కవిరాజ శ్రీ మహాకవి

మండపాక చిన జోగిరాజు

విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము



ద్వితీయ సంపుటము

కవిరాజ శ్రీ మహాకవి మండపాక చిన జోగిరాజు

విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము



ద్వితీయ సంపుటము

శ్రీమదాంధ్ర మహాభారతము
అరణ్య పర్వము

ప్రథమ సంపుటము	:	సెప్టెంబర్ 2024
ప్రతులు	:	100
మూల్యం	:	రూ. 200

ISBN :

డి.టి.పి మరియు ప్రతులకు : యం. అచ్యుతాంబ

డోర్‌నెం.3-33, గోపాలకృష్ణ అపార్ట్‌మెంట్స్,

కుకట్‌పల్లి, హైదరాబాద్ - 500072

సెల్ : 86885 53902, 83746 31142

మెయిల్ : mcjraju@gmail.com

ముద్రణ :

విషయసూచిక

అరణ్య పర్వ - ప్రథమాశ్వాసము

అరణ్య పర్వ - ద్వితీయాశ్వాసము

అరణ్య పర్వ – తృతీయాశ్వాసము

అరణ్య పర్వ – చతుర్థాశ్వాసము

అరణ్య పర్వ – పంచమాశ్వాసము

అరణ్య పర్వ – షష్ఠాశ్వాసము

అరణ్య పర్వ – సప్తమాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వ - ప్రథమాశ్వాసము

శ్రీ భూదేవీ సేవిత

ఆభూతా ఆత్మవిదుడ అభ్యుదయాత్మా!

యే భయములు లేకుండను

యీభువి నేలంగరావొ యిహపరతేజా!

పాండవులు అరణ్యవాస గమనోన్ముఖు లగుట

వ. అవధరింప నభ్భారత కధాకధన సూతుండు శౌనకాది మహామునులకుం జెప్పె నట్లారణ్య వాసార్థులై ద్రౌపదీ సహితులై పాండునందనులు ధౌమ్యాదులు వెంట రా-

క. ఉత్తర దిక్కై జననా
యత్తరులై నడువ నుండ నభిమన్యుండున్
చిత్తము తల్లడి గొనుచున్
అత్తరి తన తల్లి వెంట నచటికి రావన్

వ. వారితో వచ్చిన సమస్త పరివారము-

క. పురజను లెల్లరు తమలో
దురితుడు ధృతరాష్ట్ర సుతుడు దుష్టాత్ముండున్
నరరూప రాక్షసుండని
మరిమరిగా దుఃఖితులై మనసున దిట్టన్

క. వీలగు తెరగుల పెద్దలు
యేలనొ పలుకరు తగదని యే యొక్కరుడున్
మేలని దలచిరి యేమో
లాలన పరులై మనసున లక్ష్మిని గాంచిన్

వ. కర్ణ జయద్రధ గాంధారీ సోదరుండు అన్యాయ మార్గులై అవనిపతిని దుష్ట వర్తనబుద్ధిగా తీర్చిదిద్ద యెట్టు మనగడ కల్గునో యెరుగనౌనె. అరుగనౌ గాదె ధర్మ బిడ్డని వెంబడి తడయ కడవి అనిఅనేక విధముల తలచుచు దుర్యోధనుని రాజ్యంబున నుండజాలము. మీతో నుండవత్తు మనుమతిండని పాండునందను ప్రాధేయపూర్వకముగా నడుగ నప్పౌరులం జూచి ధర్మతనయుం డిట్లనియె.

ధర్మజుడు పురజను లందరిని తమతో అరణ్యములకు రా నిరాకరించుట

క. మీకేటికి వనవాసము
మాకెటు తప్పదు గడుపను మంచో చెడుగో

మాకగు యీ చీకాకులు
రాకూడదు యేరికైన రావలదంతే

వ. అంత వారెల్ల నా ధర్మరాజు మాట ప్రకారము చింతించుచు వెను దిరిగి హస్తినాపురికి అరుగుటయును, పాండవులు తామెంచుకున్న మార్గము ననుసరించి గంగాతీరంబునకుం జేరి అందొక వట స్థానంబునవిడిసి స్నానాదికములు గావించి పునీతులై ఆరోజంతయుం విశ్రమించి తెల్లవారి లేచునంతకు–

చ. తలకొక బుట్ట నెత్తుకొని తమ్ముల వీడుట పాడియే యనన్
బిలబిల మంచు వచ్చి తగ వేవురు బాపలు వేద ఘోషలై
కలకల లాడుచుం వడిగ కమ్మని కోరిక వెంట నంటుచున్
అలనటు కానలందునను హాయిగ నుందుము ధర్మనందనుతోన్

వ. అట్లు తమ తోడను కానలకైనను రా నిశ్చయించుకొని వచ్చిన వేదవిప్రుల కాదన ధర్మముకాదని ధర్మనందనుడు వారల నెల్లర గౌరవముతో నర్చించి తదాశీర్వాదంబులనానందించుచు ఉత్తమోత్తమ భూసురోత్తమా! మా తోడ మిమ్ములం గూడ యీ కానలందు కందమూలమ్ములతో గడుపుకొమ్మనుట భావ్యమ్ముకా దెట్లన వార లిట్లనిరి.

క. అస్మత్భోజన భాజలు
విస్మరితము ఔనొ నంచు వేగకు మదిలో
తస్మద్దీయత నెంచకు
అస్మద్దీయులము కామ అడవులనైనన్

వ. అన్న వారల మార్దవబుద్ధి కొడంబడి–

శౌనకుడను ముని పుంగవుండు ధర్మరాజునకు ధర్మోపదేశము చేయుట

క. తొల్లిటి యట్టుల కుడుపను
తెల్లము గాకెట్లొ యనుచు తెలియక మదిలో
తల్లడి గొను పాండు సుతుని
అల్లన శౌనకుడు జూచి ఆత్మవిదుండై

వ. అంతయుం దెలిసి ఆత్మ స్థితి తెల్లమౌనట్ల తొల్లిటి జనకగీత శ్లోకార్థ భావములు ఉట్టిపడు నట్ల య్యుధిష్టిరున కిట్లనియె.

క. మనమున దారుణ శోకము
లన బడు భయ దుఃఖ బాధ లలమట జేయన్

వినుు బుద్ధి వివేకజ్ఞుడు
కననేరడు చింత భీతి కాలము కొలదిన్

వ. మరియును ఆత్మ స్థైర్యముతో నిలబడి పరమార్ధ సౌధము నధిరోహించు తత్వజ్ఞానిఒక్కొక్క ఆశ్రమమును ఒక్కొక్క మెట్టుగా భావించి పైపైకి సాగుచు పరిపూర్ణమానవుడుగా భాసించుచుండు. జలంబుల నగ్ని ఉపశమించునట్లు ప్రాపంచిక దుఃఖములు విమల జ్ఞానమున నుపశమనముం బొందు. పాంచ భౌతిక దేహ స్నేహమున జ్ఞాని ప్రాపంచిక బాధల దేలుచు తామరాకు మధ్యమందలి నీరము వలె ప్రకాశించుచుండు. అజ్ఞాని కామక్రోధాదుల విష పూరితుండై కుందుచుండు. అజ్ఞానము సర్వ దోషములకు ఆస్పదము. తృష్ణాతురుండర్ధ లోభమున తొఱ్ఱయందలి అగ్ని కారణముగాదగ్ధంబగువృక్షమువలె దగ్ధుండగు. అర్ధాతురుం డనర్ధ హేతు భూతుండై సుఖ శుభమ్ములు కొరవడ జేసికొని వాపోవువాడగు. ప్రాణులు మృత్యువుకు భయపడునట్లు అమితార్ధవంతులు చోరాగ్ని జల రాజ స్వజన భీత మగ్ను లగుచు నుంద్రు.

క. అమితార్ధం బనర్ధంబగు
సమతా వాదమున గూరు సర్వము జయమై
అమితాశకు లోనైతే
తమ మెచ్చును దుష్కృతమ్ము తధ్యము ఒడమున్

వ. కావున బుద్ధిమంతులు అధిక ధనార్జనకు పోరాదు. రూప రస గంధప్రియ సువాసనలు అనిత్యమ్ము లగుట జ్ఞానులు వానియందు మోహితులు కారాదన అమ్మునివరునకు యుధిష్టిరుం డిట్లనియె.

తే. అవసరార్ధిని నిపుడ నే నాత్మ రక్ష
సావధానత విప్రార్ధి సాకనౌత
పాలుపోవుట లేదయో పాపమంటు
కాయ కసవులు దినిపింప కాదు లెస్స

తే. ఇల్లు పెండ్లాము కలిగున్న యేమి ఫలము
అతిధి కన్నం బిడని నా గృహస్తు కంటె
ఎండ నీడిచ్చి కాయిచ్చి పండ్ల నిచ్చు
అడవి బుట్టిన ఫల వృక్ష మగుట లెస్స

వ. ఆర్తుల కభయమ్మును, దప్పిగొనినవాని కుదకంబును, భుభిక్షువులకు అన్నంబును, శ్రాంతులకు విశ్రమంబును కల్పించుట గృహస్తు ధర్మము. ప్రీతి పూర్వకముగా పల్కుట సజ్జన లక్షణమ్ము. సాధుగోజాతుల హింసించుట పాతకము. అతిధిఅభ్యాగత బాంధవ బంధుమిత్ర విద్వజ్జనగురు భామినీ నివహంబుల పూజితంబులైనయెగ్గగు. కావున గృహస్తు సర్వ సంతర్పణకుండు కావలయు.

ఉదయాస్త మయముల పశుపక్ష్యాది అల్ప జీవుల కన్న యజ్ఞము గావించి పిదప నా యజ్ఞ శేషమ్ము అమృతము నాబడిన దాని భుజించువాడే నిజమగు గృహస్తు నా బరగు నన, విని శౌనకుండు ధర్మ జునకిట్లనియె.ఆత్మ సంకల్ప స్థితి జనకంబైన దేహమ్ము నందలి మనస్సు శబ్ద స్పర్శ రూప రస గంధా ది విషయ గ్రహణమ్ముల జిక్కువడి లుప్త తేజంబునై అగ్ని బడి దగ్ధంబగు శలభంబుల భంగి శోకానల తప్త తమ నిజస్థితి నెరుంగ నేరక జన్మజన్మ అజ్ఞాన తృష్ణ కర్ములై సంసార చక్రబంధముల పరిభ్రమిం చుదురు. అట్టి మానవులు రాగ ద్వేష వివర్జితులై దేహాభిమాన మత్సరములు విడచి వేద చోదితంబై న సమ్యక్సంకల్ప ఇంద్రియ నిగ్రహణ వ్రత విధాన గురు సేవన నియమితాహార ఆసనాధ్యయన కర్మ సన్యాసచిత్త నిరోధమ్ములను యెనిమిది కర్మానుష్ఠానంబులు జేసిన మహాత్ములు తమతమ తపోమహ త్వంబునం జేసి సంసారముల్లజయింతురు. నీవునూ అట్టి తపోమహత్వ నిష్ఠా గరిష్ఠుండవు కావలయు. అప్పుడు నీచేత ప్రారబ్ధంబు లైనవి యెల్లను సుసంపన్నంబు లగును. తొల్లి–

క. వసు రుద్రాదిత్యులు
అసమాన తపో మహత్వ ఐశ్వర్యులునై
వసుమతి తేజో మయముగ
పస జూపిరి నీవు గూడ పదపడి యటులన్

వ. తపస్సిద్ధుడవై యోగార్థ స్థితి వడసి బ్రహ్మవిదుల దనుపుచు సఫల మనోరథుండవు కమ్మన శౌన కమునిపుంగవు మతానుగమ్యుం డగుటకు నుద్యుక్తుండయి భ్రాతృ మధ్యస్థుండైన తమ కులగురువుల ౦ధౌమ్యులకు నమస్కరించి–

క. తోడన వనముల నుందుము
వీడము మిమ్ముల ననుచును వేదన పడుచున్
మేడలు మిద్దెలు వీడియు
నీడగ వెన్నాడు వార్ని యేగతి జూతున్

వ. మీరల విడువనోప నేమిచేతునన ధౌమ్యుండు పెద్దయుంప్రొద్దు చింతించి ఆదిన్–

క. ఆకలి గొని భూతాదులు
చీకాకులు పడుచు నీల్గ చూడగ లేకన్
ఆ కమల బాంధవుడు రవి
ఆకలి దీర్పను తినగను అత్యాదరణన్

వ. ఉత్తరాయణ గతుండై యుర్వీ రసంబుల దక్షిణాయన గతిం పర్జన్య భూతుండై యోషధులం బడసి రాత్రులందు చంద్రకిరణామృతంబులం బడసి మర్దించి అందన్నంబుపుట్టించి ప్రాణాధారముం జేయుటయుంజేసి అన్నంబు ఆదిత్య మయంబని యెరింగి తొల్లి కార్త వీర్య నహుషాదులు యోగ

సమాధి స్థితులై సూర్యునుపాసించి అన్నంబువడసి ఆపదల నుండి ప్రజల నుద్ధరించిరి, కావున–

తే. అర్కు నాదిత్యు భాస్కరు అరుణ కిరణు
మిహిర సప్తాశ్వు మార్తాండు మేఘ గమను
వారి రుహ మిత్రు సూర్యుని భాను నార్యు
భూత ఆధారు కీర్తించి భూరి యశుడ

వ. నీవునూ నిజమనోరథ ఫలుండవు కమ్మని ధౌమ్యుండు విశుద్ధాత్ముండైన ధర్మ రాజునకు ఛాయేషా పద్మినీ ధవ పద్మబాంధవ పద్మసఖ సహస్రాక్షో సహస్ర కిరణు ఆదిగా గల అష్టోత్తర శతనామంబులు మంత్రోచ్ఛారణను విధి యుక్తముగా నుపదేశించి దీనింతొల్లి ఇంద్రుని వలన నారదుండును వాని వలన వసురాజును వానినుండి నేనునూబడసితిమి. నేను నీకిచ్చుచున్నాను. ఇది దేవనిర్మితమ్ము. దీన నాదిత్యు నతిభక్తి ప్రపత్తుల నారాధింపు మనిన–

ధర్మరాజు సూర్య భగవాను నారాధించి వరంబు గొనుట

క. గురు నానతి ధర్మ సుతుడు
తిరముగ నాదిత్యు తలచి దీధిత బుద్ధిన్
అరుణోదయ వేళ సరిగ
విరి గంధాక్షతల తోడ పేరిన భక్తిన్

క. గంగా జలముల శుచుడై
సాంగో పాంగమ్ము గాగ సాధన పరుడై
నింగిని సూర్యుని జూచుచు
పొంగారెడు మనసు తోడ పూజలు చేయన్

క. మంత్రోచ్ఛారణ విదుడై
తాంత్రిక బీజాక్ష్ర యుక్త తాత్మ్యత నిష్ఠన్
యంత్రస్థలి అష్టాక్షరి
మంత్రంబుల దీక్ష తోడ మానస జపుడై

వ. త్రి దివారాత్రంబు లట్లు యేక దీక్షా పరతంత్రుడైన నాల్గవ నాటి ఉదయంబున ఆదిత్యుం డాతని నిష్ఠకు మెచ్చి ప్రత్యక్షంబై ధర్మజా !

క. మెచ్చుగ భూసుర వరులతొ
వచ్చితి వడవుల గడుపను వావిరి కాగా
హెచ్చుగు దీక్షాయుక్తుడ
నచ్చిన వరమిచ్చు చుంటి నయనిధి గూర్పన్

వ. అనుచు రాజా! నీవీ అరణ్యముల నుండు నంత కాలము వన్య మూల ఫలాదులునీ మహానసంబున (వంటశాల) ఈ ద్రుపద రాజతనయ చేత సాదకంబులునై అక్షయములగుచు చతుర్విధ పాయసాన్నంబు లగునని వరం బిచ్చుటయును–

క. అది మొదలుగ వన భోజన
ముదితాత్ములు పాండు సుతులు మోదితు లగుచున్
పది మందికి పెట్ట నవుట
ముదితా ద్రుపదాత్మజాత ముదమల రారన్

వ. అనుదినమున నిట్లు అనేకానేక బ్రాహ్మణ సంతర్పణ భోజనంబుల నెల్ల వారలసంతృప్తుల జేయుచు తృప్తు లగుచున్న తన పతులు గుడిచిన తరువాత భుక్త శేషమ్ముల గుడుచు నా పాంచాలితో వారలు కొన్ని దినంబు లందుండి బ్రాహ్మణాశీర్వాదంబులు గొనుచు వారల తోడన కామ్యక వనంబున కరుగుటయును, ఇట ధృతరాష్ట్రుండు విదురుంబిలిపించి నీవు కౌరవ పాండవులకు సముడవు .బుద్ధి కుశలుండవు. సమ్మతుండవు. పాండు సుతులిప్పు డెక్కడ యేమి చేయువారనిన వానికి విదురుం డిట్లనియె.

మత్త. ధీర చిత్తులు భవ్య జన్ములు కీర్తి తోడుత పాండవుల్
ఉత్తమోత్తము లుర్వి దేవులు ఉత్సుకంబున మెచ్చుగాన్
కాననుండియు కాచుచుండిరి కామితార్థుల తృప్తితో
అన్నపానము లన్ని గూర్చుచు ఆదరంబున జూచుచున్

మత్త. సత్య సంధులు సాధు వృత్తులు సద్గుణాఢ్యులు సమ్మతిన్
ఉందు రందరు ఐక మత్యత ఉత్సు కెంతయు జూపుచున్
మిన్ను విర్గియు మీద బడ్డను సన్నుతాంగులు ఓర్పుతో
ఉన్న వారల గొప్ప బుద్ధిని ఊహ జేయుమ మెచ్చుగాన్

వ. అని పల్కుచు రాజా ! ఇప్పటికైనను మించినదిలేదు. నీ కొడుకులు చేసిన అన్యాయ జూద అక్రమార్జనకు సంతసింపక తమ్ముల బిడ్డలను ధర్మ చింతనులు అజేయులు ఐన పాండవుల రప్పించివారల పిత్రార్జితమైన రాజ్యంబున వారల ప్రతిష్ఠించుము. ఈధర్మ కార్యమున పెద్ద లెల్లరును సంతసింతురు. కులకీర్తి యినుమడించును. కర్ణ శకునుల మాటలువిని నీ బిడ్డలు చెడి పోవుచున్నారు. భీమార్జునుల వంటి మహా వీరులైన జ్ఞాతులతో వైరమూనుట యెన్నటికినీ మంచిది కాదనుచు సభా మధ్యమున పాండవ పట్టమహిషికి నీ కొడుకులు చేసిన అపరాధములకుగాను వారల కినుక బాన్ప ద్రౌపదీభీమసేనులకు క్షమాపణలు తెల్పునదిగా దుశ్శాసను ననుపుము. కానినాడు కౌరవకులమునకే చేటువాటిల్ల నగునని యెన్నియో విధమ్ముల దెల్ప విని కడునల్గియుం ధృతరాష్ట్రుండు కోపోద్రిక్తుడై

విదురుం జూచుచు–

ఉ. పాండవ పక్షపాతమున బాధిలు చుందువు పెంపు జూపగా
మెండగు విల్లుకాడనుచు మిక్కిలి మెత్తువు పాండ్వ మధ్యమున్
దండి గడింప భీము గద ధాటికి దీటుగ నిల్వ నొక్కరుం
యుండెనె నీ సుతం కదన ఊర్జిత శక్తుల నూర్వు రందరిం
ఖండన చేయుచుందువల కౌరవు దూరుచు నెల్ల వేళలన్

వ. నా బిడ్డల యున్నతిం దలంపవు. ఇట్టిది నీకు తగునే నా కయిష్టంబగు పల్కులేల పల్కెదవు. నీకి ష్టము లేకున్న ఇక్కడ ఉండనేల. ఆ పాండవులవద్దకే పొమ్మన వికల మనస్కుండై చింతించుచు విదు రుండు అప్పటి కప్పుడు ప్రయాణమై పాండవులున్న కామ్యకవనంబున కరిగెనంత.

ఆ. విదురు రాక గనుచు విస్మయ పరుడౌచు
కుంతి పెద్ద కొడుకు కొంత వింత
మనసు దోప తనదు మర్యాద నెదురేగి
కౌరవేంద్రు డేమి కతన బంపె

వ. నోయని బహుభంగుల వితర్కింపుచు ప్రియసత్కారంబుల కుశలంబడిగి సేద దీర్చికూర్చున్న య ంత సంభాషణా వశంబున ప్రియపూర్వకంబుగా తదాగమన విషయ కారణం బడుగ, విదురుండు వారల కిట్లనియె.

క. హితు వలె నా ధృతారాష్ట్రుడు
మతి నెంచుచు మిమ్ము గూర్చి మచ్చిక నాతో
ధృతి జెడి పాండుని బిడ్డలు
సతి తోడున యెటు లుండిరి సద్విధు లడవిన్

వ. అని యడుగ అపుడు నేనాతనితో అన్నా!

క. ఇరుగడ నీ నా బిడ్డలు
కురుకుల సంజాతు లరయ కూరిమి తనయుల్
కురువర తెలియుట లేదా
దురితము ఆ జూదమందు దుర్దశ పాలై

క. అడవుల నుండుట తగునే
సుడివడి యిడుమలు బడుచును స్రుక్కుచు నుండన్
కడు వేడుక నీదు సుతకు
మడి గట్టుకు కూర్చునుండ మర్యాదగునే

వ. కావున మన పాండు పుత్రుల బిలువనంపి వారల రాజ్యము వారికిచ్చి వారునూ నీ సుతులు నూ అన్యోన్యులుగా నుండునట్లు చూడవలసిన బాధ్యత నీయందే యున్నదని లేనియెడల ముందు ముందు విచారింప నగుదువన కోపోద్దీపితుండై నన్నొల్లక చురచురం జూచుచు నీ వెప్పుడునూ నా పుత్రుల కాదనుచుందువు. వార కిష్టత కాని పాండవుల పక్షమై పల్కుచుందువు. వారల కడనేయుం డుము పొమ్మన–

తే. మంచి చెప్పిన వాడ నా మాట చేదు

తేట మాటల విషమైన తీపియౌగ

దుష్ట చిత్తుల కృద్ధుల కష్ట మతుల

చెంత నుండుట తగదని చేరవస్తి

వ. దురాత్మ దుష్ట వర్తనుల వద్ద రాజ్యలక్ష్మి స్థిరంగా నిలువదు. ధర్మ తనయుండవైన నీ రాజ్యలక్ష్మి మరల నివ్వరియింపగలదు. నా వచనంబులు విశ్వసించుడన, అట ధృతరాష్ట్రుండు పాండవులయొద్ద విదురుని ఉనికి యెరింగి తనకన్ని విధముల చేదోడు వాదోడుగా నుండు విదురుంబాసి యుండనేర క సంజయున కిట్లనియె. నీవు వెడలికామ్యక వనమున పాండవుల వద్దనున్న విదురు కడకేగి నాపను పున వచ్చితినని తెల్పిధర్మరాజుని తోడన కుశలం బడగి ఇట్లని దెల్పి దెమ్మనె.

క. నెమ్మి గలవాని నిన్నటు

పొమ్మని పలికితి పొగరున పూత చరిత్రా

రమ్మని వేడుచు నుంటని

పొమ్మన వచ్చితిని వేగ పుణ్యుని విదురున్

వ. అని పల్కిన సంతసించుచు ధర్మ నందనుండు విదురునితో–

క. అరుగుటయే సమ్మతమన

పరిపరిగా చింత జేసి పదపడి వేగన్

కరుణతొ ధృతరాష్ట్ర కడకు

సరినడకల విదురు డేగె సంజయు తోడన్

వ. అంత ధృతరాష్ట్రుం డెంతో సంతోషంబున విదురు నాలింగనము గావించుకొని క్షంతవ్యుడ నన, విదురుండిట్లనియె.

ఆ. కష్టమైన గాని కరుణతొ బల్కుట

సత్యమైన వాక్కి సమ్మతమ్ము

తగగ పల్కి తేను తథ్యంబు తెలియంగ

మంచి కోరు వాడ నెంతొ మీకు

ఆ. నీదు మంచి గోరి నిజము పల్కితి నయ్య
అన్న దమ్ము తోడ ఆప్తి గనుట
ముందు కెంతొ మంచి మూర్ధాభిషిక్తుండ
పొండ వేయు తోడ వలదు తగవు

వ. అని యెప్పటి యట్ల అన్యోన్యానురాగ మంతనంబుల మెలగుచుండగనిన దుర్యోధనాదులు వీరలు మరల పాండవుల రప్పించ నైనచో వారల తుదముట్టించుటే కార్యంబన శకుని దుర్యోధనుం జూచి విదుర ధృతరాష్ట్రులు విపరీత మతులై రాగోరినను ధర్మానువర్తన సత్యనిరతుడైన ధర్మరాజానుజులు తమ జేసిన సమయంబు సలుపకరారన కర్ణుం డిట్లనియె.

చ. సడియది లేక పెద్దలకు చప్పుడు గాకను ముందు వెన్కలం
తడయక సేనలం గొనుచు దండెతి వారల నిస్సహాయులన్
సుడివడి వెంట నంటుచును స్రుక్కగ జేయుచు మట్టు బెట్టనా
యడవుల నుండ ద్రుంచుటది అద్భుతమౌ పని సూక్ష్మ మెంతయున్

వ. అన వారు సమరసన్నద్ధులై సమకట్టి యుండ సర్వమెరింగిన కృష్ణద్వైపాయనుండువచ్చి దుర్యోధను దురాగత నుద్యుక్త బుద్ధిని వారించ ఆంబికేయున కిట్లనియె.

తే. ధర్మ సత్యాను వర్తనులై ధర్మ జనుజ
కర్మ కెంతేని తల యొగ్గి కానలందు
నిర్మితంబైన కాలమ్ము నియత బుద్ధి
మర్మ మిసుమంత లేకుండ మసలుచుండ

వ. నీ సుతుడు వారల నడవులయందు మడియింప దలచుటెంతేని అధర్మము అన్యాయము అక్రమము. మీ రెల్ల రుండియు ఇట్టి అధర్మము నుపేక్షింప ముందు ముందు యెంత చేటు వాటిల్లగలదో తలపరైరి. నీ కొడుకును వారింపుమన, తండ్రీ! పుత్రవాత్సల్యమున దుర్యోధనుని విడువలేక వానికేమియు కాదని చేయలేకున్నానన–

వ్యాసుడు ధృతరాష్ట్రునకు ఇంద్ర – సురభి సంవాదము దెలుపుట

తే. స్నేహ సహవాస బంధుత్వ సంఘ మందు
పుత్ర వాత్సల్య మెంతేని పొగడ దగును
ధనము లెన్నేని సత్పుత్ర ధనము కంటె
ఎక్కుడౌ గాదు ఎంతయు నెప్పుడైన

వ. సకల గోమాత సురభి తొల్లి కన్నీరు కార్చుచుండ యేమని ఇంద్రుండు ప్రశ్నింప

నా సురభి, రాజా! నీవజ్రాయుధ రక్షణలో అందరునూ సుఖియింప నాసుతుల కష్టములు చూడలేకి ట్లు యేద్చుచుంటినన, యేమి నీ సుతుల కష్టములన బలవంతమ్ముల సరసన అబలములగు వాని బూన్ప అతికష్టత పడుచుం వీగుట తెలియక నుడిగెడు వానింములుకుల నొడిచియు బొడిచియు దిట్టంజూచియు దుఃఖించెద ననుసురభికి సురపతియిట్లనియె. వర్షంబుల తృణధాన్యంబులు సమృద్ధ ములగుట నీ సుతులెల్లరుం బలవంతమ్ములగు. దుఃఖింపకు మన, యీసంవాదము వేదములందు వి నం బడుచున్నయది. కావున రాజా! నీకునూ పుత్ర స్నేహము సామాన్యము కాదైనను దీనులై అడవు లందుండి యిడుమలు పడు పాండవులకు దయాళుడవు కమ్ము.

తే. వినుము నీవును పాండుండు విదురు నాకు
సర్వ సములట్లు నీకునుం సదయ హృదయ
కౌరవాన్వయు లెల్లరుం కారె సములు
పాండు సుతులను బాధింప పాప మవదె

వ. కర్ణ శకునుల సంగతంబున నీ కొడుకు అధర్మ మార్గం దగుచున్నవాడు. సుజనుడైన ధర్మ నంద నుని కడ కొంత కాలముండునట్లు నీ కొడుకు నంపుము. ధర్మా ధర్మవిచక్షణుం డగును అన కృతాం జలియై ధృతరాష్ట్రుండు మహాత్మా! నా కొడుకు నా మాటలు వినుట లేదు. మీరే దండించి హితవు గరపుడని ప్రార్థింప–

క. ఘనుడా! మైత్రేయుండను
మునివరు లరుదెంచి ధర్మమున నీ దుర్యో
ధను శాసించు ననుచు
కనుమని ఆ వ్యాసుడేగె ఘన తపములకై

వ. అంత కొండొక దినంబున–

క. కడు సౌమ్యుడు మైత్రేయుడు
వడి నేగుచు అడవులంట వ్యాసుని కడకున్
కడు దస్సియు హస్తి పురికి
అడవిం కామ్యకము నుండి అరుగుచు రావన్

వ. కనుగొని ధృతరాష్ట్రుండా మునిని అర్ఘ్య పాద్యాది విధుల పూజించి మహాత్మా! మీరెందుండి వచ్చుచున్నారని యని అడుగ–

చ. కలుముల నెల్ల బాసి అల కాయలు పండులె భోజనంబుగా
వలనుగ కానలందు నను వాసము జేయుచు పాండవోత్తముల్

అలసియు వచ్చు వారలకు ఆశ్రయ సిద్ధత ఆదరింప నే
నలవడి వస్తి కామ్యక వనోత్తర సీమల మిమ్ము జూడగన్

వ. నే నఖిలాటవీ వన తీర్థమ్ముల గ్రుమ్మరుచు కామ్యక వనమున వారల కతిథిగా కొన్నాళ్ళుండి యిపుడిటకు వచ్చితి నన ధృతరాష్ట్రుడు–

చ. కలుముల నెల్ల గొంటి మని కానల కంపితి మంచు దిట్టకం
పలువుర ముందరం వెనుక పాటున నైనను కోప తాపతన్
పలుకుల మాట మాత్రమున బాంధవ మెంచుచు సామరస్యతన్
తలతురె మమ్ము వారలట తమ్ముల మమ్ముల శాంత చిత్తులై

చ. అమిత బలాఢ్య సోదరులు అంతకు నంతటి శక్తి తత్పరుల్
సమయపు మగ్నులై కుపిత సాహస మెంతన భీమ అర్జునుల్
స్థిమితత నుండనిస్త్రె మము సింహ బలాఢ్యులు మాద్రి నందనుల్
తమతమ ఆయుధావళుల తమ్ముల పైకొని నెత్తి రారుగా

వ. అనవిని మైత్రేయుడు రాజా! వారలు మిమ్మెపుడునూ దలంచుచునే యుందురు. అదియునుం గాక –

చ. నిజమిది చెప్పుచుంటి విను నిశ్చల చిత్తత నున్న వారలా
విజయ పరాక్రముల్ విజ్ఞుల రెంతయు మాట దప్పినం
కుజ గురు తారకా సమితి క్రుంగదె ధాత్రియు సంద్ర మింకదే
సుజనులు ధర్మ మార్గణులు సుస్థిర సిద్ధులు పాండునందనుల్

వ. అని దుర్యోధనుంజూచి కురుకులాన్వయా నీవు బుద్ధిమంతుడవేని నీసోదరులు పాండు నందనుల తోడి విరోధమ్ము కాకుండుము. అట్లైన నీకూ నీవారలకునూ మంచియగునని వినిచి మరియునుం వినుమని ఆ వృకోదరుం డతి భుజబల సంపన్నుడు. చిన్న నాటనే బక హిడింబాసురుల కిమ్మీర జరాసంధుల హతామార్చిన నాగాయత సత్వ సంపన్నుడు. అర్జును దన్ననో సుర యక్ష గంధర్వాదుల యుక్కడంచిన అస్త్రాయుధ శక్తి సంపన్నుడు. వారల నెదుర్కొని నిల్చు టసాధ్యము. అని వారికి వసు దేవనందనుడునూ ద్రుష్టద్యుమ్ముడునూ సంబంధీకులు కావున నీవు పాండవులతో ఒడంబడి యుండు మన దుర్యోధనుండు వినియు కాలు నేలరాయుచు దండ సాచి తొడగొట్టి రూక్షకుండై చూచుచుండ మైత్రేయుండు వానింజూచి యుద్ధమున నీయూరు భగ్నంబగునని శపియింప ధృతరాష్ట్రుండు మునీంద్రా! ప్రశాంతుండవు కమ్మని ప్రార్థింప, నీ సుతుండు బుద్ధిగొని నడచుకొన్న శాపము తప్పును. అట్ల కాక విముఖుండైన శాప ఫల మనుభవింపక తప్పదనియు ననవిని మహాత్మా! మీ వచనము లమోఘములు. అంతియే చాలునని కిమ్మీర దనుజుడెట్లు చచ్చెనని యడుగ, ఆ కథయంతయు విదురుని

వలనవిన వచ్చునని పల్కి మైత్రేయుండరుగ విదురుండు ధృతరాష్ట్రునకిట్లు చెప్పదొడగె.

భీమ కిమ్మీరుల యుద్ధము – కిమ్మీర వధ

క. అట జని పాండవు లుత్తర
అటవీ ప్రాంతముల మూడు అహములు రాత్రుల్
యెట కేగుటొ తెలియ కటుల
చెటు లాడుచు కామ్యక వని చక్కగ నడువన్

వ. ఒకనాటి అర్ధరాత్రి రాక్షససంచారవేళ ఒక నిశాచరుండు వికటాట్టహాసుండు ప్రళయకాల మేఘ గర్జనలవలె గర్జించుచు వికృత నిశిత దంష్ట్ర కరాళ వదన గహ్వరంబు దెరచి గుడ్లురిమి చూచుచు భృకుటి కేశంబులు దూల నిజ పాదఘట్టనల అవనీతలంబు బ్రద్దలవునట్లు కదులాడ భూరుహమున శాఖలు క్రింద మీదుగా అటు నిటు రాపాడ ముందునకు దూకుచు వచ్చు నొక పర్వతాకారుంజూచి ద్రుపద రాజనందన భయభ్రాంతయై నిశ్చేష్టయయి యుండ భీముం డామెను అదిమి పట్టి భయపడ వలదని ధైర్యము చెప్పుచుండ –

క. రక్షాన్వయ మంత్రమ్ముల
రాక్షస మాయా పరిస్ఫురణ జెఱచె వడిన్
దక్షుడు ధౌమ్యుడు పాండవు
వీక్షించుచు నుండునంత విధి కృతు డెంతన్

క. మాయామహు నత్యాయత
సాయం సంధ్యా భుజబల సమరోత్సాహున్
ధీయుత పాండు లడిగిరి
యీ యుర్వీ పాలకుడవ యెవ్వడ వనుచున్

వ. యేను కిమ్మీరుడను రాక్షసుండ. బకాసురానుజుండ. ఈకామ్యక వనమున నుండు జంతుజాల ముల మడియించి దినుచుందు. నర రూపాధముల నా మాయాజాలంబుల మడియించి భక్షించు చుందు. అమరాదులకును బోరన జేయుండ. నాకువెరచి యిందెవ్వరును రానొల్లరు. మీరలెవ్వరిందు ల కేల వచ్చితిరి. మిమ్మందర వధియించి భక్షింతునన వానికి ధర్మరాజిట్లనియె.

క. పాయక పండ్రెండ్లేండ్లవి
ఆయాయా అడవులంట ఆప్తి దొరంగన్
చేయుచు మునిజన సేవలు
కాయో కసవో దినుచును కాలము గడుపన్

క. వచ్చితి నే ధర్మ సుతుడ
సచ్చరితుడు భీము డితడు సాహసు డెంతన్
మృచ్చిల జేయుచు రక్కసు
విచ్చల విడి సంచరించు వీరుం డనగాన్

క. ఎట్టెడు భీముం డీతడ
పట్టియు మింగుదు నమలక బకు నా యన్నన్
మట్టిని బెట్టిన ఖలునని
దిట్టత తెలియంగ నాదు తెంపరి తనమున్

వ. అని ముందున కురుక ధర్మ రాజానుజులు–

ఆ. అన్నగారి కోప మధికమ్ము కానౌత
అడుగు ముందు కేసి అసుర గదియ
విల్లు యెక్కు పెట్ట విజయుండు తడయక
ఖడ్గ హస్తులైరి కవలు గూడ

వ. అంత వాయు నందనుండు వాయువేగ మనోవేగమ్మున ముందుకురికి తమ్ముల నుండుండని రా రమ్మని మదమత్త ఘన గజముపై నురుకు సింహ కిశోరముభాతి కిమ్మీరుపై కురుక –

మ. అమితోత్సాహులు ఘోర వీర రణధుల్ అత్యుగ్ర కోపాగ్నులై
తమ మెంతేనియు రేగ నా మనసులం తాత్మ్యమ్ము ఢీకొట్టుచున్
సమ ఉజ్జీలుగ బోరనా యిరువురుం సామీప్య వృక్ష స్థలుల్
తము లోభమ్మున భీతమై వణకుచుం ధర్మమ్ము వీక్షించుచున్

ఉ. అట్టిటు యిర్వురుం సరిగ ఆదట నెట్టుకు క్రింద మీదుగా
కొట్టుకు గుద్దులాడుచును కుమ్ముకు నెంతయు ముష్టి యుద్ధతన్
మట్టిని బండలం విసరి మార్కొను చెంతయు హుంకరించుచున్
చుట్టుల నున్న వృక్ష తతి చోద్యత బీకుచు బోరి రెంతయున్

వ. అటు నా భీమ కిమ్మీర దనుజుండును ద్వంద్వ యుద్ధము చాలా కాలము నెరుప చుట్టునుం ప్రతిధ్వను లీన గిరి గహ్వరముల నున్న మృగరాజ తండంబులు పర్వులెత్త మద మత్త గజంబులు ఘీంకారములు బెట్ట–

క. పోరుచు నెంతన ముష్టులు
వీరోచిత చిత్త వృత్తి విరుగగ నెముకల్

ధీరోద్ధతుడై భీముడు
ఆ రాక్షసు వెన్ను విరిచి అవనికి దోసిన్

వ. మీద పడి పిడి గుద్దులు వైచుచు మస్తకము విచ్ఛేదన మొనరించి బక హిడింబాసురు చంపిన విధమ్మున యమపురి కంపుటయును అట్ల నా వనవాసు లెల్లరును తద్రాక్షసు భయవిముక్తు లగుట యును ద్రౌపదీ సహిత ధర్మజానుజ నకుల సహదేవ ధౌమ్యు లెల్లరుం ప్రశంసించిరని కిమ్మీర వధ వృత్తాంత మంతయును పూస గ్రుచ్చినటుల పలకవినిన ధృతరాష్ట్ర దుర్యోధనులు వికలమనస్కు లగు టయును, అట నా కామ్యక వనవాసుల తోడ పాండవులు సంతుష్టాంతరంగులై యుండునంత–

యాదవ పాంచాలురు పాండవుల కడ కేతెంచుట

సీ. రారాజ తుల్యులై రమణీ లలామతో
వసుమతీ రాజ్యమ్ము బడసి యెంతొ
దుర్యోధనాదుల దుష్ట బుద్ధుల కత్న
పాచిక లాటలో భ్రష్టు లగుచు
దీనాతి దీనులై దుర్దశ పాలౌచు
పాండు నందను లేవ్రు పడతి తోడ
ఆరణ్య వాసులై ఆకు లలములు దిన్చు
అలమట జెందనా అడవులందు

తే. ఇడుమ లెన్నింటినో బడ్చు యుండువార్ల
చూచి పోవగ వచ్చియుం చోద్యమనుచు
దిట్టు కొనుచును కౌరవు మట్టు బెట్టి
ధరణి పట్టంబు గట్టను ధర్మ సుతుకు

సీ. యాదవ మాధవ యదు వృష్ణి భోజాంధ్క
గోపాల తతులెల్ల గూడి వచ్చి
వీరాధి వీరులౌ విఖ్యాతి గొన్నట్టి
పాండవేయుల జూచి బాధ పడుచు
యూర కుండుట కాదు యుద్ధమ్ము చాటించి
భీమార్జు నానుజున్ వెంట గొనుచు
దండెత్తి పోయియా దుండగు కౌరవ
దుష్ట చతుష్టులన్ దూలదన్ని

తే. మాయ పాచిక లాటయే మనల కిట్టు
లనుచు వగవంగ కౌరవా అనుజు లెల్ల
పాండు భూపాలు భాగమ్ము పాండుసుతకు
మరల పట్టంబు గట్టనా మనుజ విభుకు

తే. అన్న ధర్మజు కపవాదు అగును కాదె
ధర్మ మార్గమ్ము దప్పు టధర్మమనుచు
నరుడు భీముండు బావతో ననిరి యిట్లు
శాంత చిత్తుడ కావె ప్రశాంత మూర్తి

వ. అని ఆ వాసు దేవుని కీర్తించి రిట్లు.

తే. పూర్ణ పురుషుడ పురుషోత్మ పుణ్య చరిత
అవని బుట్టిన వాడవో ఆది విష్ణు
మూడు మూర్తులు తానౌచు ముదము తోడ
సృష్టి స్థితియు లయముల సమత వీవు

తే. ఆత్మ తత్వజ్ఞ పరమాత్మ అద్వితీయ
వేద గోచర విజ్ఞాన విమల తేజ
ఇంద్రియ జ్ఞాన భూతాత్మ యెరుగ వశమె
భక్త జన రక్ష దక్ష కవ్యక్త రూప

వ. నీవు తొల్లి గంధమాధన పర్వతముల ఫలాసనుండవై తపంబొనరించ లేదె. ప్రభాసతీర్ధమున యేకపాదుండవై వాయుభక్షణ జేసి యుండలేదె. బదరికావనంబుల నూర్ధ్వబాహుండవై నిరాహారుండ వయి గడుపలేదె. సరస్వతీ తీర్ధమున కృశశరీరుడవై పంద్రెండేడు లుదక సేవనమున తపస్సు సలుప లేదె. చైత్ర రధమ్మున జగజ్జేగీయుండవై ఉత్తమక్రతువుల సలుపలేదె. భక్త ప్రహ్లాదు గాచిన భక్తవరద దైత్యదానవ రాక్షసాధముల వధియించి ఇంద్ర పదవిని అయ్యింద్రునకు యేకాధిష్టితము గావించిన వాడవు. అతి చిన్నవాడవై అదితి కశ్యపుల కుదయించి ముజ్జగముల నిండ వ్యాపించి పెరిగిన విశ్వ వ్యాపకుండవు కాదె. రామావతారమున రాక్షస రాజేంద్రు రావణాసురు ద్రుంచి రక్ష జేసిన త్రి జగ ద్రక్షకుండవు నీవకాదె.

తే. పంచ భూతాత్మ జగదీశ పాపరక్ష
పారమార్ధత తలపవే పరమ పురుష
సర్వ సముడవు సర్వాత్మ సాక్షివీవు
శాంత చిత్తుడ కావవే సదయ మమ్ము

వ. అని కృతాంజలి గావించియున్న ధనంజయుని జూచి జగన్నాధుం డిట్టులనియె.

తే. నీవు నేనను బేధమ్ము నెరుగ లేము
నరుడు నారాయణుండను నాది మునుల
మిద్దరము జనియిస్తి మిద్ధరందు
నరుడవీవ నే నారాయణుండ వినుము

వ. అని అనేకానేక జన్మలందలి పూర్వ ప్రాచీన ఘట్టముల దలంచు కొనుచు హితాభిలాషు లగుచు నుండ–

ద్రౌపది తన పరిభవమును కృష్ణునితో జెప్పికొని దుఃఖించుట

క. సన్నుతి జేయుచు అన్నను
కన్నుల భాష్పమ్ము లొలుక గద్గద యౌచున్
అన్నా వినుమా నన్నని
నిన్నమ్మిన దానగాన నిలచితి నింకన్

వ. నీవు సర్వ శరణ్యుండవు. సర్వాంతర్యామివి. సర్వజ్ఞుండవు. సర్వ మయుండవు.నీకుతెలియని విషయము లేదు. ఐనను నే పడిన భంగపాటు యింతింతని జెప్పనేల. నీకుదప్ప యెవ్వరికి దెల్పుకొందు. ఆప్తులకును ఐనవారికి దెల్పుడు చేసికొన్న కొంత కొంత మనసు ఊరట చెందు గాదె.

సీ. యజ్ఞ గుండమ్ము నందుద్భవించిన దాన
పాంచాల భూనాధు పట్టి నౌచు
పంచాగ్నులం బోలె ప్రఖ్యాతి గన్నట్టి
పంచ పాండవులకే పత్ని నౌచు
వసుదేవ నందనా వరదుండ గాపాడ
అన్న నీ చెల్లినై యెన్ననౌచు
దుష్టవర్తన బుద్ధి ధృతరాష్ట్ర బిడ్డచే
అవమానము ల్బొంది తధమ కానొ

తే. నిండు సభలోన తలబట్టి దండి వేడ్క
మాన మర్యాద లేకుండ మగువ యనక
వలువ లూడ్వంగ బడితి యే పడతియైన
బాధ లొందెనే భువిలోన భర్త యెదుట

క. ఉన్నారెందుకు పెద్దలు
కన్నార్పక జూచు వారు కరుణామయులే

విన్నను మిన్నక సభలో
నున్నార్ బధిరాంధు లట్ల ఉత్సవ మూర్తుల్

వ. ఇందరుండియు నాకుం లేనిదాన నైతి. అప్పుడు కర్ణుండు నన్ను జూచిన నగవు దుశ్శాసనుడు చేసిన దానికంటె యెక్కుడుగా మనమున ఘూర్ణిల్లు చున్నయది. తొల్లి యీ ధూర్త ధృతారాష్ట్ర నంద నులు పిన్నాటలు ఆడు కాలంబుననే నా పతుల యెడల పగతో వగతో యెట్టులైనా వీనిని మట్టుబెట్ట దలచినవారలై విషాహారమ్ము పెట్టించియువాయు నందనుం కట్టగట్టి మడుగున ద్రోచియు విషసర్పం బుల గరపించియు లక్కయింట మంట కలుప నూహించియు యిప్పుడీ విధమున మాయాద్యూత క్రియ అరణ్యముల పాలు జేసిరని కంటికి మింటికి నేకధారగా నేడ్చుచున్న పాంచాలిం జూచివాసు దేవుం డిట్లనియె.

చ. తలగకు మమ్మ భీతవయి తక్కువ నెంతువె పాండు సంతతిన్
తులువల కౌరవాధముల దుర్నయ బుద్ధుల సంహరింపగా
వలగొని అస్త్ర శస్త్ర చయ వాడి మయూఖల సంగరంబునన్
విలవిల లాడ్చు జత్తురది వింతగ జూతువు తాపమారగా

వ. అన, నప్పుడు ద్రౌపదిం జూచి వాసవాత్మజుం డిట్లనియె.

క. కన్నుకు రెప్పగ మమ్మిటు
అన్నిం టాదుకొను చిట్టు లనునయ పరుపన్
దన్నుగ పల్కుచు నుండన్
యెన్నడు జయమే మనలకు యింతియ కనుమా

వ. అప్పుడా చెల్లి ద్రౌపదిం జూచుచు ద్రుష్టద్యుమ్ను డిట్లనియె.

క. ఆర్యోత్తము కుంభజు నే
దుర్యోధన దుశ్ససేన్ల దుర్దమ భీమ్ముడన్
కార్యోత్సాహుడు కర్ణుని
వీర్యోచితు దర్జునుండు విరుతుము అనిలోన్

వ. అని ఆ ద్రుపద రాజ తనయ నాశ్వాసించి రంత యయ్యచ్యుతుండు ధర్మరాజుతో బావా! ద్వార వతి నుండియే–

క. తెలిసితి యుయుధానునిచే
విలవిల లాడగను మనసు వింతగ నెంతో
మలినులు కౌరవు లనుచును
అల పాండవు లడవులంటి అరిగిరి యనుచున్

వ. అయ్యవసరంబున నేను మీయొద్ద నుండమిం జేసి యిట్టి దుర్వ్యసనంబు వాటిల్లె.కామోద్రేకోత్తే జనకరమగు స్త్రీ జూద మృగయా వినోద మధు పానములను చతుర్దుర్వ్యసనంబుల ప్రవర్తిల్లకుండ ప్రతిపాదింప వలయు. అందును ముఖ్యముగా అనర్థదాయకమగు జూదమ్మును పరిహరింపని నాడు ప్రభుతకు పాపం బొనగూడునని సహేతుక దృష్టాంత పూర్వకముగా జూపించి పెద్దలైన కృప ద్రోణ విదుర గాంగేయాదులదోడ్కొని ఆంబికేయు నొడంబరచి దుష్టజూదమ్ము నన్ని విధముల నాపుదునని–

క. మీ కెగ్గులు దలపెట్టిన
ఆ కౌరవు నిగ్రహించ మనుచును పల్కిన్
మీకెన్నడు యెగ్గవదనె
చేకొనెయా ధర్మ్మ కరము చేయింజేయిన్

సౌంభకోపాఖ్యానము

క. వలనుగ సాళ్వుని తోడన
కలనం పది నెలలు గడుపు కాలము నందున్
తెలియను మీ ద్యూత విధము
అల యీ ఆటవిక పందె మజ్ఞాతంబున్

వ. అనిపలుక అదియేమన, అయ్యుధిష్ఠిరునకు సౌంభకోపాఖ్యానమును సవిస్తరముగాకృష్ణుండిట్లని చెప్పందొడంగె. నీ యజ్ఞంబున అర్ఘ్య నిమిత్తంబున అసహిష్ణుండైన శిశుపాలుడు నా చక్రముచేత ని హతుండగుటవిని ఆతని తమ్ముడు సాళ్వుండు నాపై నలిగి కామ గమనంబైన తనసౌంభకంబను నగ రంబుతోడ సర్వసన్నద్ధుండై ద్వారవతీ పురంబునవరోధించియుం–

క. ఎక్కడ నా వృష్ణి ఖలుని
ఉక్కడగించియును ద్రుంతు యెట దాగున్నా
తక్కుచురా చెడు యాదవు
స్రుక్కడగింతునని వాని సాహసమెంతన్

క. అసమానోద్ధత సాళ్వుడు
పస దనరిన ఘోట్క గజ సపరివారమ్మున్
మిసమిస లాడెడు వనముల
కసవుల పందిళ్లు జేసె గజయూధమ్ముల్

క. తృణ జల ధాన్య సమృద్ధ మ
గణిత శతఘ్ని ఘనతర గజచయ మయమౌ

మణిమయ ప్రాకారాన్విత
రణ గణ చతురంగ సేన రక్షిత పురమున్

వ. జుట్టుముట్టి నిత్యమ్ము అనేకానేక నుపద్రవంబులు చేయుచున్న సౌంభక విజృంభణమును సహింపని వారలై సమరోత్సాహ సర్వ సన్నద్ధులునై-

క. ఉద్యద్బల సందోహ ర
ణోద్యోగులు సైనిక తతి నూర్జిత బలులై
విద్యాధర సములిల నా
ప్రద్యుమ్నుడు చారుధేష్ణ ప్రబలిరి ఒక టన్

వ సాంబడు సాళ్వ చమూపతి క్షేమవృద్ధి యను వాని సాహసోద్దామును ఆవల నుండి రాకె శరధారల మించి ముంచ గన్. జాంబవతేయుడు గుప్పించిన శర పరంపరల ధాటి కెంతయు దీటు గాక సాళ్వుడు క్షేమవృద్ధి తా నేసెను లక్ష శరంబుల్.

క. ఆ లాఘవ మా నేర్పుకు
మేలని మది మెచ్చు చెంతొ భీతము కావం
ఆలోచనుడై సాళ్వుడు
శూలాస్త్రుల నశ్వ తతుల స్రుక్కగ జేయన్

వ. అని యాశూలాస్త్ర వేదనము భరింపజాలక రధచోదకు మాటవినక రణరంగగతుల నతిక్రమించి తమ యిచ్చ చ్చిన తెరంగున పర్వులిడ చమూపతి సమర విముఖుండగుటయును, అది చూచి -

క. వేగుండను సాళ్వ నృపతి
వేగోద్ధతి సాంబు తాకె విరువ గ రథమున్
ఆగని శర వర్షమ్మున
యుగాంతుండోయన తన యుద్ధతి దెలియన్

క. నిస్థులుడౌ సాంబు గనియు
సుస్థిరుడా జాంబ్వదేయ్డు చురచుర లాడ్చున్
దుస్థితు జేసెను సాళ్వుని
మస్థిష్కము పగుల గొట్టి మాయని కినుకన్

వ. ఇట్లు జాంబవదేయుచే వేగుండా సాళ్వపతి విగత జీవుండయినవానిం జూచి విచింత్యుండను వాడు విక్రముండై ప్రద్యుమ్న చారుధేష్ణ జాంబవదేయ సాంబులపై శత సహస్ర విశిఖంబులు ప్రయోగింప ప్రద్యుమ్నుండాతని యుద్ధతిం గ్రహించి మంత్రోచ్చారణ చేసివహ్ని బాణము ప్రయోగింప, నది మహా విస్ఫులింగముల వెదజల్లుచు ద్రిక్కులు గ్రాల నా విచింత్యుం గూలనేయ సాళ్వ సైన్యంబు

లెల్లను హాహాకారు లగుచు చెల్లా చెదరు కావ-

క. సౌంభక సాళ్వుడు వచ్చియు
సుంభధ్వజుడై రణ సంక్షోభము నాపిన్
కుంభించెను శరవర్షము
శంభుని వర శక్తి యుక్తి సాంబాదులపై

వ. అంత వాని కలిగి ప్రద్యుమ్నాదులుం వృష్ణి యాదవ వీరులును-

క. ఒక్కుమ్మడి నా సాళ్వుని
దిక్కై నేగుచును జుట్టి తీక్షణు లగుచున్
స్రుక్కం జేసిరి శరహతి
గ్రక్కున మూర్ఛితుడు కావ గర్వోన్నతులై

క. ఉన్నంతన మూర్ఛ దెరలి
సన్నంగా పైకి లేచి సాళ్వుడు ద్యుమ్నున్
మిన్నంటిన కోపమ్మున
దన్నం అతి రౌద్రు డగుచు దర్పిత మతియై

వ. దానిం దప్పించుకొని ద్యుమ్నుండును నారసింహోగ్రహోదగ్రుండై మూడేశమ్ముల సాళ్వ రథాశ్వ సారథుల నేలంగూల్చి రాక్షస మాయాబల సంపన్నుడైన సాళ్వునినూటొక్క శరంబుల అంగాంగ సంధులం భేదింపనేయ మాయోపాంతరముల దప్పించుకొని సాళ్వుండును ప్రద్యుమ్నాదులపై మాయా శత సహస్ర విశిఖమ్ములు ప్రయోగింప-

క. అమ్మాయాయుధ శరజా
లమ్ముల ప్రద్యుమ్ను డంత అత్యద్భుతి భ
గ్నమ్మొనరించియు నడుమన
సమ్మోహితు జేయ సాళ్వు సాహస యుక్తిన్

వ. ఇట్లు సమ్మోహనాస్త్ర పీడితుండై పడియున్న సాళ్వుం దుదముట్టింప బాణ ప్రయోగంబు చేయ సమకట్టిన, ఆకశంబున హాహారవంబు లెగయ ఇంద్రాది దేవగణ ప్రేరితులైననారదాది మారుతులు ప్రద్యుమ్ను పాలికి దిగివచ్చి మహనీయా యీ సాళ్వుడు-

క. చావండీతడు నీచే
చావది నారాయణునిచె జరుగును వీన్కిన్
ఆ వాణీధవు పల్కున
ధీ విభవుడు దెలియు మనగ తిరిగెను అతడున్

సాళ్వుడు ప్రద్యుమ్నునిచే బాధితుండై జనుట

వ. అంత సాళ్వుండును చేయునదిలేక ద్వారవతీ అవరోధమ్ము ఉడిగి తనసౌంభకమునెక్కి వెనుదిరిగి వెడలుటయును, నీ యజ్ఞంబు పరిసమాప్త మైనంతన నగరి కేగి తుత్తునియలుగా విరువంబడి మాసి యున్న తత్పుర వనాంతర ప్రదేశమ్ముల పాడుబడి భస్మీపటలంబైన దుర్గ ద్వార దేశంబులు గలదాని కలగాపులగమ్ముగా రక్తసిక్త జల సందోహంబైన అగడ్త గలదాని గాట్లుపడియున్న కోటబురుజులు గల దాని భీతభీకర కరవాల సంకుల సంగ్రామ చిహ్నంబులు పొడగట్ట పీడిత వ్యాకుల చిత్తులతో నిండి నదాని ద్వారవతిం గాంచి దీని రక్షించుకొనుదానిగా బలదేవాదులకు జెప్పి అప్పటికప్పుడు–

తే. సైబ్య సుగ్రీవ కాశ్వక శకట మెక్కి
భేరి మ్రోయించి దశదిశల్ భోరనం గ
దురిత దుస్సహ సాళ్వునిం దునిమి కాని
పురము జొరనని భీష్మించి పోర నగుచు

తే. పాంచ జన్యంబు పూరింప పవను డాది
పంచ భూతంబు లన్నియుం ప్రబలె వేగ
చండనోద్ధృతి భీత ప్రచండ గతుల
గరుడ కేతనం బెగుర నాకాశ వీధి

వ. ఇట్లు అసంఖ్యాక చతురం గ సైన్యంబులు వెంట నా గిరివన సరోవర నదీనదమ్ముల గడచుచు ప్రాగ్జ్యోతిర్పట్టణ తీరదేశంబుల కేగునంతకు ముందర సాళ్వుండు సౌంభకారూఢుండై సముద్ర మధ్య దేశంబున కేగిన నేనును వాని వెంటదవుల–

క. నా సైన్యము పెచ్చు పెరిగి
ఆ సాళ్వుని సైన్యమంటి ఆహవ ముడుపన్
ఆ సాళ్వునిపై బడ నే
మీసంబుల నులిచి వాడు మీదకు దూకన్

క. ఘోరాహవ మయ్యె నప్పుడు
హోరాహోరిం నెగడుచు హోహోయనగా
వీరాగ్రేసర సాళ్వుడు
ధీరోద్ధతి సరిగ నాతొ ధీరత బోరన్

చ. ఇరుగడ సైన్యము ల్దివిరి యింతయు నెంతయు సాహసంబునన్
పరశువు శూల పాశురము బల్లెము లాదిగ చేత బట్టియున్
దరియుచు వారు వీరనక దద్దరిలం భువి కిందుమీదుగా

ఒరయుచు ఆహవోద్ధతులు ఓర్వక మించుచు గెల్పు మాదనన్

చ. వన నిధు లింకగా చెదల వహ్నియు వాయువు సంచరింపగా
మునుమున శంఖ చక్ర గతి ముందుకు సాగను దైవ మాయగా
కనివిన నేరమెప్పుడన కమ్మెను జీకటి యుద్ధభూమిలో
తునియలు గాగ కూలెనిల దుర్దశ నొందుచు సాళ్వ సైన్యముల్

వ. అట్టి యెడ మదీయ సైన్యంబుల విజృంభణము మారుమ్రో గ నిజ సేనా నివహక్షీణతను చూచి సహింపని సాళ్వుండు సౌంభకారూఢుండై–

తే. ప్రోది జేసియు తన సేన ప్రోత్సహించి
పాశ అంకుశ కరవాల బాణ తతుల
కుంభ వృష్ఠిగ గురిపించె కోపగించి
రాల వర్షము ఆపగా రాక్షసుండు

వ. అట్టి సమయంబున నే నప్రమత్తుండనై

తే. వజ్ర ములుకుల బాణాగ్ని వడిగ జిమ్మి
అస్మదాయుధ బలమున కధిక మౌచు
కఠిన శిలవృష్ఠి ఆయుధాల్ క్రమ్మరిస్తి
సాళ్వ భూపతి నుత్సాగ్ని చల్లబడగ

వ. అట్టి సమయమున ద్వారవతి నుండి ఒకడరుగుదెంచి వాసుదేవా! అక్కడ సాళ్వునిచే వసుదేవుండు పట్టుబడె. మీరిక్కడెవరితో బోరుచున్నారన ఆశ్చర్యచకితుండనై యిదియంతయు సాళ్వ రాక్షస మాయాజాలమ్ముగా నోపునని నిశ్చయించుకొని నా సాళ్వు సౌంభకముపై మాయావిచ్ఛిన్నాస్త్రంబు ప్రయోగింప అదిఅదృశ్యం బ గుటయును దశదిశల అసురానీక ఆక్రోశనధ్వనులు ఉప్పతిల్లుటయును వాని నెల్ల అనల జ్వాలాభి శోభితమ్మునై ప్రతికూల రాక్షస యక్ష గంధర్వ దైత్య దానవ కోటి సంహరణ దారుణంబైన నా చక్రమును మంత్రించివైవ అది యుగాంతకాల పరివేషణ భీషణంబై నా సాళ్వు సౌంభకముపై పడుటయును దానితోపాటు సాళ్వుండును తుత్తునియలుగా చీలి భూమిపైబడి బస్మీభూతమ్మయ్యెనంత ననియిట్లు చక్రధరుండు ధర్మరాజునకు సౌంభ కోపాఖ్యానమ్ము వివరించి పాండవులం వీడ్కొని సుభద్రాభిమన్యుల వెంటగొని కాంచన రధంబెక్కిద్వారవతి చేరుటయును ద్రుష్టద్యుమ్నుండు ప్రతివింధ్యాదులైన ద్రౌపదేయులం దోడ్కొని ద్రుపద పురంబున కే గుటయును, అంత–

పాండవులు కామ్యక వనము నుండి ద్వైత వనమున కేగుట

వ. పాండవులు ద్రౌపదీసహితముగా ఆయుధములు ధరించి రథమునెక్కి తమవెంటవచ్చు భూసురాది పరివారులై ద్వైత వనమున కరగినంత ధర్మరాజు తమ్ములతో నిట్లనియె.

క. ద్వైత వనంబిది ఋషి కుల
దైత్య సురాసుర బహువిధ తేజోమయమౌ
ఘాతుక శార్దూలాదిగ
భీత భయోద్వేగ భల్ల భీకరమౌచున్

క. ఘోరాటవి పర్వతముల
తారాడెడు కొండ జాతి దర్శన మగుడున్
ఆరాటమ్మున పరుగిడి
పారాడుచు వేట లందు పటుతర శక్తిన్

క. కామోద్ధతి సంచరితము
సామజ నాగేంద్ర సింహ శార్దూలంబుల్
యేమర కుండుచు తగ తగ
ధీమంతత మెలగ వలయు తేకువ తోడన్

వ. అనవిని అర్జునుండన్నతో-

సీ. అనఘ నీ ఆరణ్య మమితోగ్ర మృగమయ
ఆవాస సంకుల అడవి యయ్యు
ముని గణ ఋషి వర్యు ముదమార సేవింప
పాపౌఘ విఘ్నమ్ము భద్ర పుడమి
జనజీవనోద్యోగ జలధార లలికించు
పుణ్య పావన ధాత్రి పూత చరిత
వన మూల ఫల భక్ష్య బహు విధ పోషక
ఆహారమొలికించు అవని దెలియ

ఆ. తీయ తేనె లొల్కు దీపింప నెంతయో
మధుర మధుర నాద మధుప గీతి
పూర్వ పుణ్యమైన పురుషార్థ సంసిద్ధి
యోగ్యమైన యుర్వి ఉత్సహింప

వ. మరియు నిది ద్వైతారణ్యమనుపేర ప్రవర్తిల్లు చుండియు నద్వైత ఫల ప్రసిద్ధులుగానెంచనగు అద్వైతోపాసులైన నారదాది మునిముఖ్య సురవరపూజిత సనకసనందనాదులిందు సంచరింతురని విందు. నియతాత్ములమై యేవురముం వాసమ్ము లేర్పరచుకొని యిష్టంబున దేవ పితృ కార్యమ్ములు నిర్వర్తించు కొనుచు వచ్చిన ముని వృత్తపోధనుల సేవించు కొనుచు బ్రాహ్మణులను గూడా దనుపుచు

నుండుదమన్న–

క. సకలం బెరిగిన వారలు
బకదార్భ్య మృకండ సుతులు పాండుల కడకున్
అకలంక తపోధను లిరు
ఒక నాడల ఉదయమ్మునె ఒప్పుగ రావన్

వ. ధర్మరాజానుజు లందరు యెదురేగి నమస్కరించి అర్ఘ్య పాద్యాదు లమర్పించి పూజించిన వార లం జూచి–

క. అలనాడల రఘురాముని
తలపించుచు మీర లిపుడు ధర్మ నియుక్తిన్
కలుములు బాసియు నడవుల
ఫల భక్ష్యంబుల దినుచును పావన మతులై

వ. సత్య నిష్టా నియమానుబద్ధులై వర్తిల్లుచు భాసురకీర్తి ప్రతిష్ఠలు గన్న నల హరిశ్ఛంద్ర సగర భర తాదుల వలె మీరునూ రాజ్య ప్రతిష్ఠిలు కాగలరు. దుష్ట సౌబల ప్రయుక్తులైన దుర్యోధనాదులు–

క. ధర్మము దప్పియు వార ల
ధర్మపు జూదమ్మున మిమ్ము తరిమిన వారా
దుర్మార్గులు తమ పాపపు
కర్మకు లోనౌదు రెంతొ కౌరవు లనుచున్

వ. మీరు సత్యవ్రతులు గాన మీకిష్టసిద్ధి యగునని యాబకదార్భ్య మార్కండేయ మహామును లరిగి నంత, కొంత దుఃఖోపశమన పరులై పాండవులుండు నెడ ద్రౌపది ధర్మరాజునితో–

ఆ. సత్య ధర్మ విదుల సన్మార్గ వర్తన
నియమ నిష్ట చరిత నీతి పరుల
అడవులంట దరిమి ఆ దుష్ట కౌరవుల్
బాగు పడుటదేమి భవ్య చరిత

ఆ. మాన హీనులౌచు మర్యాద లెంచక
వంశ కీర్తు లెల్ల భగ్న పడగ
పాప వర్తన్ సుతుల పారంగ దోలని
కృద్ధుడెంతొ చాల వృద్ధరాజు

సీ. రమ్య హర్మ్యమ్ముల రమణీయ తల్పాల
శయనించు సుఖ భోగ సదయు లీరు

కఠినోర్వి పాషాణ గతుకు నేలలలోన
దర్భ శయ్యల నెట్లు తాల్మి గొంద్రు
పసిడి పళ్లాలలో పంచ భక్ష్యాన్నాలు
పదిమంది వడ్డింప భద్ర గతిని
కుడిచెడు మహనీయ కుడువంగ వలసెనా
దర్భాసనమ్ముల ధరణి మీద

ఆ. విధి విలాస మిదియ వీర్యవంతులు రయ్యు
నీదు ధర్మ యుక్తి నిలచి రనుజు
అడవులందు సరిగ అలమట నుండరే
నీతి ధర్మ నియతి నిర్మలాత్మ

ఆ. అర్ధభాగి నవుదు అన్నింట దవిలుండి
అష్టభోగ సుఖము లనుభవించి
రాజసంబు తోడ రాణిగా తులతూగి
యెట్టు లోర్తు మదిని యిట్టు లిపుడ

వ. కంద మూల ఫలభక్ష్య పానీయాన్నములు గుడిచి కృశులై పర్ణశాలయే రాజ ప్రాసాదముగా నెంచుచు అరివీర భయంకరులైన తమ్ములం గల్గియు అశక్తుని వలె క్షమవహియించి మిన్నకుండుట పాడి యగునె. అనేకానేక నరపతి మకుటాయమాన నవరత్న కాంతుల రాగ రంజితములగు మీ పద యుగళి యీ పర్వతమయ పాషాణ శిలావేదికలయందు ప్రస్ఫుటితములు కావాయె. సింహ కిశోరముల వంటి తమ్ములీ యడవుల ధూళిధూసరితులై అవిశ్రాంతులై మీ వెంట శాంతిదాంతులై యుండ వలసిన వారునై యుండిరి. క్షమా శాంతిదాంతులు యెల్లరయందును యెల్లెడలను శ్రేయోదాయకములుకావు. దుర్జన దురహంకారుల నుపేక్షించుట రాజధర్మము కాదన ద్రౌపదికి ధర్మరాజు–

మత్త. ధర్మతత్పరు లైనవారికి దర్శనీయుడు దేవుడున్
కోపగించని ధీ విశాలర గోప్య వర్తన సాధనన్
శాంత చిత్తుల సద్గుణాఢ్యకు సర్వలోకము లందునన్
కాని దేదియు లేదు నమ్మవె కామితార్థము తథ్యమున్

వ. కోపాగ్ని సమస్త సద్గుణములను దహించును. ధర్మ బుద్ధులు తత్కోపాగ్నిని శాంతి క్షమాజలంబుల చల్లార్చి తేజస్సంపన్నులై లోకకళ్యాణ కారకులు కాగలరు. అప్పుడు దైవంబు తోడు రాగలదన భీమసేనుండు అన్న ధర్మరాజుతో–

సీ. ముని వృత్తి వశియింప మూర్ధాభిషిక్తుండ
ధర్మ తత్పరత యే ధర్మరాజ
పిత్రార్జితం బౌచు పేర్కొన్న రాజ్యాలు
దుష్టుల పాల్జేసి దురిత వృత్తి
అర్ధాభిరతులైన అధికార మదమత్త
దుర్వినీతుల ద్రుంప దోసమగునె
సత్య ధర్మము లంచు సద్భావనుండవై
ప్రజల భీతుల జేయ భావ్య మగునె

తే. శత్రు కదనాన ద్రుంచుటే క్షాత్ర గుణము
శాంతి దాంతులు వలదంద్రు శత్రు నందు
అర్ధ రాజ్యాలు జయియించి అలరు వాడె
ప్రజల హిత బుద్ధి కాపాడు ప్రాజ్ఞు డరయ

వ. సత్య ధర్మాభిరతులమై మునివృత్తి, మన మీ యడవులం దున్నచో కౌరవులు మనల పరాక్రమ హీనులుగా దలంపరే. బల పరాక్రమ సంపన్నులనే ప్రజలును రాజ్యలక్ష్మియు వరించును. ధర్మార్ధ కార్యంబులం దవిలి యజ్ఞ యాగాది క్రతువు లొనరించి సద్ధర్మాచరణ చేయువాడే ఉత్తమకుల క్షత్రియుడు. ధర్మార్ధములు రెండునూ మహాబ్ధి మేఘ ముల యట్లు పరస్పరోదయములు. అర్ధ హీనుడు సత్కర్మలు చేయ జాలడు. దేవ భూసురోత్తముల సంతృప్తుల జేయలేడు. ఇహపర సాధనాను కూలముగా దేశమున శాంతి దాంతులు నెలకొల్పుచు భయ భీత రోగార్తి యీతిబాధలు లేకుండ ప్రజల కాపాడుటయే సత్య ధర్మములు. సుక్షత్రియ పురుషకారత్వములను పరమార్ధము నీవెరుంగనిది కాదుకదా. తిరిగి మన రాజ్య లక్ష్మిని చేకొననిదే సద్ధర్మాచరణము చేయజాల మనుట నిర్వివాదము. ఆటలాడి లోటు వడినంత మాత్రాన అడవులంబడి దిరుగుట ధర్మాచరణ మగునా? మనశత్రువులనందగు కౌరవుల జయింప నీవ "ఊ" అనుము చాలు. తక్కిన దంతయు నీ తమ్ములు యెట్లు చేసికొందురో జూతువు గాక.

క. అర్థాంగ బలోద్ధతులా
స్వార్ధుల నెటు ద్రుంతు మనకు సమరోత్సహుడా
పార్ధుడు విల్గొన నాజిని
అర్ధాంతర గతు లవుదురు ఆకశ వీధిన్

క. భట సంపద లేదనియా
పటుతరులై దండ నిహతి పగతుర నెల్లన్

మటుమాయము జేత్రు నిజము
చటుల బలోద్ధతిని దుంత్రు సాహస ఫణితిన్

తే. సత్య శీలివి సద్గుణ సమర యోధ
ప్రేమ తోడుత నున్నారు ప్రియము గూర్ప
యశ విశాలురు యేకయ యాదవాది
నృపులు పల్వురు నీతోడ ననికి దూక

తే. శాత్రవుల ద్రుంచి పుడమి నిశ్శాత్ర మౌగ
యేక ఛత్రాధిపతివిగా యేలనౌదు
ధర్మ పాలన చేయుటే ధరణి పతికి
ఒండు ధర్మమ్ము గలదె వేరొండు దలప

వ. అనిన వాయు నందనునితో ధర్మరాజు తమ్ముడా!

తే. నీదు పల్కులు ధర్మమ్మె నిక్క మరయ
శత్రు జయియించి ధర్మమ్ము చక్కబెట్ట
ధర్మజుండన్న పేర్గొన్న ధరణి పతికి
ఆడి తప్పుట సరిగాదు ఆపదైన

తే. కామ కోపమ్ము లందున గడలుకొనక
శాంత చిత్తత పరికించి సత్య మరసి
బాసలాడిన యట్టుగా భద్ర గతిని
దీర్చి కాలమ్ము ఆవల దీర్ప నవదె

వ. సత్య సమయ మతిక్రమింపక శుభోదయ కాలము రా నిరీక్షింతము. సమస్త ధర్మములును సత్యము నందే యిమిడియున్నవి. రాజ్యవిభమ్ములును సర్వ సంపదలును కీర్తిప్రతిష్ఠలును సత్యమునకు సరిగావు. అనిన ధర్మజునితో మరల భీమసేనుండు–

ఆ. చావు నిక్కమంచు సమయజ్ఞులము గాక
ఊరకుండ నవునె ఉర్వి జనుడు
పగయు దీర్ప వలదె పరిభవ మ్మెద దల్చి
క్రూర కర్మ దుష్టు గూల్ప వలదె.

వ. నిండు సభలో కౌరవులు చేసిన మానావమాన పరాభవాగ్ని నా మనంబున అనిశము దహించు చున్నయది. నాకంటెను కుంతియు ద్రుపదరాజ నందనయు మీరునూ భీమార్జున నకుల సహదేవులు నూ కూడా అంతః మనస్తాపమున వ్రమ గ్గుటలేదే? ప్రతీకారము దీర్చునంతకు నా పరాభవాగ్ని

చల్లారదు. కౌరవులపై కారుణ్యము జూపుట శాంత బ్రాహ్మణ ధర్మము. పగతుర మట్టు బెట్టుట క్షాత్ర ధర్మము. ఇందు నీవెరుంగని దేదియులేదు.

క. ఇమ్మగ పంద్రెండేడులు
సమ్మతి గడపిన వనముల సరియా అజ్ఞా
తమ్మది గడపగ తరమే
ఇమ్మహి నెట నున్నగాని యేర్పడకుండన్

వ. అదియునుం గాక ఇప్పటికి పదమూడునెలల పర్యంతము మనమీ వనవాసమున నుండు వార ము.సంవత్సరమున కొక్కమాసము చొప్పున లెక్కించుటయు పరిపాటియు ధర్మవిరుద్ధమును కానేరదు. అనిన వానికి ధర్మరాజిట్లనియె.

సీ. శూరులు వీరులు సుయోధనాదులు
భూరిశ్రవుండును భూరి బలుడు
దుర్మార్గ వర్తన ధూర్త వ్యసను లెంతొ
మర్యాద లెరుగడు మద్రపతియు
అంగరాజెంతయు అసహాయ శూరుడు
ఆశ్రితుడైయున్న అస్త్ర విదుడు
దోర్బల భుజ శక్తి దుర్నయ శీలుడు
దోషకారుడు గాదె దుస్ససేన్డు

ఆ. కవచ కుండలుండు కడు మిత్రుడౌగాదె
కౌరవేంద్రు కెంతొ కడిమి బలిమి
ఆచి తూచి గాని అడుగేయ వలవదు
సాహసంబు తగునె సమరయుక్తి

వ. మరియును భీష్మ ద్రోణ కృపాచార్యులు సములయ్యును వారి పక్షమై యుండి యున్నవారు. అపార దివ్యాస్త్ర బలసంపన్నులు. వీరల నెల్ల నిర్జించినం గాని దుర్యోధను జోలికి పోజాలమనివిచారిం చుచున్న యవసరంబున–

కృష్ణద్వైపాయనుని రాక

క. వచ్చెం బారాశర్యుడు
సచ్చరితుడు లోక వంద్య సమయజ్ఞుండై
అచ్చెరువందగ ధర్మజు
డిచ్చుతొ కృష్ణాజినోత్తరీయుడు ప్రీతిన్

క. పూజితుడై పాండవులచె
ఆజిం భీష్మాది ముఖ్య అధిపుల నెల్లన్
భాజిష్ణుల చేయు తెరగు
భూజన ప్రియ దెలుప వస్తి భూరి యశుండా

తే. అతి రహస్య ప్రతిస్మృతి ఆధ్య విద్య
అవధరింపంగ బంపుమా అర్జునాఖ్యు
అతి తపో వీర్యవంతుడై అధిక శక్తి
గొనగ దివ్యాస్త్ర సంపత్తి కోర్కె మీర

వ. అని ప్రతి స్మృతి విద్య నుపదేశించి దీనన పార్థుండు శత్రువుల జయించ నగునని వెండియు మీర లీ వనమున చిరకాల ముండి యుండుట తగదని వేరొండు చోటికి అరుగుడని పల్కి అమ్ముని వరుం డరుగుటయును.

క. ద్వైత వనంబును వీడియు
యేతరులై పాండవులల యెంతయు ప్రీతిన్
భూతల కామ్యారణ్యము
చేతో మోదమ్ము దనర చేరిరి మరలన్

వ. అంత యొకనాడజాత శత్రుండు అర్జునుం బిలిచి యిట్లనియె.

క. యుద్ధమె కార్యము సిద్ధికి
యుద్ధమె అనివార్య మగుడు యుద్ధతి మిగులన్
యుద్ధురులా భీష్మ గురులు
యుద్ధృతుడవు కమ్ము లెమ్ము యోధాగ్రణ్యా

వ. దివ్య మంత్రోక్తి యుక్తంబైన ధనుర్వేదము భీష్మ ద్రోణాదుల యందాశ్రయంబై వెలుగొందు చున్న యది. అట్టి వారల జయింప వీలగు దివ్య మంత్రయుతంబైన ప్రతిస్మృతీవిద్యను కృష్ణద్వైపాయనుడు ప్రీతితో ఉపదేసించెను. నీ వద్దానిని యోగనిష్ఠా పరుండవయి మంత్రయుక్తంబుగా అనుష్ఠించినతేజో వంతుడవు కాగలవు. ఇంద్రాది దేవతలు ప్రత్యక్షము కాగలరు. వారి ఆదేశమున ఈశ్వర వరప్రసాద సిద్ధియుం చేకూరగలదన –

క. మునివర ధౌమ్యుల పెద్దల
అనుజుల ఆశీస్సు గొనియు అర్జును డంతన్
ధనువును చేకొని ముందుకు
చనియెం హిమ నగములంటి సత్వర తపమున్

వ. అట్లు హిమశైల గంధమాదన వన పర్వతముల నతిక్రమించి పైపైకి ఇంద్రకీలాద్రి దిశగా పయనించువాడు యెదుర ఒక మునిపుంగవుం చూచి మ్రొక్కునంత–

క. ఆగుము వీరుడ ముందుకు
సాగకుమను వాక్కు వినియు సద్గుణ శీలుర్
యోగులు సిద్ధులు యుండెడు
రాగూరునె ఆయుధ ధర రాక్షస వృత్తిన్

వ. అన్న ఆ వాక్కు వచ్చిన దిక్కై ధర్మరాజానుజుండు–

ఆ. రాక్షసుండ గాను రారాజ కులజుండ
ఇంద్ర సన్నిభుండ చంద్ర కులుడ
పాండు నృపుని సుతుడ పార్థుండ నందురు
ఆత్మ రక్షణార్థ మాయుధమ్ము

ఆ. విడువ దగునె దీని విఖ్యాత గాండీవ
మనెడు ధన్వు వరుణ మంత్ర సిద్ధి
వహ్ని చేత గొంటి వజ్రాయుధము కంటె
మిన్ననౌగ తెలియ సన్నుతాంగ

వ. అన్న అతని ధైర్య సాహసములకు మెచ్చి మునిరూప ధరుండైన వజ్రాయుధుండు నిజరూప ధరుండై–

ఆ. తుష్టి వరము లిత్తు దుష్టుల దునుమాడ
కోర్కె బడయు మయ్య కోర్కె మీర
దేవలోక ప్రాప్తి తేజో మయం బౌగ
ఇష్ట భోగ మందు యిద్ధ చరిత

వ. అనుటయును అపు డర్జునుండు రెండు చేతులు జోడించి దేవా! భవత్ ప్రసాదంబున దేవలోక ప్రాప్త్యాది వరసిద్ధి యుతుండనైతిగాన మమ్ముల యిప్పాటిం పరాభవించి అన్యాయముగా అడవుల పాల్జేసిన ఆ ధార్తరాష్ట్రుల నెల్లర తుదముట్టింపనిదే మనమున కూరట లేదు. అందులకు వలయు దివ్యాస్త్ర సంపన్నుడనై కానీ ఉత్త చేతులతోఅనుజుల సన్నిధికి జేరనొల్లనన–

ఆ. కామితాస్త్ర సిద్ధి కరకంతు వరమున
బడయ దగుదు బిడ్డ భయము వలదు
సర్వ సిద్ధి ప్రదుడు సర్వేశ్వరుండౌను
యోగ విద్య పరత వేగ గొనుము

వ. అని సహస్ర లోచనుం డంతర్హితుం డగుటయును.

క. సురపతి వచనాను సరణి
పరమేశ్వరి యోగసిద్ధి బడయుట కొరకై
హరహర శంభో యనుచును
వరదాయకు గొల్వ నేగె వన్యాటవులన్

క. తరుమయ గిరి గహ్వర ఘన
వారుణి ఝరి పాయలందు పావనుడగుచున్
ఆరుణోదయాది సంధ్యల
కరుణాలయు యోగ దృష్టి కాంక్షిత తపమున్

వ. మనోబుద్ధి ధ్యానపరుండయి చిత్తచాంచల్యా వివర్జితుండయి నిరాహారుడయి కొన్నాళ్లును, నీరము లుగొనుచు కొన్నాళ్లును, వాయుభక్షణ జేయుచు యింకొన్నాళ్లును, ఊర్ధ్వబాహుండై ఆకాశ వీక్షణము జేయుచు యేకపాదుండైనిలచి అనన్య దీక్షాతత్పరుండయిఆరవమాసముననుఅతిఘోర తపము నం దున్నఆర్జునుం జూచి విస్మయాకులిత మానసులై అందలి ఋషిపుంగవులు పరమేశ్వరు సన్నిధానము న కేతెంచి ఇట్లని విన్నవించు కొనుటయు–

చ. అలఘుడు పాండు నందనుని అద్భుత శక్తితపః ప్రభావతన్
జలతల జీవకోటి భువి జాగృతి తప్పెను గాఢ వేడిమిన్
కలువల రేడునుం తిమిర గాఢత కుందెను అంధకారుడై
తలపుము పాండవాభ్యుదయ తత్పర తెంతయు అంబికా ప్రియా

వ. అతని అభిమతం బీడేర ప్రసాదుండవై కరుణాళువు కావుమన పరమ శివుడు ప్రసాదుండై వాని అభిమతార్ధమీడేర్తునని ప్రియ పూర్వకంబున వీడ్కొల్పుటయును తదనంతరంబ భర్గుండు భవానీ సహితుడై–

తే. వేట దోపిళ్లు విల్లంబ్లు వెంట గొనుచు
అంబ సాంబుద ఘనులంత అలరె యెంతొ
కోయ చెంచుల వేషాల కోర్కె దనరి
అర్జునాధ్యుని యెదరగా అడవి నంటి

వ. కదలి రా ఈశ్వర చోదితుండై ముందట అల్లనల్లన మెల్లన వచ్చు–

తే. మూకుడను దైత్యు దుస్తర సూకరంబు
భీకరాకార భీభత్సు భీతి గొనగ
గుర్ఘురార్భటి యుదగ్ర ఘోష చేసి

ముష్టి కోరల జనకరా మూకు దునుమ

క. ఘన గాండీవము నెత్తియు
అనఘుడు అస్త్రంబు విడువ ఆవలి తట్టున్
ఘనవిభు చెంచుని కోలల
వనచరమా సూకరంబు వసుధకు కూలెన్

వ. అపుడా అలుగులు తగిలిన సలుగుని దిక్కుమొగంబైవచ్చిన అర్జునుండు ముందటనిల్చి యున్న ఘన భుజ చాప ధారు వనచర వనిత కిరాతకరూప అనుపమతేజో రాజితమేరు అపార భిల్లసేనా విహారు చంద్రకిరణ కరుణా వీక్షణ చారు లోచనాకారు మృత్యుంజయాకారు నొక మంగళ మృగయా విగ్రహాకారుం గని అయ్యా! నీ వెవ్వండవు. అమానుష గోచరంబైన యీఘోరాటవీ వనితాను పరివృ తుండవయి రా, గతంబెయ్యదిమరి నా యమ్మున నాటిన కిటి నేసి మృగయా ధర్మ విరుద్ధుండవైతి. మృగయాటవిక జీవనుల నేలు పశుపతుల కైనను నీతి నియమ ధర్మము లుండును. నీయట్టి ధర్మవి రుద్ధుని యేమన వలయునన నప్పుడా కిరాతపతి ఆతని కిట్టు లనియె.

క. ధర్మాతి క్రమణుండనె
నిర్మల మతివై యెరుగుము నీవే ఔదో
ధర్మమె? నా యడవి సలుగు
ధర్మాచరణుండ ద్రుంప ధర్మమె నీకున్

క. ఈ యడవిని గల జంతులు
నా యనుటది యేటిమాట నయవిధి తెలియన్
సాయుధునై వేటాడితి
నా యలుగిది చూడుమంచు నరుడాడుటతోన్

క. నా యలుగిటు చూడు మిదియ
దూయగ వడి దాకె కిటిని దోగుచు నశువుల్
బాయదె ధరణికి గూలిం
నాయదియే యంచు చెంచు నరు నడ్డుటయున్

వ. ఇట్టు లా యిరువురును పట్టుదలతో–

క. కిటికై పటుతర వారణ
జటిలోద్ధతి ముష్టి ఘాత చతురులు మరియున్
ఘటనా ఘటన సమర్థులు
కటువై దివ్యాస్త్ర లంద్రి కయ్యం బాడన్

క. నరు దేసిన బాణ వితతి
మరుగౌచును మాయమౌగ మర్మంబేమా
గురుతర నా యస్త్రంబులు
విరుపుచు నెదురొడ్డి నిల్చి వింతయు కాదే

వ. ఈతం డెవడో సామాన్య మానవమాత్రుండు యెంత మాత్రమును కాదు. ఏ దివ్యపురుషుండో ఆటవిక కిరాతక రూపంబునవచ్చిన దైవాంశ సంభూతుడో కావలయునని చింతించుచు అర్జునుండు తన మనంబున–

క. సుర రేడో పరమేశుడొ
దురితోపశమన భవభయ దుర్దమ హరుడో
కరినేలిన హరిసముడో
వరమీయను మెచ్చి వచ్చు పరమాత్ముండో

వ. అను నిశ్చయ బుద్ధిని కనులు మొగిడ్చి సురేంద్ర నందనుం డేకాత్ముండై పరమేశ్వరు ధ్యాన మగ్నుండై యుండునెడ–

చ. శిరమున చంద్ర వంకయును శీతల గంగయు ఝూటజాలమున్
ఉరుగజ చర్మ పుట్టము నుమాసతి గూడియు వామభాగుడై
ఉరుతర నాగభూషణము లుచ్చుక గొల్పెడు బూతి రేఖలున్
కరముల శూలముం ఢమరు కార్ముక ధారియు ఫాలనేత్రుడై

వ. పరమ శివుండు ప్రత్యక్షం బగుటయును అర్జునుండు పారవశ్యుండయి–

పరమేశ్వర స్తోత్రము (దండకము)

ఈశ పరమేశ ఆది లోకేశ విశ్వేశ లోకైక సంస్తుత్య దేవాధి దేవా! మహా దేవదేవా! ఆది మధ్యాంత రాహిత్య అద్వైత భావా విభావా, భవానీప్రియా వేదాంత విజ్ఞాన విశ్వద్భవానీక తేజస్వరూపా విరూపాక్ష విశ్వేశ్వరా, అజ్ఞానము ల్బాపు ఆత్మైక జ్యోతిస్వరూపా అర్ధనారీశ్వరా, యేకైక స్త్రీపుంస యోగీశ సంసేవనా సక్త ముక్తి వరదాభయా, దక్షాధ్వర ధ్వంస అక్షయానంద సందోహ తాండవ ప్రియాఅవ్యయా, సాధు సంసేవనాసక్త మునిముఖ్య సంస్తుత్య ముక్కంటి ముల్లోక పాలా పాపహరా, కాశ్మీర హిమశై గిరివాస నగరాజ తనయాధవా, బృందారకాది మునిజన పూజిత విరాజ రాజాధిరాజ రామలింగేశ్వరా, భస్మ భూషితాంగా దిగంబరా నంది వాహనా నాగ భూషణ భూషితా, శ్రీశైల మల్లేశ శ్రీకాళహస్తీశ చంద్రశేఖర మంగళాకర సేతురామేశ్వరా, హరహర మహాదేవ శంభో శంకరాభరణ కాంభోజ రాగప్రియా, కొంగు బంగారు జటాఝూటధారీ కాంతార కైలాసవాసా మాహా శక్తి చిద్రూప చిత్తైక చిద్విలాసా, ఫాల నేత్రా గంగాధరా గిరిజానంద మందార హృదయాంతరంగా మల్లికార్జున పుష్ప

పూజితా, భావ భవ భావ భవరోగ సంహార జగజ్జేగీయమానైక సర్వేశ్వరా, కృతార్థుండనైతినో దేవా ధిదేవా మహాదేవా, కరుణించి కాపాడు దీనుండ నాతప్పు మన్నించు నన్నేలు మోయయ్య నిర్వాణ సంధాయకా, నీకు మ్రొక్కెదన్ భవద్దర్శనం బెంతొపాపౌఘ విఘ్నంబు పరమేశ్వరా పాహిమాం పాహిమాం పాహిమాం పరమేశ్వరా!

వ. అని స్తుతియించి కృతాంజలియై మోకరిల్లి కిరీటి వెండియు–

క. ఎరుగక ఎఱుకని తలచితి
తరుగని పాపంబు జేస్తి దయ కావుమయా
కరుణాంతర మగ్నుడవై
వరదైతా శరణు శరణు భక్తుడ కానా

చ. అనవిని యా త్ర్యంబకుడు అర్జును నెత్తియు కౌగలించియున్
ఘన విలు విక్రమంబునను గాఢత గొల్చిన భక్తి యుక్తులన్
మనమున సంతసించితిని మానుగ వేడుము యేమి కోరితో
అనువగు రీతిగా నయత అన్నియు నిత్తును కాదు లేదనన్

వ. తొల్లి నారాయణ సఖుండవైన నీవు నరుడను దేవ ఋషివి. ఆది నుండియు మీరిర్వురును జగద్రక్షకులుగా ప్రజలను కాపాడుచుండువారు. బదరికా వనంబున అనేక వేల సంవత్సరములు తపస్సు చేసిన మహావీర్యవంతువు. ఈ గాండీవముతొల్లి నీయదియే. మదీయ మాయావిశేషంబున నేడీ అస్త్ర సంచయము నీకు కనుమరుగాయె. నీ అక్షయతూణీర గాండీవములు మరలగొను మిచ్చు చున్నాను. వేడు మింకేదియైనా అన–

తే. వరద నీ శక్తి యుక్తియే వరము నాకు
పరమ నీచులు కౌరవ భారముడుప
వరము దయచేయ వేడెద కరుణతోడ
పరమ పావన దివ్యాస్త్ర పాశుపతము

వ. ఇదియును బ్రహ్మ శిరోనామకాస్త్రంబును యుగాంతములందు ప్రయుక్తములై పాపసంహారము గావించు. అత్తరి యి దివ్యాస్త్రముల నుండి అభిమంత్రితములైన అలుగులనుండి అనేక శతసహస్ర సంఖ్యానకములైన శూలములుగదులువడి ధర్మస్థాపన గావించునని విందు. ఇప్పటికి నీ కారుణ్యము వలన దీనింబడసితి. దైత్య దానవ యక్ష రాక్షస పిశాచోరగ భూతములను అతి వీర దురంధరులైన భీష్మ ద్రోణాదులను జయింతు. కవచ కుండల మండితుండైన కర్ణుని తుద ముట్టింతునన పరమశివు డు ప్రీతుడై పరిశుద్ధాత్ముండైన పార్థునకు సమంత్ర ధ్యానోప సంహరణ పూర్వకముగా పాశుపతాస్త్ర మును ప్రసాదించి దీని కసాధ్యమనునది లేదు. కావున అల్పులయందును ఆమాయకులయందును

ప్రయోగింప ధర్మము కాదు అని పల్కి అంతర్హితుండగుటయును.

క. త్ర్యంబకు అంగ స్పర్శన
నం బాండవ మధ్యముండు నవనవ తేజో
సంభవ విభవోజ్వలుడై
సాంబుని దలపించి రౌద్ర సాయకు డగుటన్

క. మానుగ దిరిగెడు దుర్నయ
దానవ యక్షాది యసుర తామస వృత్తుల్
మానిరి భయమున పర్వత
సానువులం బాండు లడవి సంచరు లగుటన్

వ. ఇట్లు పాండవ మధ్యముండు తనతపః ప్రభావ కారణముగా యీ అరణ్యవాస కాలమును గూడ రిపుజయ కారిగా సర్వ ప్రయోజన కారిగా పరిణమించుటకు సంతుష్టాంతరంగుడై యుండునంత–

ఇంద్రుడు దేవ గణంబులతో అర్జుననకు ప్రత్యక్షం బగుట

క. హరుచే వరములు గొన విని
వరుణ కుబేరేంద్ర యములు వరదులు వేగన్
సురగణ సేవితు లొచ్చిరి
పరమేశుని పాశు గొన్న పార్థుని జూడన్

తే. దివ్య విమానారూఢులై దిగిరి భువికి
దివ్య దృక్కులు యిచ్చిరి భవ్యు మెచ్చి
దేవ కార్యము దీర్పనా తిరము గాను
ధర్మ సంస్థాపనార్థమ్ము ధరణి యందు

వ. అనిన యప్పుడు విమానారూఢులై ఆకసము నందున్న వారలంజూచి అర్జునుండువినయ విని మితోత్తమాంగుడై ధర్ముడు వానితో నీవు తొల్లి నరనారాయణులను దేవఋషులలోనరుండవు. అజు ని నియోగంబున ఉత్తమ క్షత్రియుడవై జన్మించితివి. నీమూలమున ఆదిత్యాంశజుండైన కర్ణుండును దేవదానవ దైత్యయక్ష రాక్షస గంధర్వాంసుజులైన రాజులెల్లరును పరాభూతులై తరియింతురు. ఇది దైవ కార్యంబని పల్కుచు అతనికి ప్రతి వారణ భయోత్పాతంబైన దండంబునిచ్చిన వరుణుండు అని వారణనివహములగువరుణ పాశంబులు ప్రసాదింప కుబేరుండు కుబేరాస్త్రమునీయ వానిగొని అర్జు నుండు యధోచిత కాలానువర్తనుడై వాక్పుష్ప జలంబుల ఇంద్ర యమ వరుణ కుబేరులసంతృప్తులం జేయ సహస్రాక్షుండు సంతసిల్లి–

క. ఇందు ధర దిశాధిపతులు
వందితులై వరములీయ వహ్వా యనగా
నందను విజయుం చక్రు డ
మందానంద మగ్న మార్గణు జూచిన్

క. సుర లోకార్హుడ వైతివి
నరనాయక రాచ కులుడ నయవిధి రమ్మా
సురలోకులు గొనియాడగ
వర పురుషుడ రధము నంప్డ వరముల నిత్తున్

వ. అని దేవ గణంబుల తోడ నమరావతికిం బోయి–

ఆ. అంతరిక్ష యాన అధికార యుతమౌచు
దేవ లోక గమన దీప్తు లెగయ
మఘవు నాజ్ఞ గొనుచు మాతలి గొని దెచ్చె
ఇంద్ర రధము నపుడ ఇంద్ర సుతుకు

వ. మహనీయ! మహేంద్రుండు భవద్దర్శనం బపేక్షించి నిన్నుగొనిరా యీ దివ్య విమాన రధమును నీకై బంపియున్నాడు. ఇది అనన్య సామాన్యము. నూరు అశ్వమేధ యాగములు చేసిన వారలకైననూ దుర్లభము. దీని నధిరోహించి ఇంద్రపురి అమరావతికి రావలయునన అర్జునుండు సీత నగ గంగాజ లంబుల స్నాన మాచరించి శుచిర్భూతుడై దేవ గురు ఋషి పితృతర్పణములొనర్చి మాతలిప్రయుక్తం బైన దివ్య రధారూఢుండై–

అర్జునుం డమరావతికి బోవుట

చ. సమధిక శీతలోష్ణతయు సంయమ తాపస యోగ వాసమున్
అమలిన శీతలోదకములా వన పుష్పిత సౌరభాలతో
అమరుల వాహ్య వాటికయు అశ్రయ సిద్ధుల కాశ్రయంబునై
హిమగిరి ఉత్తమోత్తమము యి ధ్ధర యెంతయు పుణ్య భూమియై

వ. వెలుగొందు నీయందు తపః స్సంపన్నుడవై పుణ్య తీర్థముల సేవించుచు పుష్ప ఫల వనస్పతు లుపయోగించుచు యింతదనుక సుఖంబుండితి. అమరేంద్రుల ఆహ్వానితువై నిప్పు డమరావతికి బోయి వచ్చు వాడనని హిమవంతు వీడ్కొని అర్జునుండు దేవ పధమ్మున నేగుచు–

చ. అమరుల వాసముం మరియు ఆయత కర్ముల పుణ్య భూమియున్
యమ నియమాది మార్గణుల యజ్ఞముం జేసిన ధర్మ దాతకున్

సుమధుర గీతికావళుల సుస్థిర ధార్మిక హవ్య కర్తకున్
సుమతికి పుణ్య శీలురకు సూకృతి నేతకు సేవ్య మానమౌ

వ. మరియును–

చ. గత నుత జన్మ పావనుల కారణ జన్ముల కాకరంబునై
అతి రమణీయ కుడ్య తరు హర్మ్య జలాశయ సుందరంబునై
సతతము దేవభామినుల సంగతి శోభన లాలితంబునై
స్తుతమతి కీర్తనంబగుచు సుందర నందన దివ్య ధాత్రియున్

వ. అదియునుం గాక అనృతభాషలకును ఆధర్మ వర్తనులకును అగ్నిహోత్ర విహితులకును దైవ దూరులకును వేద దూషణ విశుద్ధాచారులకును అతిథి అభ్యాగతుల నాదరింపని వారలకును పాప కర్ములకును దూషణ భాషణులకును చెడ్డ సంకల్పులకును సత్కార్య దూరులకును ధర్మయుద్ధ పరాన్ముఖులకును జొర వీలుకాని అమరావతీ పుణ్యసీమను చేరుటయును అందలి సమస్తమును శోభాయమానమై శీతల సౌరభ కాంతిమయమై–

క. సురనాధుని కరిచందము
విరియాడెడు కర్ణశోభ వింజామరలో
సురధేనువు తెలి దనమును
తరమే పొగడంగ వేరు ధాతకునైనన్

క. శరదిందు కాంతి సమమై
సరి సౌరభ మల్లె మొల్ల సాదృశ మౌచున్
విరజిమ్ముచు వింత సొబగు
పురమెల్లను మరులు గొల్పు పుష్పిత వనముల్

వ. చూచుచు ఆనందమగ్నుండై అమరావతీపుర ప్రాంగణ వాకిటకు వచ్చుసరికి–

క. నరుడనుచును నారాయణు
సరిచెల్లెలి ధవుడనుచును సద్గుణుడనుచున్
సురలెల్లరు గూడి రచట
మురిపాప్సరాంగ్న లెల్ల ముచ్చట పడుచున్

వ. అయ్యెట్లర్జునుండు సురేంద్రు పంపున అప్సరో జేగీయమాన మంగళగీతికారవళులమధ్య సుర సిద్ధ సాధ్యవిద్యాధర ముని ముఖ్య గణాశీర్వాదములు గొనుచు ముందునకువచ్చుచు ఇంద్రాసనస్థుడై యున్న యా–

క. శతమఖునకు సహస్రాక్షుకు
సతియుతుడౌ శచిధవునకు సంస్థవ గుణికిన్
ధృతిమంతుడు ఇంద్ర సుతుడు
మతిమంతత ప్రణతు లిడియె మానిత భక్తిన్

వ. శచీపతియునుంగూడ మహదానంద మగ్నులై తనయుని గౌరవించుచు పూర్వోరుభాగంబున నునుచుకొని అర్ధసింహాసనంబిడి గౌరవించుటయును సురసిద్ధ సాధ్యవిద్యాధర గంధర్వు లెల్లరుం ప్రీతిపూర్వకముగా అర్జునుని నత్యుత్సుకత నర్చించిరంత–

సీ. మహనీయ మంటపాభ్యంతర మందిర
తూగుటుయ్యాలలో తూగ జేయ
పాశుపతమును గొన్న పాండవాన్వయు కీర్తి
మూడు లోకాలలో మ్రోగి వెల్గ
నందన వన సీమ నయగారముల్ బోవు
సుర నాగ కన్యకా సుందరాంగ్న
గంధర్వ గానాల గణనీయ గీతికా
మధుర మంజుల వాద్య మహిత ఘోష

తే. ఆట పాటల దోగుచుం అలరు వేడ్క
సరస సంభాష లెగయంగ చతుర రీతి
ప్రణయ కోర్కులు వెల్వార్చె పార్థు చెంత
యువిద యూర్వశి ప్రణయాబ్ధి ఊగి దేల

వ. ఉద్విఘ్న మదనానురాగ మధుర మంజుల స్వరంబున–

చ. అనుపమ వీర్య శౌర్య గుణ ఆశ్రిత కాముల కోర్కె దీర్తువం
చనిశము గోరుచుంటి నిను చక్కని దానను నిన్ను గూడనా
మనసది చల్ల జేయుమిక మన్మధు బాధకు తాళజాల లే
నన విని అర్జునుండపుడు అచ్చెరు వందుచు అమ్మరో యనిన్

చ. సుతుడను ఔదు నీకనుచు సుస్థిర బుద్ధిని మానసంబునన్
అతి వినయంబునం బలికి అమ్మరొ నీకివె వందనంబ్లనిన్
మతి చెడి మాటలాడకుము మానవ జన్మడ దేవ భామిరో
ధృతి చెడి చాపలత్వమున దుష్కృత మెంచకు కోప తాపతన్

వ. అనవిని యూర్వశి అనునయంబ అర్జుననితో–

తే. దేవ వేశ్యల కాదను ధీర పురుష
వావి వరుసలు లేవు యీ వసుధ మాకు
అమర వేశ్యకు సురతయే అభిమతమ్ము
కాదనందువ పురుషార్ధ కామ వృత్తి

వ. ఈ లోకంబున స్త్రీ పురుష సాంగత్యదోషము లేదు. నీవునూ యీలోకమున అడుగిడిన యపుడ దివ్యుండవైతి. దేవవేశ్యలమైన మాతో క్రీడింప దోసము కాబోదు. నా మనోరథం బీడేర్చి అమందానంద మందార మకరంద మధువనసురాపానముల ద్రావుచు నందన వనవిహార స్థలముల క్రీడింపుచు సుఖాబ్ధి దేలింపుమన నిర్వికార నిశ్చల చిత్తుండైన అర్జునుండు–

తే. దివ్య వనితవు నీవౌదు దేవదేవు
ఇంద్రు సాంగత్య సురభోగ యిష్ట సఖివి
ఇంద్రు వరసుతుండను నేను ఇందువదన
నీదు కోర్కెను యెటు ఓర్తు నేమనందు

తే. ధర్మ తత్పర జనుడ సద్ధర్మ మౌనె
పాప కార్యమ్ము నెరపుదే పాహిపాహి
నీతి నైతిక నిష్ఠుండ నిష్ఠురంబు
వలదు వలదమ్మ నాయందు వలపు వీడు

ఊర్వశి అర్జునుని శపించుట

తే. అనుచు వచియింప నూర్వశి ఆగ్రహాన
మాననీయుండ నీవొక మగడవౌదె
ఆడు వేషాన వసియింపు అవనియందు
అనుచు శపియించె కోపాగ్ని ఆపలేక

వ. తద్వృత్తాంతమంతయు విన్న దేవపతి తనయున కిట్లనియె.

తే. ధర్మ తత్పర మహనీయ తాత్మ బుద్ధి
మానవత్వంబు నిండిన మహిత గుణుడ
కాము శక్తిని తలదన్ను కర్మయోగ
దేవ దేవుడు నీ ముందు తీసికట్టు

తే. అనుభవించక తప్పదీ యతివ వాక్కు
సరస సద్గుణ అజ్ఞాత సమయ వేళ
దేవ శాపమ్ము వరమౌచు తీర గలదు

పరిహరించితి శాపమ్ము పాండవుండ

వ. మరియును ఈ ఆఖ్యానము విన్న వారెల్లరును సకల దురితోప విముక్తు లగుదురని వైశంపాయనుండు జనమేజయునితో యిట్లనియె. ఇంద్రుండు వరదుడైమెచ్చి ఇంద్రాస్త్రమాదిగా అనేక దివ్యాస్త్రములు ప్రసాదించుటయును దేవ గంధర్వ దిక్పతుల తోడ గీతసంగీత వాద్య నృత్య సౌరంభ్రముల మధ్య పాండవ మధ్యముండేడు వత్సరములు అందుండి యుండుట నొక్కట–

తే. రోమశుండను మహనీయ ఋషియు వచ్చి

అలరు అర్ధాసనస్థుండు అమర గద్దె

యెవ్వ రీతడు మహనీయు డేర్పరింప

అనుచు ప్రశ్నింప అనియె నిట్లు

వ. నరుడాది ఋషి తొల్లి నరలోకమున బుట్టె నాదు అంశ. కుంతీమతల్లికి కడగొట్టు బిడ్డడు పాండవ మధ్యమ పార్ధు డితడు. కురువంశ క్షత్రియ కులజుండు యీతండభరతాది కులజుండు భద్రయశుడు. పశుపతిని మెప్పించి పాశుపతమును గొన్న పావనుండు. సాధుసంసేవనా సక్త సద్గుణుండు.దుష్ట శక్తుల దెగటార్చు దుస్తరుండు. దేవ కార్యమ్ము దీర్ప భువిని తేజోధృతుండు ఆత్మ సన్నిభుండుకృష్ణ పరమాత్ము స్నేహితుండు. దేవతా సన్నిభుండు.

క. సురలోకమ్మున నాకడ

తిరముగ నున్నాడనంచు తీయని మాటన్

సరగున రాగలడంచును

యెరిగింపుము ధర్మజునకు యెంతయు ప్రీతిన్

క. కురుకుల రాక్షస యంశుల

వరవీరుల భీష్మ కర్ణ భాసురు గెల్వన్

అరుదగు పాశుపతాస్త్రము

పురహరు మెప్పించి గొనియె పోటరికంబున్

వ. మరియును నా వచనమ్ముగా ధర్మజుని సకల తీర్ధ సేవలు చేయునదిగా అతనికి తోడుగా నుండునదిగా రోమశునికి దెల్పి బంపుటయును–

క. ఇట హస్తిన ధృతరాష్ట్రుడు

పటుతర చింతన పరుడయి పార్ధుని శక్తిన్

అటనట దెల్సియు మనమున

గుటకలు మింగుచును యెంతొ ఘూర్ణిలు దగుచున్

వ. వ్యాకుల హృదయుండై సంజయునితో

సీ. ఖాండవం బేర్చియు గంధర్వ పతి మెచ్చ
గాండీవ ధన్వుడై ఘనుడు నగుచు
భూదవు లెల్లర బోరున గెల్చియు
రాజసూయాధ్వర రమణు డగుచు
అగ్రజు నానగా అఖిలార్థ సంసిద్ధి
పాశుపతమును గొన్న భవ్య కీర్తి
ఇంద్రాస్త్ర వరదుడై యాప్సితార్థుడు నైన
అర్జున సింహుకు అడ్డు దగుల

ఆ. భీష్మ ద్రోణ కర్ణ భీషణ యోద్ధత
సమర సింహు లగుచు సాహసంబ
విజయ సింహు లగుచు విక్రమింపగలారు
యెంత మంది యుంద్రు యేర్పరింప

వ. అని వాపోవ సంజయుండప్పుడు–

ఆ. నన్ను విన్న దెపుడు నా యని పలుకంగ
సుతుని మాట చొప్పు సొరుదు గాని
తమ్ము సుతుల మాట తలపవు మదిలోన
ధర్మ పరత కావ ధర్మమతిని

వ. నీయుపేక్షం జేసి కాదె దుర్యోధనుండా దుష్టుల సాంగత్యమున నిన్ను కాదని ధర్మ విరుద్ధుండై కర్ణ మాతుల మాటల వలనను బలోద్ధతులు తమ్ముల నూర్వుర జూచుకొని పెంపెక్కిన రాజ్యమదాంధ అర్థ గర్వితుండై–

ఆ. తండ్రి తాత మాట దర్పాన తలదన్ని
విబుధ మాట వినక విఱ్ఱ వీగ్చు
ధర్మ మార్గ గుణుల ధర్మజానుజు తోడ
వైరమెంచు కొనుట వెఱ్ఱి కాదె

వ. అని వచియింప–

ఆ. మొక్క నాడె వంచ్క మోసపోతిన యంచు
దూర మెంచ్క పోతి దురిత బుద్ధి
ధర్మ రక్ష్ణసుతుల దయనీయు లంచును
కృద్ధ బుద్ధి నైతి గ్రుడ్డి తనత

వ. అని పరితపించు చుండుటయును కామ్యకవనముల నుండిన పాండు నందనులును పాంచాల నందనయు పార్థుడెప్పుడు వచ్చునో యనుచు మనంబున యువ్విళు లూరుచునుండు నంత వాయు నందనుడు పాంచాలయాదవ బలంబులగూర్చుకొని అర్జునురాక మున్న కౌరవాధముల నుండి తమ దైన ధరణీ రాజ్యమ్ము గైకొన కాలయాపనము సైపజాలక యుద్ధ సన్నద్ధత కుద్యుక్తుం డగుటయును, భీమసేనుని మహా సంరంభమ్మునకు సంతోషించియు జనార్ధనుని రావించి అనుమతంబు గొందమ నుచు ధర్మజుండు సమయ భంగము గావింపనేరక కాలయాపన పరుండయి మంచి మాటల భీమ సేనుని అనునయించినను పుణ్యకధను వైశంపాయనునివలన విన్నవాడైన జనమేజయుండుసంతోష వార్ధి తేలియాడు చుండునెడ. ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయు విరచిత

-: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ ప్రథమాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వ - ద్వితీయాశ్వాసము

శ్రీశక్తిని పూజించుచు
ఆశించిన కోర్కె లిచ్చు అద్భుత తేజా
ఈశ్వర సంసేవితుడా
శాశ్వత కరుణాంతరంగ సంస్థవనీయా!

ధర్మరాజు బృహదశ్వునితో తమ బాధలను తెల్పు కొనుట

వ. ధర్మరాజు నొద్దకు బృహదశ్వుండను ఋషి వచ్చి ఆతనిచే పూజితుండై విశ్రమించి యున్న సమయంబున ఆర్యా! తమరు త్రికాలజ్ఞులు. మీకు తెలియని దేదియును లేదనుచు మావలె దాయాదుల అన్యాయ అధర్మ వర్తనం అడవుల పాలైన దురదృష్ట వంతులులేరని వాపోవ అపుడు బృహదశ్వుండు ధర్మరాజుతో–

తే. ధర్మ వర్తను డగుచును ధరణి నలుడు
జూదమాడియు దీనుడై బాధలొందె
కానలందున కలి చేత కర్మ వశత
ఆలు బిడ్డల విడనాడి అవని ప్రభుడు

నలోపాఖ్యానము

వ. అనవిని అదెట్లని ధర్మనందనుం డడుగ బృహదశ్వుండు ఇట్లనె. తొల్లి నిషధేశ్వరుండైన వీరసేనుని తనయుడు నలుం డనువాడు–

తే. సర్వ సమ్మద పాలనా సక్తుడౌచు
అవని యేలుచు నుండెనా అధిపుడెంతొ
అక్ష విద్యయం దారితే రర్ధయుక్తి
యెల్ల రాజుల జయియించి యేక శక్తి

క. ఉరుతర భక్తి బలాఢ్యుడు
నరవరుడా నిషధ రాజు నయవిద భక్తిన్
అరుదుగ నుందురు నాతని
సరిసాటిగ వచ్చు వారు సద్గుణ శీల్తన్

వ. అత్తరి విదర్భ దేశాధీశుండు భీమకుం డనువాడు విస్తృత గుణాఢ్యుండును విశద యశుండును సంతానార్ధియై సతీసహితుండై అనేక పుణ్య వ్రతములు చేసియు మునిసత్తముల సేవనంబున నైనను

సఫల మనోరథుండ నగుదునని తపోవనంబుల కేగి అటదమనుడను మహామునిని సేవించి అమ్ముని ప్రభావ ప్రసాదంబున దమయంతి అను కూతును దమన దమదాంతులను కొమరుల నిర్వురంబడసె. లేకలేక కలిగిన సంతానము కావున భీమకుండు వారల నతి గారాబమ్మున పెద్దగా పెంచి పెద్దల వద్ద విద్యా బుద్ధులు నేర్పరించ నంత పెరిగి పెద్దదయిన–

క. దమయంతి దయార్ద్ర హృదయ
సుమధుర యౌవన మనోజ్ఞ సుందరి దెలుపన్
సమరారు దేవ కన్యలు
కమనీయమ్మో పలుకులు కామిత మొప్పన్

క. సొగసది చూచిన తోడనె
మగనాలులె కదియు చుంద్రు మన్మథ వశతన్
వగపులు ఊరించు మగువ
నగుమోమా చంద్ర వదన నయగారంబుల్

వ. అట్టి యెడ–

క. సిరి గల యా నలరాజుకు
సరి తూగెడు సుందరాంగి సద్గుణి మరియున్
ధరనుండెడి రాచ కులుల
కరమరుదై వెలుగు చుంద్రు కమనీయులునై

వ. అని ఆ యిర్వరం జూచిన వారలు అందందు రమణీయోక్తుల ప్రశంసించుచుండ ఆ వార్తలు విన్న ఆ యిరువురి యందును అన్యోన్య ప్రేమానురాగంబు లుద్భవిల్లి–

క. నాటికి నాటికి పెరుగుచు
వాటముగా మనములందు వాక్కుల యందున్
ఘాటగు బలిమిని బహు ఆ
రాటపు సెగలు పొగ లెగసె రాత్రుం బవళుల్

వ. దమయంతియ అంతఃపుర సుకుమారి. నవ యౌవని–

క. అనురాగ సఖుల వలనను
వినుచుండును నలుని గొప్ప విశదపు చరితల్
పనిగట్టుకు భాషించును
వినిపింపగ నలుని గూర్చి వివశత యగుచున్

క. నలుడును దమయంతి గుణము
పలు గొప్పగ మది దలంచు బాయని తుష్టిన్
పలువురు పల్కిన విధమున
నలువయు సమకూర్చె నొక్కొ నాకగు సతిగాన్

వ. అని పరిపరి విధంబుల ఆలోచించుచుండువా డచట–

ఉ. ఆకశ వీధులం దిరుగు హంసల రాయని భాషణంబులన్
రాకొమరుండు యీ నలుని రాణియ కానగు భీమపుత్రనిం
తేకువ విన్నవాడగుట తీయని పల్కులు హాయి గొల్పగా
వాకొను చుండు టెంతయును వాణితొ వాక్పతి బ్రహ్మ వాక్కనిన్

వ. అంత సంతుష్టాంతరంగుడైన నిషధ దేశాధిపతి ఆకసవీధుల ఆ రాయంచని దిక్కు మొగంబై–

చ. మనసది చల్ల జేసితివి మానిత పల్కుల రాజహంసమా
అనువగు రీతులం దెలిపి అవ్వనితామణి మానసంబెదో
వినదగ కోరుదుం శుభము వీనుల విందుగ సంఘటింపుమా
మనములు యేకరీతిగను యేర్పడ జేయుమ రాయబారివై

వ. అని పలుక ఆ రాయంచ–

చ. అటువలె జేతు చూడుమని హంసల రాయడు సంతసంబునన్
పటుతర యుక్తుడై పలికి బాయని మక్కువ మానసంబునన్
యెటు వలె గాంతునా నిషధు నేనని భీష్మ కుమారి జూచుడున్
అట జనె ఆప్తబంధు డన అంచల రాయుడు సంభ్రమోద్ధతిన్

వ. దమయంతి సఖులతో యీదులాడు నక్కాంతా సరోవరమ్మున డిగ్గ, యీదులాటకై వచ్చిన దమయంతియు సఖులును దానిం బట్ట ప్రయత్నింప రాయంచలు–

ఉ. పట్టకు మమ్మ మమ్ములను పట్టిన యేమగు పట్టగా దగున్
ముట్టిన కందు నీ కరము ముద్దుల గుమ్మరొ మోహనాంగునిన్
దిట్టత కల్గెనేని విను ధీనుత ధీరుని సత్య ధర్మునిన్
బట్టగ నున్న యా నలుని బట్టుము పట్టము కట్టుకో తగున్

వ. అని సంతసంబుగా నుడువుటయే గాక అమ్మరో నేనా నలుని వద్దనుండియే వచ్చినదాన. నీవా నలుని కర్ధాంగి వగుదువని మొన్న విధాతయే వీణాపాణియతో పల్క విన్నదాన. ఆతని చేపట్టిన ధన్య మగుదువు అని పల్క, దమయంతియు ఆతని గుణ గణ రూపవిలాసంబులు వినియున్నదియ కావున

తన మనము నెరింగించి పుణ్యము కట్టుకొమ్మని హంసలరాయని వేడుకొన్న, రాయంచ వారిరువురి మధ్యను విధికృత–

ఆ. రాయబారి యగుచు రమణీయ భాషల
పంచ బాణ రుచులు ప్రబల మౌగ
ప్రేమ మీర పల్క పెంపెక్క మదిలోన
మధుర మధుర భావ్న మదను లగుచు

క. నలుడును దమయంతియు నల
అలుపెరుగని ఊహలందు అమృతమయులై
వలపుల ఉయ్యల లూగుచు
చెలువొందుచు చిక్కనైరి చెప్పెడిదేమా

క. అన్యోన్యం బురుతరమై
మాన్యులు దమయంతి నలులు మన్మధ వశులై
అన్యం బెరుగక నుండిరి
ధన్యులు తమ మనము లందు తద్దయు వేడ్కన్

క. నలునే కలలో నైనం
నలుతో మాటడు మురియు నవ్వుచు మాతో
నలుడే నా ధవుడు అనుచు
నలుడా నిన్నే వరింతు నమ్ముము అనుచున్

వ. అంత నా మదవతి దమయంతి చెలులు–

క. భయ సంభ్రమ చిత్తులునై
నయనంబులు తుడుచు కొనుచు నయవిదు లగుచున్
నయగారంబుల పలుకుల
రయమున యెరిగించిరంత రమణులు భీమ్మున్

వ. అంత నా విదర్భాధిపతి సంప్రాప్తయౌవనయైన దమయంతి మనోగత కన్యావరణమ్ము చింతించి కూతు స్వయంవరము నల్దిశలం సాటించి బంప–

క. రానై మొదలిడి రంతట
మేనా లెక్కియు వరుసన మేలౌ దొరలున్
నానా దేశాధీశులు
సేనా వాహినుల తోడ చేరుచు నుండన్

వ. అత్తరి పురాణ మునులు పర్వత నారదులు భూలోకమునం గ్రుమ్మరి ఇంద్రలోకమునం కరుగ వారిం బూజించి ఇంద్రుడు భూలోక కుశలవార్త లడుగుచు–

ఆ. వీర రణధి నిహతి వీర సర్గులు నౌచు
ఇంద్ర లోక సుఖము లొంద నరులు
యేమి కతన రారు. ఇందుల కొచ్చెడి
వారు లేర యిపుడు వసుధ యందు

వ. అని యడుగ వారలా సురేంద్రునితో భువి విదర్భరాజ పుత్రి స్వయంవర కన్య.

క. అతి లోకోత్తర సుందరి
సతిగా దమయంతి గొనగ సత్వర గతులై
ధృతి నేగెడు వారు నగుచు
మతి మంతత యుడిగి నారు మత్సర బుద్ధుల్

క. స్తుతమతి యా వైదర్భియ
మతి దలపదు నలుని తక్క మరి యెవ్వరినిన్
పతిగా వరియింప దనుచు
అతిగా వినియుంటి మింద్ర యనుటయు తోడన్

వ. ఇంద్రుండును దిక్పాలవరులును తదాలోకన కౌతుక విభ్రాంత మనస్కులైదివ్య విమానారూఢులై భూలోకంబునకు దిగివచ్చుచు దమయంతీ స్వయంవరమునకు బోవువాని గుణ తేజస్రూప సంపన్నం బుల ధర్మాదిత్య మన్మదేంద్రుల బోలువాని విభూషిత వస్త్రాలంకారు నలునిం గని యంతరిక్షంబున విమానంబులు నిల్పి భూతలమునకు వచ్చి వానితో నిట్లనిరి.

ఆ. దర్శనీయమౌచు ధరణీ తలంబున
భీష్మ పుత్రి పెండ్లి భేషజమ్ము
చూడ వస్తిమయ్య సుదతీ లలామమ్ము
యెవని నెంచు కొనునొ యేర్పరించి

వ. అని పల్క మీరలెవ్వరు. ఎందుండి వచ్చుచున్నారని నలుడు ప్రశ్నింప–

తే. ఇంద్ర వరుణాగ్ని యములము హితుల మయ్య
మమ్ము వివరించి దెల్పుమా మానవతికి
అభిమతార్థమ్ము యీడేర్ప అడుగుచుంటి
దేవ హితము దీని తీర్పవలదె

వ. అనవిని వారలకు నలుండు వినమ్రుడై అంజలి ఘటియించి–

ఆ. కోరియున్న దాని కోరిక వరియింప
పోవుచున్నవాడ పూజనీయ
నన్ను కోరి పంప న్యాయమా యెరిగుండి
సన్నుతాంగి కడకు సదయ హృదయ

వ. అన్న మాటకు నలునితో ఆ దేవతా మూర్తులంత–

ఆ. దేవ హితము కంటె వేరెద్ది
మాననీయుడైన మనజ వరుకు
యెవ్వరెరుగ కుండ యేకాంత నగరికి
యెట్టు బోదు నంచు యెంచ వలదు

ఆ. ఇంద్ర జాల మహిమ యెవ్వరేనియు గాని
నిన్ను గాంచలేరు నిజము వినుము
రాజ గృహము జొచ్చి రాజ వదన గాంచి
మమ్ము దెల్పు మయ్య మానవేంద్ర

వ. అనిన ఇంద్రు వచనంబుల నశంకితుండైన నలుండు విదర్భాపుర రాజ గృహమునకుం బోవు మార్గమ్మున తన్నెవ్వరూ పలుకరింప కుండుటచే నిర్భయముగా దమయంతి అంతఃపురము జొచ్చి–

సీ. రాయంచ రూపిత రమ్యమై చెలువొంది
హంస తూలిక లందు అమరియున్న
సుర కన్యకల కంటె సోకౌచు వెలుగొంది
విభవాతిశయముల వెలుగు లీన
అపురూప లావణ్య మతిశయిల్లుచు నుండ
సుందరాంగులు చాల చుట్టి గొలువ
దమయంతి పురియందు దర్శనీయుండవ
యెట నుండి వచ్చెనో యీతడంచు

ఆ. నలుని రాక జూచి నలువ రెల్లరు యేగ
ఓర కంట జూచి యువిద అలరి
నాదు మనసు దోచు నవ మన్మధాకారు
నలుడు కాడె నంచు నలువ యెంచి

ఆ. ఆసనంబు డిగ్గి అభివాదముం జేసి
నాదు మనసు నున్న నలుడ కావ

యెట్లు వస్తి వంచు యేర్పడ పల్కుమా
దేవ సన్నిభుండ దివ్య తేజ

వ. అని మర్యాద పూర్వకముగా పలుకరించిన దానికి నిషధుండు–

ఆ. నేను దేవదూత నింతియా నిషధుండ
అమర విభులు నన్ను అనుప వస్తి
పెండ్లి యాడువేళ పేర్వేర వివరింప
వరదు లింద్ర అగ్ని వరుణ యములు

వ. ననుచు పంచిన తద్దేవతా యుక్తి అదృశ్యతావిద్య ప్రభావమ్మున దుర్భేద్య సురక్షితంబైననీ కోట కెవ్వరి కెరుక రాకుండ రాగల్గితి. ఇంద్రాదులకు ప్రియంబు చేయుమనిన నాతని నలునిగా యెరింగి న దమయంతి ఆత్మగతమున విచారించుచు ఆతనితో హంసచే నీగుణగణములు విన్నది మొదలుగా నిన్నే దలంచుచు నీకై యెదురుచూచుచు త్రికరణ శుద్ధిగా నిన్నే నా పతిగా కోరుకొను చున్నదాన. నీ విట్లు పలుక తగదు. మరియును అమరు లెక్కడ నేనెక్కడ.

ఆ. మనసు విచ్చి చూడు మానవాంగను నేను
దివ్య పురుషులయ్యు దేవవరులు
నిన్ను మదిని నిల్పి నీదాన గానుంటి
నన్ను గోర వార్కి నాయమగునె

వ. నీవు నన్ను వరియింపకున్న ప్రాణములు విడుచుదాన. అనిన దానికి నలుండు యిట్టు లనియె.

తే. అష్ట దిక్పాల వరులె నిన్నాశ తోడ
వేడ్క దిగి వచ్చి వరియింప వేడు టెల్ల
నీదు భాగ్యమ్ము కాదటే నిజము దెలియ
వార్ల కాదన సబబటే వారిజాక్షి

తే. దేవతల తోడ సరిసాటి ధీర జనులు
మానవీయత అల్పులే మనుజులెన్న
ఆత్మ వంచిత కాకుమా అధిక వౌచు
సావధానత యోచింపు సమత బుద్ధి

వ. అనగ నా దమయంతి అంతరంగ భాష్పవారిలోచనా గద్గదస్వనయగుచు స్థిత బుద్ధి నాలోచించి నలునితో నీ మాట పోకుండ నా మమత పండ వారు వత్తురేని–

తే. మనసు నిండిన వాడ నా మాట వినుము
నిన్ను కాదని వేరొండు యెన్నుకొందె

దివ్య కాంతులు చెలగి నుద్దీప్తు లెగయ
ప్రబలమై వెల్గ నా స్వయంవరపు సభను

వ. ఆ దివ్య పురుషుల సన్నిధిని నిన్నే వరియింతు. నట్లైన నీవు నిర్దోషుండ వగుదువన్న నలుడు ఇంద్రాదుల కడకు జని జరిగిన దంతయుం దెల్పనంత–

తే. నలునె కాని యా నలినాక్షి దలుప దొరుల
చూతమంచు వారు చూచు వేడ్క
యెటుల జరుగొ నంచు యేర్పడ జూడ రా
వచ్చినార మెటుల వసుధ కురికి

క. పటుతర యా దమయంతియ
యెటులం వరియించు నొక్కొ యేర్పడ నలునిన్
ఇటు నటు నాతని రూపున
నటియింతము మంటపాన నయనలు చెదరన్

వ. వెడలు నంత నా దమయంతి స్వయంవర మంటపాన

సీ. అపురూప లావణ్య అనురాగ దమయంతి
నవ మన్మధాకారు నలుని గోరి
వరియింప తనువేగ విరిదండ హస్తయై
రారాజ చంద్రుల రాజ సభను
నల్వు రమరులు రా నలరూప ధరులౌచు
యేర్పరింప నేర్క యెడద భీతి
దీనాతి దీనయై దివ్యుల దేవేర్ల
ప్రార్థనంబు జేసె పరమ ప్రీతి

ఆ. దేవ వరుల సతులు దీప్తితో దిగివచ్చి
అవని దేహులగుచు అమర విభుల
అంటి యుండు నంత అలరియా దమయంతి
నలు వరించె నపుడు నల్వు రెదుట

వ. ఇట్లు మనోహర రీతి తన మనోహరు నెన్నుకున్న దమయంతిని నలుడు వివాహంబగుట కెంతయు సంతసించిన–

క. దేవాశీర్వాదిత భూ
దేవాశీర్వాదులగుచు తేజస్కులునై

దీ. వైభవ సత్య నిరతి
సేవా ధర్ములు జననుత సేవితు లగుటన్

వ. ఇంద్రాగ్ని యమ వరుణులు నలుని యజ్ఞాది క్రతువుల యందు స్వయం ప్రకాశకులుగా యుండు నట్లనుగ్రహించి స్వర్లోకముల కరుగువారి తమ కెదుర ద్వాపరంబుతో కలసివచ్చు కలి ఇంద్రాదులం గని యెందుండి వచ్చు వారలని అడుగ తిరిగి వారు వాని నీవెవ్వడ వెందుల బోవు చున్నావన భూలోకమ్మున విదర్భరాజనందన దమయంతి స్వయంవరమున కేగుచున్నా నన, విని నగుచు వారు వాని కిట్లనిరి.

క. ఎంతో సుందర తరమౌ
ఇంతియ దమయంతి మమ్ము యెవ్వరినైనన్
సుంతము పతిగా గొనునని
చింతకు లోనౌచు యింట్కి చేరగ రామే

వ. ఆమె మమ్మెవ్వర గాదని మానవమాత్రుండైన నలుని వరియించెనన విని కలి దుస్సహుండై నల దమయంతుల కడకరిగి మత్ప్రతాపము జూపెదగాక యని నలుని అక్షవిద్యావ్యసనుండుగా నెరింగిన వాడుకావున ద్వాపరుని అక్షములందు బొంచి యుండ నియ
మించి నలుని పితరు భ్రాతృ సంబంధ బంధువగు పుష్కరుండనువాని కడకేగి తన్నెరిం గించుకొని జూదమాడి నలుని రాజ్య విభవమ్మును నొడుచు కొమ్మని–

క. కమనీయత కడు వెంబడి
సమయము కొరకై వెదకుచు సత్వర గతుడై
వమనాశుచి మిగులం గని
అమరెను కలి నలుని యందు అదనని యెంచిన్

క. పుష్కరునకు తోడై తన
దుష్కృతి నెరవేరు నట్లు ద్యూత క్రియకున్
నిష్కరుణం ఆ నలు నా
విష్కరుడై బిల్వ నంత వింతగ నెంతన్

వ. ద్యూత మాడ రమ్మని పిలువం బడినప్పు డాడ రాకుండుట రాచధర్మ విరుద్ధంబని
యు నోడిన వానితో పరిగణింపబడుదు ననియును యెంచి నలుండు పుష్కరునితో
జూద మాడ గడంగి–

క. అలయక నొడ్డుచు నాడుచు తల
పక నిద్రాద్యు జూద తమకపు వృత్తిన్

కల ధనముల రాజ్యమ్మును
కలివశుడై ఓడె నలుడు కర్మకులోనై

వ. దమయంతియు (కొడుకు కూతురు తాతగారి యింట విదర్భాపురమున నున్నవారుకావున) నలు
నితో పురంబు వెలువడి నరుగు వారలు రెండు దినమ్ము లమ్మవారి గుడి
యందు గడుపుకొని–

నల దమయంతులు కానలకు బోవుట

పుష్కరుని యధికారమునకును కలి ప్రభావమునకును లోనైన ప్రజ లెవ్వరునువారి దిక్కైనను జూ
డను మాటాడను విముఖులై మిన్నకుండుటకు విస్మయులగుచు క్షుత్పి
పాసలకు లోనగుచు అర్ధరాత్రి లేచి యెవ్వరెరుంగకుండ అడవులంబడి పోవు వారు
మరునాడు ఒక్కచో వింతవింత రంగుల పక్షులును గుంపులుగా జూచిన నలుండు ఆహారార్ధంబు వా
నిం బట్టుకొన పైపంచ వలగా వానిపై విసుర ఆ పక్షులన్నియు ఒక్కుమ్మడి
పైకెగయ నా పుట్టంబు గూడ వానితో దూర తీరంబుల కెగిరి పోవ నిరాశకు లోనైదేహ
పిపాసకు లోనౌచు దప్పితీర నీరములనైన గ్రోలుదమని దాపుల–

క. గలగల పారే వాగున
మొల బంటగు లోతు నీట ములుగుచు నుండన్
అల తాకెడి కూడి నలుని
మొల బట్టయు నీట గలసె మోడై నిలువన్

వ. దమయంతియ అప్పుడు తన వలువ జించి అందీయ అది మొలకు జుట్టుకొని
నలుండు బైట పడి వగచుచు–

క. ఇందీవరాక్షి మనమిపు
డెందుల బోవంగ దగునొ యేతెర వగునో
కొందల మందెదు మదిలో
సందియ మా బ్రహ్మకైన సద్బుధి దలపన్

వ. దమయంతితో నీవైనను నీ తండ్రి కడకు విదర్భ కేగి సుఖంబుండుమని యెంత
వేడినను–

క. మతిమంతిగ దమయంతియ
ద్యుతి చెడి పుట్టింటికేగ దుఃఖిత యగుచున్
పతితోడిదె సకల మనుచు
అతి యాప్తత నలుని నంటి యడవుల నైనన్

క. సుఖ దుఃఖమ్ముల రెంటను
సఖియతొ గూడున్న మగలు సౌఖ్యులు కారే
సఖియయె యూరట జీవన
సుఖియింపను అడవి నైన సుస్థిర బుద్ధిన్

వ. కావున నన్నెడ చేయకుడన వల్లెయని జనుచో నొక్కట మార్గాయాసమున విశ్రమింప కడుంగడు డస్సియున్న నక్కోమలి దమయంతి భూతలి నిద్రా పరవశురాలై యుండ దానిం జూడ లేక నలుండు మనంబున–

ఆ. నన్ను దగిలి కాదె నళినాక్షి యెంతేని
సోలి బాధ నొందుచున్న దిట్లు
కన్నవారి కడకు మిన్నక బోవదో
సన్నుతాంగి విడువ సమయ మిదియ

వ. అని దైవయోగ గతికి చింతించుచు పరిపరి విధంబుల వగచుచు మనసురాయిచేసికొని అయ్యె ర్థాంతర అడవి మధ్యమ్మున నామెను విడచిచనియె. దమయంతి మేల్కొని తన పతికై నటు నిటు జూచుచు భయాందోళనా శోకమగ్న సంతప్తమాన వ్యాకులచిత్తయయి దిక్కుతెలియని అక్కానల మధ్య మ్మున –

ఆ. రాజరాజ చంద్ర రమణీయ నల భూప
యెందు బోయి తొక్కొ యేమనందు
నమ్మ బల్కి యిటుల నయవంచ్న జేతువా
కాల విధిని దాట కాదు దెలియ

ఆ. మనసు రాయి జేస్కు మసలిన వాడవా–
కలికి జిక్కినావొ కాల వశత
ఆలు బిడ్డ గడ్డ అన్నిటి పోవీడి
దిక్కుమాలి మనసు పిక్కటిల్ల

వ. ఎక్కడ యే విధమున చిక్కువడి యుంటివోకదా. నావల్లనే నీకిట్టి దుర్గతి పట్టెనేమో కదా. వరదు లైన దిక్పాలుర వరియింపుమని యెంత పల్కినను విననైతిని. వారలు కోపించుట చేతనే నావలననే యింతయు వాటిల్లె కాబోలు కాకున్న యిట్టి పాట్లేల మనకు అని వెక్కి వెక్కి యేడ్చుచు దీనావన యయి–

ఆ. వన్య మృగములార వన మయూరములార
కరుణ జూప రండు కావ వేగ

అభయ మంచు వచ్చి ఆదుకో వేడెద
దేవ దేవులార దీనురాల్ని

వ. అని అనేక విధముల ప్రార్థించుచు ఆకలి దప్పులకు లెక్క చేయక కంటక పన్నగ పాషాణంబులకు వెరవక నిజనాధు అసహాయత్వమునకు వగచుచు–

క. అలసియు సొలసియు నడువను
పులుగుల యెలుగుల కులుకుచు పూపొదరిండ్లన్
వలనుగ యొదుగుచు దాగుచు
విలపించుచు మనము నందు భీతిలి యెంతోన్

వ. ఎండ వేడిమికి తాళ జాలక ఒక సెలయేట నీరు ద్రావి పొదరింట విశ్రమింప నేగ అందుండిన అజగర మొండు నామె చరణమ్మును బట్టిలాగ భీతిల్లి–

ఆ. ఎచట నుంటి నాడ వేమైతివో రాజ
నన్ను గావరావ నిన్ను వెదుక
ఆపదందు చిక్కి అల్లాడుచుంటిని
కొండ చిలువ బట్టె కోర్కె దినగ

వ. అని ఆక్రందింప నా ఆక్రందనలు విన్న యెఱుక నొకండు యేగుదెంచి దానిం జూచి తన మొలనున్న కరకు కత్తియ ఆ అజగర నోటను వాటముగా నుంచిదానిం జీల్చ రాహుగ్రస్తయై వెలువడ్డ చంద్రబింబమోయన దమయంతి అజగర గ్రస్థమునుండి బయల్పడ సమీప సెలయేట స్నానాదికములు గావింప జేసి వన్య ఫల తేనియులు దెచ్చియిచ్చి స్వాంతన పరచి యెవ్వరి దానవిట్లేకతంబ యీ అడవులకు రా నిమిత్త మేమని ప్రశ్నింప మితభాషిణి యగు దమయంతి తన వృత్తాంతముం దెల్ప అమలిన సాధు శీలఅభిమాన పుణ్య చరిత ఆశ్రిత రక్ష ఆదరణనీయ అని మనంబున దలంపక కాలము దాపురించినవాడై కామవికారుండై కోరి ఆమెం జేరబోవ నప్పుడు దమయంతి–

క. అంటిన జత్తువు అన్నను
అంటను దరిజేర యెఱుక ఆయువు మూడన్
కంటిని నిప్పులు గురియన్
మంటలు రాల్చంగ నతడు మాడెను మసియై

వ. అంత నా విదర్భ రాజ తనయ–

క. పతి దలచుచు మది నెప్పుడు
అతి భీతిని అడలుచెంతొ అడవిని గలయా

ప్రతి పుట్టను చెట్ల పులుగుల
పతి కొరకే నడుగు చుండె పామరు రీతిన్

వ. పగలనక రాత్రియనకను ఎండనకను చలియనకను యెల్లెడలం దిరుగుచు–

ద్వి. కొండ చరియల గూండ్ల – కోయ జాతుల యిండ్ల
వాగు వంకల దరుల – వహ్ని రగిలెడు దిశల
భూరుహమ్ముల పొదల– భూగృహాంతర సీమ
వనముల దిరిగెడు – వానరోద్ధతులార
నా పతి నలరాజు – నగుమోము చంద్రుని
కాయ కసవులు దినే – సాదువాదనులార
సర్వంబు పోనాడి – సతి నెడ బాసియు
ధృతి చెడి మతి బోయి – దుఃఖితుం డగుచు
నిజరూపు విడనాడి – నిర్నిద్రాహొరాత్ము
నాపతి వల రాజు – నగుమోమా నలచంద్రుని
నన్వీడియు నడయాడెడు – నా పురుషుని
యెవ్వరైనను గాని – యెక్కడైనను గాని
చూచినారా మీరు – చెప్పంగ వలవదొ

వ. అని వేడుకొనుచు విలపించుచు విపినాంతర సీమల దిరుగాడుచు పుణ్య నదీ తీరంబున నొక మునిపల్లెయనుంగని అందలి తపోధను లెల్లరకును నమస్కరించిన, తేజోమయి దమయంతిం జూచి వారు తమలో ఆమెను మసిగుడ్డ చుట్టంబడిన మాణిక్యముగా నెరింగి వెఱగంది యెవ్వరి దానవమ్మా, యిట్లేల యీ విపినంబుల ఒంటి దిరు గాడుచుంటివన వారికి దమయంతి నిట్లనియె.

తే. ఏను దమయంతి నలునింతి యేమి చెపుదు
విధి వశంబున యిట్టు లీవిధము గాగ
పతికి నెడమైతి యిక్కాన పరితపింప
దైవ మేవిధి నను దేర్ప దలచినాడొ

వ. అని విన్నవింప ఆ దైవజ్ఞులు కరుణించి దివ్యావలోకనమున వీక్షించి అప్పుడు–

క. అడలకు మమ్మా యెద నీ
యిడుమలు బాయును సతిపతు లెప్పటి యట్లన్
కడు సంపద విభవమ్ముల
వడి నొందెడు శనియు దొలగు వహ్వా యనగాన్

వ. అని పల్కి ఆ మునిముఖ్య యోగిసంఘము అల్లంత దవుల కేగునంతవరకు నదృశ్యంబగుటయు, దమయంతి విస్మయంబై సిద్ధయోగుల పల్కులు సిద్ధించునని సంతుష్మాంతరంగితయై యెంచి నయ్యడవి దారి ముందుకు కొంత నడచునంత నొక నీటిపట్టున విడిచియున్న నొక మనుజ తండము కానంబడిన కొంత ధైర్యం బవలంబించి యిమ్మహాటవి నిట్టి జనసంకులంబైన సార్థము కానం బడుట దైవయోగమ్మిగా భావించి వాని తోడం గలసి నడుతు నని పలికి వారల యనుమతంబు వడసి కొన్ని దినంబులకు చేది పతియైన సుబాహుపురంబు చేరుటయును.

దమయంతి సుబాహుపురమున కేగుట

తే. దిక్కు తోచక దమయంతి దీన వదన
వెక్కి యేడ్చుచు పతికినై పొక్కి మదిని
నక్కి నక్కుచు నడయాడ నగరి బాట
పక్క జూచిన జనములు బాధ పడుచు

వ. ఎవ్వతియో కాని యీ యింతి యెంత మాసినను ముత్యము వలె ప్రకాశించు చున్నయది. ఆను కొని మాటలు ఆ నోట కానోట అంతఃపుర రాణి చెవికి సోకుటయును అంతఃపుర గవాక్ష వీధినుండి చూచుటయును–

క. విరి బారెడు జడ కురులతొ
పుర వీధిన నర్గు దాన్ని పూనిక జూచిన్
సురలోకము దిగివచ్చిన
సరినడకల లచ్చి దోప సత్కృప తోడన్

వ. దాసుల నంపి ఆమెం పిలువనంపించి విచారింప దమయంతి యామెకిట్లనియె.

తే. ఏమి చెప్పుదు నమ్మరో యిదియె నంచు
భర్త కెడమౌచు నొంటిమై బ్రతుక నుంటి
జాడయైనను దరి గాన్క జడమతైతి
యేడనున్నారొ యేమైరొ యెటుల గాంతు

వ. నని విలపింప, సుహృద్భావ మానసయైన రాజమాత దమయంతి తీరు తెన్నులమాట మాత్రాన పెద్దింటి వనితగా గ్రహించి తన కడ నుండుమని పలుక దమయంతి తమ పతి జాడ తలియునంతకు నుందునని ఐనను నీచ కృత్యముల చేయ జాలననియును ఉచ్ఛిష్టము ముట్టననియును పరపురుషలతోడ పలుక ననియును అట్లైన నుందు నననిరాజ మాత ఆమె ధర్మ బుద్ధిని పతివ్రతా గరిమంబులకును మెచ్చి ఓయమ్మ నిన్ను నా బిడ్డగా జూచుకొందు నన అటులనే యని సమ్మతించి యుండు నట్లనుగ్రహించు దాని నతి గారవంబున జూచుచు సునందయను తనకూతురు తోడం గూర్చుటయు

అంత కొంత నూరట జెందిన దమయంతి సుబాహు పురంబున–

క. పతికై వగచుచు మదిలో
అతి యాప్తత రాజమాత ఆదర మెంచిన్
గతమెంచుచు వాపోవుచు
అతి క్రూరత యంచు దూరు అభవుని లీలల్

వ. నలుండట దమయంతి నట్ల నయ్యర్ధ రాత్రంబున నొంటి విడచి మనసు రాయిచేసికొన్నవాడు మతిచెలించిన వానివలె దిక్కు తోచని విధంబున అక్కారడవి నల్దిశల పరిభ్రమించువాడు–

తే. రండు మహనీయ రండు రండు
చిచ్చు వారిన జావనై చిక్కి యుంటి
అనెడు ఆర్తంబు విని ధీర అవని విభుడు
చిచ్చునం దూకి పోకార్చె చిన్నవాని

వ. అటుల రక్షితుండైన కర్కోటకుండను నాగకుమారుండు నలునకు కృతాంజలియై నన్ను రక్షించిన నీకు ప్రత్యుపకృతి జేతు వగవకుమని వానింగరచి విషగతుంజేయ తత్ప్రభావంబున నలుండు వికృత రూపుండగుటయును ఇంక నీకు విషోదగ రాక్షస పిశాచ బాధలు లేకుండు ననియును జయకారుం డవై భార్యా సంగమనంబును రాజ్య ప్రాప్తియు అగునెడ నీ నిజ రూపంబు నీకగు ననియును నన్ను దలంచుట వలన నీయిప్పటి వస్త్రంబు నీకడకు రాగలదనియును దానసర్వమును జయమగుననియు ను వరంబిచ్చి వెండియు నిట్లనియె.

ఆ. ఋజు వర్తనుండు ఋతుపర్ణు కడకేగి
బాహుకుండను నామ భద్రగతిని
అక్ష విద్య గొనుము యిక్ష్వాకు నొద్దను
అతనికిమ్ము నీదు అస్త్ర విద్య

వ. అని పలికి అదృశ్యం డగుటయును నలుం డయోధ్యా నగరి కేగి బాహుక నామంబున ఋతు పర్ణు నొద్ద వంటల వాడుగాను అశ్వ శిక్షకుల శిక్షకుడు గాను నియమితుడై యుండునంత నొకనాటి రాత్రి నిద్రయందు–

క. తన సతి దలచుచు వెక్కుచు
వినలేదని నాదు మాట విహ్వల హృదునై
కననేరక ధర్మ పథము
వనములలో విడిచి పోతి పామరు రీతిన్

క. వనజాక్షీ యెందుంటివొ
తినివైచెనొ పులులు నిన్ను తీఱెనొ ఋణముల్
నిను జూచుట మరి యెన్నడొ
మనమున నిను దలవకుండ మనగలు టెట్లో

వ. అని పలువరింతలుగా వినిన జీవకుండను సహపచకుండు వానిం దలంచి–

తే. చీపి కన్నులు మెల్లయు చిన్న జూపు
గూనె వంకయు నడుమది కోతి మూతి
కురుచతర రూపు వికృతంపు కురుచ చేయి
మగువ నెంచుచు దలచు తా మనసునందు

వ. వీనిచే తలంపంబడు నా తన్వి వీని కంటెను యెంతేని మిన్ననౌ అపూర్వ సౌశీల్య సోయగంబు లుగలదియై యుండ నోపునని యెంచి బాహుకుని వద్దకు వచ్చి రాత్రి నిద్ర యందు నీ తలంచు నీ భార్యకును నీకునూ యెడబాటేల సంభవించెనని యడుగ–

ఆ. వీడి బాధ నొందు విప్రయోగ సఖుని
అనుకరించుచు నుంటి నతివ దలచి
నన్ను దలచునట్టి నళినాక్షులుందురే
చూడ చూడ నెంతొ చొద్య మగుడు

వ. అని సమయోచితంబుగా పల్కి బాహుక నాముడుగా నలుండుండునెడ, అట విదర్భేశ్వరుండైన భీమకుండు రాజ్య విభవంబుతో పాటూ సర్వ సంపదలు గోల్పోయిన నలునితో తన కూతురు దమ యంతికై శోకించుచు–

క. రోయగ బంపుచు జనముల
ఆయాయా దూర రాజ్య అటవీశ్వరులన్
గాయల గసవుల దినుచును
యే యిడుముల పాల బడుచు యేమైరొ యనిన్

క. అధినాయక పుర వీధుల
విధి వేత్తల బ్రహ్మ విధుల విద్వత్పరులన్
బుధ విబుధుల సత్శీలుర
సుధనముల నిచ్చి బంపె చూచియు రావన్

వ. చూచి చెప్పిన వానికి వేయి టంకములును వారిం దోడ్కొని వచ్చు వారికి గోసహస్ర అగ్రహారం బుల నిత్తునన–

సుదేవుడను భూసురోత్తముడు చేది పురంబున దమయంతి నెఱుంగుట

క. తిరముగ వెదుకం దిక్కుల
పుర పట్టణ సీమలందు పూర్వోత్తరముల్
తరతమమౌ శక్తి కొలది
పరిపరిగా చింత జేసి పట్టుక రావన్

వ. అందు చేది దేశమునకు జనిన సుదేవుండను బ్రహ్మ విదుడు సుబాహు పురంబున బ్రాహ్మణుల తో గూడి రాజ గృహంబునకేగి పుణ్యాహవచన సమయంబున రాజపుత్రి సునందా సహితయైయున్న నొక్క లతాంగిం పరికించి చూచుడు ప్రకాశమానమౌ భృకుటీ ఫాల భాగంబును రూపు రేఖా విలా సంబులంగాంచి తమ విదర్భేశు కూతు దమయంతిగా దోప చింతించి ఆమె కడకేగి అల్లనల్లన–

తే. అమ్మ నల పత్ని దమయంతి వగుదువేని
కరుణ జూడుము నావంక కమల నేత్ర
దేశ దేశాలు దిరిగి యీ దేశమందు
నిన్ను గాంచితి నాభాగ్య మెన్న దరమె

తే. నీదు తలిదండ్రి ఆత్మజుల్ నెమ్మి నుండ్రి
అతివ నే సుదేవుండ నీయన్న సఖుడ
వగచు చున్నారు నీకునై వన్నె తరిగి
అనుచు వచియింప దుఃఖాన అతివ యేడ్వ

వ. ఈ వార్త విన్న రాజమాత ఆమె కడకేతెంచి ఓదార్చి ఆ విప్రోత్తమునితో యెవరయ్యమీరు యేమి కారణమున యీమె విలపించుచున్న దిట్లన ఆ బ్రాహ్మణుండా చేది నృప (రాజు సుబాహు) రాజమా తతో తనను తెలుపుకొని–

ఆ. ఏమి చెపుదు నమ్మ యీ యింతి వృత్తమ్ము
భీమ రాజ తనయ వీర పత్ని
నలుని దేవి యీ నళినాక్షి దమయంతి
కంట పడియె యిచట కాల వశత

వ. వీరికై విధర్భేశ్వరుండు వెదుక పంప నానాదేశముల నన్వేషించుచు భగవత్కృప వల్ల మా రాజ కుమార్తె యీ దమయంతిని మీ రక్షణలో సుఖంబున నుండగంటి. నంతియచాలు. నేబోయి యీ శుభవార్త విదర్భేశ్వరులకు సత్వరము తెలుప వలె అనుడు ఆనంద భరితయైన ఆ రాజమాత ఆ భూసురోత్తమ సుదేవునితో–

తే. అక్క కూతురు యిదియ నాకనుచు బల్కి
బ్రాహ్మణోత్తము దనిపెంతొ బల్కె నపుడు
ఉన్నదిక్కడ దమయంతి ఉత్సుకతన
అనుచు వచియింప దెల్పనా అవని విభుకు

వ. మేమును విదర్భేశుని పత్నియును యేక గర్భ జనితులము. దశార్ణ మహారాజ తనయలము. అని దెల్ప దమయంతి సునంద నెత్తి కౌగలించుకొని పినతల్లికి మ్రొక్కి కొన్ని దినంబులుండి–

తే. అమ్మ పుట్టిల్లు యిదియును యగును నాకు
అయిన తల్లి దండ్రి అనుజన్ము నాత్మజులును
జూచు నంతకు మామది క్షోభ తొలగు
నిషధ భూనాధు లేడుండ్రొ యెరుగ నైతి

వ. అనిపలుక ఆ రాజమాత తన సుతుడు సుబాహు రాజేంద్రు బిలిపించి చెల్లెలు దమయంతిని తండ్రి కడకు విదర్భావనికి బంపు యేర్పాట్లు గావింపుడన సువర్ణ మణిమయ విమానయాన యర దంబు సిద్ధంబు చేయించి పట్టు పీతాంబర దుకూల సువర్ణాభరణముల నిచ్చి సుభట సందోహంబు వెంట నడువ నంప–

దమయంతి నలు నెడబాసి విదర్భాపురము జేరుట

తే. కూతు రాకడ మదికెంతొ కూర్మి గూర్ప
తల్లి దండ్రియు ఆత్మజుల్ తనదు వారు
అందరుండియు దమయంతి అవని పతికి
దూరమైయుంట దురపిల్లు తోయజాక్షి

తే. ఏమొ చింతించుచుండును యేడ్చుచుండు
ఎక్కడున్నాడొ నలరాజు నన్ను వీడి
దేహ పాశంబు దెంచెనో దీనుడగుచు
చావలేకను బ్రతికుంటి చేవ జచ్చి

వ. అనుచు వాపోవు నా దమయంతి–

తే. తినదు కట్టదు సుంతైన తిరము లేక
జననితోనైన చనువుమై జనదు లెస్స
పలుకరించిన వెలిజూచు పలుక దెపుడు
కన్న బిడ్డలు దరికిరా కసరు కొనును

వ. అట్టియెడ నామె మనోగతంబును వీక్షించిన ఆ భీమకుండు బాధపడుచు భార్యతోనాలోచించి–

తే. విమల విజ్ఞాన విదుషులౌ విప్ర వరుతౌ
నలుని రూపాది గుణముల వెలువరించి
యెచట నున్నాడొ సుముఖుడై యేర్పరింప
వెదుక బంపెడు సమయాన విప్ర వరుతౌ

వ. దమయంతి యిట్టులనియె.

తే. అర్థ సంపద రాజ్యంబు లన్ని వీడ
నిషధ భూపతి నలరాజు నిక్క మరయ
మారు రూపున నుండునా మనుజ వరుల
యెరుక రానట్టి విధముగా యేర్పడుండు

వ. కావున మీరు మీ మీ తిరిగి వెదికెడు ప్రాంతమ్ముల యందెల్లడ–

తే. అర్ధ తనువైన అర్ధాంగి నడవి విడచి
ఒంటి వలువను చించుకు ఒనర బిగిచి
ఒకట బోవంగ పాడియే ఒకడ వీవు
ధర్మ చింతన కెడవైతె దయయు లేదొ
యెచట నుంటివొ యేమనం యేడ్చుదాని
ఉదయ భానుడ వగుదువో యువిద మెచ్చ
అనుచు బల్కుడు యెవరేని ఆలకించి
మాట మాత్రాన పలుకునా మనుజు నపుడు
నలునిగా యెరిగి దేతెండు నన్ను దెల్పి
రావ విముఖత జూపెనా రండు రహిని

వ. అని దెల్పుటయును బ్రాహ్మణులు దమయంతి తెల్పిన విధంబున పల్కుచు పల్లె పల్లెలం పట్టణ ప్రాంగణముల జనవరు లుండుచోటుల చౌకముల దేవళమ్ముల దిరిగిదిరిగి యెందునుం కానక వచ్చి నం దొక్కరుండు సుముఖుండనువాడు దమయంతి కడకువచ్చిఅమ్మ నీ చెప్పిన విధమ్మున నెమ్మిబల్క–

తే. అమ్మ అయోధ్య ఋతుపర్ణ అధిపు సభను
వింత వికృతంపు గూని నా చెంత జేరి
వీడి విలపింప దలతునా విభుని సతియ
పరమ పావని సౌజన్య బడయు కీర్తి

వ. అని పలికి అంతిపుర పరిజనంబులతో కలసి కోటలోనికిం బోయెనని వినిపింప దమయంతి బ్రొద్దు చింతించి నలుడు కానివాడు యిట్లేల వచియింప నగునని యెంచి ఆ అయోధ్యా పుర

రాజ మందిర పరివార సభయందలి వింత వికృతరూపి యెవ్వండోయింకను తగువారల నియోగించి యెరుంగ వలయునని తల్లి యనుమతి గైకొని తన్నెరుంగ వచ్చినట్టి సుదేవు బ్రాహ్మణునిం రావించి వానితో–

క. నన్నెరుగు కరణి యో వి
 ద్వన్నుత నలునిం యెరింగి ధన్యుడ వగు దే
 డున్నను మరి సాధింతువు
 అన్నింటను ఘనుడవయ్య అవనీసురులన్

వ. అని పల్కి వెదుక నేగి వచ్చిన సుముఖుండు దెల్పిన విషయము లెరింగించి–

క. అరుగుము అయోధ్యాపురి
 కరుణామయు కోసలేంద్రు ఘన విభు కొలిచిన్
 కురు రూపుని కనిపెట్టుచు
 సరి వారల తోడ రాజ సభయందుండన్

వ. వివిధోర్వీ పతులందున ఉన్నతుండైన విదర్భాపతి నిషధాదీశునకై–

క. పలువురు విభుదుల నంపియు
 నలునెందుం గానకెందు నయవిధి సుతకున్
 వలనుగ రెండవ వరవిధి
 తలపెట్టడె భీమకుండు తద్దయు వేడ్కన్

వ. అందుల కీ కువలయంబున గల భూపతు లెల్లరుం అతి త్వరితగతులై బోవనుండుటాదిగా గల విషయంబును వినికిడి మాత్రముగా అందరెరుంగు నట్లుగా ఋతుపర్ణునకువచియింపుమని పంపుట యును, సుదేవుండను నా బాపడటులనే అయ్యయోధ్యాపురపట్టణ మేగి ఋతుపర్ణుం గాంచి విదర్భా పురంబున దమయంతీ పునఃస్వయంవర మెల్లియో యెల్లుండియో అయ్యెడు ననవిని ఋతుపర్ణుండు బాహుకునింజూచి తత్ స్వయంవర వేడుక నాకునుం జూడ మనసయ్యెడు. ఒక్క నాటన విదర్భకుం బోవలయు. ఇప్పుడుగదా నీ అశ్వ విద్యా నైపుణ్యము నెరుంగు సమయము వచ్చినదన నాకునుం స్వయంవరము జూడ మనం బొడయుచున్నదని వచియించి దుఃఖించుచు మనంబున–

ఆ. అడవి తనను విడిచి అరిగిన పాపాన
 ఇట్లు గూర్చు టెల్ల ఇంగితమ్మొ
 ఆడు దాని మనసు అలవియే యెరుగంగ
 నియతి సాధ్వి గుణము నీతి యగును

ఆ. పిల్లలుండి యిట్టి పెర బుద్ధి కెరగుట
నీతి గాదు తెలియ నాతి కెపుడు
వేచి చూతునైన వేగక మదిలోన
అవల బయల పడును ఆత్మ సుద్ధి

వ. అని దలంచి వార్ష్ణేయుండు మున్ను దెచ్చిన తన రథంబు నందు వాయు వేగ మనోవేగంబున పరుగులిడు పంచకళ్యాణీ ఉత్తమోత్తమ శుభ లక్ష్య లక్షణముల మెరయు రథాశ్వంబుల బూన్చుకొని వచ్చిన అయ్యశ్వ హేషలు శుభసూచకము కాగా ఋతుపర్ణుండు వార్ష్ణేయ సహితుండయి బాహుక సారథ్యంబున యేగునాడు.

క. ధృతి నేగెడు రథ వేగము
అతి అద్భుత మంచు దోప అచ్చెరు వగుచున్
శత యోజన పర్యంతము
అతి దగ్గర అనుచు దోచె అంతయు వింతన్

క. అతి వేగపు రథ చోదన
మతిమంతత జూడ నితడు మాతలి యగునో
స్ధుతి మంతుడు నిషధేశుడొ
పతగేంద్రుని అన్న యగునొ పనిదన మెన్నన్

వ. అని అయ్యయోధ్యాపతి ఋతు పర్ణుండును వార్ష్ణేయుండును మనంబుల నియ్యది పంచకళ్యాణీ జాతి తురగముల దౌడు శక్తియా లేక సుబాహు రథాశ్వచోదన కౌశలమా యని మెచ్చు కొనుచు నుండ నంతకు వారి రథము విదర్భాపుర పొలి మేరల కరుగు దెంచు నంతకు–

క. పొలిమేర లాట లాడెడు
చిలిపిరి యా పిల్ల కాంద్రు చెట్టుం జుట్టిం
వలనుగ కాయలు లెక్కిడ
తలమునకలు అగుచు నుంద్రి తలకొక రీతిన్

వ. అది చూచిన ఋతుపర్ణుండు అరదము నాపుమని బాహుకునితో పలికి అందరూ వినుచుండ తన అక్షవిద్యా ప్రభావమున ఆ చెట్టునకు గల అన్ని కొమ్మల పలవలకు గలకాయలిన్ని యని ఒక్క చూపున ఆ చెట్టుంజూచి పల్కుటయును కాయలను దించి లెక్కించినపుడా కాయల సంఖ్య ఋతుపర్ణుండు పలికిన లెక్కకు సరియగుటం జూడ బాహుకుండు రాజా! ఈ విద్య నాకొసంగునదిగా కోరు చుంటినన ఋతుపర్ణుండు బాహుకునితో ఇది గ్రహించిన వారలు సంఖ్యావిదులనం బరగుదురు. మరియును దుష్కృత కళంక విషవిముక్తు లగుదురని దానిని ఉపదేశించుటయును ప్రతికృతిగా

బాహుకుండు తనయశ్వ హృదయంబును తమకు బహూకరింతునన ఋతుపర్ణుండటులనే తరువాత గ్రహింతు ననుటయును అక్షవిద్యా గ్రహణ కారణముగా–

నలుడు కలిచే విడువం బడుట. నల దమయంతుల కలయిక

క. కలి బంధము వీడి నలుడు
కల గాంచిన విధము దోప కరుణా దృష్టిన్
కలి జూచుడు నలుని కతడు
వలనొప్ప నమస్కరించి వసుధా దీశా!

వ. నిన్ను ఆవహించిన పాపాన నీ గరచిన కర్కోట సర్ప విషాగ్నుల బహు విధముల దగ్ధుండ నైతి. నీ ధర్మ నిరతియే నిన్ను రక్షించుచుండె. మరియు నిన్ను కీర్తించిన వారలు నావలన భయ బాధలు పొందకుండెదరు అని నుడువుటయును, నలుండు రూప మాత్రంబు తక్క తక్కిన దుష్కృత బాధల నుండి విముక్తుండయి రథం బెక్కి ఋతు పర్ణ వార్ష్ణేయుల తోడ పుర ప్రవేశానుమతమ్ము వడసి నగర వీధులంబడి అంతర్గత ప్రాకార ద్వారదేశం బులం గడచుచు రాచనగరు ప్రవేశించుచుండ దమయంతి–

క. రథయానపు వడి శబ్దము
విధమదియా నలుని దంచు వివశత యగుచున్
అధరము కన్గవ అదరగ
రథమందున వచ్చు వార్ని రయమున దేవన్

వ. ఎదురేగునదిగా తండ్రికి ప్రియ పూర్వకంబుగా పల్కుటయును భీమకుం డెదురేగియందు నలుం గానక అయోధ్యాపతియైన ఋతుపర్ణుం జూచి సంతోషమ్మున ఆహ్వానించి రమ్య హర్మ్య విమల ప్రాంగణముల తగు విడుదుల గావించినంత సంతోషించి ఋతుపర్ణుండు యిప్పట్టణమున స్వయం వర సూచకముగా యే ఆలికిడియుం మరియు–

క. రాకొమరుల రాకడలవి
యేకొంచెము పురమునందు యేర్పడ లేమిన్
నాకొక్కట కబురంపను
యే కార్యపు సాధనంబొ యేర్పడ జూడన్

వ. అని ఆత్మ గతుండై ఆలోచించుచుండ అంతఃపుర పరిచారికల వలన బాహుకుని నలునిగా సం శయించుచు నలునికై దమయంతి–

క. వచ్చిన ఆ రథమందున
సచ్చరితుం నలుని గాన్క సంచలితాత్మై

అచ్చెరు వందుచు మనమున
నిశ్చయమా నలుని రాక నిశ్చయమనుచున్

వ. ఆ రధాగమన సమయమున శుభ సూచకములుగా తన కన్గవ అధరావయంబు లదర అయ్యయోధ్యాపతితో వచ్చిన అయ్యిరువురును యెవ్వరైనదియు యెరుంగ శశియను తన ఆంతరంగిక చెలికత్తెను పంపనది బోయి వచ్చి దమయంతితో అమ్మా! ఆ అయోధ్యాపతి ఋతుపర్ణ మహారాజులతో వచ్చినవారు యందు వార్ష్ణేయుండనువాడు సూతకులజుండు. ఆ రెండవ వారెవరో గాని బాహుకుండను రధ చోదకుడుగా తెలియనగు కావున–

క. అరకొర చేతుల అవయవ
మరుగుజ్జగు రూపధారి మామక దెలియన్
తరతమ మేర్పడ కుండెను
సరివారల మధ్య నుండ సద్గుణశీలా

వ. కానినాడు రారాజుల తోడ యెటుల రాగలడని విన్నవింప అయ్యయోధ్యాపురికి వెళ్లిన సుముఖుని మాటలకు ప్రతిపల్కిన వాడగునో కాదో తెలియుమని పంపిన అదివోయి బాహుకుం గని అయ్యా! దమయంతి నీ కుశలం బడిగె. ఏమి కారణంబున ఇందుల కొచ్చితి వన బాహుకుండు శశి యను దానితో–

క. అయ్యమ పునః స్వయంవర
మయ్యారే చూతమంచు మనసున దోపన్
నెయ్యంబున రారమ్మన
నయ్యో నా రూపు జూసి నవ్వెద రనినన్

క. ఒక్కట బోవం దగుదీ
వొక్కడ వే రధము దోల నొండొరు కగునే
తక్కక రారమ్మన్నచొ
మిక్కుటమౌ కౌతుకంబ మేలని వస్తిన్

వ. అన్న యాతని మాటలు (శశి వలన) విన్న దమయంతి యీతడు తప్పక నలుండుగా దోచుచున్నదని మనంబున చింతించుచు–

క. శత యోజన పర్యంతము
అతి రధుడా నలుకు దక్క అన్యుల కగునే
వెతలొందుచు బహు విధముల
సతి గతికై చింతిలుచును సతమతి యౌచున్

క. గతమెంచుకు వాపోవుచు
అతి సాధ్వియ భీమ పుత్రి ఆ నలు దలచిన్
సతి కృత్యము నాపదలచి
మతిమంతిగ వచ్చియున్న మత్పతి యగునో

వ. కాదోయని ధృఢపరచు కొనుటకై ఆ శశిని మరల బంపుటయును ఆమె బాహుకునివద్ద కేగి –

క. నలు నెరుగుదువా నీవన
నళినాక్షిని యొంటి విడచి నమ్మిక బల్కిన్
వలవల యేడ్చుచు పొక్కుచు
అల అడవుల దిరుగుచుండు నాతనినేగా

వ. అడుగుచుంటిరి. అతడును నేనును ఒక్కటి కామా! కారడవి మధ్య కార్చిచ్చు నుండి రక్షింపుడు రక్షింపుడు అను ఆర్తనాదము వినవచ్చుడు తత్తక్షణమున కార్చిచ్చున దూకిన వాడేమయ్యెనో మరెరుంగ ననవిని దమయంతి కడకు వచ్చి బాహుకునిం దనకును జరిగిన సంభాషణమును యధాతధముగా విన వినిన దమయంతి యీబాహుకుడు నిశ్చయముగా నలుండని తన అంతరాత్మ ఘోషింపుచు నుండనైన యీతనికీ కురూపం బేమొకోయని పరితపించునది నల రుచి నెఱింగినది కావున వెండియు బాహుకుని వ్యావృత కార్యక్రమ విషయముల నెరుంగ వలసి నదిగా పల్క నది వారి విడిది గృహంబున కరిగిచూచుడు అమ్మా!

క. అంతయు వింతగ దోచెడు
వింత గదా అగ్ని సెగలు వీచకె యెగయున్
యెంతో రుచికర వంటలు
ఇంతింతని పాత్రలందు యీనుచు నుండెన్

వ. అని దెలుప దమయంతి ఆ వంటకములు దెప్పించి రుచిచూచి సందియములేదితండు నలుడు తక్క వేరుండు కాదని దాసింబిలిచి తన బిడ్డల నిర్వురం బాహుకుని వద్దకుం గొనిపోవం బంప–

క. బిడ్డల జూచుచు కన్నుల
కడ్డంబౌ భాష్ప వారి నావల దుడిచిన్
నడ్డిం జుట్టుచు దగ్గరి
దొడ్డగ ముద్దిడి శిరముల దురపిల్లు మదిన్

వ. ఆ శశినిం జూచి వీరు నా బిడ్డల వలె నుంట వీరింజూచిన నా కన్నులు నీరైనవని తన్నెరుంగకుండునట్లు పలుకుటయును నయ్యువిద సర్వమును దమయంతికి యెరింగించిన విని–

దమయంతి బాహుకుని జూడ గోరుట

ఉ. సందియ మొందనేల మది శంకలు బాయను నొక్క టొక్కటిం
గొందల మందుచుం దనదు కూరిమి బిడ్డల గారవించుటల్
నిందల పాలు కానగుదొ నిశ్చల చిత్తత నున్న దాననో
ముందటి రూపు నన్నలుని ముద్దుల మోహను కాంచగల్గుదే

వ. అని నిస్సంశయ మనస్కయై తల్లికిం జెప్పి తండ్రి యనుమతింవడసి ఒండొరు గలసిమాటలాడ దగు యేర్పాటు గావింపుడన విదర్భకుండు సుహృద్బంధు జనంబుల నంపి బాహుకుని తోడ్తేర దమ యంతి లజ్జావనత వదనయై ఆతనితో–

చ. అడవిని ఆర్ధ రాత్రమున హాయిగ నిద్దరు నిద్రబోవనా
కెడ జని యెందు బోతివల యెయ్యెడ యే విధి బాధ లొందితో
సుడివడి యింతకుం దనుక స్రుక్కుచు చిక్కితొ క్రూర జాతికిన్
కడివెడు నేడ్చు చుంటి మది కర్కశమైతివె మానసంబునన్

వ. ఇంద్రాది దిక్పాలురగాదని అగ్నిసాక్షిగా దేవతల సముఖంబున తన్నే వరియించిన విశుద్ధాంత రంగను సంతానవతిని అట్లడవుల పాలు చేయ నగునె నిన్వీడనను పల్కులు దలంప నేరకుండుట కంత ధర్మేతరనేయన వలవల యేడ్చుచున్నదమయంతింజూచిశోకాకులచిత్తుడై బాహుకుం డిట్లనియె.

తే. కలికి వశవర్తు నైతినే కలికి యపుడు
తలప లేకుంటి ధర్మమ్ము తప్పు ఒప్పు
ఆలుబిడ్డల కెడమొచు అలమటిస్తి
కాల మీవిధి చేసెనా ఖర్మ వశత

వ. కానలం దిరుగుచుం కార్చిచ్చునందుండు నొక బిడ్డను కాపాడ నందు దూకి రక్షింపనతడు నీకు ప్రతి ఉపకృతి చేతు భయపడ వలదనుచు ఆతడు తనను కౌగలించ్కు–

తే. కాలసర్పుడు కర్కోట్క గరళ యుక్తి
రూపు మాసియు వికృతంపు రూపు వడసి
యెరుక రాకుండ జనవర్యు కీ విధంబ
అరిగి అయ్యోధ్య పతివద్ద అమరియుంటి

వ. పతికన్యోన్యానురాగ ధర్మశీలి సంతానవతి పతివ్రత యైన దమయంతి స్వయంవర మను మాట విని యిదియెంత వరకు సత్య ధర్మ వర్తనంబోయని వగచుచుఅంత దవ్వులనుండి యీ యయ్యోధ్యా పతి వెంట వచ్చినాడ మిమ్మెల్లర జూడనైతి నన దమయంతి నన్ననుగ్రహింపుడని వలవల యేడ్చుచు దగ్గరకు వచ్చి ఆర్యా! మీరాకకై ఇంతపన్నాగముపన్నితి. అంతియే కాని వేరొండు కాదు. సుముఖుని

వలన నా మాటకు ప్రతి వచనంబులిచ్చినవారు నిషధేశ్వరులు కాకమరి యెవ్వరనుచు కానినాడు నొక్కనాట యింత దవ్వులకెట్లు రాగలరని అట్లు వార్తప్రకటింప బంపితిని. వేరొండుకాదన బాహుకుండప్పుడు–

తే. కలి సమాకృష్ఠ దుష్కర్మ కలుషమెల్ల
దీరె నీపర్ణు అయోధ్య ధీవిశాలు
అక్షవిద్యాది శక్తుల నవధరింప
యిపుడ గైకొందు నిజరూప మీప్సితంబ

వ. అని కర్కోటకుం దలువ నాతడు చెప్పిన ప్రకారము నాటి నలుని కట్టుకోక దమయంతి చించి యిచ్చిన భాగము నలుని చేరుటయును అద్దానిం జుట్టుకొని నలుండు నిజరూపంబు గొన్నవాడగుటయును దమయంతి ఆతనిం జుట్టుకొని అనురాగాంబువులు కన్నులు రాల ఆనంద పారవశ్య యైనయంత–

క. విరివాన గురిసె నమరులు
సురలోకాంగనలు బాడ్రి శుంభధ్వనితో
చరితార్ధుల కీర్తించుచు
పరిమళ వీచిక లెగయగ పరవశు మగుచున్

వ. విదర్భాధి పతియును అయోధ్యా పతియుం యెంతయుం సంతసించిన వారలైతిరి. నల దమయంతులు తమ తమ బిడ్డల పురజన పరిజనుల కెల్ల హాయి గొలుపుటయునుఋతుపర్ణుండు నలునొద్దకు వచ్చి నిన్నెరుంగని నన్ను మన్నింపుమని వేడి యశ్వ హృదయ విద్య నాతని నుండి గ్రహించి సత్కృతుండై వెడలుటయును నలుండు భార్యా బిడ్డలతో విదర్భాపురమున కొంతకాలముండి తగు రథ గజ తురగ పదాతి భటసందోహంబులు వెంటగూర్చుకొని నిషధపురమున కేగి పుష్కరునిం గని–

తే. రమ్ము రారమ్ము జూదమ్ము రాజసంబ
పణముగా బెట్టు దమయంతి పద్మ ముఖిని
ఓడి నట్టైన రాజ్యమ్ము తోడ నీది
ఆడి ఓడిన సర్వమ్ము వీడి జనుము

తే. అటుల గాదేని యుద్ధమ్ము నందు గెలుపు
యెవరి వరియించు నాతడే యేలికగును
ఓడినట్లైన రాజ్యమ్ము వీడి జనుము
ఇందు నీకేది యిష్టంబొ యెంచు కొనుము

వ. అన విని పుష్కరుండు రణంబున నలుని గెల్చు టసాధ్యముగా మది దలంచి జూదమాడి గెల్చిన వాడౌట మరల జూదమాడి మగువను గూడ చేపట్టగలవాడ నని ఊహించి నలునితో జూదమాడి వోటువడిన యంత నలుడు వానింజీరి నీవు నా తాతల వంశజుండవు. కలి సంప్రాప్తుండనై తొల్త నీ చే నోటు వడితి నంతియె కాని నీ విద్యా బలిమినికాదని యెరుంగుము. పొమ్మనుటయును.

తే. తనదు రాజ్యమ్ము విభవమ్ము తరుణి తోడ
సర్వ సంప్రాప్త మయ్యెంట సద్గుణుండు
అన్న దానాది విధులెన్నొ అవని నలుడు
దేవళమ్ముల జరిపించె దేవ హితము

తే. సత్య ధర్మజ్ఞ సేవనా సక్త హృదుడు
రాజ్య విభవంబు పెంపెక్క రమణి గూడి
జగతి బొగడంగ వేనోళ్ల జనవరుండు
యజ్ఞ యాగాది క్రతువుల నొనర జేసె

వ. మరియును అనేక యజ్ఞ యాగాది క్రతువులం నెరపుచు నలుండు పెక్కేండ్లు రాజ్యమ్ము చేసె. కావున ధర్మనందనా నీవును జయశీలుడవై నీ రాజ్యమును సంపదలను పొందగలవని బృహదశ్వుం డు ధర్మరాజునకు అక్షహృదయ విద్య నుపదేశించి నిట్లనియె.

క. కలి దోష వివర్జితమగు
యిల నీ నలరాజు చరిత యెరిగిన విన్నన్
కలి కలుషములు బాసి సుఖము
వలనొప్పెడు శుభము లెల్ల వడయుదు రెల్లర్

ధర్మరాజు నొద్దకు నారద మహర్షి వచ్చుట

వ. అని పల్కి బృహదశ్వుం దరిగిన తమ్ముల తోడన గూడియున్న ధర్మరాజు అర్జుననిందలంచుచు వాని రాకకై నిరీక్షించుచు–

క. ఇంద్రావని కేగిన నరు
డేంద్రా యింతకును రాడు యెట ౹లున్నాడో
యింద్రాప్సర దిక్పాల ము
నీంద్ర స్తుతి పాత్రు డేమి నేరము చేసో

వ. ఏమి కారణమున మసలుచున్నాడో అనుకొనుచుండ–

క దివినుండి డిగ్గ నారదు
దవిరళ గతి బాడుకొనుచు అభవుని లీలల్

అవనీజను లెల్ల బొగడ
సవినయు లప్పాండు సుతులు సంబర పడుచున్

వ. నారద మహర్షిని అర్ఘ్య పాద్యాది విధుల పూజించి నమస్కరించిన తృప్తుండై నారదుండు ధర్మ నందనా! నీ యుదార చరిత్రకు సత్యసంధతకు ధర్మచింతనకు యెంతయు సంతసించుచున్నాను. యే దైన సందియమున్న అడుగుమన–

ఆ. సాదు వాదు లెల్ల సంతృప్తు లయ్యుంట
తృప్తి చెందు వాడ తృప్తి తోడ
పూర్ణ పురుష బాడు పూజ్యుండ నీ రాక
మాదు కెల్ల తృప్తి మనసు నందు

వ. అయినను నాకొక ధర్మ సందేహము గలదు. దాని దెలుప గలరని యడుగ–

ఆ. దైవ క్షేత్ర తీర్థ దర్శనీయులు నౌచు
దేశమెల్ల దిరుగు దేశి జనులు
తీర్థ సేవనార్థ తేజోమయంబౌచు
యెట్టి ఫలము నిచ్చు యెరుగ చెపుమ

వ. మీరుమెట్టని పుణ్యతీర్థములులేవు. కావున వినిపింప ప్రార్థింపుమన నారదుండు–

క. శంతన గంగా నందను
డెంతయు తన పితరు ఋణము నెలమిని దీర్పన్
సంతత వాహిని గంగా
సంతర్పణ తీర్థ రాశి సత్వర మేగిన్

వ. పితృ హితమ్ముగ అనేకానేక పుణ్యకార్యంబులు జరుపు వాడునై యుండ పులస్త్యుండను మహా మునిసత్తముం దరుదెంచి అతని పితృ, దైవ భక్తి కెంతయు సంతసించుచు–

క. అరుదుగ నుందురు భీష్మా
సరియన నీ సాటి లేరు సద్గుణ చరితా
తరముల పెద్దల నెల్లర
తరియింపగ జేస్తివయ్య ధన్యుడ వీవే

వ. అని పలుక నాతని యధోచిత సత్కారంబుల పూజించి నంత సంతుష్టుండైన పులస్త్యునితో మహాశయా!

క. కల ధనములు కలవారలు
వెలయంగా క్రతువు లెన్నొ విభవత జేసిన్

యెలమిని గాంతురు శుభగతి
కల ధనములు లేనివారి గతు లేవిధమో

వ. ఉన్నవారు అనేకానేక ధర్మములు చేయం జాలుదురు. ఒకచో యివి యెవ్వియును చేయనేరని నిర్ధనులగు వారలెట్లు శుభగతి నొందగలరని ప్రశ్నింప, పులస్త్యుండప్పుడు–

తే. భాగ్య హీనతంచు బాధ నొందగ నేల
కామితార్ధ యుక్తి కలిమి చెలిమి
ఆయువృద్ధి తోడ అమితార్ధ ఫల సిద్ధి
తీర్ధసేవ వలన తీరునంచు

వ. ఇయ్యది యోగవిద్యా నిధులైన యోగాగ్ర మౌనిపుంగవుల మాటయు. బాటయును. మహదర్ధ ప్రదమ్ములైన బహుతీర్ధములీ జంబూద్వీప భరత వర్షమున ఆసేతు హిమవన్నగ౦పర్యంతము అయ్యా యు నదీనద క్షేత్రముల భాసిల్లుచుండు. అవియే పుష్కర తీర్ధములుగా జగత్ప్రసిద్ధమ్ములై బరగునట్టి–

చ. అమలిన అన్నదీ నద జలమ్ముల నంబుజగర్భ సంభవుం
డమర సురేంద్ర దిక్పతి బలాఢ్యుల తోడన నభీష్ట సిద్ధుడై
యమ నియమాది యష్ట విధ ఆయత సిద్ధ మునీంద్ర సేవ్యుడై
మమతలు దీర సన్నిహిత మార్గణుడౌచును పుష్కరంబులన్

వ. అట్టి పుష్కర తీర్ధములందు స్నానము లాచరించి తీర్ధవిధి విధానముగా దేవ ఋషి పితృ తర్పణ ములు చేసినవారు పది అశ్వమేధ యాగములు చేసిన ఫలము లొంద గలరు. గంగా గోదావరీ నర్మ దలు ప్రసిద్ధ పుష్కర తీర్ధములనంబడు. అందుల కృతస్నానులై తీర్ధ సేవనం బొనర్చుటవలన సమస్త దేవతాపూజలొనర్చిన పుణ్యము వడయుదురు. సరస్వతీసాగరసంగమ తీర్ధమున స్నానమలాచరించిన గోదాన ఫలము గల్గును. ప్రభాస తీర్ధములాడిన ప్రతిభావంతు లగుదురు. పాపవిముక్తులును కాగల రు. బ్రహ్మ తీర్ధులు బ్రహ్మ విదులగుదురు. విష్ణు కుండమున జలకమ్ము లాడిన లక్ష్మీయుతు లగుదు రు. వసు తీర్ధంబులాడిన సువర్ణ దాన ఫలము నొందెదరు. శమంత పంచక కురుక్షేత్ర తీర్ధము లాడి నవారు శమ దమాది సమస్త సద్గుణ సమన్వితు లగుదురు. యక్షి తీర్ధంబు లాడిన పాపక్షయంబగు.

క. వారణ జేయం క్షాత్రత
వీరుండా జామదగ్ని వివశుం డగుచున్
దారుణుడై జంపి నృపుల
మారణ రుధిరముల నేను మడువుల జేయన్

వ. అందు పితృతర్పణంబులు విడువ పితృదేవతలు ప్రత్యక్షులై నీకెద్ది కావలయునో కోరుకొమ్మన పరశురాముడు వారల కిట్లనియె.

తే. మరణమునైన పాపమ్ము మాయవలయు
ధరణి తీర్థంబులై యివ్వి దనరవలయు
కరుణ నాకస సద్గతి కలుగ వలయు
తీర్థ జనికెల్ల భవ బాధ తీర వలయు

వ. అని వారల వలన తీర్థ సేవనా స్నానాదుల వలన సర్వ పాప నాశనంబగు నట్లు సద్గతికి ద్రోవ యు కల్గునట్లు ఉద్ధరింపబడియె. శ్రీ తీర్థము లాడిన శ్రీమంతు లగుదురు.బ్రహ్మ తీర్థమ్ము లాడిన జన్మాంతరమున బ్రాహ్మణుడు బ్రహ్మ లోక ప్రాప్తి వడయుదురు.వేద విహితంబైన హృధూక తీర్థము లాడిన బ్రహ్మ హత్యాది పాతక విముక్తు లగుదురు.

క. ధారుణి లోనను స్వర్గ
ద్వారంబయి ఋషిక సేవితంబగు గంగా
తీర్థం బాడిన జన వరు
జేరును శతకోటి తీర్థ సేవా ఫలమున్

వ. మరియును గంగా సాగరసంగమ తీర్థ క్షేత్రము లందేనియు స్నానాదిక ఉపవాస దాన ధర్మము లాచరించుట వలన పాప క్షయమును ఉత్తమ లోక గతులను కూరును.

చ. సురుచిర కీర్తి నైమిశము జూచిన మాత్రన బోవు పాపముల్
అరుదుగ నైన తీర్థముల నాడిన వారల జేరు పుణ్యముల్
దురితము లెల్ల బాయునట దోహద మొచును సద్విధంబునై
హరిహరు గొల్చుచుం సమత మాశయ సిద్ధతలొందె దెల్లరున్

వ. వారణాసి యందును గయ యందును ప్రయాగతీర్థము లాడిన వారు పూర్వాపర ఉభయ పక్ష ముల వారి నుద్ధరించిన వారగుదురని–

క. విదితంబీ తీర్థ కధను
జదివిన విన్నం జనులకు జయమౌ నెల్లన్
ముదిత హృదయులును అగుదురు
పదిలంబుగ విష్ణు పదము బడయుదు రనుచున్

వ. సాకల్యము సకల తీర్థసేవన సుకృతి వివరించి చెప్పిన పులస్త్యు వచనానుగుణ్యముగా మీ తాత భీష్ముండు తొల్లి యెల్లతీర్థములం సేవించి కృతార్థుండయ్యె కావున నీవును యీ తీర్థ సేవలం జేసి–

క. ఉరుతర గుణ కీర్తనులరు
కురుకుల పూర్వీకులట్ల కృతకృత్యుడవై

పురురవు పూరు భగీరధ
భరతాన్వయ ధర్మరాజ బడయుము సుఖముల్

వ. రోమశుండను దేవర్షి ఇంద్ర లోకమునుండివచ్చు తదుపదేశమున ధౌమ్యానుమతుండవై తీర్ధ సేవ చేయుమని చెప్పి నారదుం డరిగిన ధౌమ్యునిం జూచుచు ధర్మరాజు–

చ. అనువుగ కార్య సాధనగ ఆయుధ శక్తుడు కాగలందుకై
పనిచిన ఇంద్రలోక గతి పాండవ మధ్యము డింద్రు సన్నిధిన్
తనియుచు యింత కాలముగ ధన్యత గూర్చుకు రావదేలకో
మనమున చింత చేయకను మానుగ నుండగ పాలుపోవదో

చ. సఫల మనోరధుండగుచు సంగర శక్తుల సంతరింపకే
విఫలత వచ్చునే నరుడ విజ్ఞత నెంచుము దేవ సన్నిభుల్
సఫలుడవైతివంచు తగ సత్కృప దీవన లిచ్చి పంపరో
సుఫలుడ వౌదు నాజి పురుషోత్తమ యిత్తరి భారతావనిన్

వ. అని అంబుదాగమన కాంక్ష చేతకంబులట్ల ఫల్గుణాగమన కాంక్ష నిరీక్షించుచున్నారము. ఏమి చేయం దగునని ఆలోచించుచున్న యవసరంబున ధర్మరాజులకడకు–

రోమశ దేవ ఋషులు ధర్మరాజు కడకు వచ్చుట

తే. ముజ్జగంబుల దిరుగాడు మౌని వర్యు
డాడినట్టుల రోమశుం డరుగు దేర
అర్ఘ్య పాద్యాది పూజల నలర జేసి
సేద దీరెడు సమయాన క్షేమ మరసి

వ. మహాత్మా! ఎందుండి ఇటు లరుదెంచుచున్నారని యడుగ –

తే. పరవశించియు బలికెనా బ్రహ్మ మయుడు
జగతి పదునాల్గు భువనాల జనుచు నిపుడ
దేవ విభుడైన దేవేంద్రు దేవ సభను
జూచి వస్తందు అర్జునిం జూసి వస్తి

తే. పశుపతుం డీయ అస్త్రమ్ము పాశుపతము
ఇంద్ర వరుణాది దిక్పాలు రెలమి మిగుల
దివ్య అస్త్రాల వరదీప్తి దేవ సభను
అర్ధ సింహాసనస్థుడై అలరుచుండ

వ. ఆతండు సాధించిన ఆదివ్యాస్త్రముల ప్రభావమ్మున నీతమ్ముండర్జునుండు అష్టావశుఅంశ బల

సంభవుండైన భీష్ముని సయితము కర్ణాదుల నెల్ల నిర్జించగలడు. అంతటి దివ్యాస్త్ర సంపత్తితో ఇంద్రాసనమున ఇంద్ర సమానుడై అర్ధసింహాసనంబున వెలుగొందువానిం జూచి నే విస్మయం బందుచుండ ఆఖండలుండు తనఅంకముననున్న తనయంశజుండైన నర్జునుంజూపి యీతడు వడసిన దివ్యాస్త్ర ప్రభావమ్ము దెల్పుచు దివ్య పురుషుం డైనవాడు. మనుష్య మాత్రులెవరును యితనికి సాటిరారు. అన్యుల కశక్యంబైన దేవకార్యము లెల్లం దీర్చిన తదుపరి రాగలడని మర్త్యలోకమున కేగి సోదర సహితుం డైన ధర్మ నందనున కెరిగింపుమని పల్కి మరియును యిట్లనియె.

క. చేయింపుము తీర్థాటన
చేయింపుము ధర్మ విధుల చేకొన శుభముల్
ధీయుతులా పాండు సుతుకు
సాయముగా వెంటనుండి సంయ మునీంద్రా

క. కడు జని తీర్థాటనలం
బడయుదు ఇహపర శుభములు పావను లగుచున్
మడి మాన్యము లీనేరని
బడుగులు సయితమ్ము వీడ్డు భవబంధమ్ముల్

వ. మీరెల్లరీ తీర్థ సేవలు జేయుట మీ తమ్ముడు ధనంజయునకు కడు ప్రీతి పాత్రము కాగలదని పుత్తెంప వచ్చితి. నే నిదివరలో యినుమారు భూప్రదక్షిణ జేసితి. నీతో వచ్చుట వలన మూడవ పర్యాయము చుట్టి వచ్చినవాడ నగుదునన ఆ రోమశ మహర్షికి నమస్కరించి ధర్మరాజాతనితో–

తే. విజయు కుశలమ్ము యింద్రోర్వి విశదమౌగ
దేవ విభుదుండు కాంక్షించి తీర్థ గమన
సేవ లీడేర్ప విభవమ్ము క్షేమ మేర్చి
మిమ్ము బంపుట మా భాగ్యమ్మెన్న దరమె

వ. మహదాశయ మునీంద్రా! నేను తొల్లి నారద ధౌమ్యుల వచనంబుల తీర్థ గమనోన్ముఖుండనై అర్జు నాగమన కాంక్ష యింత వరకును ఆలసించుట జరిగినది .మీ రాకతో యింక నాలసింవ వలసినది లేదు. కృతార్థుండ నయ్యెదనన ధౌమ్యపురస్సర బ్రాహ్మణోత్తములు ఆ ధర్మ నందనునితో–

ఉ. వీరులు ధీరులుం మరియు విజ్ఞులు దమ్ములు అండ దండగా
పారగుడైన రోమశుని పావను వెంబడి తీర్థ సేవకుం
దీరును మీకు తోడుగను తీరగ కోర్కులు భూ ప్రదక్షిణం
బారయ మాదు భాగ్యమన పావన పూరుష పాండవాగ్రజా

వ. అని ధర్మ నందనుని అనుజ్ఞ వడసి ప్రయాణోన్ముఖులైనంత–

క. వచ్చిరి వ్యాసుడు నారద
సచ్చరితులు పాండవేయు సద్గుణ శీలుం
డిచ్చల తీర్థాటన పరు
ముచ్చట పడి చూడ వచ్చి ముదమలరారన్

వ. వారలం పూజించిన ధర్మరాజుతో వారలిట్లనిరి. తీర్థ సేవనులు నియమ నిష్ఠాపరులయి మనో బుధ్యహంకారముల ఋజు మార్గగాములై యుండ వలయు. కలిగి నంతలో అభ్యాగతులగు వారికి తోడు పడ వలయు. పూర్వ వంశ కర్తలగు మహనీయులను తర్పణ సహితముగా నర్చించి బ్రహ్మణ్యు లగువారిని దానాదుల సత్కరింపవలయు. అట్లొనరించిమీరును మీ వంశ కర్తలైన మహాభిష నాభాగ భరత భగీరథ మాంధాత్రు సగర సోమకసార్వ భౌమాష్టక రోమపాదులయట్ల శత్రువులజయించి కీర్తి ప్రతిష్ఠ లినుమడింప జేయుచు యిహపర సుఖ సంతృప్తు లగుచు నుండ గలరని చెప్పి మువ్వురు మౌని పుంగవు లరిగి నంత, అజాత శత్రుండు రోమశులతో నిట్లనియె.

రోమశ దేవ ఋషి ధర్మరాజుతో ధర్మ విషయములు పల్కుట

తే. ఒగి నధర్మ వర్తనులకు నుధృతియును
ధర్మువుకు వివర్ధనమును దనరుచుండు
యైన ధర్మార్థ మది యోగ్యమౌచు నిలుచు
వసుధ దైవత్వ దైత్యత వరలు నట్ల

ఆ. సత్య ధర్మ నిరతి సాదులై మీరలు
నిత్యు లగుచు కీర్తి నెగడు చుంద్రు
ధర్మ హీనులైన ధార్తరాష్ట్ర సుతులు
దురిత వృత్తి హీన్త దూలుచుంద్రు

వ. అధర్మమున దర్పము దానివలన దురభిమానము దాని వలన క్రోధము దాని వలననీతి లజ్జా నివృత్తనంబును దాని వలన అపకీర్తియుం బుట్టు. అపకీర్తి అన్యాయ అధర్మ వర్తనుల యందు లక్ష్మి నిలవదు.

తే. ధర్మ వర్తన జనులందు దనరు నీతి
నీతి నియమంబు ధర్మార్థ నెగడ జేయు
కామ క్రోధాది అరి వర్గ కాములెల్ల
అధమ గతులందు కృశియింత్రు రధిప దెలియు

వ. సత్య ధర్మార్థ వర్తనులైన దేవతలు ఋషులుపితృవ్యులు వసియించుటం జేసి పుణ్య నదీనద తీర్థ క్షేత్రములు మహా పవిత్రములును కామ్యార్థ ప్రదమ్ములునై వెలుగొందుచుండు. తీర్థసేవ వలన

పురుషార్థ సిద్ధియు సర్వ జయసిద్ధియు చేకూరు. దాన యజన క్రతువు లొనరించిన ఫలముగల్గును. బ్రాహ్మణాశీర్వాదము జయప్రద సిద్ధి గూర్చునదిగానెరుంగుడనినుడువ ధర్మనందనుడును తమ్ములును పాంచాలీ సహితులై ఆసేతు హిమాచల పర్యంతమునం గల సర్వ తీర్థంబుల సేవన లొడ గూర్చు కొనుచు గోధన హిరణ్య దానము లొనరించు కొనుచు అందలి ఋషిసత్తముల వలన పుణ్య కథలు వినువారలు నైమిశంబున అశ్వ తీర్థమును గంగాతీర్థమును గోమతీ బాహుదా నదియందు దేవయజనమును ప్రయాగ గంగా సంగమున అక్షయ వటమున చతుర్మాసములం గడపి ప్రయాగ తీర్థమున శమనకుండను ఋషి వలన తత్తీర్థ నామ మహత్యమును వినిన పిమ్మట అగస్త్యా శ్రమమున కరుగ దానిం గూర్చి రోమశుండిట్లు చెప్ప దొడగె. తొల్లి –

అగస్య మహర్షి లోపాముద్రను వివాహ మాడుట

క. ఇట నయ్యగస్త్య వటమున
కటి తలమున గోచిపాత గట్టినవారై
పటుతరులై తలక్రిందుగ
ఝటిలోద్ధతి తపసు లుండ్రి జర్జిత కృశులై

వ. వారలంజూచిన అగస్త్యుండు మీరలెవ్వరని అడుగ వారలగస్త్యునితో మేము నీ వంశకరులము. నీవు బ్రహ్మచర్యంబున మహద్విభుదుండ వైయుండియు అవివాహితుడవుగా నుండుట వలన మా కూర్ధ్వ గతులు లేకుండ చేసిన వాడవు కావున యిట్లుంటిమన–

క. తరుణిం వెదుకంబో మణి
పురమున ఆ రాజు చేత పూజితు డగుచున్
దురితిల్వలు నా తాపసు
దురితోన్మాదుల దెలిసియు దుస్సహుడగుచున్

క. ఆతత రాక్షస ముడుపగ
యేతరుడై యిల్వలింట్కి యేగియు తనిగా
తా తినునంత కుడుపను
ఆతనిచే ననిపించు కొనియు అతిథిగ నేగన్

వ. ఇల్వలుండు ఇదివరలో వలెనే వాతాపిం చంపి తినిపించుచుండ అయ్యగస్త్యుడు“ వాతాపి జీర్ణం మాతాపి జీర్ణం అనుచు“ భేవున తేన్చుచుండ యిల్వలుండు వాతాపిని యెంత పిలిచినను రాకుండుటచే అయ్యగస్త్య మునివరు పాదముల పైబడి ప్రార్థింప నీ దినిన పిశితంబు నీకు జీర్ణంబు కాకుండెదు నని పల్కి నంతయిల్వలుండు నాటినుండిశాకాహారియై ఆడవులబడి పోవ అగస్త్యుడు మణిపుర రాజ తనయ లోపాముద్రను వివాహంబై తన వంశకరులను ఊర్ధ్వలోక గతులుగానొనర్ప సంతాన

వంతుండగుటయును సంతసంబుగా విని వైశంపాయనుని జనమేజయుడు తరువాతి కథ వినిపింపుమనెను. ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయు విరచిత

-: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ ద్వితీయాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వ తృతీయాశ్వాసము

శ్రీ వేంకట రమణామయి
యేవేళకు సరిగ పూజ యెలమిని గూర్పన్
రావే వరములు నీయను
కావేరీతీర్ధ సక్త కరుణామయుడా!

వ. అ క్కధకుండు శౌనికాది మునివర్యులకు చెప్పినట్లు ధర్మరాజునకు అగస్త్యుని మహత్వంబును సవిస్తరముగా రోమసుండు యిట్లని చెప్ప దొడంగె.

అగస్త్యుని చరిత్ర

ఉ. ఆది యుగంబు నందనుజ ఆతత శక్తుల కాలకేయులం
 ప్రోదిగ మార్చ్కు వృత్తృడల పోతరికంబున నాశనోద్ధతిం
 సొదరులంచు దేవతల సుంతయు కొంతయు లెక్క చేయకన్
 వాదొనరించుచుం జగతి బాధిల జేయుచు నుండ నెంతయున్

వ. ఇంద్రాది దిక్పాలు లెల్లరుం ఆ కమలసంభవు పాలికింజని వృత్రునిం మట్టు పెట్టు నుపాయము దెల్పవేడిన నతండు వారితో సరస్వతీ తీర్ధమున యేకాగ్ర చిత్తుడై తపముచేయుచున్న దధీచి వద్ద కేగి వానిని ప్రార్ధింపుడన దేవతలాతని కడకేగి వేడిన వారగుటయిది బ్రహ్మసమ్మత మగుట దధీచి అప్పటి కప్పుడు-

తే. దేవ హితార్ధమీ పృధివి దేహులనల
 గావ అగ్నికి ఆహుతుడాయె వాని
 అస్తి సంచయ మదియెల్ల ఆయుధస్తు
 లగుచు వాసవు నొందె నాయసుర ద్రుంప

వ. అంత ఇంద్రుండు దధీచి వెన్నెముక తనకు వజ్రాయుధమై వెలుగొందనా వృత్రు ద్రుంప కాలకేయాది అసురు లెల్లరు సురేంద్రాదుల నెదిరింప నేరక సముద్ర గర్భంబున దాగుకొని పవళ్లయందెప్పుడునూ పైకి రాక రాత్రులందు మాత్రమే పైకెగసి పెచ్చు పెరిగి జగతి జనుల బాధించుటయును మరియును దేవతలు శాంత చిత్తు లగుచు-

తే. వన్య ఫల రస శాకాది భక్షు లగుచు
 వేద విహితార్ధ సత్రృతు వేద్యులగుట

గాదె జగమందు శుభశాంతు లొందు నట్టి
వారల వెదకి బాధింప వలదె మనము

వ. అని తమ రాక్షసత్వము వెల్లి విరియ అయ్యయ ఆటవిక ప్రాంతముల ఆశ్రమవాసులుగా నున్న వశిష్ఠ చ్యవన భరద్వాజ ఆశ్రయుల బ్రహ్మవిదుల వందల సంఖ్యల శిక్షించుచు మహోపద్రవ కారకు లగుట కెంతయు చింతించుచు మనముల దేవతలు క్షీరసాగరశేషతల్పుని వద్దకేగి–

దేవతలు వైకుంఠుని కడకేగి మొరపెట్టు కొనుట

తే. సర్వ రక్షక సర్వేశ శంఖ చక్ర
గరుడ వాహన వైకుంఠ కమల నయన
ఆది మధ్యాంత రాహిత్య ఆది దేవ
జగతి జీవుల గాచేటి జాగృతుండ

వ. దేవా! దేవాది దేవా! దీనశరణ్యా, ఆది వరాహరూపంబున హిరణ్యుని వధియించి ధరాతలంబెత్తి నారసింహుండవై ఆది దైత్యు హిరణ్యకశిపుం ద్రుంచి వామనుండవై బలి నణచి యజ్ఞమూర్తివై జంభా సుర విజృంభణ మణచి భూజలవాసక్రిమి కీటక మృగ పక్షి వృక్ష మానుష సర్వ జీవుల నెల్ల రక్షించు చున్న జగద్రక్షకుండవు.

తే. కాలకేయులు కడలిలో గాపు గాచి
హవ్యకవ్యాది క్రతువుల హతమొనర్చి
వేద విప్రుల బరిమార్చి భీతవృత్తి
అవని కెగ్గగుచున్నారు అవనిసురకు

వ. ఈ ఉపద్రవము వారింపవే అని వేడుటయును వనజనాభుం డప్పుడు వారికి మీరు మిత్రావరణ తనూజుండైన అగస్త్యు వద్దకు పోయి ప్రార్థింపు, డాతడు వార్ధి జలంబులనెల్ల ద్రావగల సమర్థుండన దేవత లెల్లరును కమలనాభుని పంపున అగస్త్యు పాలికిం జని వినమ్రులై మహాత్మా! తొల్లి నీవ కావే వింధ్యను అణగద్రొక్కి జగద్హితంబుగా కీర్తిగాంచిన వాడవు. ఇపుడీ ఉపద్రవంబు వారింపవే అని వేడు టయును అదివిని ధర్మనందనుండు అగస్త్యుడు వింధ్య నణగద్రొక్కుటేమది విన్నవింపుమన రోమశుం డు వానికి–

అగస్త్యుడు వింధ్య నణగ ద్రొక్కుట

వ. తొల్లి విధివిహితంబుగా మేరు మహీధరముం జుట్టి సూర్య భగవానుడు భూప్రదక్షిణము చేయు టకు కినిసి వింధ్యా చలేంద్రుండు శశి భాను తారకాగణముల కడ్డు తగులునట్లు మేఘ మండలంబు లందాటి పెరుగ పృథ్వియెల్లెడ కారుచీకట్లు గ్రమ్ముకొని అల్లకల్లోలముకాగా ఇంద్రాది దిక్పాలకా గణం బు లెల్లరును అగస్త్యు పాలికింజని యి ద్దురితోపవారణ గావింప వేడుటయును అప్పు డగస్త్యుడు

లోపాముద్ర సతీసమేతుండయి వింధ్యకడకు చనుదెంచిన వింధ్యాచలేంద్రుడు వానిని పూజించి వాని రాకడకు కారణంబేమని అడుగ అగస్త్యుడు మున్నుపూర్వాపర ఉత్తరదిగ్దేశంబుల గల పారావార తీర్థం బుల దర్శించి యిపుడు దక్షిణ దిగ్దేశ వార్ధి దర్శింప నేగుచుంటిని. దారి యిమ్మని అడుగుటయును, వింధ్య వినమ్రుడై ముని పాద భూతలమునకు వంగి నమస్కరించి దారి యొసగి యున్న యాతనికి అగస్త్యుండు నేవచ్చు వరకును నీవీలాగుననే యుండు మనుటయును లోపాముద్ర సహితుడై దక్షిణ దేశ భాగములకుంజని లోకహితం బొనర్చెనని అగస్త్య మహత్యంబు వివరించినాడాయె నట్లు అగ స్త్యుడు దేవతల ప్రార్థనంబు విని సముద్రోదకముల ద్రావుటయును అప్పుడు కాలకేయులు బయల్పడ వారితో దేవతలు తలపడి నిశ్శేషముగావారినెల్ల హతముగావించి మునీంద్రునెంతయుం కొనియాడి పాడి మరల యిట్లనిరి.

క. మునివర జలనిధి నింపుము
జనముల కాహ్లాద మొదువ జననుత నీవే
అని వేడిన దేవతలకు
ముని జీర్ణంబయ్యె వార్ధి మొదలికి అనుచున్

క. అరుగుడు ఆ అజు కడకని
తెరగేదో తెల్పు నతడు తోయజ నింపన్
కరునాళువు పరమేష్ఠియు
దురితోపశమన మగునటు తొలిగా నుండన్

వ. అని పలుక దేవతలు మరల బ్రహ్మదేవుని కడకుంజని సమస్తమును దెలుప విరించి ఆలోచించి వారల కిట్లనియె.

క. వననిధి నింప భగీరధు
డనువా డుదయించు పొందు అనుటయు తోడన్
జనిరా అమరులు దివికిని
మనముల చింతయును వీడ్రి మహదానందుల్

వ. అనవిని ధర్మరాజు మునీంద్రుల కిట్లనియె.

క. ఎవరా భగీరదుండని
వివరింపగ వేడుచుంటి విశదము అవగాన్
సువిదితు డిక్ష్వా క్కులజుడు
దివి గంగను భువికి దేడె దీరోద్ధతుడై

భగీరథుడు గంగను దెచ్చి సముద్రమును నింపుట

వ. ఆ కథ యేమదట్లు చెప్పుమని పాండునందనుండు మరల నడుగ రోమశుండు వానికిట్లనియె. తొల్లి ఇక్ష్వాకు సంభవ సగర చక్రవర్తి హైహైయ్యుల నిర్జించి సత్య ధర్మ నిష్ఠాపరుండై రాజ్యంబు చేయువాడు సంతానార్ధియై కైలాసనాధు ప్రార్ధింప పరమశివుడు వానికి ప్రత్యక్షంబై సంతానవంతుడ వగుదువని వరము ప్రసాదింప తత్ప్రసాదమున సగరు పెద్ద భార్య వైదర్భియందు యేబది మంది పుత్రులును రెండవ భార్య సైభ్య యందొక్కరుండును ఉద్భవిల్లిరి. అందు–

క. వైదర్భులు నూర్జితులై
 భేదోద్ధతి వైరమూని భూనభ చరులన్
 పాదాక్రాంతుల జేయుచు
 సాదుల బీదల నణచుచు సాహసు లెంతన్

వ. సగర నందను లేబదుండ్రును మదోన్మత్తులై పదునాల్గు భువనంబుల బాధించుట కోర్వనివారై మరుత్నాగామర యక్ష విద్యాధరు లెల్లరును బ్రహ్మ దేవు నొద్దకు పోయి మొరలిడ విరించి వారల నూరార్చుచు సగర సుతులు దగ్ధులగుదురు. భయపడ వలదని పల్కుటయును–

క. సగరుం డ్వయమేధ మొన
 ర్పగ సాహసులా యాగాశ్వ రక్షణ కరులై
 సగర సుతులు వైదర్భులు
 తగుదని అశ్వంబు వెంట తరలిరి వేగన్

వ. ఆటుల నా హయము వెంట సర్వ భూతలములను గ్రుమ్మరి పాతాళంబున కేగి కపిల ముని ఆశ్రమ ప్రాంతమున తన తండ్రి సగరు యాగాశ్వ ముండుటకు గర్వించి పలుక కపిలుండు కోపించి చురచురం జూచుచు నేత్రాగ్నులుం గురిపింప నా సగర సుత వైదర్భు లెల్లరుం దగ్ధులగుటయును దానిం విని సగరుడు శోక మగ్న హృదయుండై యుండునెడ ఆతని మనుమండు అంశుమంతు డరు దేరి విషయమును గ్రహించి సగరసుత ఖాత బిలద్వారమున పంకజోజ్వలిత సంకులంబైన సముద్ర గర్భమునకుం జొచ్చుకొనిపోయి పాతాళంబున కేగి అందు తపోధనుండను సహస్రభాను ద్యుతిమం తుండై వెలుగు కపిలమహామునినింగని నమస్కరించి నిజాగమన ప్రయోజనం బెరిగించిన కపిలుండు సంతసించి క్రతుహయమును పంపుచు వానికిట్లనియె.

క. జనవర నీ మనుమనిచే
 వననిధు లెల్లయును నిండు పావన మగుచున్
 తనియంగా జేయు సగరు
 అనునయముగా యాగమేర్చి అభినుతి పొందన్

వ. అని దీవించి పంపుటయును, యాగాశ్వము రాగా సగరుండు అశ్వమేధమును పరిపూర్తి గావించుటయును సంతసంబుగా పెద్దకాలము రాజ్యంబుచేసి తన రాజ్యభార మెల్లయును మనుమడు అంశుమంతున కొప్పగించి తపోవనముల కేగుటయును, అంశుమంతుడు–

తే. తాత యట్టుల కీర్తిమై ధరణి నేలి
సుతు దిలీపుకు రాజ్యంబు సొంపు మీర
యేలుకొమ్మని నిజేఛ్ఛ యేగె వనికి
అంశుమంతుడు విభుదుండు ఆత్మవిభుడు

వ. దిలీపుండును తన తాత లధోగతులు కాకుండు నట్లు గంగావతరణము చేయగడంగియు పెద్ద యత్నంబు చేసియు విఫల మనోరధుండయ్యును –

క. అంచితుడౌ హరు వరమున
సంచితమౌ ఫల మనంగ సద్విధ గుణునిన్
గాంచె భగీరధు సత్సుతు
మించగ సత్కీర్తి పరుని మేధోద్ధతునిన్

వ. దిలీపుడు తన తనయు భగీరధుని అపార భూభార దురంధరుగా తీర్చి దిద్దుటయే కాక సర్వ ప్రాణి సమాదరణ వాత్సల్య హితుగా నొనర్చి తానుగూడను తమ పూర్వుల వలెనే విశ్రాంత తపోవన జీవనంబు గడుప నేగుట యును భగీరదుండు రాజ్యపాలకుండయి కులగురువుల వలన కపిలముని కోపాగ్నికి తమ తాత తరములవారు సాగరులుదగ్ధులగుట యెరింగి తండ్రి దిలీపుడు ప్రారంభించివిడిచిన గంగావతరణ సత్క్రుతి చేయనిశ్చయించుకొన్నవాడయి ఉత్తరాభిముఖుండై యేగి మహోన్నదుత్తుంగ సంగ హిమధర మేరు శిఖరములతోడను మహిత తుహిన బిందువర్షిత శ్యామాయ మానిత గలగల శబ్దసమన్వితములై జాలువారు జలపాతముల తోడను మహామహిమాన్విత పరమ హంసా నివహ పద్మాకరంబుల తోడను దేవగంధర్వ గీర్వాణ సిద్ధ సాధ్య విద్యాధర బుధుల విహార సంసేవ్యమాన నానారత్న రమ్య కందరముల తోడను బహువిధ విష సర్ప నాగ నివసన వల్మీకముల తోడను నానావిధ వివిధ పరిమళ పూవిలసన మధుప మధుకర తరు గుల్మ లతా వితాన సుందరో ద్యాన విహార స్థలముల తోడను ఘూక కాక శుక పికశాలికా పారావతా కోకిలాద్యనేక పక్షి కిలకిలారావముల తోడనూ సింహ శరభ శార్దూల భల్ల భల్లుక సుండాల కిటి గుర్ఘుర గోలాంగోల కోలాహలకిచకిచ నిస్వనముల తోడను మనోహర ఆహ్లాద భయంకరమైన హిమవత్పర్వతము నెక్కి–

క. ఉపవాసా దీక్షాపర
జప విధి నియమముల తోడ జాహ్నవి దేవన్

తపమొనరించె భగీరథు
డుపయుక్తము గాగ జనుల కూర్ధ్వపు గతికిన్

వ. బహువిధ శ్రేయోదాయకమగు నా భగీరథు తపమునకుమెచ్చి గంగామాత ప్రత్యక్షంబై నీకేమి కావలయు కోరుకొమ్మన కృతాంజలియౌచు భగీరదుండు-

క. పావన గుణ ధీరోద్ధతి
తా వేడె దిలీప సుతుడు ధన్యుడ ననుచున్
పావన గంగా మాతను
రావేడెను భువికి దేర రయమున తనతోన్

వ. అని వేడిన ఆ ఆకాశ గంగ వానికిట్లనియె.

క. నీదేరగ నాధాటికి
సాదరమున ఓపువాడు సర్వేశ్వరుడే
ఆ దేవుని వేడు మనగ
మేదురుడు భగీరదుండు మీరిన భక్తిన్

వ. పరమ శివుని ప్రార్ధింప ఈశ్వరుండు వానికి సన్నిహితుండై మెచ్చి సర్వ విధ జీవనాధారమ్మ్గా నీవు భూలోకంబునకు గంగావతరణము గావింపు. నేను గంగను నా జటాఝూటమున భరింతునన భగీరదుండు గంగను దూక ప్రార్ధించిన-

క. గంగా మాతయు కరుణతొ
పొంగుచు వడి సుడులు రేగ భూస్థలి కేగన్
లింగడు పటుతర ముష్టితొ
వంగక తన ఝూటమందు వాలుగ దాల్చెన్.

క. అది గని భగీరథుం డల
ముదమున గంగాధర హరు మోక్ష ప్రదునిన్
పదముల బడి పార్ధించెను
వదలగ నా గంగపార వసుధాస్థలికిన్

వ. ఇటులా భగీరదుని వలన ఆకాశగంగ భువిని అవతరించి సముద్రమును నింపుటయు పదునాల్గు భువనమ్ముల పారుచు పాతాళంబున గూడ ప్రవహించి సగర పుత్రుల రుద్రభూమి అస్తికలమీద పారుటచే వారు సద్గతి కేగిరనియును భగీరథ మహత్మ్య గంగావతరణమును రోమశుడు నుడివిన విని ధర్మరాజనుజ సహితుడై అరిగి యందందాతటి తీర్థమ్ముల స్నానంబులు సలిపి భూసురులం దనుపుచు హేమ కూటంబును ఋషభ కూటంబును జూపుచు-

క. ఇది విశ్వామిత్రుని యాశ్రమ
మది కౌశికి యనగ బరగు మహిమాన్వితమౌ
ఇది ఋష్యశృంగ మునివరు
ప్రాద పుణ్య ప్రదములనగ ననవుడు మునికిన్

ఋష్యశృంగుని చరితము

వ. ధర్మ తనయుండు మహాత్మా ! ఈ ఋష్యశృంగుని చరితము వినవలతు నన రోమశుం డతనికి యిట్లనియె. తొల్లి కశ్యప పుత్రుండైన విభండక మునివరుం డఖండిత బ్రహ్మచర్య తపం బనుసరించు చు ఒక్కనాడొక మడుగున స్నాన సంధ్యాధికము లొనర్చు నప్పుడు ఆ కొలని యొద్దున–

చ. బహువిధ వేష భాష లొగి భాసిల యూర్వశి నాట్య మాడుచున్
తహతహ బుట్ట జేసినది తథ్యము మౌనియు కామ వాంఛలన్
రహి గతి లాలసోక్తు లనురాగము పుట్టగ వెంబడింపనా
మహితల దర్భలం బడియె మౌన్వరు రేతము ఉద్భవోద్ధతిన్

వ. ఇట్లయ్యమోఘ వీర్యవంతములగు దర్భలం మేసిన మృగము గర్భము దాల్చిన అందు శృంగము తో నొక బాలుం డుదయించిన వానికి ఆ ఋషు లెల్లరును ఋష్యశృంగుడను నామమిడ విభండకు డు తనయునిగా బెంచి పెద్ద చేయుటయును–

క. మాన్యుండా ఋష్యశృంగుడు
అన్యం బెరుగక తపముల అడవుల లోనన్
ధన్యత చదువుచు వేదము
సన్యాసిగ బెరుగు చుండె సర్వోన్నతుడై

క. మట్టిని బట్టలుగా గొను
బట్టలు కట్టుట తెలియడు భామిను లసలే
పుట్టిన దాదిగ యెరుగడు
చుట్టును గల ఋషుల దప్ప చూడగ లేదో

వ. అట్టి యెడ అయ్యంగ దేశము అనావృష్టి దోష భూయిష్ఠంబైన జన నుతుండైన రోమపాదుని రావించి ప్రజానురంజకముగా యేమి చేసిన సువృష్ఠి పరిధమిల్లునన వారలాతనికి యిట్టులనిరి.

క. జనవర శృంగుడు కాలిడ
కనువిందుగ మేఘవృష్ఠి కాగలదనుచున్
వినుకలి కలదని పలికిరి
పనివారల బంప వారు పదపడి తేవన్

వ. ఆ పంచిన వారల లోని వార కాంతామణులం జూచుచు వారి తనూ విలాస విభ్రమముల కబ్బుర పడుచు ఋష్యశృంగుడు–

చ. మనమున మెచ్చుచుం తగగ మాన్యత జూపుచు స్వాగతించుచున్
వనముని బాలులార యిటు వచ్చిన మీరలు యెవ్వరంచునా
వనితల జూచుచుం మధుర భాషణ భూషణ సోయగాదులన్
మునిజన బోటులం గనుట ముగ్ధత గాదొకొ యిట్టి బాలురన్

క. అనుచును ఆశ్రమ వాకిట
వనచయ తరు శాఖలందు బాగగు తిన్నెన్
తినదగు పలహార మిడియు
సునిశిత తృణ సెజ్జ లందు సొబగుల నుంచిన్

వ. అంతనా వారకాంతామణులు ఆతని ఆదర ఆతిధ్య మర్యాదల కబ్బుర పడుచు–

క. కల్లా కపటము యెరుగని
చల్లని యా శృంగ మౌని చక్కని రూపున్
అల్లన జూచుచు ముగ్ధత
సల్లాపముల పలుకుల సాదర నయనల్

క. మెల్లన జేరుచు దరిదరి
ఉల్లము ఉప్పొంగు నట్లు ఉవిదలు శృంగున్
అల్లన జుట్టుచు మేనుల
చల్లడ బడ జేసిరంత తరుణులు వేగన్

వ. అట్లా యువిదల చెయిదముల కెంతయు విస్మిత వదనుండగుచు శృంగుడు చూచుచుండ వార లాతని దగ్గరి మా ఆశ్రమ మీ ఆశ్రమ ప్రాంతముల కెంతయుదవ్వని మీ ఆతిధ్య మెన్నడునూ మరువ జాలమని మా ఆశ్రమ మర్యాదలు స్వీకరింప రమ్మని కోరి వెడలుటయును–

క. అమ్ముని వరుడల తన డెం
దమ్మున తొట్రువలు పడుచు దయనీయుండా
కొమ్మల దలచుచు ఆ ము
ద్దుమ్మల పోదెసల జూచు కుదురది లేకన్

వ. అంతనాతని జనకుండు విభండక మునివచ్చి చూచుడు మాటాడకయున్న తనయుజూచి యేమి ట్లుంటివని అడుగ ఋష్యశృంగు డాతనితో తండ్రీ!

క. చల్లని ముదిత మనస్కులు
అల్లన ఆ దూర తీర ఆశ్రమ వాసుల్
చల్లని సోయగ చూపుల
జిల్లన పురుషార్ధ యుక్తి జిత మన్మథులున్

క. ఇటకుం వచ్చిరి ఔనన
పటుతర రూపాతిశయలు భరమగు ఉరముల్
కుటిలత శోభన కటితటి
ఝటిలత అల్లిన జడముడి చారు శరీరుల్

వ. మరియు వారుధరించినవి మణిమయ సువర్ణమండిత దండలుకాని రుద్రాక్షతావళములు కావు. వారలందు విభూతి చందనాగరు కస్తూర పరిమళ సుగంధ బంధురము. కాని యజ్ఞవాటికల వేల్చిన తులసి కాష్ఠ పరిమళము కాదు. వారి దుకూలములు దేవతా వస్త్రసన్నిభములు కాని నారలు కావు. వేయేల జనకా, వారు నాతో నొనరించిన అంగాంగనాలింగన పరవశత్వము యింతని యెంతని వక్కాణింతు. గుసగుస లాడుచు వారొనరించు మణిత స్పందన శబ్దమతి మనోజ్ఞమును మనోహర ములని వివసాత్ముడై పల్కుటయును విభండకుడు తన మనమున-

క. కనుగొన కాంతా జనముల
అనునయ వాక్చాతురిమ మహాద్భుతమౌచున్
మనసున దోచుచు పురుషుల
ననుసరణీయముగ జేయు నయతెంతనతన్

వ. తన కొడుకు కారడవుల నుండుట చేతకదాయింతవరకును స్త్రీ శరీరుల చూచియెరుంగకుండుట ఈ నాటికి కదా ప్రకృతి సహజంబగు స్త్రీ సంయోగాలింగనా సంపర్క వివశత్వము నొంది పురుషార్ధ చిత్తుండౌట అని సంతసించి వానిని జనావాస తీరముల కేగుటకు అనుగుణులైన ఆ స్త్రీ జనముల వెంట అంగరాజ్యమునకు పంపుట యును, రోమపాద ప్రభువులు ఋష్యశృంగుని సముచిత సత్కార ముల పుర ప్రవేశము గావించు కొనుటయును-

క. గ్రహ దోషమ్ములు బాయుచు
బహుళమ్ముగ మేఘ చయము వానలు కురియన్
మహిమోన్నత శృంగుడనుచు
మహదానందమును పొంద్రి మహి నా జనముల్

క. కాలిడినాడో లేదో
కాలగరు మేఘ వృష్టి కామిత మొప్పన్

నేలకు నింగికి ధారగ
చాలా కురిసెను జనులు సంబర పడగాన్

వ. అట్లు ఆ ఋష్యశృంగుని మహిమము జగంబున జను లెరుంగుటయును సంతసిల్లిన అంగ భూపతి తన కుమార్తె శాంతా దేవినిచ్చి వివాహము గావించి–

క. దంతావళములు కొలదిగ
సంతోషమ్మున వెలగల సముచిత నగలన్
యెంతో గో గణ సంపద
లింతింతలు అరణ మిడుచు యేర్పడ జెప్పన్

క. అల్లార్ముద్దుల శాంతను
ఇల్లాలుగ యేలుకొనగ యింతటి నుండిన్
ఇల్లరికపు టల్లునిగా
అల్లునికిడె రాజ్యమెల్ల అవనీపతియున్

క. అనవుండాతని కనియెను
వినశృంగుడు తనదు తండ్రి విజ్ఞత పలుకన్
జనవరు లేలగ జగతిని
ముని ధర్మము తపము గూర్ప ముదమది భువికిన్

వ. కావున–

క. ఇల నేలను నాకేలను
కలధనము తపము ఋషులకు కామిత ఫలముల్
తలకొని వెలయంగ నవుట
కలకాలము అడవులందు కామిత మొప్పన్

వ. అని ఆ రాజ్య భారమును రోమపాదులకే అప్పగించి ధర్మచారిణి యైన శాంతాదేవిని తోడ్కొని ధర్మాను వర్తనుండై ఆశ్రమ దీక్షాపరుండై తండ్రికడ కేగుటయును విభండకుడు కొడుకును కోడలు అంగ మహీపతి తనయ శాంతాదేవిని చూచి ఆనందమగ్నుండై నిజాశ్రమంబున సంతుష్టాంతరంగుడై వశిష్ఠున కరుంధతియు, అగస్త్యు నకు లోపాముద్రయు, మౌద్గల్యునకు నారాయణియైన ఇంద్రసేన యుం బోలె తనకు పరమ భక్తి యుక్తయై శ్రద్ధాసక్తత శాంత పరిచర్యలు చేయుచుండ ఋష్యశృంగు డు సుఖంబుండెనని చెప్పిన నాకౌశిక తీర్థంబున అందరును అభిషిక్తులై మున్నూరు నదీనద సంగమ స్థానంబైన గంగాసాగర సమగమంబున కేగి అట నుండి వైతరణి యను మహానదిని చూచిరంత రోమపాదుడు ధర్మరాజున కిట్లనియె.

క. అనఘులు జేసిరి జన్నము
అనుభాసురముగ సురమునులౌన్నతి దనరన్
మునుగం నీ తీర్థమ్ముల
జనవర శుభ శాంతు లొదవు జగతుల కెల్లన్

వ. మరియు నీ తీర్థము లాడిన వారు దేవయాన గతులగుదు రనియును ప్రతీతి గలదన భార్యాను జ సహితుండై ధర్మరాజు వైతరిణీ తీర్థముల జలకము లాడి బ్రాహ్మణులం దనిపి తదాశీర్వాదంబులు గొనుటయును తొల్లి స్వాయంభువుండైన విశ్వకర్మ యిట యజ్ఞమ్ము చేసి సువర్ణ దానంబు లనేకానేక భూసురుల దనిపి ఋత్విక్–

క. దక్షిణగా కశ్యపునకు
దక్షిణ దిక్భాగ మెల్ల ధార్బోయుటయున్
రక్షణ దక్షులు నృపులని
తక్షణమా నృపుల కిచ్చి తరలెను దివికిన్

వ. కావున యిచ్చుట పుట్టినను తపంబొనర్చినను మంత్రోపదేశంబును గొన్నను అవిమహావీర్య వంత మ్ము లగునని దెల్పుచు ఆయజ్ఞ వేది చూపుటయును ధర్మరాజు అనుజ సహితుండై అవ్వేది యందు పవిష్ఠుండై యుండ మహా వీర్యవంతమ్ములైన మంత్రోపదేశమ్ముగావించుటయును తత్మంత్రోచ్చారణ మహత్వంబున –

క. ఆ సుర గంధర్వ నివహ
మప్సర భామినుల తోడ ఆడెడు గిరులన్
భూసుర మునిగణ సహితులు
భాసురముగ పాండు సుతులు వసుగిరి కరిగిన్

క. అందుల మహా మునులరకు
వందన సాష్టాంగు లగుచు వసుధకు వంగిన్
పొందుగ పూజలు జరుపుచు
పొందిరి ఆశీశ్సు లెన్నొ భూభర దక్షుల్

క. పరమ మునివరద మీరలు
పర ధర్మ మహాత్ము విష్ణు పావన పురుషున్
సుర మునిగణ సంసేవితు
తరుణోప యతిని వరదుని దర్శింతురనిన్

వ. వినియుంటిమి. అమ్మహాత్ము దర్శించుభాగ్యము మాకును గల్పింప వేడుచుంటిమనిధర్మ నందనాదులు ప్రార్ధించుటయును రామాను చరణుండైన అకృత ప్రణుండను మునివరుడు వారల కిట్లనియె.

క. ప్రతి పున్నమి దర్శన మిడు
మతిమంతుడు జామదగ్ను మహనీయులకున్
అతి వైభవ తాపసులరు
ధృతిమంతులు మీరు గూడ దర్శింప దగున్

వ. అని పల్కిన ధర్మరాజానుజులు మహాత్మా! ఆ మహనీయ జామదగ్న్య చరితము విన దెల్పుడని అడుగుటయును–

జామదగ్నుని వృత్తాంతము

వ. వెనుకటి కాలంబుల కన్యాకుబ్జ ప్రాంత ఆటవిక కులపెద్ద గాధి యను క్షాత్రవునిబిడ్డ సత్యవతి అను కన్యను భృగు పుత్రుండైన ఋచీకుండను మునివరుడు వివాహమాడగోరి అడుగ–

ఆ. గోగజాశ్వ శతము కోమలి కుంకువ
పెండ్లి యాడనైన పెంపు మీర
కులపు ధర్మ మిదియ కూతును కొనిపోవ
ననుచు బల్కె గాధి అవని పతియు

వ. అంత నా భృగు తనయ భార్గవుడు నిజతపోవనంబున కరిగి జనకునానతి వరుణేంద్రుల ప్రార్థింప, వారు వాని తపస్సిద్ధి కెంతయు సంతసించి గోగజాశ్వశతము ప్రసాదింప వాని దెచ్చి యిచ్చి ఉద్వాహ మొనర్చుకొని యుండుటయును నాటంగోలె నయ్యదిగోగజాశ్వ తీర్ధమ్ముగా ప్రసిద్ధంబగుటయు భృగుడు కోడలి మంచితనంబులకెంతయు సంతసించుచు సుఖోపవిష్టుండై యున్నెడ కోడలు సత్యవతి వచ్చి మామ పాదములకు ప్రణమిల్ల భృగుండు నీకేది యిష్టంబు వేడుము. ఇచ్చెదనన–

క. సమ్మతి నాకొక కొడుకును
అమ్మకునుం కొడుకు నొకని అసమాన్గుణులన్
ఇమ్ముగ నుదయించ నగుచు
కమ్మని వరమీయ వేడ్డు కరుణుల రగుచున్

వ. అని వేడిన ఆమెతో నీకోరినయట్లు అగు. శుచిస్నానలై నీవును మీఅమ్మయు క్రమంబున మేడి మ్రానును అశ్వర్థంబును కౌగలింపుడని పల్కవారు సంతసించి ఆనంద పారవశ్యంబున అస్తవ్యస్త తారుమారు ఆలింగిత లగుటయు నది యెరింగిన భృగుండు ఆమెకు యిట్లనియె.

ఉ. జెట్టులు దిట్టలౌదు రిల జిష్ణుని భక్తులు భవ్య లెంతయున్
పుట్టును నీకు బ్రహ్మ కుల పూజ్యుడు పుట్టియు రాజసుండగున్

అట్టులె నీ సవిత్రికిని ఆఢ్యుడు పుట్టియు తాపసుండగున్
పుట్టుదు తారుమారుగను పూజిత మాతరు కౌగిలింతలన్

వ. అని పల్క నా సత్యవతి కృతాంజలియై రాజస క్షాత్ర గుణంబులు తన పుత్రునకుం గాక పౌత్రున కగునట్లుగా మామను వేడిన, అటులనే అగుగాకని ఆ భృగుం దనుగ్రహించి పల్కుటయును గర్భవతియై నవమాసంబులు నిండిన ఆమెకడుపున–

క. పుట్టెను జమదగ్ని భువిని
దిట్టడు వేదాధ్యయుండు దివ్యుడు దిశలన్
అట్టిటు జేయ సమర్థుడు
పట్టిన పట్టది విడువడు పావన గుణుడై

వ. అతడు ప్రశేనజితుడను రాజుకూతురు రేణుక అనుదానిని వివాహంబాడి దానియందు ఋమణ్వ, త్సుసేన, విశ్వావసు, రాములను వారి నల్వుర పుత్రులం బడయుటను, వారు తపోవనాశ్రమ విద్యా బుద్ధులందనరి పెరిగి పెద్ద యగుచు నుండ, జమదగ్నిఉగ్రతపోనిష్ఠల యేకాగ్ర నిశ్చల చిత్తుండై నుండ పుత్రుడు పూపత్ర వన్య ఫలాహారంబులం దేనరుగుడు వారి వెంట నీరు దేర రేణుక కడవం గొని దాపున గల సరోవరంబున కేగుడు, అట హృదయారవింద పూర్ణేందు తేజోవదను లగుచు గజగమన యానలగు భార్యలతో ఇంద్రసముండయి జలకంబులాడు చిత్రరధుడను గంధర్వపతి జేయు కామ మోహిత కార్య కలాపంబులం జూచుచు ఆలసించి యింటి కరుదెంచిన రేణుకం జూచుచు కోపోద్రిక్తుండై ఫలాహారంబులతో నప్పుడే వచ్చుచున్న తనయుల మొగంబై–

క. మానసిక వ్యభిచారిణి
జాణిది వధియింపు డనుచు జమదగ్ని యనన్
రేణుక వధియింపు డనుచు
తానుగ తన సుతుల కనియె తద్దయు వేడ్కన్

క. జననిని ద్రుంచుట ఘోరము
అనుచును ముప్వురు కొడుకులు అనుటయు తోడన్
జనకుని ఆజ్ఞాపాలనె
తనకని రాముడు పరశున తల్లిం దునిమిన్

వ. అంత నుపసమిత క్రోధుండైన జమదగ్ని–

క. తన మాటకు యెదురాడక
వినయుడవై పాపమనక వినిచిన పనినిన్

జనితోద్ధతి జేస్తి వనుచు
కనులార్ధత యేడ్చు సుతుని కనుగొని తృప్తిన్

క. మనుమని దీర్ఘాయువుగా
తనయుని దీవించి పలికె తనిగా వరముల్
జనవరు లెల్లరు మెచ్చగ
వినయుడ వేద్విత్తు ననుచు విజ్ఞుడ వనుచున్

వ. అంత నా జామదగ్నుండు పరమానందమగ్నుండై తండ్రికి నమస్కరించి –

క. అల్లారుమ్ముద్దుగ బెంచిన
తల్లిని జీవింప జేయ్యు దయతో ననుచున్
తల్లిని జంపిన పాపం
బెల్లను నను వీడునట్లు వేడెద ననియెన్

వ. జమదగ్ని తనయు చరితార్ధుగా వరములు ప్రసాదించి సౌమ్యుండై సుఖుడై యుండ, కొండొక కాలంబున–

ఉ. ఆహవ వీర్య వర్ధను డహస్పతి తేజుడు కార్తవీర్యుడన్
హైహయ రాజశేఖరు డహీన పరాక్రమ విక్రముం డిలన్
వాహిని వెంటరా దనుజ వన్య మృగమ్ముల వేటలాడుచున్
ఆ హిమ శైల సానువుల అట్టిటు గ్రుమ్మరి సేద దీరగన్

తే. వచ్చె జమదగ్ని ఆశ్రమ వాసుడయ్యు
మెచ్చ మౌనియు ఆతిధ్య మిచ్చుటయును
హెచ్చు మెచ్చుచు ఆశ్రమ హోమ ధేనువు
నిశ్చయంబుగ గొని పోదు నిమ్మనంగ

తే. అతిధి అభ్యాగతర్ధుల కన్న మిడగ
మౌని మర్యాద నిల్పెడు మహిత శక్తి
కామధేనువు దలపించు హోమధేన్వు
ఆప్త వస్తువు నాకున్న ఆస్తి యిదియ

వ. ఇది మా ఇంటి మహలక్ష్మి. దీనినెట్లు నీకిత్తునన కార్తవీర్యుం డలిగి –

తే. అవని పతులకు యెదురాడు నంతవాడ్వ
యేమి జేతువు యెదురొడ్డి యేకతంబ

ననుచు వీర్యుండు బలిమిమై ఆవు దూడ
నీడ్చుకొని పోయె సైన్యాల నెచ్చరించి

వ. అది తండ్రి వలన తెలిసి కొన్న జామదగ్నుండు కోపోద్రిక్త మానసుండయి–

తే. వీర్య వంతుని వెన్నంటి వేగ నేగి
శర పరంపర ధారలం శర్వు డగుచు
కార్త వీర్యుని సైన్యాల కాలరాచి
ఆవుదూడను గొనితేర అధిక శక్తి

వ. అంత కార్తవీర్యార్జునుని తనయులు హైహయయులు అనేకవిధ సైన్యములతోదండు వెడలిజామదగ్నుడు ఇంటలేని సమయంబున ఆశ్రమమును ముట్టడించి–

క. మునులం వెన్నంటి దరిమి
అన వధ్యుల నాడువార్ల అవమానించిన్
వనముల నెల్ల పెకల్చియు
జనితోద్ధతి జంపినారు జమదగ్ని మునిన్

ఉ. ఆ ముని పాద పద్మముల నాన్చుచు మూర్ధము తల్లడిల్లుచున్
మోమును మోదుకొనొచు మూర్ఛిల యేడ్చెడు తల్లి చూచుడున్
గోముగ నుండు వృక్షతతి గూలియు నుండుట కేమొ నంచ్మదిన్
రాముడు వచ్చె జూచె నల రాక్షస కృత్యము ఓర్వ వచ్చునే

వ. అని జామదగ్నుండు కోపోద్రిక్త మానసుండై –

క. సర్వోత్తము నాదు జనకు
గర్వితమతి జంపినారు కార్పణ్యమునన్
గర్విత నృపజాతి జనుల
నిర్వీర్యుల జేతు నిజము నిలలో ననుచున్

వ. ప్రతినంగొని తల్లి నూరార్చి ముయ్యేడు పర్యాయములు క్షత్రియ జగత్ప్రళయముగాదండెత్తి బ్రహ్మణ్యాస్త్ర విద్యా తేజంబు ముందు క్షాత్ర తేజమ్ము మొక్కవోవునట్లు నిర్జించి, దిగ్దిగంతరావలయ చతుస్సముద్ర ముద్రిత సప్తసాగరాంతర్గత భూరుహ మహీధర నదీనద భూవలయంబు నంతయును జయించి వివిధ విహితార్ధరుండై సమస్త జీవ సంతృప్తిగా అన్నదానాది సత్కారంబుల దశదానంబులు గావించి భూసురుల నెల్ల దనిపి దేవ బ్రాహ్మణ పూజాదివిధుల కంతరాయము రాకుండ మడిమాన్య అగ్రహారంబు లొసగి కశ్యపునకు ఋత్వి క్దక్షిణగా మిగిలిన సమస్తంబును దారబోసి యిచ్చి నిస్సంగుడై మహేంద్ర గిరి పర్వత గుహాంతర సీమ తపో నిష్ఠుడై యున్నవాడని ఆ పరశురాముని చరితమును

వినిపింప సంతసించిన వారలై పాండవులు యెల్లివచ్చు పౌర్ణమినాడు విష్ణు సన్నిభుండైనపరశురాము నిం ముని గణంబుల తోడన దర్శించుకొని పూజించి శుభ స్థితులు కండని అనిపించుకొని దక్షిణ దిక్మొగంబై జనుచు వారెల్లరును–

చ. త్రిభువన పావనం బగుచు తీర్థపు రాజము పుణ్య సీమయా
నిభమణి కాంతి శోభితము నిర్మల తోయ సమీకృతంబునై
అభవుని పాదపీఠి తనకాస్పదమౌచు చెలంగ నెంతయున్
శుభమగు నాత్రయంబకము చూడగ నేగిరి ధర్మరాజుతోన్

వ. అదియె ఆ దక్షిణగంగ యనంబడు గోదావరీ నదీమతల్లి పుట్టిన పుణ్యసీమ. అచటనాసికా త్రయంబక గోదావరీ ప్రభవతీర్థమ్ముల వారెల్లరును స్నానము లాచరించి గో భూ హిరణ్య దానముల బ్రాహ్మణుల తృప్తులంజేసి అక్కడనుండి పశ్చిమోత్తర తీరదేశంబులంగల అగస్త్య తీర్థమ్మునం గ్రుంకు లిడి అందు తొల్లి అర్జునుండు తీర్థయాత్రాసమయంబున చేసిన విధివిధానం మరల చేసిన అనేకానే క దానంబులం ప్రశంసించి కొనియాడుజనానీకంబుల కని వినిసంతసించుచు సముద్రతీర్థములకుం జని ప్రభాస తీర్థమున పదురెండుదినమ్ములు పంచాగ్ని మధ్యంబున జల వాయు భక్షణముల ధర్మ రాజు తపం బాచరించుటయును–

క. అల తీర్థాటన పరులై
పలు బాములు పడి యడవుల పాండులు రాగా
బలభద్రానుజ యాదవు
లలవారల జూడ వచ్చి అనుగుణులగుచున్

క. చీరాజిన ధారులగుచు
ధీరాంగన కృష్ణ తోడ దీన్వదను లవన్
వారల జూచిన తోడనె
వారిజ శుభ నేత్రులైరి వసుదేవ సుతుల్

వ. అప్పట వారలం జూచిన వారెల్లరును వలవల యేడ్చుచుండ బలరామకృష్ణులు వారల నెల్ల హితోక్తుల నూరార్చుచు ధర్మానుజ ద్రౌపదుల అక్కునంజేర్చుకొని వెచ్చనూర్చుచుండ ధర్మతనయుండు వారల కుశలంబడిగి–

క. అలసియు కృశులై గూడను
వలసిన వారలు కనుపడ బాధలు మరచిన్
పలు తెరగుల మాటాడుచు
కులవర్ధను కుంతి మధ్య కొడుకు విధంబున్

క. మునుకొని వాసవు పనుపున
అనుజార్జును డింద్రసభకు అరిగిన దాదిన్
తన తీర్థాటన విధులను
వినిపించెను గాథలెన్నొ వినిన విధమ్మున్

వ. అంతయు విన్న బలరామ కృష్ణులు అచట నున్న వారలందరు విన–

క. అధములు ధృతరాష్ట్ర సుతులు
అధమాధమ శకుని తోడ ఆడిన ఆటన్
విధిరాతని తలపోయుచు
నిధనులునై పాండు సుతులు నియతులు అవుచున్

క. అడవుల పండ్రెండేడులు
పలుబాధలు పడుచు నుండ్రి భార్యతొ గూడన్
విడనాడియు నిజ రాజ్యము
కడు ధీరులు అస్త్ర విద్య ఘన విజయులునై

క. మగువతొ అడవుల వెంబడి
సగజచ్చియు బతుకుచున్న సద్గుణవంతుల్
తగు విధమారసి ధర్మజు
జగధీశుగ జేయ వలదె చర్చింపు డనన్

వ. అనిన బలదేవునకు సాత్యకి యిట్లనియె.

చ. అనుపమ వీర్యవంతులు ననంత బలాఢ్యులు మీర లుండగా
వనముల వెంబడిం శుభులు వాసవు నంతటి పాండు నందనుల్
దినములు వెళ్లబుచ్చు టతి దీనత కాదొకొ దుర్విధందుమా
కనివిని యుండ లేదిటుల కౌరవ దుష్టుల కంత ముండదే

ఉ. నీవును నీదు సోదరుడు నిచ్చల జూచుడు నెల్ల లోకముల్
చేవ లుడింగియుం దుదకు చేతులు జోడిచి వేడుచున్మదిన్
చేవది మూడెరా యనుచు చచ్చుచు లేచుచు మూర్ఛ దేలుచున్
కావని కూయకుండుటది కర్జము కాదుగ కౌరవాళికిన్

క. హలమును బట్టి వ్రేటిడ
కులిశము మించిన వడువున కూకటి లేచున్

విలవిల లాడుచు కౌరవ
బలమంతయు నొక్క పాట పడదే భూమిన్

వ. అదియునుంగాక వృష్ణి యాదవ కేకయ శృంజయ పాంచాల భోజాంధక వీరు లెల్లరు కృష్ణాను మతులై యుద్ధంబున ఉధృతిం జూప ధార్తరాష్ట్రులు నూర్వురును భీష్మ ద్రోణకర్ణ కృపాశ్వద్ధామాదుల సైదము నిలువం గలరే. ధర్మరాజు భార్యానుజ సహితుండయి సమయాబ్దంబులు సల్పి వచ్చు దనుక అతిరధ మహారధుండైన సుభద్రా నందనుండైన అభిమన్య కుమారు నఖిల రాజ్య రక్షకునిగా నియ మించి యుండుదమనిన సాత్యకి పలుకులకు అనుకూలముగా వాసుదేవుడు ధర్మరాజుతో నిట్లనియె.

క. కౌరవ దుష్ట చతుష్టిని
పోరిన పాంచాల వృష్ణి భోజ సునందుల్
మారణ హెూమ మొనర్తు ర
వారిత భీమోధృతులయి పాపం బనకన్

వ. అనవిని ధర్మ నందనుండు వసుదేవనందను మొగంబై బావా!

ఉ. మీదయ మాకు గల్గుటది మేదిని శాంతికి మూలకందమీ
యాదవ వృష్ణి భోజవరు లాయత శక్తుల అండదండలున్
కాదన కాదుగాని విను గౌరవ వృద్ధుల సమ్ముఖమ్మునన్
ఆదట పల్కినట్టి విధమారయ ధర్మము దప్పినట్లగున్

వ. అనుచు వారల ననునయవాక్యముల నూరడించి గ్రమ్మరించుటయును, శాంతచిత్తులై యాదవో ధృతులు పాండు నందనుల వీడ్కొని యేగుటయును, అట సోమ మిశ్రితతోయ పయోవృష్ణి యందు తీర్థ స్నానములు తీర్చుకొని యుండ, నందు ధర్మరాజుతో రోమశుండు యిట్లనియె.

క. మును యిట నృవుండను నధిప
పనిజేసెను యజనములను భార్యాహితుడై
అనిమిషపతి తృప్తుండయి
దనుజుల మడియింప జేసె తద్దయు వేడ్కన్

వ. మరియును తొల్లి గయుండిందు ఏడశ్వమేధ యాగంబులొనర్చి అసంఖ్యానక ధన ధాన్య గోభూ హిరణ్మయ వస్త్రాది దానముల ఋత్విక్యాజక ఋషి మునివరభూసురోత్తముల దనియింపజేసి అక్షయ ఇంద్ర లోకముల సుఖంబులం వడసె. ఇబ్బయోష్ణి యందు తీర్థములాడిన దేవసాయుజ్యము లొందు దురన ధర్మరాజానుజు లందు కృతస్నానులై యేగుచు వైఢూర్య పర్వత ప్రాంతములకు జేరునంతట నిదిత్రేతా ద్వాపరసంధి కాలంబున సంయాతి యజ్ఞవేదిక యనియును మరియు భృగు పుత్రుండైన

చ్యవనుండిట సంయాతి కూతు సుకన్య అనుదాని వివాహంబై వాని యజ్ఞమ్ముల నింద్రునారాధింపక యాశ్వినులు సోమపీథులం చేయుటాదిగా గల వృత్తాంతమును దెల్పుచు రోమశుండిట్లనియె.

సుకన్య చరిత్ర

క. భృగుసుతుడా ఋషి చవనుడు
పగలనకను రాత్రనకను పట్టుగ వెయ్యేం
డ్లగు తప మొనరించెను వరు
సగ యమ నియమ నిరతి శయ సాహసు డగుచున్

వ. ఇప్పుడు చ్యవనుండు తప మొనరించుచుండ కాల గతి ననుసరించి ఋతు అయన సంవత్సర ములు క్రమగతిని గడచు కొలందిని–

క. చ్యవనుం డున్నెడ గుబురు ల
డవి గతి పుట్టలును పెరిగె తీగలు డొంకల్
చ్యవనుని దేహము గప్పుచు
చివరంటను మూసివైచె చెదలును పెరిగిన్

క. ఒడలది జీర్ణంబయ్యును
మిడుగురుల యట్లవి కండ్లు మెరయుచు నుండన్
కడు ధృడమౌ శల్య గతుల
నడయాడుచు జీవుడుండె నయ యోగమునన్

వ. అంత కొంత కాలమునకు సంయాతి అను రాజు తన సతీ సుత సపరి వార సహితుండై మృగ యా వ్యసనుండై వనముల దిరిగి దిరిగి డస్సి యందలి రమణీయ సరోవర తీరమున విహరింప నేగి న నాతని కూతురు సుకన్య తన యిష్టసఖీ జనంబుల తోడ అందందాట లాడుచు ఆయాకు జొంప ముల మధ్యనున్న ఒక వల్మీకమ్ము మాటున దాగుకొనిఅటునిటు చూచుచు ఆ కలుగుల అంతర్భాగ మున–

క. మణిమయ విద్యుత్కాంతుల
పుణి పుట్టల మణులదేమి పాములు కాకన్
ఫణి మణులా యివి రెండును
మణి కాంతులు జిమ్ముచుండె మంజుల మౌచున్

వ. వానిం బొందవలయు నను కోరికతో ఆపుట్టం ద్రవ్వింప శల్యగత శరీరుండైన చ్యవనుంజూచి విభ్రమ సంభ్రమాశ్చర్యములు ముప్పిరిగొన పాదాక్రాంతయై చేతులుజోడించి–

ఆ. నాదు తప్పు గావు నయవిధి యోగేంద్ర
యెగ్గు జేస్తి నీకు యెరుక లేక
అనుచు బోయి దెల్పె అప్పుడ తండ్రికి
తల్లడిల్లు మదిని దయయు గదుర

వ. అంత సంయాతి భార్యలతో గూడ పరుగు పరుగున వచ్చి యోగి వర్యులకు పాదాక్రాంత నమస్కారములు ఘటియించి మహాత్మా! నా తనయ తెలియక చేసిన తప్పును మన్నింపు డనియు, తప్పు చేసిన దానికి దండన తప్పదు కావున ఆ దండన ఆమెకు బదులు నాకు విధింపుడనియు ప్రార్థింప, చ్యవనుండు రాజుం జూచి–

ఆ. మణుల రీతి వెల్గు మహనీయ కన్నుల
జూచి పొందు కోర్కె చోద్య మగుడు
పుట్ట ద్రవ్వి చూడ పొంపిలి విభ్రాంతి
కావ వేడె నన్ను కనుల జూచి

వ. కావున దీనిం పరిగ్రహించుటకాని వేరు దండన లేదు అనగా సంయాతి సుకన్యనుఆ ముని నాధునకు సపర్యలు చేయ నియమించుటయును సుకన్యయును యెంతో ప్రీతితో దాని కొడంబడి చ్యవనునికి వలయు రీతిని నడచుకొనుచు నున్నెడ–

క. అరుదుగ దిగి వచ్చాశ్విను
లరు దేరియు భువికి రావ ఆదర బుద్ధిన్
విరివయసున నున్న యువిదె
వరీ సుగుణ శీల యంచు భరమౌ మదితోన్

వ. వచ్చి తమ్మెరిగించుకొని అమ్మా ! నీ వెవ్వతె. వెవ్వరి దాన వెవ్వని బిడ్డవని యడుగ,ఆర్యా ! నేను సుకన్య నామధేయను.

క. చ్యవన మునినాథు భార్యను
సువిదిత సంయాతి సుతను సురసన్నిభు లీ
భువి కేతెంచుట పరమము
తవదీయుల రాకె వరము తథ్యము కరుణన్

వ. అనవిని వారలు కరుణించి, అవ్వా యిట్టి రూప విభవమ్ములు వడసి కామ్య భోగ భాగ్య రూప భావ్యుండయి మునివృత్తి నున్న వృద్ధు భార్గవుని వరియించి తరియింప నెంచితివే, వెఱ్ఱివి కావె. నీ యౌవనం బెల్లను వృధ చేసికొంటివి. ఇంకనైనను నీ వయోరూప యౌవ్వనములకు దగిన వానిం వరియించి సుఖంబుండు మన, వారి పలుకులు సహింపక సుకన్య–

క. మహిత గుణులు మీర లిటుల
అహితమ్మిటు నాకు బల్క నౌనే తమకున్
దుహిత సమానను కానా
మహిమోన్నత మాననీయమౌ మాటగునే

క. అనియుం చ్యవనుకు నంతయు
వినిపించెను వారి మాట విహ్వాల యగుచున్
దీ తనియుచు గుణమతి బుద్ధికి
ననియెం నా చ్యవనుడంత అటులే జేయన్

క. పతి యానతి గొని నేగియు
అతి వినయత చ్యవను మాట ఆశ్విని సురకుం
అతి సుందరు వరు దేవను
మతి మంతిగ వినిచె నపుడు మగువయు ప్రీతిన్

వ. ఆ మాట వినిన అశ్వినీ దేవతలు అపుడాకొలని జనుటయును భార్గవుండునువారివెంటనే అక్కొలని నీరంబుల గ్రుంగుటయును నవ యౌవన రూపసంపదల నలరారుచుఆ కొలని బైటకు వచ్చి ఆశ్విను లిరువురును మా యందొక్కరిని వరియింపుమని పల్కుటయును అంత మహా పతివ్రత యగు నా సుకన్య ఆ పల్కిన యిర్వురం అశ్వనీ దేవతలుగానూ మౌనముగా నున్న మూడవ వరుడు తన మునినాధుని గా గుర్తించి వాని దరికి జేరుటయును ప్రీతి నొందిన ఆశ్వినుల కతి ప్రీతుండైన చ్యవనుం డిట్లనియె.

చ్యవనుడు ఆశ్వినుల సోమ పానార్హులుగా జేయుట

క. సురలార యేను మీ కత
న రమ్యా తర యౌవనుడ నైతిని కావన్
సుర లోకాధిపు సరిగా
సుర భాజన సోమతార్హ చేసెద ననియెన్

వ. అని పల్కిన ఆశ్విను లెంతయు సంతసించి తమ లోకముల కరుగుటయును. సంయాతి తన అల్లుడు చ్యవనుడు నవయౌవన తొందినాడని విని సంతసించుచు అల్లునకును కూతునకును తగు వస్తువాహన చీనిచీనాంబర సంబార ఆభరణ భూషణంబులం గొనిదేవ నాతని గౌరవించి చ్యవనుం డిట్లనియె.

క. జేయుము మామా యజ్ఞము
సోయగముగ నాశ్వినులను సోమార్హులుగా

చేయింతును వేదవిదుడ

ఆయత్తము కమ్ము లెమ్ము అభ్యుదయంబౌ

వ. అనిపల్క సంయాతి యాగార్థంబుగా సంబారమ్ములు గొనితేర చ్యవనాచార్యత్వంబున యజ్ఞము గావించి–

క. అందుల నా యాశ్వినులరు

పొందగ సోమం బిడగని పోతరి యగుచున్

ఇంద్రుడు అడ్డము దెల్పగ

ఇంద్రా తగదీకు ననుచు యెంతయు పలుకన్

వ. ఇంద్రుండు కోపించి వజ్రాయుధముం పైకెత్త కనుల జూచుచు–

క. కుంభించి తపో శక్తిని

శుంభధ్వనితో చ్యవనుడు సుహృదు డగుటన్

స్తంభింప జేసె ఇంద్రుని

స్తంభముగ నిల్చునుండ సదయులు జూడన్

వ. అంత ఇంద్ర సఖ సురసంఘం బంతయు దిగివచ్చి చ్యవను తపోధనోద్ధతు నొద్దకువచ్చి కృతాం జలులై ప్రార్థింప ఇంద్రుని యెప్పటియట్ల అనుగ్రహింప ఇంద్రుడు తనతప్పుమన్నింప వేడుకొనియును భార్గవుని తపో మహత్వంబున అప్పటి నుండియు ఆశ్వినులుగూడ సోమపానార్హత కలిగిన వారలగు టయును.

క. ముని నాథు డలుక వీడుట

అనిమిష లాదిగ జనములు అవనీంద్రుండున్

మనముల సంతోషింపను

అనిమిష రాజేంద్రు డంత అరిగెను దివికిన్

వ. నాటంగోలె అది సోమపాన తీర్థమునా బరగెనని రోమశుండుచెప్ప అందు కృతస్నానులై పాండు నందనులు ఆనందజనకమ్మగు నరనారాయణ విధాతృతపోవన స్థానంబె దేవఋషి నివాసంబైన సైం ధవారణ్యమున శీతల చంద్ర సరోవరమ్మున శుచిర్భూత స్నానులై యతిథులం బూజించుటయును అటనుండి పోవంబోవ యమునా నదింగని నంత రోమశుండు వారల కిట్లనియె.

మాంధాతృ చరిత్రము

క. కమనీయుడు మాంధాత్రుడు

యమునా నది తీరమందు యజ్ఞము లెన్నో

సమసాటిగ జేసి నిలచె
అమరేంద్రుని సముడునౌచు అవనిని యేలెన్

వ. అననా మాంధాత్రు చరితము వినగోరుచున్నామన రోమశుండు–

తే. తొల్లి యిక్ష్వాక యువనాశ్వ దోర్బలుండు
ధర్మశీలుండు పుణ్యుండు ధార్మికుండు
అశ్వ మేధమ్ము లొనరించె అధిపు డిచట
పతితు డాయెను సంతాన ప్రాప్తి లేక

వ. రాజ్య భారము నంతను బుధ విబుధులైన మంత్రి సామంతుల కొప్పగించి భార్యా సహితుడై భృగు నాశ్రమంబునకు జని వాని సేవించిన న య్యువనాశ్వుం కరుణించిభృగుండు పుత్రకామేష్ఠిం జేయించి మంత్రపూత జల పూరితంబైన కలశంబు వడసి కొద్దినిద్రల దనుక దానిని రక్షింప ఋత్విజుల నియమించి యుంచె. అయినను–

తే. శ్రాంత జీవులు జాగర్ణ శ్రాంతు లగుచు
నిద్రవోయిరి. అందరు నిద్రవోవ
దప్పి కాగను నారాజు దగ్గరున్న
కలశ మంత్రోదకముల కమ్మ ద్రావె

వ. దానిం దెలిసి భృగుడు విధికృతం బెవ్వరికిని తప్ప తరము కాదు. అయినదేదో అయినది. నీ భార్య కీదలంచిన సంతాన జలంబులు నీవుద్రావితివి. కావున నీకు గర్భంబై ఇంద్ర సమోపేతుండు ఉదయింప గలడు పొమ్మన. పెద్ద కాలంబైన కొన్నాళ్లకు యువనాశ్వు వామ భాగమును చీల్చుకొని బాలార్క తేజోవంతుండగు బాలకుం డుదయింప వానిం జూడ ఇంద్రుండు వచ్చి ఆశీర్వదించుటయును, ఇంద్రు వచనంబున ఆబాలునకుమాంధాత్రు డనునామమిడుటయును, చాల చిన్నవయసుననే–

చ. వినికిడి మాత్రనన్ సరిగ విన్నది విన్నటు అప్పగించుచున్
మనమున వల్లె వేసినటు మాతృక భావము విప్పి చెప్పనౌ
అనువగు రీతులం వివిధ ఆయుధ విద్యల నభ్యసించుచున్
కనివిని యుండ మింత ఘను కారణ జన్ముడు యీతడన్దగున్

వ. అనునట్లు వేద శాస్త్ర పురాణాదులందును ధనుర్వేదము నందునుగూడ ప్రావీణ్యముసంతరించుకొనుటయును అందరియందున పూజనీయుడై ఆ ఇంద్రునిచే మన్ననలొందిఇంద్ర సింహాసనస్థుడై మహామణిమాన్విత మహీతల రాజ్యమున కభిషిక్తుండగుటయును,అభేద్య కవచ దివ్యాస్త్రములం బడయుటయును ఒకప్పుడు వర్షాభావమున భూతలజీవనులు తల్లడిల్లుసమయమున ఇంద్రునితో తగవుగొని వరుణుని మర్ధించి మేఘముల పిండినట్లు భూతలమున పయోధార లొలికించుచు నియ్యది

ఆ ఘనుడేలిన కురుక్షేత్రము.ఇందలి సరస్వతీ తీర్థమున సోమకుండను రాజర్షియజ్ఞములు చేసి నూర్వురు పుత్రుల బడసెనన నది యెట్లన దెల్పు మన రోమశుండు వెండియు వారల కిట్లనియె.

సోమక రాజర్షి చరిత్రము

వ. ఇందు సోమకుండను రాజర్షి మహాయాగ మొకటి యొనరించి జంతు వనువానిం బడసె. ఆ సోమకుని భార్యలు నూర్వురును ఆ జంతుని తమ పుత్రునిగా భావించి పెంచుటను ఐనను ఒక్కగా నొక్క సుతుని యెట్లు నమ్మి యుందునని మంత్రి పురోహితాది ఋత్వికులతోనన వారలందరు యెట్ల ని ఆలోచించుచుండ నొకఋత్విజుడు యిట్లనియె.

క. మంచని చెడ్డని యెంచక
వంచన యని దలప కుండ వాచా జరుపన్
మించిన కొమరుల నూర్వుర
అంచిత నీ భార్యలందు ఆందెదు వనియెన్

వ. అదేమన నీ సుతు జంతుం బలి పశువుగా వధియించి తద్వపాక్రవ్య హవ్యములఅవ్యవాహనున కాహుతిగా హవ్య మొనరించునదియన వల్లెయని ఆ ఋత్విజుండు సోమకునిచే అనుజ్ఞాపితుండై–

క. బలి పశు వొనరించి సుతుని
బలిమిని వపనంబు దీసి బహుముఖ అగ్నిన్
తలకొని వేల్చగ పాపము
వలవల యేడ్వగను యువిద వసుధను దొర్లిన్

క. తద్ధూపాఘ్రాణమ్మున
సద్యో గర్భంబులు దాల్చి సవతులు నూర్వుర్
అద్దిద్దని నిండ నెలలు
ముద్దుగ సుత శతము బుట్టె ముదమలరారన్

వ. అంత కొంత కాలంబునకు నూర్వురు కొడుకులును సమర్థులై పెరిగి పెద్దవారైన తరి ఋత్విజుం డు పరలోక గతుండై ఘోర నరక కూప బాధలు ననుభవించు చుండుటయును తదనంతరమున కొంత కాలమునకు సోమకుండు దేహత్యాగముచేసి అమరలోకగతుండై యేగువాడు ముందర నరకా లోకన పరుండయి యాతన లనుభవించుచున్న ఋత్విజుం చూసి యిదెట్లన వానికి ఋత్విజుం డిట్ల నియె.

క. వినుడని యెందరొ అననీ
తనయుని బలిపశువు జేస్తి దయ లేకుండన్

అనుచితమగు నార్త్విజ్యం
బొనరిచి కడు పాపినైతి పోతరికంబున్

వ. ఇప్పుడీ బాధలు ననుభవించుచుంటినన సోమకుండు యమధర్మ పాలు కడ కేగి–

క. నా కారణముగ నీతడు
చీకాకుల నొందుచుండె చేకొని పోవన్
నాకానతి యీయు మటుల
లోకోత్తర ధర్మ పాల లోకస్తుత్యా

వ. అని ప్రార్ధించి అతని పాపము పరిసమాప్త మగుడు అనుజ్ఞాపితుండయి తనతో కూడను సుర లోకమునకు గొంపోవుటయును మరియు నిందు తొల్లి ప్రజాపతి సహస్ర వార్షిక సత్రయాగమును అంబరీషుడు యజ్ఞములం చేసి కర్మఫల ప్రాప్తి నొందుటయు నహుష చక్రవర్తి దశపద్మ సంఖ్యానక ధనంబుల సదస్యుల యాజ్ఞకుడుగా పూజించుటయును సార్వభౌమ స్థానంబొందియు యయాతి యొనరించిన సవనంబుల కింద్రుండు వచ్చెననియును రామ హ్రదంబిది నరనారాయణాశ్రమంబిది ప్లక్షావతరణంబను యమునా తీర్థంబిది. దేవతలు ఋషులును చేసిన సారస్వత యాగ తీర్థమనియు ను దేవర్షి సంవర్తుని చేత రక్షిత స్థలంబనియును భరతుడిందు అనేక యజ్ఞ యాగాది క్రతువులం జే సిస్వర్లోకాలోకనుండయ్యె ననియును నీవును ఇందు కృతస్నానుండ వవుచు సర్వలోక వీక్షనుండ వౌ దువనిన ధర్మ తనయుండు అనుజ సతీ తోడన ఆ తీర్థమున పుణ్య స్నానాదులాచరించి భూసురుల సత్కరించి ఆ రోమమహర్షి కిట్లనియె. మహాత్మా! నీ దయ వలన ఇంద్రాదుల ప్రోద్బలము పెంపున–

చ. ఇహపర సాధనాను విధి ఈశ్వర పెన్నిధి పుణ్య సీమలన్
మహిగల సర్వతీర్థముల మక్కువ మున్గియు పావనోద్ధతిన్
అహిచర పర్వతావళుల అన్నియు గ్రుమ్మరి తృప్తి నొందితిన్
సహజత మీ కృపా గరిమ సద్గుణ వందిత వందనంబనిన్

క. పదునాల్గు భువనంబులు
పది దిక్కులు నెల్ల లోక పరిధులు నాలో
నొదిగున్నటు విధమాయెను
మదియందున నీదు కరుణ మహనీయ గుణా

క. జూచితి నా యింద్ర సుతుని
జూచితి నా యింద్ర సముని చోద్యం బగుడున్
చూచితి నా పార్థానుజు
చూచితి నా సవ్యసాచి చూపులు పండన్

వ. అనిన ధర్మరాజునకు వెండియు రౌమహర్షి యిట్లనియె.

క. ఇది దక్షాధ్వర తీర్థ
మది సారస్వతి నదినద మెంతయు శుభమౌ
ఇదియా ఇంద్రుని హిమనగ
మిది మాన్య సరోవరాంచ్ల మిధ్యాసరసౌ

వ. ఇది మహా మహితాభ్యుదయ మహానది. ఇందుప్రజాపతి యజ్ఞ వేదిక కలదు.ఇందుదేహ త్యాగ ముచేయు మనుజులు అమరులు కాగలరు. ఇది సిద్ధ తీర్థంబిందు లోపా ముద్రాగస్త్యుల పాణిగ్రహ ణము జరిగె.

శిబియను రాజర్షి చరిత్ర

వ. ఇక్కొలనున ఉమాసహితీశ్వరుండు స్నానమాడు గావున మునులకు దర్శనమిచ్చునుగావున పర మపూజనీయము. అరుంధతీ సహితుండై వశిష్ఠుండు యిందు వసించె.

క. ఇక్కొలను మహా మునులకు
యెక్కుడు ఆస్పదము గాన యెవ్వరు గానీ
ఇక్కడ తీర్థం బాడిన
మక్కువ ముక్కోటి తీర్థ మాడిన విధమౌ

వ. ఇది భృగుతుంగంబను పర్వతము. ఇది తొల్లి శుచీ నరపతి శిబియనువాడు యజ్ఞవిధి నిర్వహిం పుచుండ అతిధులుగా వచ్చి అడిగిన వారికి లేదు కాదు అనకుండా అన్నదానాదులర్పించుచు సంతృ ప్తుల జేయుచుండ ఇంద్రాగ్నులు శిబి దానగుణమును పరీక్షింప శ్యానకపోతములై శ్యానము తరుము కొనిరా ప్రాణభయమున కపోతము వాయువేగమనో వేగముల ఆకాశ గమనమున అలసి సొలసి యాజ్ఞికుడైన శిబి తొడను వ్రాల, దాని అలసత్వమును వీక్షింపుచు అభయ ప్రదానముగా దాని తల నిమురుచుండ డేగ దానిం జుట్టిపట్ట నుంకింప దానిని విదలించిన రాజుతో శ్యాన మిట్లనియె.

తే. అతిధి అభ్యాగతర్థుల కన్న మిదుచు
నోటికందిన హార మిదియ అనుచు
అత్యాసతో నున్న అవల ద్రోయ
అన్న దాతవు పాడియా అధిప నీకు

తే. సత్య ధర్మాభి రక్షణ సదయ హృదయ
అన్న పానాల జీవించు అవని జీవి
నీకు తెలియని ధర్మమ్ము నాకు అగునె
నాదు ప్రాణమ్ము దీన్నిచ్చి నన్ను గావు

వ. భూతదయకు మించిన ధర్మము వేరు లేదు. సర్వభూతములును అన్నమయ ప్రాణులు. ఇ క్కపో
తి నాకువిధి విహితంబైన ఆహారము. కావున దీన్ని నాకిచ్చి రక్షింపు మన విని శిబి యిట్లనియె.

తే. ఆర్త రక్షా పరతత్వ మన్ని కంటె
మిన్నయై యుండు తులదూచ యెన్నగాను
దీన జీవుల గాపాడ దేవ హితము
హార మిత్తును నీకగు హార మెన్న

తే. ప్రాణ రక్షణ త్రాణమై పరుగిడొచ్చి
ఉద్ధరింపు నన్నన్గ ఊరు వ్రాలె
ప్రాణి యేదైన నొకటేను పట్టి విడువ
శరణు జొచ్చిన దీన్ని చావ జేయ

వ. నీవు పక్షి వయ్యును వేద చోదిత పరమార్థ మెరిగిన దానవై పలికిన ధర్మ మూర్తివి.శక్తుల యుం
డియు శరణాగత రక్షణ చేయకుండుట కడు పాపము. ఆకలిదీర్చుట కంటెవేరు పుణ్యములేదు. కావు
న నీకు వలయు ఆహార మిచ్చినచో రెండు విధముల ఫలమునూ దక్కును. వేరు మాంసముల వండి
న యింత కంటె రుచి కరమగు ఆహారము నీకొసగెద దీనివిడువు మనిన అనియెనా శ్యానమిట్లు.

తే. వేరు మాంసమ్ము యిడనొచు వేడ నేమి
అదియు పాపమ్ము కాదొకో అధిప దెలియు
యిచ్చు గలదేని నీ మాంస మిమ్ము నాకు
తెలియ సద్ధర్మ తత్వమ్ము తేట పడగ

క. అనవిని ఆ శిబి యప్పుడు
వినుతింపగ పరమ ధర్మ విషయము దెల్పిన్
నను కావగ దిగివచ్చిన
అనుపమ తేజో హితుడవు ఆప్తి దొరంగన్

వ. అని పల్కి శిబి తన ఆత్మ గతమున పక్షి యిట్లు పల్కుట మహాద్భుతమని నన్నుకాపాడ, పరీక్షిం
పనెంచిన దైవసన్నిభ మూర్తిమత్వమని యెంచి సత్యధర్మ నిష్ఠాపరుడు కావున అప్పటి కప్పుడు తగు
వారల నియమించి తన తొడ మాంసమును కోసి తూచి యిచ్చుటకు వలయు తులాదండమును క
త్తులం దెప్పించి–

క. తుల యంద కపోతి నొకట
వలనుగ కూర్చుండ జేసి పరశున తనదొ

విలువగు కండల రెండవ
తుల యందు కోసి బెట్ట తూచుచు రావన్

క. తూగదు సరిగా దండము
తూగెడు బరువై కపోతి తుల కిందకు గాన్
తూగగ శిబియే రాగను
ఆగుము రాజా వగవకు మనియా పక్షుల్

క. కననై నిజ రూపమ్ములు
గొని తనువైనను ధారవోయు దాతవు నీవౌ
దని యింద్రాగ్నులు పలికిరి
మనుమని సత్కీర్తి తోడ మన్వంతరముల్

వ. అని ఆశిర్వదించి చనుటయును. ఈ నదీ తీర్థము పుణ్య ఫలప్రద మనియును మరియు నిది యౌద్దాలకియైన శ్వేతకేతు తపోవనంబనియును సరస్వతి మానుష స్త్రీ రూపిణియై శ్వేతకేతును సేవించె ననియును. అల్లుడు మేనమామయైన అష్టావక్ర శ్వేతకేతు లిందు ఉగ్ర తపోధనులైరనియును చెప్పిన రోమశ మునితో ధర్మరాజు అష్టావక్రు చరిత్రము వినవలతు నన–

అష్టావక్రు చరిత్రము

వ. తొల్లి యేకపాదుడను మునివరుడు తన విధ్యాభ్యాసన కాలమ్మున సుజాత యను కన్యను వివాహమాడుటయును తపోధనార్థియై ఘోరాటవుల కేగుటయును అందనవ రతము వేదాధ్యయన శిష్యులతో కాలము గడుపుచుండుటయును సుజాత గర్భిణియై కడుపున నున్న అర్భకుండు తండ్రితో నీవిట్లు దివారాత్రములు విడువక శిష్యుల అధ్యయన సంపన్నుల గావించుటవలన వారి మనసులకు నిద్రయు విశ్రాంతియు లేక జడమతులుగా మారుచుండిరనియునన యేకపాదుండు ఆ ఉపాలంబనము (దూషణము) సహింపని వాడై ఆ గర్భస్త శిశువును అష్టావక్ర గతులజన్మింపుమని శపియింపుగా పల్కుటయును భార్యపురిటి ఖర్చులకై ధనార్జన కొరకు జనకమహారాజు ఆస్థానమున కేగి అతని ఆస్థాన పండితులతో ప్రతిఘటించి ఓడియు జలప్రవేశము చేసి యుండక పోవుటయును అంతట ఆ సుజాత కడుపుననున్నవాడు ఆష్టావక్రుడుగా పుట్టుటయును ఉద్దాలకపుత్రుండైన శ్వేతకేతును యేకపాదుని కుమారు డష్టావక్రుండును చిన్ననాటి నుండియు పుష్కర కాలము శయ్యాన్న పానాదుల సమవయస్కులై ఒక్కటిగా నుండి పెరుగుచు ఉద్దాలకు నొద్ద చదివి విద్యావంతులగుటయును పెరిగి విద్యాధికులై నంతట అష్టావక్రుండు తండ్రి సంగతి తల్లి నడిగితెలుసుకొని రాజ యోగియైన జనకమహారాజ సభకు పోయి ఆతని ఆస్థాన పండితుడు తన తండ్రితో సహా పెక్కురు పండితుల క్రింద పరచి నంది

యనువానిని సర్వశాస్త్ర పారంగతునితో పదిదినములు సభామధ్యమున వాదోపవాద ప్రతివాదనము లు జరిపి వేద వేదాంగ న్యాయ ధర్మ నీతి ఛందో తర్క వ్యాకరణ ఖగోళ గణిత జ్యోతిష వైశేషిక మీమాంశ మొదలగు చతుష్షష్టి కళావిషయముల యందును తనపేరు నిలుపు కొని తండ్రిని అతని తో పాటు ఓటు వడియున్న వారల నెల్లరను స్వస్థుల గావించుకొని వచ్చినవాడని చెప్పుచు ఇందు భరతుడు రాజ్యాభిషిక్తుండాయెనని, తొల్లి యింద్రుండు యీ నదీతీర్థ జలోప స్పర్శన భాగ్యమునలక్ష్మీ ప్రాప్తుండయ్యె ననియును,ఇది మైనాక పర్వతము. ఇం దదితి పుత్రార్థియై తపము జేసె. ఇది ఋషి దైవతంబను కనఖల నగంబు. ఇది గంగానది. ఇందు సనత్కుమారుడు సిద్ధిపొందిరి. ఇది భరద్వాజా శ్రమము. ఇందు భరద్వాజ సుతుడు విద్యా గర్వంబున అపగత జీవుండయ్యెనన, అది యెట్లనిన రో మశుం డిట్లనియె.

యవక్రీతుని చరితము

వ. భరద్వాజ పుత్రుడైన యవక్రీతు డనువాడు గర్వితమతియై వర్తింపుచు భరద్వాజ మిత్రుడైన రైభ్యుడను మునివరు కుమారుడు అర్వావశుని గురుమతి విద్యా భక్తి ప్రపత్తులకుం కినిసి చదువకయనే సర్వవేదములు శాస్త్రార్థములు బడయుదునని తపంబొనరించుటయును ఇంద్రుండు గ ురు శుశ్రూషతో నేర్చిన విద్యలే సత్ఫలితము లిచ్చు ననియు ఇతరత్రా గ్రహించనైనవిద్యలు పరామార్ధ ముకాక మదము మత్సరములను పెంపొందింపజేయుననియు ఆ ప్రయత్నము తగదనియు మానుకొ మ్మనియు చెప్పినను వినక గర్వించుట వలన రైభ్యుని కోపాగ్నికి నశించుటయును, అదిగని భరద్వా జుడు పుత్రశోకము భరింపనేరక దేహత్యాగము గావించు కొనుటయును, అర్వావశుని తమ్ముడు పం ావశుడు ఒకవేకువ సంధి చీకటిగా నున్న సమయమున యెదురుగా వచ్చు తండ్రి రైభ్యుని జంతువు గా నెంచి ప్రాణభయమ్మున వధించుటయును, నిజము దెలిసికొని తాను చేసిన అకృత్యమును అన్న అర్వావశున కెరింగించుటయును అతడు తన తపోమహిమచే దేవతలమెప్పించి వారిఅనుగ్రహమున తన తండ్రి రైభ్యుని భరద్వాజుని ఆతని తనయుడు యువక్రీతుని పునర్జీవితులుగా గావింప జేయుట యును గరుముఖముగా గ్రహించిన విద్యలే సఫలీకృత సిద్ధి నొంది జయ నగుననియు పల్కుటును, రైభ్యుడు గురుశుశ్రూషా సంతోషకరుండై బ్రహ్మ జ్ఞానోపార్జితుండు కావున వాని తపోమంత్రములు ఫలవంతము లగుటయును, ఇది యవక్రీతు నివాసం. ఇందు వసించుటచే దురిత నివారణ పొంద గలరనియును ఇది మందరనగంబనియు ఇందు ఆయుధ ధరులగుచు అష్టాశత సహస్ర గంధర్వ కిన్నెర కింపురుష సుపర్వులు సురేంద్రుం గొల్చిరనియు కైలాసగిరి యిక్కడికారుయోజనముల దూర ము కలదనియును, అందు కుబేరుండుండు ననియును చెప్పిన పాండవులు కృత సమాధిస్థితులై వారి నెల్లర జూచినంత అంతక నందనుండు భీమున కిట్లనియె.

క. దుర్గమ మార్గంబగు నీ
దుర్గారణ్యములు గడుప దుస్సహ మగుడున్
మార్గాయాసం బుడుగగ
దుర్గా దేవిం గొలుచుచు ద్రుపదాత్మజతోన్

వ. ధౌమ్యుల వారును రథాది ఇంద్ర సేనయు విప్ర వరులును నీవును నీ తోడు సహదేవుండును యిట కొందరు విశ్రమింప నేనును నకులుడును రోమశ మునీంద్రుల ఆదేశములం గొనుచు యీ పర్వత తీర్థములం సేవించి రాగల వారమనుటయును, అంత దనుక నీ కృష్ణ గాచుకొనియుండు అతి జాగ్రతతో అనిన–

చ. నిను విడి యుండ నేరమిట నిక్కము నీవును మమ్ము వీడియున్
జనుటది యింతకుం సబబె చక్కని చిక్కని మాని జొంపముల్
కనుగవ ధృక్కులుం జొరని కారడవెంతయు రాక్షసోద్ధతిన్
జనసుత తీవ్ర తాపమగు సందియ మందకు మానసంబునన్

వ. ఈ అరదమ్ముల బోవనిమ్ము. కాదేని ఇంద్రసేనాదుల నిందెందేని బెట్టిపోవుదమనిన రోమశుండి ట్లనియె.

క. అరిగెద మందర మచ్చుట
సుర రాజేంద్ర సము పార్థు శూనుని విజయున్
వరవందితు నీ తమ్ముని
కరుణాలయు కాంచ నగును గంధమాదనమున్

వ. అనిన అందరు సంతసిల్లి అర్జునానుగమన దర్శన కుతూహలురు గంధమాదన గిరి కేగువారలు ముందర అనేకప హయ రథ సనాథంబై అపార కిరాత బల సంకులంబైనదాని పుళిందాధిపతి యైన సుబాహుపురంబును గని అందువానిచే పూజితులై తమరథసూత గజాశ్వ నివహంబుల నింద్ర సేనాది భృత్యుల నెల్లర సుబాహు నొద్దం బెట్టి పాదచారులై రోమసానుగములై గంధమాదన దిశగా యేగువారలు.

ఉ. ఎప్పుడు కాంచనౌ నరుని యేవిధి యింద్రుని సన్నిధానుడై
చొప్పడ నున్నవాడొ యని శూర శిఖామణి దేవకన్యలే
తప్పుడు దోవలం గరుప ధన్యత గూర్చుకు మానవేంద్రుడై
ఎప్పట రాగలండనుచు యీప్సిత కోర్కుల మానసంబులన్

తే. మధుర మంజుల గంధమాదన నగము
పరవశించెడు విరి శోభ బహుళ గతుల

మనసు లువ్విళు లూరించు మదన పడగ
మధుపటీగల ఝుంకార మృదుల గీతి

క. నానానేకపు పరిమళ
నానావిధ గుల్మ పుష్ప నవ నవ కాంతుల్
నానా మృగ పక్షి కులము
లానందా నగపు శోభ అద్భుత మెంతోన్

పాండవులు గంధమాదన పర్వతమున కేగుట

వ. ఆ గంధమాదన పర్వత రమణీయతను తిలకించుచు ఆనందాతిరేకంబున ముందునకేగుచుండ–

క. అతి వేగాన్విత వాయువు
ధృతి యెగయగ మింటి కెగసె తరువులు గూలన్
అతివృష్టియు తోడగుటయు
గతి తప్పుచు పాండు సుతులు కడు భీతిలగాన్

క. ఉరుములు మెరుపుల తోడను
ఉరుధారల కుంభవృష్టి ఉర్విని గురియన్
గిరి శిఖరులు ధరణి కొరుగ
విరివాగులు పొంగె పవను వేగపు గతికిన్

వ. ద్రుపద రాజతనయ అతలాకుతలమైన అడవి దారిన నడువ లేక ఒక తరు మూలమున కూల బడుటయును ధౌమ్య ధర్మజ సహదేవు లొక్క చోటను రోమశుండును నకులుండును బ్రాహ్మణులు ఒక్కచోటను భీముండు గదా ఖడ్గ పాణియై ద్రుపద రాజతనయకు ఊతగా నుండుటయును కొంత వడికి గాలివాన ఉధృతి తగ్గిన అందరును ఒక దెసకు జేరుకొనుటయును ద్రౌపదిం జూచి ధర్మరాజు దుఃఖితుండగుచు–

ఆ. ఎరుగ దిట్టి నేల యెన్నడు నడచియు
పదము యెర్రనౌగ పద్మ ముఖియు
పదన పల్లవమ్ము వాడియు చిక్కియు
అడుగు వేయలేక నడయుడుంగ

ఆ. పట్టు పాన్పు మీద పవ్వళించెడు చాన
కటిక రాతి నేల కాయమేర్చి
నిద్ర కొరుగుచుండనే చూడలేనయో
చీర చెరుగు మీద చేయి మోడ్చి

వ. అని మనోవేదన పరుండయిన ధర్మనందనుని సమయోచిత పలుకుల ధౌమ్యులాదిగాగల వార లూరార్చుటయును ధర్మరాజు భీమునిం జూచి-

క. అడుగు నడువ నేర దతివ
కడు డస్సియు సోషగొట్టె గమనాయాసన్
అడవుల గడచుట యెట్లో
వడిగొను నీ బలము లావు పదపడి దేవన్

వ. అనవిని ఆ అనిల నందనుడు తన-

క. మదిలో దలచె ఘటోత్కచు
విదితాసుర వీరు ఘోర విజయోత్సాహున్
అదనని రా రమ్మనగా
ముదమలర హిడింబి సుతుడు మోదితు డగుచున్

క. వచ్చెన్వెచ్చగు వేడ్కతొ
సచ్చరితుడు పితృవరులకు సాష్టాంగపడిన్
అచ్చెరువంద స్వజనము
నిచ్చ యెరింగింపు డనుచు యేర్పడ పలికిన్

వ. మ్రొక్కిన తన అగ్రసుతు హైడింబుం జూచుకొనుచు ముదంబున కౌగలించుకొని భీముండు వానితో-

క. అమ్మో నీకీ యువిదయు
దెమ్మా నడువంగ లేదు ధీరుడ మాతో
నిమ్ముగ నీ భుజములపై
గ్రుమ్మరె యీ రాతి నేల ఘోరాటవులన్

క. అనవిని యాతం డనియెను
కననేరరు దారి తెన్ను కానలయందున్
కొనిపోవుదు మిమ్మెల్లర
వినువీధుల నేగనగుదు వివరింపు డనిన్

వ. ఘటోత్కచుండు ధౌమ్యుల తండ్రుల ద్రౌపది మాతను తానెత్తుకొని మిగిలిన భూసురోత్తముల నెత్తికొనం తనరాక్షస బలంబులంబంచె. రోమశమహర్షులు సిద్ధగతింనేగుదేరగగన మార్గమున వారెల్లరును నరనారాయాణాశ్రమంబైన బదరికావనాంతర సీమల-

క. అతి శీతల మృదు మధురిమ
 మితిమీరిన కమ్మదనపు మిళితపు గంధం
 బతి గూర్చెడు పుష్ప తరుల
 శిత శోభల హిమ నగంబు చేరుట తోడన్

వ. మహర్షుల ఆదేశానుసారము దిగి రాక్షస కృత స్కంధావారమ్ముల విడియించి సుర సిద్ధ సాధ్య విద్యాధర గంధర్వ ముని సేవితంబయి దివిజ గంగామాతయైన భాగీరదిం జూచి నమస్కరించి అందు కృతస్నానులై మీది తరముల పెద్దలకెల్లరకును జలతర్పణములొసంగి నియమ నిష్ఠాపరు గుచు సమాధి యోగంబున హిరణ్య శిఖరమును బిందు సరస్సులంచూచి ఆరువాసరంబు లందుండఅందొక్కనాడు గంధమాదనపర్వతారూఢులై–

క. పవమాన నందనుండును
 దోవదియుం గిరుల నెక్కి తూర్పుగ నేగన్
 పవమాన చరిత మగుచును
 భవ సుందర పుష్ప మొకటి పడె వార్చెంతన్

వ. ఆ సౌగంధికా పుష్ప రమణీయ కాంతిమయ కమనీయ మృదు మధుర సుగంధికా సౌరభముల కచ్చెరువందుచు ద్రుపదరాజ తనయ మోదితయగుచు యియ్యది అపూర్వ పుష్పమ్ము, మిగుల మనోహరముగను నయనానంద కరముగను నున్నయది. ఇట్టి పూవులం పూజించిన కాదె పురుషోత్తముడైన మాయన్న కృష్ణ పరమాత్మ సంతుష్ఠ డగుట, యీ నా కృష్ణ నామము ధన్యంబగుటయు నన విని భీముం డన్నగారి అనుమతంబున–

సౌగంధికా పుష్పముల దేవ భీముడు గంధమాదన నగారోహకుండగుట

క. అమితపు తేజో సౌరభ
 గతి నేగెడు వాయు సుతుడు గంధన గిరికిన్
 అమితోత్సాహత పదపడి
 ధృతి దూలుచు పూలుదేవ తద్దరి వేడ్కన్

వ. దారిం జనువాడు తన కడ్డం బగుచున్న లతాగుల్మంబుల ద్రోయుచు శిలామయ శిఖరంబులం దాటుచు మద మత్త వారణ సింహ శార్దూల భల్లూకాది వన్య మృగ తండముల హుంకార ఝుంకార నాదమ్ముల ద్రెళ్ల నేయుచు పవమాన గతి ఆ సౌగంధికా పుష్ప సౌరభ ఆఘ్రాణము జేయు దెస యేగుచు–

క. సుర సిద్ధ సాధ్య విద్యా
 ధర కిన్నెరు లాటపాట్ల దనరారు వనాం

తర గంధమాదన నగము
దరి జేరుచు నుండ నొక్క తరుకోటరమున్

వ. నివాసంబుగా యేర్పరచుకొని దారి కడ్డంబుగా తన–

క. పది బారల వాలము నిడి
ముదివయసౌ వానరాన్ని ముచ్చట గనియెన్
కదలక మెదలక కూర్చొని
ముదమారగ రామనామ మొనరుచు నుండన్

వ. అంత నా భీముండు దాని రామనామ పారాయణ పరత్వమునకు విస్మితుండగుచునీవెవర, యిట్లేల యుంటివని ప్రశ్నింప నా వానరముఖుండు తన్మయత్వమున రామనామమునే జపించుచు బదులాడకున్న దానికిం కినిసి ఆతని మేల్కొల్ప గిరిగహ్వరమ్ములు మారుమ్రోగ భీముండు సింహనాద మ్మొనర్ప, అది విని అక్కపి కులసంజాతుండు ప్రతిగా తానునూ కదలకయే భూమ్యాకాశములు ప్రతి ధ్వనింప శత సహస్ర సింహనాద ధ్వనిప్రకటింప, భీముండు చలితుడై యిట్టి పెను ధ్వని ప్రకటించిన వాడు యేతన్మా త్రుడు కాక తప్పదని మది దలంచి అక్కోటరము వద్ద కేగి చూచి యిది ఒక ముసలి కోతియని యెంచి దర్పంబున నీవెవ్వర, దారికడ్డంబుగా వాలముంచి నిదురించుచున్నావు. తోక ముడిచి దారి యిమ్మన, వాయునందనుండంత భీముని జూచుచు నాయనా! నీవెవ్వండ. వేల యీ దారి జనుచున్నావు. నీ దారి కడ్డంబులు తొలగించ కొనలేని వాడవా యని ప్రశ్నింప, కోపోద్రిక్తుండై భీముడు–

క. వాలము దీయుము లేదా
లీలగ పై కెగయ జిమ్ము లే లెమ్మనగా
కాలము పెక్కగు వాడను
వాలము తొలగించ్కు పొమ్ము వలనగు పగిదిన్

క. లేవను నడువను లేకనె
యీ వనమున నుంటి చిరము యీ పగిదిటులన్
ధీ విభవుడ అడ్డు పడిన
నా వాలము దాటలేని నరుడవు కావే

వ. దాటి బొమ్మని పలుకు చుంట్వి. నేనంతసమర్థుండనా! కురురాజన్య పాండుభూపతితనయుండ. వాయు నంశ బుట్టిన భీముండ.

క. దాటుకొని పోవు టుచితమె
మేటి గుణము కాదు సుమ్మ మెచ్చరు పెద్దల్

దీటగు వారల కడ్డము
చేటని యెరుగంగ వౌర చెప్పిన వినవో

వ. అనవిని ఆ పండుకోతి కదలకనే రామా! రామా! యేమీ బలయుతుని మాటలు. నీవే నను కాపాడువాడవు. నీవేరామా. అని పల్కుచుండ కుపితుండై భీమసేనుండు ఆకోతిమూతి వానరునితో–

క. రామా రామా అందువు
వేమారులు చెప్పు చున్న వినబడ లేదా
రాముడు నీ యజమానుడ
ధీమాగా వాలమేచి తిరముగ నుండన్

వ. అన నా వానర ముఖుండు భీమునితో –

క. శ్రీ రాముడు నా దేవుడు
యే రాయిడి యైన దొలగు యేతరి నున్నం
ఆ రాముని రారాజన
నీ రాయిడి తొలగ గలదు నిజముగ సుమ్మా

వ. అని రామనామ జప తత్పరుండై యుండ ధర్మజానుజుండు కోపముతో వాలము దీసి దారి యిత్తువా లేదా యని హుంకరింప ఆ వానరంబు–

క. నే ముదుసలి వానరుడను
ధీమంతుడ వగుదువేని తిప్పుము తోకం
భీమోద్ధతి కదుప గలవె
సామాన్యుల వశము గాదు సాహస కృత్యా

వ. అని రెట్టించి చులుకనగా బలుక భీముడు రోష వంతుండై ఆ వానర ముఖు వాలమును–

ఆ. తొలుత నొక కేల తొలగింప జూచియు
గోటి బిళ్ల పగిది గోట మీట
చేత గాక బలిమి చేతుల రెంటను
పట్టి యెత్త లేక మట్టి కౌఁగ

వ. ముందునకు నేలంబడి మూతి దుడుచుకొని తన గర్వ సర్వస్వంబును వీడి –

ఆ. మాట మంతి మాని మర్యాదగా లేచి
కోతి గాదిదియని వాత సుతుడు
రామ బంటు అగుట రామాంజనేయుండు
అనుచు బోయి మ్రొక్కె అన్న యనుచు

వ. నిన్నెరుంగనేరక నేనాడిన మాటల తప్పిదములు మన్నింపుమని వేడుటయును,అంతఅంజనీమాత సుతుండైన ఆంజనేయుడు భీముని చేరంజీరి ఆదరంబున నీవు నాఅనుజుండవు. మానవ మాత్రులు జొరనేరని యీపుణ్య భూముల కేల రాగలిగితివి. యేకార్యమపేక్షించి వచ్చి నాడవు. యెరిగింపుమన ఇప్పుడీ ద్వాపర యుగంబున వాయు నంశ జన్ముండైన భీమసేనుండు ఆంజనేయనితో యిట్లనియె. మహానుభావా! రామ ప్రభు భక్తిపారాయణా! నీకు తెలియని దేముండును.

తే. దివిజు లంశుల జన్మించి తేజ మొప్ప
పాండు పుత్రులమై ప్రబలియు పాప జూద
మాడి ఓడిన ధర్మాన అడవు లంటి
దిరుగు చుండియు తీర్థాట్న దేవ హితము

తే. సర్వ తీర్థాలు సేవించి సమత గూర్చు
క్షేమ హిమశైల బదరికా క్షేత్ర భూమి
సరసిజా పుష్ప సౌగంధ సౌరభమ్ము
దేవి ద్రౌపది కోర్కెమై తేగ వచ్చి

వ. ఇట యీ విధి మిమ్ము కన్గొని కృతార్థుండనైతి. నాదుజన్మంబే జన్మంబు. ధన్యుడనైతి.నా కార్యం బీడేరి నట్లే. అయినను అలనాడల రామకార్యార్థివై నూరు యోజన పర్యంతమైన పారావారమును ఒక్క ఉదుటున లంఘించిన నీ అనుపమ తేజో రూపమును జూపి నన్ను ధన్యునిగా నా మనోరథం బీడేర్పమని ప్రార్థింప–

తే. కాలగతి రూపాలు కలుష మగును
నాటి రూపమ్ము జూపంగ నగునె యిపుడు
సత్య ధర్మాలు వేర్వేర సమయ ఫక్కి
నిత్యమయ్యును రూపొందు నేపు మీర

వ. అనిన యుగధర్మ ఆచారగతులు దెల్పుమని భీముడు అన్న ఆంజనేయుని అడుగ–

క. కృతయుగ జగతిని సత్యము
అతి మధురిమ ధర్మ దృష్టి అంతట సమమై
ధృతి నెగడి చతుర్పదముల
అతులితమౌ దైవ శక్తి అలవడి యుండున్

వ. చాతుర్వర్ణముల వారును ఒకటిగా వేదాధ్యయన యోగ్యులుగా నిష్కామ్య కలాప సంపత్తుల తుష్టులై పుణ్య లోకములు పొందెదువారు. అందసూయా ద్వేష వ్యభిచార అభిజాత్య మద మత్సర సంతాప వ్యాధి క్షయంబులు లేకయుండు.

క. మలి యుగమున ముప్పాతిక
పాలు ద్వాపరమున అర్ధ భాగము యిలలో
కలి యందున పావు ఒకటి
తుల తూగుచు ధర్మ వృత్తి తొణికిస లాడ్చున్

వ. వేద విహిత కర్మంబుల యందును సత్య ధర్మ నిరూపిత విషయము లందును తమతమ యిష్టాను వర్తనులై మనోవైజ్ఞానిక శాస్త్ర విద్యా విజ్ఞానులై నిష్ణాతులగుచు సుఖ జీవను లగుచు తమోగుణ ప్రధాన నియుక్తులగుచు వివిధోల్లాస విధ్వంసక యుద్ధ బుద్ధు లగుచు స్వార్ధ పరులగుచు అర్ధకామంబుల యందనురాగాసక్త చిత్తు లగుచు తెలియకనే నిష్కామ కృతములై తాముచేసిన యే అత్యల్ప దానాది ధార్మిక వర్తనముల కైనను బహు విధ ఫల ప్రాప్తులు బొందుచుండుదురని అయ్యయా యుగ వర్తన ప్రకారంబులు నుడివి వెండియు ఇష్ట సిద్ధి నొంద గలవన, అన్న ఆంజనేయునికి నమస్కరించుచు నీవానాడు రామకార్యార్థివై లంక కురుకు నాటి రూపంబు జూపవే యని ప్రార్థింప-

ఆంజనేయుడు తన పూర్వ రూపమును చూపుట

వ. భీముడు అత్యద్భుత సంభ్రమాశ్చర్య భయ విహ్వలుండగు నటుల హనుమ-

క. తరు గిరి శిఖరము లన్నియు
అరికాలికి కింద నుండ అంబర మంటిన్
హరి వామను డెదిగి నటుల
విరి పొంగెను భీము డడల వింతగ జూడన్

వ. భూ నభోంతరాళములు నిండిన ఆ కపివరు రూపంబప్పుడు ముల్లోక భయంకరమైనుండ జూడ నేరని భీముని కనులు మూతపడుటయును అది గనిన హనుమ తన యెప్పటి రూపము ధరియించుటయును, భీమ కరములు మొగిచి వాని కిట్లనియె.

క. అన్నా తెలియక అంటిని
కన్నెత్తియు చూడలేము కనివిని యుండం
నిన్నుం బంధింప తరమె
అన్నా లంకాధి నేత కసురేంద్రునకున్

వ. అనిన వానినతి ప్రీతిపూర్వకముగా కౌగలించుకొని నీవచ్చిన కార్యముసఫలంబగు.ఆ సౌగంధికా సరోవరము యక్ష రాక్షస రక్షితంబై దేవతా భోగ్యంబైయుండు. దేవతలు భక్తి యుక్తులుకాని సాహసక్రియా సాధ్యులు కారు. ధర్మార్థ శుభ కార్య చరణంబున దేవతలు తృప్తు లగుదురు. కార్యసిద్ధి నొందగోరు వారు సాహసంబు విడిచి సామోపాయులగుటలెస్స. నిగ్రహానుగ్రహ శక్తి యుక్తుండైన రాజ

శాసనంబును ప్రజలు పాటింతురు. నీవు నిగ్రహశక్తుండవు. కావున నీకసాధ్యము లేదు. నీకు హితం బుగా అమిత్రులై మీకెగ్గొనర్చిన ఆ అంధరాజు పుత్రులనందర నిప్పుడ కట్ట కట్టి నీ పదముల ముందు పడవేతునన, భీముండు అన్నా! నీకిది యేమి పెద్దపనియా. తృటిలోచేయంగలవాడవు. అయినను నీదయ మాకుండుట వలన ఆ దుర్మదాంధుల యుద్ధంబున నేనొక్కంరుండ నిర్జింపగలవాడ ననిన భీమునకు హనుమ యిట్లనియె. అనిలో–

క. ఊర్జిత బల సత్వంబుల
నిర్జింపను పగతు నెర్ల నిర్భయ శక్తున్
అర్జును రథ టెక్కంబున
దర్జాగా నుండి జూతు తద్దయు వేడ్కన్

వ. అన్న ఆంజనేయుని ఆలింగనాను యుక్తుల విగత శ్రముండై భీమసేనుండు–

క. అది యిది యేమని చూడక
కదియుచు సింగపు కొదమల కానన లందున్
మదమత్తత యెదురొచ్చిన
విదలింపుచు యేన్గునైన విశదపు బలుడై

క. అడవుల పర్వత శిఖరుల
నడ నెడ యెక్కుచును దిగుచు నరిగెడు దారిన్
కడు డస్సియు ఉస్సురనుచు
కడకా సౌగంధి వనము కాంచిన వాడై

వ. సంతోషాంతర్గత మానసుండై ఆ కనకమయ సౌగంధికా పుష్ప మకరంద సౌరభముల నాస్వా దించుచు మద మత్త గజయాన సదృసుండై తస్సరోవరము దాయం బోవువాని సౌగంధికా–

క. వన రక్షక రాక్షసులరు
విను వీధుల వచ్చి జుట్టి వీరుం భీముం
మనుజాధిపు డెవడోయని
అనుమానము తోడ దారి కడ్డం బగుచున్

క. ఇదియా యక్ష కుబేరుడు
సుదతులతో కూడి యాడు శోభన కరమౌ
విదితంబగు సౌగంధిక
పదికుడ వెవ్వండ వీవు పదపడి రావన్

వ. దీని తీరంబున దేవఋషి గణంబులు దేవతార్చనలు చేయుచుందు రిందుల జలంబు లమృతో

పమానంబులు. మరియు మణిమయనాళంబులై అపూర్వ సౌరభమ్ము లెగజిమ్మెడు కనకకమలమ్ము లంగల్గుటం జేసి యక్ష రాక్షసక్షౌహిణీగణ రక్షితంబగు దీనిదరిజేరు టుచితంబు గాదు. వెడలుండన భీముండు–

తే. పాండవాన్వయ ప్రభవుండ పాండు సుతుడ
ధర్మజానుజ భీముండ తరలి వస్తి
కోర్కె యిల్లాలు ద్రౌపది కోరి పలుక
కనక సౌగంధి కమలాలు గడగి దేవ

క. ఎవ్వరి వీ వన భూములు
ఎవ్వరి వీ కొండ ఝురులు ఎవ్వరు దెలియన్
ఎవ్వరి దీ భూత చయము
నవ్వుదు రెవరైన గాని నాదను మాటన్

క. యక్ష కుబేరుని దయయును
వీక్షింపగ నేల నయ్యె యివ్వన చయముల్
రక్షక దక్షుండెవరో
యీ క్షణమున దేల వలయు యే విధి నైనన్

క. గుత్తగ కొనినటు పలుకగ
ఉత్తమమగు గుణము కాదు ఉత్రాధిపుకున్
ఉత్తమ కులమౌ క్షత్రియ
సత్తము జూపించి గొందు జలజము లెల్లన్

వ. అని ఆ సౌగంధికా వనము జొచ్చి అందలి కనక కమలంబులనేర్చి అమృత తుల్యంబులైన సర సీజలంబుల గ్రోలి అజేయ బల సంపన్ను భీము గదా దండమ్ము ధాటిని ప్రతిఘటించి నిలువ నేరక యక్ష రాక్షస గణంబులు–

క. పరుగిడి పారి కుబేరుకు
వర వీరుడు వాయు సుతుని బలమది దెలియన్
పరిపరిగా పొగడి పొగడి
సురు లెల్లరు యేకమైన స్రుక్కగ జేయన్

క. తధ్యము నిజమని దెల్పను
మిధ్యా వచనుం ద్వగుచును మెచ్చుచు మది వై
రుధ్యము వీడి యపుడు సా

రథ్యుల బంపియును భీము రథమున దేవన్

వ. అట్లు మిత్రంబైన యక్ష రాజు కుబేరునితో సంతుష్టుడై యుండునెడ–

క. వడి దాకుచు యెదురొడ్డగ
పుడమిం బడె రుధిర ధార పొక్కగ నెంతో
పడి జచ్చిన దివి సీమల
వడి జూచియు ధర్మజుండు వాయుజు కొరకై

వ. ఇది భీమోత్పాతముతప్ప వేరొండు గాదనితలంచి ద్రుపదాత్మజ యిచ్చిన పూవువంక జూచుచు–

క. ఏడీ భీముడు ఒక్కట
పోడే మనలందర విడిచి పూవుల దేవన్
వాడే పోయెన నీవే
వేడితొ దనుజాన్తక సీమ వేగమె చెపుమా

వ. అని కలవర పడ పాండవాగ్రజుని వంక జూచుచు ప్రియంపడి నాథా!

క. ఎందుండి ఎగిరి వచ్చెనొ
ఎందెందో యుండ వలయు యిట్టివి సుమముల్
ఇందీవరాక్ష పూజకు
సందేహింపకనె దెండు సరగున అంటిన్

వ. అని పల్కి సౌగంధిక ఎగిరివచ్చిన దిశా ముఖముగా ఉత్తరదిశ కేగిరన, మనమునూవాని పోయి న దెస పోవుదము రండని రాక్షసబల సమన్వితుండై గగన గతి యేగుచు సౌగంధికా తీరమున–

తే. నందనోద్యాన వనవాటి గంధమాద్న
సుందరోద్యాన సౌగంధి శోభ వనము
నందు యక్షరాజును వాయు నందనులరు
సందడింపుల జూచుడు సంభ్రమంబ

తే. భీమసేనుండు ప్రీతితో క్షేమ మరసి
ధౌమ్య రోమశ వర్యుకు దండ మిడియు
అన్న ధర్మజు కవలల నక్కు జేర్చి
కనక కమలాలు ద్రౌపద్కి కాన్క యిచ్చె

వ. వాని నెంతేని ప్రీతితో కౌగలించుకొని ధర్మరాజు భీమునితో–

తే. అన్ని తెలిసిన వాడవీ వెన్నగాను
నాకు గూర్చుము యిష్టము నయము గదుర

యిట్టి చేష్టలు చేయకు మెన్నడింక
చెప్పి చేయుమ నీదగు చేష్టలేమొ

వ. అని పల్కుచు అందరా కుబేరోద్యాన వనమున విహరించు చున్నంత, తద్వన రక్షకులైన యక్షు లు వచ్చి–

తే. దేవ ఋషి ధౌమ్యాది తేజి కెల్ల
ఇంద్ర సన్నిభ ధర్మజు కెరగి మొక్కి
అవని సుర భీమ కవలల కాప్తి పల్కి
విన్నవించిరి తమదైన విన్నపమ్ము

వ. ఇది సురాసుర యక్ష గంధర్వాది దివిజ వర్యుల ప్రచార ఘోర సంకులము. ఇందుమీ వంటి మానవోత్తములు మసలుట సమంజసము కాదన అందుండనొల్లక ధర్మజానుజ పాండవాదు లెల్లరు రాక్షస పరివారంబుతో హిడింబాసుతుం బోవ బంపి తత్సమీప వనాంతర సీమల నివాసము లేర్పర చుకొని యుండు నంత–

భీముడు జటాసురునితో యుద్ధము చేయుట

వ. జటాసురుడను రాక్షసుండు బ్రాహ్మణ మారు రూపధరుండైవచ్చి వేదాధ్యయన పరుండనని పాం డవుల సేవించుచు నొక్కనాడు–

తే. వీరవిహరుండు భీముండు విదిత బలుడు
ఇంట లేనట్టి సమయాన వెంట దరిమి
పాండవాదుల ద్రౌపదిం పట్టి యొకట
రూపు మార్చియు తనదైన రూపరింప

సీ. ఉరు జటాఝూటమ్ము ఊర్ధోరు దంష్ట్రలు
వెక్కసంబగు మోము వెడద యురము
పుర్రె పుణికె మాల బిరుగా మెడ దాల్చి
రక్తాక్షనుండైన రాక్షసుండు
కరడు గట్టిన యట్టి గజచర్మ ధట్టియు
బొద్దు బొద్దుగ నున్న బుగ్గ మీస
పొణకంత పొట్టయు పారలంతటి గోళ్లు
క్రూర చూపుల తోడి కురుచ హస్తు

తే. డడవి గ్రుమ్మరు వేళ నా యమ తనూజు

కవల ద్రోవది వడిబట్టి కట్టగట్టి
భూసురోత్తము లెల్లరు భోర్న నేద్వ
యెత్తుకొని పోవ భీముండు యేమనంచు
తే. వేగ చనుదెంచి పరుగెత్తి భీతి గొల్ప
రక్కసుం దాకి తొడ గొట్టి నుక్కడంగ
జూట జాలమ్ము పిడికిట జుట్టి బట్టి
రక్కసుండును వెను తిర్గి రమ్మటంచు

వ. భీమసేనుం గదియ వచ్చిన వాయు నందను డా రక్కసుని–

క. వడి దాకియు నేల కొరుగ
పిడి గుద్దులు గుద్ది గుద్ది పెడగా విరచిన్
అడపెడ రెక్కలు వంచియు
యెడమీయక పట్టు బగిచి యెంతయు ముష్టిన్

వ. అంత నా జటాసురుండును తనదౌ వీరముష్టి ఘాతముల భీముని భీమపట్లు విదలించుకొని–

తే. దండ జబ్బలు చరుచుచు కండ లెగియ
ఒండొరుల దాకియు యిరువురు ఓండ్రగించి
బండ రాళ్లతొ పోరాడి కండ బలిమి
భూరుహమ్ముల పెకలించి పోరిరెంతొ

వ. వాలి సుగ్రీవులట్టుల వాయునందన జటాసురుల్ వహ్వా యనగ. మల్ల యుద్ధము సాగింప నిద్ధ బలులు, పాద ఘట్టన రజంబు పర్వ దిశల, గిరిగహ్వరమ్ములు ప్రతిధ్వనింప వృక్ష శాఖల నున్నట్టి ప క్షితతులు వన్య మృగమ లయునుకులు వాయునటుల, ఘోర యుద్ధమ్ము బరపనా భీమ బలులు. హాహాకారంబులు మిన్ను ముట్ట భీముండు వాని పట్టెరింగి ఆలసింపక–

క. మెడ జుట్టి రెండు చేతుల
కుడి యెడమల శిరసు వంచి క్రుంగగ దీసిన్
వడి నేలను పడవైచియు
తొడ దొక్కియు జీల్చె నసుర దొందుగ విసరెన్

వ. అటుల నా పర్వతా కారుండైన జటాసురుని భీమసేనుండు మట్టు పెట్టుటయును దానిం జూడ వచ్చిన అయ్యాటవిక నిశాచర యక్షులెల్లరును భీమసేనుని బలపరాక్రమముల మది దలంప ధౌమ్య రోమశ భూసురోత్తము లెల్లరు భీతివాసి యుండిరని వైశంపాయన కథా కదితంబైన కథ రమ్యంబు గా వినిపించుటయును.

ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయ విరచిత

-: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ తృతీయాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము చతుర్ధాశ్వాసము

శ్రీ నాధా! గురు బావా
యేనాడును మరువ నిన్ను యెంతయు భక్తిన్
భానోదయ సంధ్య లలర
యే నోటను విన్న నీవె యిందున్ యెందున్

పాండవులు నారాయణాశ్రమమున నుండట, అర్జుని రాకకై వీక్షించుట

వ. అక్కధకుండు శౌనకాది మహామునులకుం జెప్పినట్లు నరనారాయణాశ్రమమున కొన్ని దినము లుండ అందొకనాడు ధర్మరాజు తన తమ్ములతో యిట్లనియె.

క. అర్జునుం డేగియు నేడేండ్లయె
నిర్జర దిక్పాల్ర వద్ద నియమోద్ధతుడై
ఆర్జింపను దివాస్త్రులు
నిర్జించను కౌరవాద్ల నిశ్చయ బుద్ధిన్

తే. యేమి కారణ మేమొకో యింత దనుక
తడవు చేయుచు నుండెనా తగవు మాలి
దేవ కార్యంబు యేదేని తీర్చనౌగ
వాసవేంద్రుని బిడ్డగా వరలనౌచు

తే. అర్ధ సింహాసనస్థుడై అమర విభుని
అమర కాంతల సైదోడు ఆటలాడ్చు
చూడ ముచ్చట గొల్పనా చూచు కనుల
అన్న దమ్ముల మరచెనా ఆదమరచి

తే. చూడ నవునంచు రోమశుల్ జోస్య మిడుట
ఉత్సహింపగ మధురోక్తి యువ్విళూర
తమ్ము నర్జును గను వేడ్క తరలి వస్త్మి
సత్యమౌగాదె ఋషి వాక్కు శాంత మరయ

వ. అని ఆ పాండునందనులు గంధమాదన పుణ్యతీర్థ సేవను లగుచు మూడువారములు గడచి న నాడు వృషపర్వుండను రాజర్షి యాశ్రమ ప్రాంతములకు జేరినవారై అతనిచే పూజితులై యేడు దినము లందుండి పరివార జనంబుల నెల్లర నటనిల్పి వృష పర్వోపదిష్ఠులై రోమశధౌమ్యులాదిగా గల ప్రముఖ బ్రాహ్మణుల తోడన జని–

తే. విమల తోయజ విలసనం బమల రుచిర
ఫల రసాదులు గురిపించు పద్మ సరుల
కీర కోకిల హంసాది కేకి రవళి
మనసు కుల్లాస మొనరింప మనుజ విభులు

తే. మహిత నగరాజ శోభన మాల్యవంత
గిరుల బూచిన పెంపెక్కు తరుల నీడ
విశ్రమింపుచు అడనెడ విమల యశులు
శ్వేతకీ పుణ్య నదీ తీర్థ సేవ లొలుప

వ. వశియించి నుండ నందొక్కనాట–

తే. గాలి వాటున దూల్యాడ్చు గగన సీమ
స్వర్ణమయ శోభ లొలికెడు సరసజమ్ము
ఒక్క టొచ్చియు దూల్పడె నిక్క మరయ
మహిత మౌచును వారల మనసు నందు

వ. దానిం జూచుచు వారలందరుం దాని వర్ణ సౌరభ సుందరతర రమణీయత కబ్బుర పడుచు నుండ యేకాంతంబ ఒక్క శశికాంతి శిలాతలంబుననున్న భీమసేను దరిజేరి ద్రుపద రాజ తనయ, యిది యొక–

క. విరిరాజ మనగ జెల్లదె
పరిమళమున యెంచి చూడ పదిరెట్లొటన్
సరి తూగునె సౌగంధిక
విరి సౌరభ మేమి దీని వింతగు సొగసుల్

వ. ఈ కుసుమంబులు తెచ్చియిచ్చి నాకు మనః ప్రియంబు జేయుదుఎ యన భీముండు అప్పటి కప్పుడు చని బహు ఉన్నత గిరిశిఖరము లధిగమించి వివిధాలంకృత రమ్య విశాల తలంబుమధ్య తరు పుష్పలతా గుల్మాదులతో పరివృతంబైన వైశ్రవణు నివాసంబుగని శంఖధ్వానంబు జేసిన–

క. దాని విని యక్ష రాక్షస
సేనానీకంబు లెల్ల చేరియు నొకటన్
మానుగ జుట్టుచు భీముని
పోనీయకుడంచు జుట్టి పోరొనరింపన్

క. వీరాధి వీర భీముడు
మారణ హెూమంబు జేయ మృత్యోర్ముఖులై

వీరోత్సాహులు దనుజులు
పోరాడియు గెలువ రైరి పూర్వోత్తరముల్

వ. అంతట మిగిలిన యక్ష రాక్షసు లెల్లరతో కుబేర సఖుండైన మణిమంతుండను మహా వీరాధి వీరు డరుదెంచి–

క. వివిధాయుధ యూధమ్ములు
అవిరళగతి గ్రుమ్మరించ అనిలాత్మజుడున్
నవనాయక మణిమంతుని
జవసత్వమ్ముల నెరుగుచు జరుపుచు రణమున్

వ. మణిమంత వాయునందను లిద్దరును ఒకరికొకరు దీసి పోక–

క. జలతల మందుల రెంటను
వలనొప్పుగ జరుప రణము వాయు సుతుండున్
చలముడుగ జేసె మంతుని
విలవిల లాడంగ దనుజ వీరులు మదిలోన్

వ. అంత నా మణిమంతుడు సహింప నేరక–

క. గద బూనియు రమ్మనుచు
న్మద మత్తత దాకె భీము మానిత బలుడున్
విదలించి గొట్టె నాతని
గద దూలగ చాల దవ్వు కనపడకుండెన్

వ. మరియు వెన్నంటి తరిమి గొట్టుచు–

క. హత మొనరింపగ నాతని
సుతులెల్లరు భీమునొడ్డి శూరత జూపన్
అతులితమౌ అస్త్రంబుల
ధృతి దూలగ జేసె వార్ని దుస్సహు డగుచున్

వ. అట ధర్మరాజు భీమసేను డేగిన వైనంబు ద్రుపదరాజ తనయచే నెరింగి వారల నందే యుం డమని రోమశ కవలల వెంటనిడుకొని తద్దిశగా పయనించి గిరిశిఖరముల నధిరోహించుచు కుబే రసదన సమీపమున నిజగదాఘాత పాతమున విగతజీవనులై యున్న మణిమంతాది యక్ష రాక్షస గణ రణ మధ్యమున నున్న కుంతీమధ్యము నొద్దకుంజనియె నంత.నట–

క. హత శేషులైన దనుజు
లతి రయమున వచ్చి యపుడల కుబేరునకున్

హత మణిమంతాదుల కథ
గతమంతయు భీము బలము కనినటు దెలుపన్

వ. వినవిని అలకాపతి విస్మితాందోళితా హృదయుండై ఆత్మగతంబున–

క. అలనాడల సౌగంధిక
జలజములం గొనగ వచ్చి చాతురి మెరయన్
కలగక యీ సుర భూముల
జలజాతములైన పూల చెయ్యన గొనగాన్

క. మణిమంతాదుల దెగచిన
గుణ మణి యా భీమసేను భూరి బలమ్మున్
గణుతింపుచు అలకాపతి
రణ భూముల జూడవచ్చె రాజస్ఫూర్తిన్

వ. సుర గరుడ గంధర్వ యక్ష రాక్షస గణ సహితుండై యక్ష ప్రభుండరుదెంచి పాండవులంగని వారిమధ్య గదా ఖడ్గ బాణాయుధ ధరుండై రణకాంక్ష తేజోవిరాజ మానుండైన మారుతాత్మజునిం జూచి భీత ప్రీతుండైయుండ–

క. గంధర్వ యక్ష రాక్ష
స్కంధా వారంబు జొచ్చి కృత వినతులు సం
బంధుర బాంధవ్యులునై
గంధర్వాధిపుని యింట కృత పూజ్యులునై

వ. యుండ, అలకా పురాధిపతి కుబేరుండు పాండు పుత్రుండైన ధర్మరాజునితో అయ్యా! నీఅను జుండు నా ప్రియ సఖుండైన మణిమంతుం వధియించి నాకపకారము గావించెనని లజ్జింప వల వదది. యగస్తి శాపవశంబున నయ్యెనని భీమసేనుం డాయంబిలచి నీ చేసిన సాహసము నాకు పకారము గావున నిన్ను మెచ్చితినన, ఆ కుబేరునకు కృతాంజలియై ధర తనయుం డిట్లనియె.

క. మునియా మణిమంతున కటు
కినిసియు శాపమ్ము నీయ కీడేమొనరిం
చెను విన వలతును జెప్పవె
వినిపింపగ దలతువేని విశదము గాగన్

క. ము న్నెమునా నది తీరము
ఉన్నతమై భువి వెలయగ మోదము తోడన్

జన్నము జరుపుచు అమరులు
నన్నుం నావారి నెల్ల నయవిధి బిలువన్

వ. నేనును పుష్పకారూఢుండనై ఆకాశమార్గమున నేగునెడ ఊర్ధ్వ బాహూండై యమునా తీరమున తపము జేయుచున్న అగస్త్య మహాముని మీద నా ప్రియసఖుండు మణిమంతుడుక్రిందుమీదు చూడక యుమిసిన, అత్యుగ్ర తపోధనుండైన అగస్త్యుడు నన్నుం బిలచి యక్షాధిపా!

క. నీ యెదుటనె నా మీదను
తా యుమిసెను లెక్కలేక దర్పిత మతియై
ఆయువు మూడును వీనికి
ధీయుత బలు భీముచేత దీటగు అనిలోన్

వ. మరియును అలకాపురాధిపా!

క. నీ బలగము సగ మొడుగును
ఆ బలయుతు భీముచేతి ఆ గదఘాతన్
యే బలములు సరిగావని
వే బలముల నైన దెగడు భీమోద్ధతుడా

వ. పాండవు కుంతీ మధ్యము దర్శనమున నీ దురితము లెల్లం బాయునని పల్కుటయును మరియును ధర్మాధర్మము లెరుంగుచు దేశకాలపరాక్రమంబుల తేజరిల్లుచు ధృతిమంతుడైన సుక్షత్రియ జన్ముండు నిర్విక్రమ పరాక్రమంబుల నెల్లరజయించి జగతిరక్షించి పాలించగలడు. పుణ్యలోకంబులు వడయగలడు. ముందు వెనుక లాలోచింపక వృధారంభుడైన, సాహసమంతుల కెగ్గగుట నిశ్చయము.

క. కావున నీ యను జన్ముని
ఆ వాతాత్మజు నసాధ్యు ఆత్మోద్యుక్తుం
ధీ వినుతా శిక్షింపుము
నీ వమలిన కీర్తి నొంద నిర్మల చిత్తా!

వ. నిన్నును నీ తమ్ముల ధర్మానిల చక్రాశ్వినులు రక్షించునట్ల నేనును రక్షించుచుందు. నా అనుమతులు మీకు నిశ్చయంబును కావలయు. అన్న పానాదు లొసంగుచుందురు. మలయాద్రి శ్వేతకీ నదీ తీర్థాటవుల ఒక్కమాసంబుండు డక్కడ అని బల్చుచు–

చ. మునుకొని ఇంద్రతేజ మిల మూర్తిల వెల్గుచు బుట్టినట్టి యా
అనుపమ రూప సంపదల నాశ్రయ సిద్ధుడు ప్రేమపాత్రుడున్

జననుతుడౌచు పార్థు డల జాగృతి దివ్యుల అస్త్ర విద్యలం
గొనగొని రాగలం డనుచు గోముగ బల్కియు తేజరింపుచున్

వ. యక్షపతి తా దివికి బోవుటయును, ధౌమ్యాదులతో పాండవులట నుండు నప్పు డొక్కనాడు పాండుల కులగురులు దౌమ్యులు ధర్మరాజుతో–

చ. అదె గను మందరాద్రి యిటు నల్లదె మేరు నగేంద్ర మా దిశన్
ముదమున యోగి పుంగవుల సంగతు లెల్లను తమ్ము గొల్వగా
విదితులు బ్రహ్మ రుద్రులును విష్ణువు తోడుత దేవదేవులుం
ముదితులు నౌచు భాసురత ముచ్చట గూర్తురు సంతసంబుగన్

చ. ప్రవిమల పాండవాన్వయుడు పాశుపతాస్త్రము సంగ్రహించుటన్
శివునితొ బోరి, దిక్పతు లశేషములౌ తమ శక్తు లీయగా
దివిజుల రేడు ఆత్మజుని తేరున మాతలి నిచ్చి బంపగా
అవనికి యేగుదెంచె నరుడాప్తులు అన్నయు యున్న చోటికిన్

వ. ఇట్లు వారెల్లరును అన్యోన్యాలింగనాదులు గైకొన్న మీదట పాండవ మధ్యముండు రోమశ ధౌమ్యులాది పెద్దలకు నమస్కరించి–

చ. వినయత మ్రొక్కి ధర్మజుకు వీనుల విందుగ ఇంద్ర లోకమం
దనువుగ తీర్చి కార్యములు ఆహవ శక్తులు సంతరించుటా
వనముల ఈశు పాశుపత పావన అస్త్రము సంగ్రహించి తా
అనుకొని నట్టు లిద్ధర లవాంతర మేదియు లేకనుండగాన్

వ. తిరిగి వచ్చితినని పల్కుచు మాతలింజూపిన, వారెల్ల రాతని పూజించి పంపుటయును తనకు నమస్కరించిన తమ్ములనెత్తి కౌగలించుకొన్న ద్రౌపదీ హృదయారవిందముల కానందము గూర్చుట యును అంతా–

క. అరుణుం డస్త్రాద్రికి జని
మరుగై చీకట్లు గ్రమ్మ మనసౌ వారల్
తరుగని మాటల వరుసన
మురిపాలతొ ముచ్చటింప మూగిరి ఒకటై

వ. వారలట్లు తమలో తాము అర్జునుండు తపోనిష్ఠకై హిమవంతమ్మున కేగినదాది యిప్పటి వర కును గల పూర్వాపర సర్వ సంవత్సర కష్ట సుఖములతో గూడిన గాధలను చెప్పుకొనుచు నుండ సుప్రభాతమ్మగుటయును, పాండవులు శుచిర్భూతులై రోమశ ధౌమ్యులాది భూసురోత్తమపరివృతు లై శుభగోష్ఠి నుండు నవసరంబున–

ఇంద్రుడు పాండవుల వద్దకు వచ్చుట

మ. పర లోకోత్తరులైన రోమశ ఋషుల్ బ్రహ్మణ్యు గూ డుండగా
సుర లోకాధిపు డెంతేనియుం ముదితుడై సోమార్క తేజస్కు డం
బర మార్గంబున నేగుదెంచె నటకుం పాండవ్యులం జూడగా
సుర గంధర్వులు వెంట రా హిమగిరీ శృంగార వన్యాటవిన్

వ. అట్లరుదెంచిన త్రిలోకాధిపతికి పాండునందను లెల్లరుం ద్రౌపది వెంటరా బ్రహ్మఋషి ముని జనంబుల తోడన ప్రణమిల్లి భక్తియుక్త పురస్సరంబుగా పూజించి ఉచితాశీనునింగావించ ఇంద్రుండు ధర్మరాజుంజూచి యధోక్తి మృదుమధుర సల్లాపంబుల అభినుతింపుచు అర్జునుని దిక్కై–

మ. సమరోత్సాహుడు సాధుశీల గుణియౌ సామన్యుడే అర్జునుం
డమరాధీశుని అంశమంతుడనగా అర్ధాసనుండుద్ధతిన్
అమితోత్పాతనులా నివాత కవచ ద్దౌర్జన్యులం ద్రుంచడే
అమితోద్దండ పరాక్ర విక్రముడు తా నస్త్రాది యుద్ధంబులన్

క. అసురాసురు లౌకటైనను
ఇసుమంతయు భీతి గొనక నేర్పున ఒకడున్
మసిమాడ్చియు హరియూథము
వసుధా రాజ్యంబు నీకు పట్టము కట్టన్

క. అని బల్కియు దివి కేగెను
అనిమిష తండమ్ము తోడ అమరాధిపుడున్
తనియుచు నా ఋషి కులజులు
వినుతింపను పాండుసుతుల విజయోద్ధతులన్

వ. మరియు నీ–

క. అమరేంద్రాగమన కథను
కమనీయత దెల్ప విన్న ఘన విజయులునై
సమరోత్సాహత గల్గియు
అమరత్వము నొంద గలరు ఆహవ యుక్తిన్

వ. ఇట్లు పల్కి అమరేంద్రుండు వెడలిన తోడనే సంతోష సంభ్రమాశ్చర్యముల దేలుచు ధర్మరాజు అర్జునుం జూచి యిట్లనియె.

క. వివరింపవె శూరాగ్రణి
నవనీతము నీదు తెరగు నయవిధి వినగన్

దివి కేగిన వైనంబును
నివాతుల దునుము టదియును నీకే జెల్లా

క. అనవిని ఆ అగ్రజులకు
వినిపింపగ దొడగె నిట్లు వివరము కాగా
మునుతా రోమశు లానతి
ఘనతపము లేగుటాది కతలను యెల్లన్

క. హిమనగ పాదపు టడవుల
సుముఖ స్థితి తిష్ఠ వేసి చూపులు మొగిచిన్
హిమనగజాధవు భక్తిని
అమలిన మగు చిత్త భవుని అంతర మందున్

క. దలచుచు చాలాకాలము
వలనొప్పుగ పశుపతీశు పరమోత్కృష్ఠున్
ఫల సిద్ధిగ అరి వీరుల
నిలగూల్చెడు నాయుధమ్ము నిమ్మగ గొనగాన్

వ. తపంబు చేసిన ఈశ్వరుండు కిరాతక రూపంబున యెదురు వడి నొక వరాహమునకై నాతో డన ఘోర యుద్ధము చేసి ప్రసన్నుండై నిజరూపముచూపి కరుణించి మెచ్చి అనన్య సామాన్యమైన పాశుపతాస్త్రమును ప్రసాదించుటయును, అది విని మహేంద్రుడు ఇంద్ర లోకమున కాహ్వానించు టయును, అర్ధాసన మిచ్చుటయును, దిక్పాలు లెల్లరుం ఇంద్రుపంపున నన్నుమెచ్చి వరుణ వాయు వ్య ఆగ్నేయ కుబేర యామ్య పైశాచ బ్రాహ్మ్యంబు లనం బరగు దివ్యాస్త్రంబు లొసంగుటయును, వాని ప్రభావంబున సురాసుర యక్ష గాంధర్వుల కైనను అలవిగాని నివాత కవచ కాలకేయులను అరువదివేల అసురుల ద్రుంచగల్గుటయును, అందులకుమెచ్చి మహేంద్రుడు ఇంద్రాస్త్ర మొసంగు టయును మరియు వారివలన తద్దివ్యాస్త్ర ప్రయోగోప సంహార విషయంబులును తదస్త్రలాభంబు లును గ్రహించితిని. అప్పుడు–

క. నీ వఖిలాస్త్ర విదుడవు
భూవలయము నెల్ల గెల్చు భూభర వినుతా
దేవతలను భూధేవుల
కావుము నీక్షితము గూరు కరుణా దృష్టిన్

వ. నాకు ప్రీతి పూర్వక గురు దక్షిణగా త్రిదశులకు బాధలు కలుగ జేయుచున్న ముక్కోటి నివాత కవచులను రాక్షసులు నీచేతన నిహతులగుదురని–

క. తన తొడిగిన కవచాదులు
అనువుగ నుండంగ ననుచు ఆయుధ శక్తుల్
ఇనుమిడిగా రెట్టింపగ
వననిధి లో దాగియున్న వారల ద్రుంపన్

వ. ఆ అభేద్య కవచమ్మును ధరియించి గాండీవముం చేతబట్టి మున్నూరు హయయూథరథంబులపై మాతలి ప్రయుక్తంబైన దానినెక్కి వారాశి తీర్థమున నిలచి దేవతలచే నొసంగ బడిన దేవదత్త శంఖమును పూరించిన తధ్వని సప్త సాగర వారాశీ మధ్యస్థంబై భయోత్పాదమ్ము గొలుప అందుండిన నివాత కవచులు మున్నూరు రక్కసులును ఉక్కుమ్మడి నాపై నానావిదాయుధ సన్నద్ధులై జుట్టుముట్టిన, మాతలి రథ హయముల హెచ్చరించి–

అర్జునుడు నివాత కవచుల వధించుట

క. గిరగిర దిప్పను అరదము
హరిచక్రము భాతి దిశల అంతయు నొకటన్
సరిదాకి నివాత కవచ
అరి మూకల చెండి చెండి ఆహుతి చేయన్

క. పరమేశుని శరమెక్కిడి
హరహర శంభోయనుచును అసురారులపై
తరుగని తూపుల నేయగ
వరదాభయు పార్థు ధాట్కి భయపడకుండన్

క. నీరజభవు వర వీరులు
వారింపగ పాశు నస్త్రు భండన భూమిన్
ధీరోద్ధతులై పోరిరి
నీరది లంఘించి పైకి నిశితాస్త్రులునై

క. వీరోచిత బలయూధము
పారావారంబు నంటి బారులు దీరిన్
వారణ జేయుచు బోరిరి
నీరధులా మాయరణము నేరను యెపుడున్

క. మాతలి భీతిలి వణకుచు
చేతనమును గోలుపోయి చేష్టలు ఉడుగన్

నాతని పక్కకు నునిచియు
చేతను గొని పగ్గములను చేసితి రణమున్

క. బలరిపుడు నాకు యిచ్చిన
విలువగు కులిశాస్త్ర మేయ వివశులు నగుచున్
చలముడిగి నివాత దనుజ
విలవిల లాడుచును గూలి విశ్వంభరపై

వ. అంత నా యసురకాంతల యాక్రందన లంబరమునంటి ప్రతిధ్వనింప, మాతలి తోడ నప్పు రంబు జొరనేగి పురందరనందనుండు అప్పుర సౌందర్యము వీక్షించుచు మాతలితో–

క. సుందరతర సౌందర్యత
యెందును లేదిట్టి దనగ యేలగ లేడో
సందియ మయ్యెడు మదిలో
ఇంద్రుం డసురుల నణంచి యెవ్విధి నైనన్

వ. అనిన వానికి మాతలి, వీరు

క. అమరుల కసాధ్యు లగుటయు
సమరంబున మొక్కవోని సాహసు లగుటన్
అమరారి నివాత దనుజు
సమయింపగ నీకె నౌగ సద్గుణశీలా!

వ. బలరిపుడు వారల తుదముట్టింప నిన్నీవిధముగా విజయవంతమ్ముగా చేకొనగల్గునట్లు బంప నీవ విజయుండవైతి వనుటయును,మరియును కాలకేయులను పులోమతనయులు అరువది వేలు దనుజులు అమరులచే అంతము లేకుండునట్లు తల్లి పరముగా బ్రహ్మవలన వరములుపొందుటచే మిగుల గర్వితులై ఇంద్రాది దిక్పతులకు లొంగని వారలంగూడ తుదముట్టించి దేవహిత కార్యశూరుండనైన విధం బంతయును పూసగ్రుచ్చి నటుల జెప్పుటయును.

క. కృప కర్ణ భీష్మ ద్రోణా
ధిప అశ్వద్ధామ శూరులు ధీరులు వీరుల్
ద్విపదాధిప యోధవరులు
అపజితులను జేతు దివ్య అస్త్రాదులచేన్

వ. అనిదివ్యులు పల్కిరని పల్కుటయును ధర్మజుడు తమ్ముని విజయోత్సాహములకు సంతోషించుచు చతురంబోధి భూవలయ సామ్రాజ్య పట్టంబు నప్పుడె తా పొందినట్లు సంతోషించుటయును, దివ్యాస్త్ర ప్రయోగోప సంహారము ల్జూపుమన–

క. దివ్యాస్త్ర మహిమ జూపగ
నవ్యాప్తితమౌ విధంబు లన్నియు వరుసన్
సవ్యాప సవ్య మార్గణ
సౌవ్యాధత పరిఢవిల్ల సంధింపంగాన్

మ. అవనీ చక్రము దిద్దిరం దిరిగెనా ఆదిత్య లోకంబుతో
రవి చంద్రాదిగ తారకా ద్యుతి గతుల్ రమ్యంబు గోల్పోవుటల్
పవనోద్వీచిక స్తంభమై నిలువగా ప్రాణ్కోటి యల్లాడగా
భువనాధీశులు జూచుచుం నిలిచిరా పుంభావు వీక్షింపుచున్

క. ఏమగునో యిపుడీతడు
మామక దివ్యాస్త్రు లేయ మరచిన బుద్ధిన్
భూమోత్పాతము కలుగదొ
పామరుడే అర్జునుండు పాపపు గతికిన్

వ. అని చింతించుచుండ, భువనాధీశుల మానస విదితుండైన నారదుడు అర్జును పాలికిం జని ధర్మరాజాదులు వినుచుండ అర్జునునితో–

క. మగధీరుడ దివ్యాస్త్రుల
పగతురకై పోగుచేసి భయదుల ద్రుంపన్
దిగులొందగ దేవవరులు
తగునే యిటుసేయ ధర్మోద్ధరణా!

వ. అని అర్జునుని వారించి నారదుం డరిగిన అమరు లెల్లరును నిజ స్థానముల కరిగిరి. ఇట్లు పాండవులా ప్రాంతముల ఋషివాటికల దిరుగుచు పది మాసములుండు నంత నొక్కనాడు సుర కన్యక లొచ్చి యిట్టులనిరి.

క. తిరముగ పండ్రెండేడులు
హరి కృప వనవాసముండి అజ్ఞాత విధిన్
వరసిద్ధత దీర్చ గలరు
పురపట్టణ జనుల మధ్య పోతరికంబున్

వ. మరియును తలకొని నీ తమ్ము లందరును–

క. అన్నకు పట్టము గట్టుదు
రెన్నంగా ధరణి నేల యెంతయు భక్తిన్

మన్నింపను ధరణి పతులు
యెన్నెన్నో ధనము లేట యిష్టత నొసగన్

వ. అని భావి భాగ్యోదయ శుభములు పల్కి చనిన దేవఋషి యైన రోమశుండు ధర్మరాజునకు ధర్మానుశాసనము పల్కి దేవలోకమున కేగ పాండవులు యెప్పటియటుల ఘటోత్కచు సేనావాహినుల తోడ క్రమ్మరి బదరికా వనంబున వాసర కాలముండి సుబాహు పురంబునకు వచ్చి యందు తమవారల యింద్ర సేనానులం గూడుకొని నిజ రధారూఢులై ఘటోత్కచుం బోవంబంపి హిమవత్పర్వతము నందలి దేవర్షి వేదవేద్యుల ఆశీశ్శులు గొనుచు ఒకవత్సర కాలంబు నుండి రంత, నొక్కనాడు.

అజగరోపాఖ్యానము

తే. అరిగె భీముండు ఒక్కట అడవి వేట
పన్నగము వాత పాల్పడి బలయుతుండు
కొట్టు మిట్టాడి యెంతయుం పట్టు వీడ్క
మోక్షితుండాయె అన్నచే మోదమలర

వ. అనవిని జనమేజయుండు–

తే. వేయి గజ బల యోధుండు భీముడేమి
అజగరుని వాత బడుటేమి అవని యందు
కధన మార్తాండ వైశంప్న కామితార్ధ
తెలుపు మంతయు మొదలంట తేటపడగ

వ. అని వేడిన వానికి వైశంపాయనుడిట్లని చెప్పెనట్లు భీమసేనుం డొక్కండు ఆ హిమవదుత్తుంగ నగ శిఖరోపాంత విపినాంతర కాంతార తీర భాగమ్ముల వేటకై గుట్టల పుట్టల నెక్కుచుందిగుచుం పరిశ్రమించుచుం డస్సి శీతలోదకములుగ్రోల తీర ప్రాంతమునగల నీరము లీతటిల్లతా గుల్మ వల్మీకసముద మధ్యమమున కేగుటయు. నట–

క. అశనాపేక్షణుడౌచును
నిశచరమొక అజగరుండు నియమితుడౌచున్
దశదినముల కొకనాటను
వశమగు నా ప్రాణి బట్టి వదలక దినుచున్

క. కాలము గడుపుచు రాగా
వీలుగ నుంకించి పట్టి వీడక భీమున్

కాలూ చేతులు రెంటిని
వాలమునం జుట్టి బిగుత బంధన జేయన్

వ. అంత నాగాయుత బలుండయును భీముండు

క. విదలింప నేర కెట్లను
యిదియేమొకొ యింత లావు యేమిట యనుచున్
కదలను మెదలను లేకను
మదమడరి పెనగి పెనగియు మాన్పడి మదిలోన్

వ. ఇది మామూలు సర్పముగా దోపదు. ఎద్దేనియు అద్భుత జనక సంభవమైయుండ నోపునని విచారించుచు ప్రకాశముగా–

మత్త. ఏను నెప్పుడు చూడలేదుర యింతలావది సర్పమున్
దానవాంతక యక్ష రాక్షస దర్ప జాతుల ద్రుంచితిన్
మాననీయుడ పాండవేయుడ మన్నలం గొనియుంటిరా
దీనతం గొనియుంటి నీయెడ దేవతా మహిమేమొకో

వ. నన్ను పట్టి బంధింపగల శక్తి ప్రకృతి పుట్టువుల కసాధ్యము. నీవిట్టి శక్తిమంతుడవై యుండుట కేదేని సిద్ధ సాధ్యుల వరదాన శక్తి బడసి యుండవలయు. నిజము వక్కాణింపుమన, అది తిర్యగ్జాతి యయ్యును పూర్వ స్మృతి చెడకుండా వరంబు గాంచుటం బట్టి వాని కిట్లనియె.

క. వరబల సిద్ధము నరవర
యెరగా నే బట్టియున్న నెద్దియు గానీ
అరబలమై గింజుకొనుచు
తిరముగ నిల్వంగ లేదు దిమ్మెర మతియై

తే. భక్ష్యమైతివి యీనాడు భవ్య జనుడ
పట్టుబడితివి కడుపాత్ర పడుచు నుంట
యెంతవాడవు కాకుండ యింత తడవు
నాదు పట్టున జీవింప నగుదె యిటుల

వ అని దుఃఖించుచున్న ఉరగరాజునకు భీముండిట్టు లనియె.

క. కడుగొని సుఖ దుఃఖములకు
అడుగడుగున బాధపడక ఆత్మోన్నతియే
అడలక సర్వం బొకటిగ
నెడ దలచెడు వాడె ధన్యు డెప్పటికైనన్

వ. అదియె పురుషార్థ సంపత్తియ. కావున దైవ గతికి తలయొగ్గి వర్తింప వలయు. యేను మహా బలుండ నయ్యును యిట్టుల నీకుం పట్టుబడియుంటిని. ఆత్మత్యాగంబునకు వగవ. అపగత రాజ్యాను భోగ్యులై మద్భ్రాతృవర్యులు దుర్గమంబైన యిప్పర్వతంబున గ్రుమ్మరుచున్నవారు. నన్నుం గానక యెంత దుఃఖింతురోయని వగచుచున్నా ననుచున్నంత, నట ధర్మరాజు వామ పార్శ్వంబును దక్షిణ భుజాస్పందనలు నుపలక్షించి తమ్ముంగానక యెటబోయి యుండునో యనిచింతించుచు ద్రుపజాత్మజ కడ తమ్ముల నునిచి ధౌమ్యాదులు తోడురా భీమునికై వెదకుచు వచ్చి–

క. అజగరుని నోట నున్నటి
నిజ సోదరు భీము జూచి నిశ్చల మతియై
గజగజ లాడుచు నిల్చియు
నిజమెరిగించుమ అజగర నీవెవ్వడవో

వ. నీవు మామూలు సర్పమవు కావు. యేకారణ జన్ముండవో యీ రూపంబుననుండిన కారణమేమో గాని, లేకున్న నా అనుజన్ముని భీమబలుని అజగరము పట్టుటేమి. నేను పాండవ మహీపాలుని తనయుడ ధర్మజుడ నని పలుక నయ్యజగరుండు యిట్టులనియె.

తే. ఇంద్రపదవిని బొందిన యిద్ధ చరితు
కండకావర బుద్ధితో గర్వినౌచు
పాపపంకిల మతినౌచు బ్రహ్మవిదుల
కాలదన్నిన దుష్కృత కర్మ వశత

వ. భృగు మహర్షి శాప వశంబున పామునై పడియుంటి. యేను మీ పూర్వజులకు పూర్వజుండ. నహుషుడను రాజేంద్రుండ. సమస్త వేదపురాణములు చదివితిని. యజ్ఞ యాగాదులు నూరు పైబడిచేసి దానధర్మాది పుణ్యకర్మ లొనరించినాడ. ఇంద్రాసనమును వీడివచ్చుచు అమ్మహామునీంద్రు పూర్వస్మృతి యుండు నటుల శాప మోక్షమునుప్రసాదింపుమని వేడ నాకుంగరుణించి నా వేడిన వరములు ప్రసాదించి యిట్లనియె.

క. నీదగు ప్రశ్నకు సరియగు
వాదనములు యెవని చేత పదపడి విందో
సాదరమున వాని కతన
ఆదట శాపాంతమగును ఆయుష్మంతా

వ. అదియును దీర్ఘ కాలంబునకుకాగలదన విచారించుచు యిట్లుంటిని. ఓపుదేని నాప్రశ్నల కుత్తరము లిచ్చిన నీ తమ్ముని విడుతునన ధర్మరాజాతనితో–

క. నీ యడిగిన ధర్మార్థము

ఆయత బుధజనికి గాక అన్యుల కగునే
ధీయుత దెల్పుము జూతును
నాయంతటి వాని వలన నయమగు నేనిన్

వ. అనిన వానికి నహుషుడిట్లను.

నహుష ప్రశ్నలకు ధర్మరాజుని సమాధానములు

తే. అవని నెవ్వాని బ్రహ్మణ్యు డనగ బరగు
వారలెరుగంగ దగునట్టి వస్తువెద్ది
తెలుప దగుదయ్య ధర్మజా తేట పడగ
అనిన వానికి ధర్మజుం డాడెనిట్లు

తే. క్షమయు దయదాన సద్ధర్మచారు డౌచు
సత్య శౌచాది సద్గుణ సదయ వృత్తు
పరమ బ్రహ్మణ్యుగా నెరుగు పరమార్ధ
పదము నొందుటె సద్విజు బ్రహ్మ విద్య

తే. అనిన వానికి నహుషుండు ఆత్మ మెచ్చి
మీది నీ పల్కు సద్గుణి మ్లేశ్చు నొంద
బరగె నేనియు నాతండు బాప డగునె
యెరుగ దెల్పుడు ధర్మార్ధ మేర్పడంగ

వ. అనగనప్పుడు ఆత్మవిదుడౌచు ధర్మతనయుం డాతనితో విపత్పరిస్థితుల యందువర్ణ సంకరం బైన యప్పట వర్ణనిర్ధారితాది పరీక్షా ర్థమ్ముగా బ్రహ్మణ్యాదులకు వేర్వేర వృత్తములు ధర్మశాస్త్ర విస్తారకుండైన స్వాయంభవుడైన మనువుయేర్పరించె. సత్యాదిగుణములు అధమునందు కల్గెనేనింవాడు సత్యసద్గుణుం డగుగాక. అత్యధిక జాత్యుండు కానేర్చునే, సత్యాది సద్గుణములు బ్రహ్మణ్యమునందు లోపించిన వాడధముండగు. కావున వార్ణాశ్రమ ధర్మసమ్మతముగా మెలగనగు. నీతి నైతిక వృత్తంబు ఉత్తమములు. విత్తమును యెట్లైనను శ్రమించి పొందనగును. కానీ వృత్తి ధర్మమైన వృత్తంబులట్లు కాదు. కావున విత్తము కంటె వృత్తము లుత్తమములు. వృత్తి రక్షణ విత్తరక్షణ కంటెను కడు మేలైనది. అనిన వానికి మరల అజగరం బిటులనియె.

తే. హింస చేయని వాడెట్టి హీనుడైన
సుగతి కేగుట తథ్యంబు సుంత దెలియు

సత్య శౌచాది సద్గుణ సంపదందు
యెక్కువైనదియ అహింస యెందువలన

వ. అనిన వానికి పాండవాగ్రజుం డిట్టులనియె. మంచి చేయని వానికంటె చెడు చేయకుండుటే విశేషము.

తే. దాన ధర్మాది సత్కృప దాతయయ్యు
హింస తలకొన్న వాడెంతొ హీనుడౌను
హింస చేయని వారలే యేగుచుంద్రు
ఉత్తమోత్తమ దైవాంశ ఊర్ధ్వ గతుల

వ. ధర్మరాజు చెప్పిన సదుత్తరములకు ప్రీతుండైన నహుషుండు శాపవిముక్తుండై తననిజ రూపంబుతో భీమసేనుని విడిచివచ్చి ధర్మరాజుని ఆలింగనము గావించుకొనినమీదట ఆతనివలన అనేక ఆత్మజ్ఞాన విషయంబు లెరింగిన యుధిష్ఠిరుండు వృకోదరుం దోడ్కొని నిజాశ్రమంబునకు తిరిగిరా.

క. సంతోషంబున చెలగుచు
వింతగ జూచుచును భీము వింతల వింతౌ
యెంతెంతగ సంతోషిలి
శాంతము యీ కథను విన్న సద్గతి యొడమున్

వ. అని సంతోషమ్మున అందరూ కాలము గడుపుచున్నంతట–

క. అరకొర చినుకుల వరుసన
విరిజల్లులు పెరిగి పెరిగి విపరీతముగా
ఉరుములు మెరుపులు తోడన
ఝరి పారగ వాన గురిసె జననుత మౌగాన్

క. దుక్కులు దున్నగ కర్షకు
లెక్కుడుగా పొలము పనుల నెంతయు వడిగా
త్రొక్కిస లాడుచు మురియుచు
మక్కువతో పాటు పడుచు మామక పండన్

క. శరదాగమనం బిదెయన
విరి వెన్నెల తెలి దనంబు విరబూచిన లే
కరి వేరపు కుసుమ ధవళి
గిరి హరు సుర దధి మరాళ క్షీరము బోలెన్

ఉ. శారద రాత్రి చందురుని చల్లని వెన్నెల కోడె గాంఢ్రకున్
మారణ హెూమమై యెదల మంతనముల్గొని సంగమింపగా
కారణమయ్యెడో యనగ కాంతల వెంబడి వింత చేష్టలన్
తారలు తేజరిల్లి తగ ధన్యత గూర్పదె చెంత జేరుచున్

క. అల్లన కలువల రేడిల
చల్లని వెన్నెలలు గురియ శారదరాత్రుల్
ఉల్లము పొంగగ మగువలు
సల్లాపపు ఆటలాడ్డు సరసుల తోడన్

క. తెల్లని వెన్నెల లందున
అల్లన బహు ఆటలాడ్చు ఆనందముగా
పిల్లలు మురియుచు నుంద్రు
చల్లని శరదృతువు లందు చలముప్పొంగన్

క. అదనగు కాలము మగువకు
ముదమెంతన మగల గూడ మోహితు లగుచున్
మదనుని పాటున కెరగుచు
పొదలందున దూరి దూరి పొర్లాడుటయున్

క. ఫల పుష్పంబుల తోడన
ఇల వనములు శోభ దనరి యింపలరారున్
మలినము లెల్లను వీడిన
తెలి నీటితొ నిండి పారు తోయధు లెల్లన్

వ. అట్టి సంతోష దాయక శరత్కాల నదీనదము లందు పాండునందను లెల్లరు అనుదిన స్నానాదిక సంధ్యాదులు నిర్వర్తించుకొనుచు ఆ శీతనగ ప్రాంతముల కొంతకాలముండిన పిదప ధౌమ్యాది గురుజన పరివారములు వెంట రా కామ్యక వనమునకు మరలి వచ్చి యుండు నంతట నొక్క నాడచ్చట–

క. మునిజన సేవను లగుచును
వనముల వశియించు చుండ పార్థుని సఖుడౌ
అనుసరణీయుడు వచ్చిం
వినుమని తానిట్లు పలికె వినుకలి జేయన్

క. జనవర ఆ యదు భూషణు
దనయము మీ మేలు కోరు యదువుల తోడన్
వినియును మీరిట నుండుట
తనుగా మిము జూడ గోరి తరలెను రావన్

వ. మరియును త్రిభువన పూజితుండను, యుగయుగాంతర కాలజీవనుండును అప్రమేయ తపః ప్రభావ సంపన్నుండును, ఆశ్రితవత్సలుండునుఅగు మార్కండేయ మహామునులును మీదర్శనము చేయంగోరి వచ్చుచున్న వారలని పలుకుటయును.

శ్రీకృష్ణుడు సత్యభామతో పాండవుల యొద్దకు వచ్చుట

సీ. కాంచన మణిమయ కమనీయ దీప్తులు
దేదీప్యమానమై దిశలు వెలుగ
గగన వీధుల నెల్ల కనుల పండుగ జేయ
రంగైన టెక్కెమ్ము రాజిలంగ
సరస సల్లాపియౌ సత్యభామామణి
వీణియం గొని బాడ వినుచు వేడ్క
శైభ్య సుగ్రీవాది చతురంగ రథముపై
దేవకీ వరసుతు్డు తేజమొప్ప

ఆ. విక్రమ యదు వీర విద్వాంసు గూడియు
పాండురాజ సుతుల పలుకరింప
విపుల గోషణంబు వింతయై చెలువొంద
రాచఠీవి యొప్ప రాగదెంచె

వ. ఇట్లు వచ్చిన వాసుదేవుడు రథంబుడిగ్గి స్వాగతింప వచ్చుచున్న ధర్మనందనుల కభివందనము గావించి భీమార్జున నకులసహదేవులం కౌగలించుకొని ద్రౌపదిని గారవించి ధౌమ్యాది భూసురుల చేత అభినందితుండైన యంత కౌంతేయాగ్రజుండు గదాయుధు నర్ఘ్యాది సత్కారముల యందు నునిచి తమ్ములుం దానును విప్రజనములు పరివేష్ఠించి యుండునప్పుడు కృష్ణుడు ధర్మజుని దగ్గర కురావించుకొని చిరకాల సందర్శనోల్లాసిత సల్లాపంబుల ఆదరంబున ఆలింగనము గావించుకొని అభినందించుచు యిట్లనియె.

క. కాలవిధి దైవ యోగము
లీలగదా తెలియు వారు లేరీ జగతిన్
మేలో కీడో గత విధి

కాలమె తెలియంగ జెప్పు ఖర్మాంతమునన్

సీ. యక్ష రాక్షస దైత్యు ఉక్కడంచియు బోర
భీకర భయదుండు భీముడొకడు
పశుపతి మెప్పించి పాశుపతము గొన్న
పరమాత్మ సంస్తుత్య పార్ధు డొకడు
ప్రబల జీవనులగు పాప కర్ముల ద్రుంప
నయవిదుండైనట్టి నకులు డొకడు
పాంచభౌతిక దేహ పరమార్ధ మెరిగున్న
సహదేవ అనుజుండు సాహసుండు

తే. సత్య నిష్టాది ధర్మార్ధ చారవిధుల
ఆడి దప్పని మాటగా అడవులందు
పదియు రెండేండ్ల వనవాస భరము దీర్ప
అభయ హస్తులు నీదైన అండదండ

తే. సత్య ధర్మాది సద్గుణ సంస్థనీయ
శమదమాదిగ సత్క్రియల్ సలుపువాడ
శాంత చిత్తుడ సద్భావ సాహసుండ
ధరను యేలంగ నగుదయ్య ధర్మరాజ

వ. అని పల్కి వెండియు నిట్లనియె.

క. ఆదట దుర్వ్యాజమునన్
క్రోదిత దుర్యోధనుండు గోముఖ పులియా
పాలిత దురితపు నేతలు
కాదను వాదనులు లేరు కౌరవ తతిలోన్

తే. శాంత చిత్తుడ సద్ధర్మ చారువౌచు
ధర్మ చింతన మది నూని దయను గొంట్వి
క్రోధనుండైన భీమాద్లు క్రోధులైన
కౌరవాధమ వ్రాతంబు కాదె బుగ్గి

తే. నీదు వాక్కున నిల్చిరి నిక్క మదియ
లేక యున్నను యివి యెల్ల లేకపోవు

మూడులోకాల జయమొందు యోధవరులు
లయ వికారులు కాదొకో లక్ష్య సిద్ధి

ఉ. ఎందరు లేరు నీ దెసను యేర్పడ భూపతు లెల్ల పేర్కొనన్
అంధక భోజ వృష్ణి కుకురాన్వయ బాంధవ కోటి పోరగన్
సందియ మందనేల మరి సాయుధ సాహస వీరవిక్రముల్
అందరు ఒక్కటై కదియ అబ్బుర మందరె ధూర్త కౌరవుల్

మ. అవమానంబులు సైచిరో సతిపతుల్ ఆత్మాభిమానంబునన్
సవనాపేక్షుడ శాంత చిత్తుడవునౌ సద్భావ సౌశీల్యతన్
అవనీ చక్రము యేలగా నగుదు వీ వన్యోన్య సౌభ్రాత్రతన్
పవనాజాతుడు భీముడుండగను యే పాపాత్ము డడ్డంబగున్

వ. అనిన సంతోషించిన కుంతీసుతుండు దేవకీనందనునితో దేవా! యెవ్విధంబుననైన తక్కుంగా మిగిలియున్న యీ వనవాస కాలమును అజ్ఞాత వర్తనమను సల్పి అనింద్యంబగు విధమ్మున పగతుర జయించ గోరెద. ఇదిఅంతయును నిర్వహించు భారము నియ్యదియ. నీ శరణంబునుజొచ్చిన మాకు శుభమగుననుట నిశ్చయంబుకాదె. అనినప్పుడు కృష్ణుండు తనసమీపమున నున్న ద్రుపద రాజ తనయం జూచి–

సీ. నీరజ లోచనా నీదు పుత్రులు యెంతొ
నేర్పరు లన్నింట నెరుగు మమ్మ
యదు కుమారుల తోడ ఉత్సాహవంతులై
సాయుధ విద్యలం సాగి మిగుల
ఆయుధ విద్యల అలరారి పెద్దగా
మామక ప్రద్యుమ్ను మామ కడను
చెలి సుభద్రయు నీదు చిన్నారు లందర
ప్రీతి తోడుత జూచు పెద్ద జేసి
ఉవిద ఉత్సాహివై యుండు ముజ్వలోజ్వ
వీర రణధీర ఉగ్రులౌ వీర వరులు
తల్ల డిల్లకు మదిలోన తనయు కొరకు
సంతసంబగు నీ మది సత్వరంబ

మార్కండేయులవారి రాక

వ. అని ఆశ్వాసించు సమయమున పరమ తపోధనుండైన మార్కండేయ మహర్షులవారి ఆగమ నంబుగని కృష్ణ సహితులగు పాండవులు వారి కెదురేగి తోడ్కొని వచ్చి యథోక్త విధివిధానమ్ముల పూజించిన వారలంజూచి కుశలంబడిగి సుఖోపవిష్ఠులైనంతన పాండవ హితుండైన వశుదేవ నం దనుం డమ్మునివరుతో యిట్లనియె.

క. విహితంబగు ధరణి పతుల
సహనోద్ధతి పెంపు గూర్ప సద్బుధ చరితల్
మహనీయత యుట్టి పడగ
మహితాత్మా దెల్ప రావె మామక వినగన్

వ. అని అడుగుచున్నంత నారదు దేగుదెంచ నందరు ప్రద్యుద్గతులై ప్రణమిల్లి ఉచిత పీఠంబున గూర్చుండ జేసి బహుసత్కారంబుల సంప్రీతుం జేయ అమ్మహాముని మార్కండేయునింజూచి కృష్ణ పాండవ హితంబుగా పుణ్య కథా కథనం బొనరింతువు గాక యని వారల నామంత్రణము చేసి నిజేశ్ఛం జనియె. తదనంతరంబ ధర్మరాజు మార్కండేయుల మొగంబై–

తే. మహిత మహనీయ నాదైన మనసునందు
పాప పుణ్యాల ఫలసిద్ధి బడయు టద్ది
ఇహము నందున ఫలమంద ఇందునందు
సందియం బందుచున్నాను సమత లేక

తే. సత్య ధర్మాలు పాటించి సదయ వృత్తి
అడవి నగచాట్లు మేమిట్లు బడయుటేమి
కౄర కౌరవ భ్రాత్రమ్ము కొదువ లేక
భోగభాగ్యాల తుష్టిమై భోగు లగుట
తెలుప దగు దీవు సద్ధర్మ తేట పడగ
అనుచు వేడిన మునివరు డాడె నిట్లు

వ. తొల్లి విధాత ప్రధమకల్పంబున ధర్మతంత్రజ్ఞులైన శరీరులుగా మానవులను సృజియింప కాల గతి కలి మహత్వంబున అమర తుల్యులై మాననీయులైన మానవులు అమరత్వ సిద్ధి గోల్పోవుచు కామక్రోధాది అరిషడ్వర్గముల జిక్కుకొనుచు మాయావర్తనులై దేవతలచే విడువంబడి అల్పాయువు అల్పబల అల్పబుద్ధి నిష్ఫలారంభులును బహువిధ రోగ పీడితులుగా నాస్తికులునై దురిత దూషణు లై దరిద్రులుగా తిర్యగ్యోనులం బుట్టుచు నరకాగ్నులంౘ గాలుచు గతానుగత కర్మవిశేష జన్ములునై సంసార చక్రంబులం బడి కొట్టుమిట్టాడుచు–

చ. మనుజులు పాప పుణ్యములు మానిత బుద్ధిని జీవనేశ్ఛమై
అనయము జేయుచుందు రది అంతటి తోడనె దీరి పోవునా
తనువుల తోడ పోవు దురితంబులు వెంబడి వచ్చు కర్మతం
మనసుకు తుష్టి ఖేదములు మానుగ గూర్చును జీవకోటికిన్

వ. మనుజునకు తా జేసిన కర్మ ఫలము అనుభవింపక తప్పదు.

క. ఇహపర లాభము లొకటన
సహజముగా గూడి వచ్చు సజ్జనులకునై
ఇహమును పరమును లేవవి
కుహనాతీతజ్ఞ తతికి కుత్సిత మతికిన్

వ. అదెట్లన–

క. ఇహ సంపద దురితాన్వయ
సహకారము దుర్వినీతి చపలత్వులకున్
మహనీయత లోపించును
సహనము లేకుండ యుండు సద్గతి లేకన్

క. ఇహ భవ కష్టము లొందియు
సహనోద్ధతి నీతి పరులు సద్గురు కృపచే
మహనీయత చేకొందురు
శహబాసనిపించు కొంద్రు చేకొని పరమున్

చ. అమలిన నీతి నైతికత అన్నిటి కంటెను సత్యసంధతా
సమతయు మంచియుం శమము శాంతము తోడుత ధర్మబుద్ధియున్
తమకము లేని జీవనము ధన్యత కెక్కుట నిక్కువం బనిన్
సుమతులు దెల్పగా వినమె సుస్థిర వృద్ధియు ఆత్మ తుష్టియున్

క. ధర్మము తప్పని వారలు
నిర్మల నీతి మంత్రులు నిశ్చల చిత్తుల్
ఖర్మకు లోనై మీదట
ధర్మజ జయమొంద గలరు ధరణీ పతులై

క. పగతుర గెల్తువు ఆజిని
పగ దీరగ జేసినట్టి బాధలు జెల్లన్

వగవం బనిలేదు నిజము
మగనాలియు సంతసించు మనసున యెంతోన్

క. వరమున బుట్టిన దివ్యులు
ధర ధర్మము నిలుపు కొరకు ధరణీపతులై
దురితుల ద్రుంచుట నృప విధి
నరనాయక ధర్మయుతము నయవిధి జగతిన్

మార్కండేయుడు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావము దెల్పుట

వ. తొల్లి హైహయ వంశజుడైన దుంధుమారుండనుపేర రాజకుమారుండు వేటకేగి అచ్చట తృణ గుల్మ లతాదుల మధ్య కృష్ణాజినోత్తరీయుండై తపోనిష్టుండైనవాని మృగము భ్రాంతిచే బాణంబున గూలనేసి డాయం నేలవాలిన యతనిం జూచి కటకటంబడి పురంబునకు పోయి తమ వారలకు దెల్ప వారలా దుష్కృత్యమునకు వగచి దగ్గరలోనున్న మునిపల్లె కేగి దార్క్ష్యుండను తపోధనుని తో జరిగినదంతయును వివరించి ప్రాయశ్చితము తెలుపుడన, దార్క్ష్యుండు వారలం జూచుచు ఆదరించి తమ ఆశ్రమ ప్రాంతముల యెవ్వరికిని భయభీతి మృత్యువ్యాధి దోషములు లేవని తన తనయుని జూపుచు మీ రాజసుతుండు వధించినది యీ బాలునేనా అనిప్రశ్నింప, హైహయులు ఆశ్చర్యచకితులై దార్క్ష్య పాదంబులకు మ్రొక్కి యిట్టి మహత్వం బెందును గనలేదనుటయును, యింతటి సిద్ధి తమకెట్లు లభ్యమైనదియు దెల్ప వేడుటయును, దార్క్ష్యుండు వారల కిట్లనియె. శుచిర్భూతమై భగవదర్పిత మితాహారము గొంచు శాంత చిత్తులమై త్రికాలముల యందును నిత్య నైమిత్తిక క్రియాచారణము, అతిథి సత్కార పూజనము, సత్యనిష్ఠ, శుద్ధశాంతి తత్వజ్ఞత, బ్రహ్మచర్య ము, యోగాభ్యాసములు పాటించుటవలన యిట్టి మహత్వము బడయ గల్గితిమని నుడువుటయు ను మరియు వారలతో వినుండని–

బ్రహ్మ క్షత్ర స్వరూప నిర్ణయేతిహాసమును పల్కుట

తొల్లి అత్రి తపంబునకు పోవువాడు భార్యనుజూచి నీవు నాతో తపోవనంబులకు వత్తువా? లేక బిడ్డలను జూచు కొనుటకై ఆశ్రమమందే యుందువా? అని అడుగుటయును, ఆమె మీరలిట్లు కుటుంబ భారమును నాపైవైచి తపంబునకు పోవుట ధర్మసమ్మతమగునే? అని పల్కుచు పోషణార్థ ములు వైన్య భూపతి నడిగిన యియ్యంగల్గుటయును, అత్రి ఆమెమాట ప్రకారము అశ్వమేధాధ్వర దీక్షితుండైయున్న వైన్యభూపాలు నొద్ద కేగి ఆశీర్వదించి రాజా! నీవు సర్వ రక్షకుండైన ప్రభుండవు. బ్రహ్మేంద్రాదులు ఈశ్వరుండును ధర్మదాతవని నిన్ను బోలిన మహీపాలురు లేరనుచు సన్మునీంద్రు లెల్లరును కొనియాడుచుందురనితెల్పుటయును, అదివినినఅక్కడున్న గౌతముడు వానికి కలుషించి

ఒక్క భూపతని బ్రహ్మ ఇంద్రుడు ఈశుడు అని ధనాపేక్షచే పలుకుచుంటివి కానీ మానవ మాత్రుడైన రాజును బ్రహ్మాదులతో పోల్చుట అయుక్త మనుటయును–

అత్రి గౌతముల సంవాదము

అత్రి: గౌతమునితో మంచిచెడ్డలు దలంపక యిట్లాడుట తగదనుచు మునిసత్తమా! నీతినైతిక పరాక్రమములనొప్పి ధర్మయుతముగా సర్వసమతగూర్చుచు సముడై యిషుడై ధరణీ భారమును వహించి ప్రజాపాలన గావించు ప్రభువును గొప్పగా నుతింప తగదా నాకు అనుటయును–

గౌతముడు: నీకు తల తెల్లబడినదే తప్ప బుద్ధి పండలేదు. జ్ఞాన బుద్ధులైన వారలమాటలే శిరోధార్యములు కాగలవు కదా యని త్రిప్పి పలుకుటయును, యివ్విధముగా వారిరువురును వాదులాడుకొనుట వినిన కాశ్యపుడను ముని అచ్చట నున్న వారలతో యీతగవు మనచే చక్కబడునది కాదు. కావున ధర్మ తత్వజ్ఞుడైన సనత్కుమారుని కడకేగి అడుగుదము రమ్మని యేగి తగవు విషయమును దెల్ప ఆతండు వారలకిట్లనియె. అత్రి పల్కినదే నిజము. ఈనేలనంతయు ధర్మసమ్మతముగా శాశించిపాలించి ప్రజల నెల్ల కాచి రక్షించు భారము తన భుజస్కందములపై వహించిన ప్రభుడు సత్య ధర్ముండు. సామ్రాట్ విరాట్ నృపుడు మెదలగు నామములతో నొప్పిన పార్థివుండు. ఇంద్ర రుద్ర బ్రహ్మాదులతో సముడు కాడా? ధర్మరక్షణార్ధము అధర్మువునకు వెరచి బ్రాహ్మణులు తమ వేదవిహితమైన తేజో బలంబుల క్షాత్రంబున నిక్షేపించిరి. నాటంగ్రోలె బ్రాహ్మ్యంబు వలన క్షాత్రంబు వర్తిల్లుచున్నయది. ఇవిరెండునూ పరస్పరాశ్రయములు. వేరుగావు.సుక్షత్రియుడు బ్రాహ్మణ సంసేవనము వలన తేజోవంతుడై దురితంబుల నణంచుచు సర్వ ధర్మాధిపత్యము వహించుటయును విన వినిన అమ్మునులెల్లరుం జని వైన్యునకు దెల్ప ఆతండు అత్రికడకుజని, నన్నీవిధముగా ఘనుడను విధముగా కొనియాడిన నిన్నేవిధముగా సంతృప్తుని జేయంగలవాడ. కావలయు ధనంబు లిచ్చెద గైకొను మని యిచ్చిన, అత్రి ఆ ధనంబులతో భార్యా బిడ్డలతో సుఖంబుండుటయును దెల్ప వినిన పాండు నందనులతో మార్కండేయుడు వెండియుయిట్లనియె.సరస్వతీగీత అనేఇతిహాసము దెల్పెద. అందలి విశిష్ఠ ధర్మము లెరుంగ దగుదురని, తొల్లి తార్క్ష్యుండను మునివరుండు భారతినారాధించుటయును, అద్దేవి వానికి ప్రత్యక్షమైనంత తార్క్ష్యుండు ఆమెతో పురుషుల కెయ్యది ధర్మువు? పరుషుండు యెద్దాన పుణ్య పురుషుడై పుణ్యగతులొందు? తెల్ప వేడుటయును, అప్పరమేష్ఠిని ఆతనితో నాల్గు వేదములు చదివిన వాడునైన భూదేవులు దేవ యజన పారంగతులైన వారలు దైవ సామ్రాజ్యమున అప్సరోగణ సమంచితానంద మహిమాన్వితుండునై ప్రీతి పెక్కేండ్లు వశియించగలదనుటయును మరియును తొలిచూలుదూడతో పాలనిచ్చు గోవును సద్బ్రాహ్మణులకు దానమిచ్చుట వలన ఆ మొదవుమేన యెన్ని రోమములుగలవో అన్ని వత్సరములు సురలోక సౌఖ్యములొందనగు. నేతితో సప్త వత్సరములు హెూమము గావించుట వలన తల్లి దండ్రుల పెద్దలైన యేడేడు

తరముల వారికి స్వర్గ ప్రాప్తిగూరు. మరియును గోలోకము ప్రాప్తించు. అగ్నిహోత్రము అస్మదాత్మ కంబని యెరుగుము. నిత్యాగ్నిహోత్రంబుల నెవ్వడు నన్ను ఉపాసించునో వారలకు సర్వ సంశయ విచ్ఛేదన జ్ఞానమ్ము ప్రసాదింతు. ఇంద్రాగ్ని ప్రముఖులైన దివిజులకు తృప్తి చేయు వారలు మత్పదం బునం ప్రాప్తింతురన దార్క్ష్యుండు అంబకు కృతాంజలి ఘటించి–

క. వాణీ అబ్జజు రాణీ
రాణ్మణిమయ నూపురాస్య రాజిత చరణా
వీణా పుస్తక పాణీ
గాణన ఝణ ఝణిత లాస్య గానవిలోలా

వ. కావుము తల్లీ! అనినుతించి కృతార్థుండగుటయును వినిన పాండునందనులు మరల మార్కం డేయునితో వైవస్వత మనువు వృత్తాంతము వినిపింపవే యని వేడుటయును మార్కండేయుడు వా రల కిట్లనియె.

వైవస్వత మనువు వృత్తాంతము

క. మును చాక్షుస మన్వంతర
మున వైవస్వతు డనువాడు పుణ్య శ్లోకుం
డొనరించె మహా తపమది
మునుమున వేయేండ్లొకటన ముదమున నెంతోన్

ఆ. అనఘుడూర్ధ్వ బాహుడై యేకపాదంబు
నంద యెండ వాన యనక నిలచి
రాత్రి పగల వరుస రవిచంద్ర తారకా
గణము దెసల జూచి కరము మొగిచి

క. జనులెల్లరు నుతియింపను
మనువౌచును దైవశక్తి మహిమాన్వితుడై
మునుగుచు నుండగ జలముల
కనుగొనగా మీను నొకటి కడు చిన్నదియౌ

వ. వైవస్వతునితో యిట్లనియె.

క. అల్పుల బలయుతు లణతురు
నిల్పుము నను నీదులాడ నీదగు కొలనన్
కల్పన జేయుము రక్షణ
కల్పాంతపు వేళ దనుక కనుగొని కావన్

వ. అని వేడిన, యిది దైవ యోగమని మదిదలంచిన వైవస్వతుడా జలచరమును తమ కమండ లోదకముల నిడుకొని గృహమున కేతెంచు సరికి ఆ మీను కమండలము పట్టనంతగా ఎదుగుట యును, ఆశ్చర్య చకితుండైన వాడు దాని పూదోటయందు కొలనిలో నిడుటయును, మరునాటి కది కొలను నిండుగా పెరిగి యీదులాడ లేకుండుటయును గని దానిం గొనిపోయి మరియొక జలాశయంబున వైవం జేయుటయును, మరుదినమునకా జలాశయమున గూడను సరిగాయీదు లాడ నేరనంతగా యెదుగుటయును జూచినవాడు దానిం మహార్ణవ మధ్యంబున విడుచుట లెస్స యని దలంచి గొనిపోవ ఆ మీను వానికిట్లనియె.

క. ఉపకారికి తగుగా ప్ర
త్యుపకృతి చేయంగ దగదె ఉత్తమ గుణికిన్
విపులంబగు భూభారక
తపనీయా నీకొనర్తు ధర్మోద్ధరణా

తే. ప్రళయ కాలమ్ము రానాయె భరము మిగుల
పంచ భూతాల విజృంభ్ణ పదము దొక్కి
పొంగి పొరలును సర్వంబు తొంగలింప
సహచరించెడు యుగసంధి సమయమందు

వ. కావున నీవు పునరుత్పత్తి కారకమగు తృణ ధాన్య బీజముల తోడను సప్తఋషి సహితుడవై ధృఢతరమగు పేరోడ గావించుకొని రజ్జుబంధన క్రియాకలాపుండవై సముద్రంబు దరిసి నన్నుం దలచునది. యేను ఘనశృంగ శోభితంబైన రూపంబున పొడజూపి మీకు మేలొనరించెదనని నమ్మ త్స్యంబు వార్ధింజొరియెనంత. వైవస్వతండు ఆ మీను జెప్పినట్లు సర్వంబును కూర్చుకొని సప్తఋషి తండ సహితుండుగా కృత నిశ్చయుడునై పయోధిజరియెం యేతెంచువాడు–

క. వలనుగ దలువం బడుటయు
ములుముక్కున పెద్ద కొమ్ము మూపున గలదై
జలచర రూపము వెల్వడి
అలలందున దేలివచ్చె అద్భుత రీతిన్

వ. వైవస్వతుడు తన యోడ బంధముల నాజలచర మూపు కొమ్మున బంధించుటయును, అతి వేగమ్మున ఆ యోడ సముద్ర మధ్య గతి కేగుటయును–

ఆ. ఉరుతరంగ వార్ధి ఉప్పొంగి యుప్పొంగ
ఫేన రూప రుచుల భీతి గొల్ప

క్రిందు మీదుగాగ గిరులెల్ల నడయాడ
విలయ కాలగతుల వింత గొలుప

వ. ఇట్లు సర్వం బేకార్ణవం బగుటయు, నా మత్స్యంబు తద్జలాంతర మధ్యగతుల అనేక సహస్ర వర్షంబు లయ్యోడ దిగుచుచు తలక్రిందులై మునుగకుండ కాచుచుండునెడ ఉప్పెనవెల్లి అల్లనల్లన దిగిచిపోవు సమయంబున హిమగిరి శృంగ సమీపంబున నయ్యోడను నిలిపి వారలతో నిట్లనియె.

క. గిరి శృంగమ్మున కట్టుడు
స్థిరముగ యుండంగ యోడ దీనన వినుడీ
గిరి శృంగము ఘననౌకా
స్థిర బంధన మనెడు పేర దీప్తికి యెక్కెన్

వ. అని వెండియు ఆ మునిముఖ్యులను జూచి వారలతో-

క. స్రష్ఠను దెలిసెడు మునులరు
సృష్ఠిని కాచేటివారు సూకృతి కొరకై
కష్టము దలపక మనముల
నిష్టతొ యీ మనువు గూడి నియమోద్ధతులై

వ. ఈ యోడనందు నామాట చొప్పున ఈ విలయ నిశి యంతయు నిష్టతో వర్తించినారు. ఈ మనువు యిజ్జగం బెల్లను మరల సృజియించు. అని పల్కి అయ్యాది మత్స్యంబు అదృశ్యం బగుటయును వైవస్వతుడు అధిక తపం బొనరించి సకల చరాచర జీవ కోటుల నెల్ల సృజియించె.

క. పరమ పవిత్రము యీ కథ
తెరమరుగున నుండి యైన తిరముగ విన్నన్
దురితము లణగును మదిలో
కరివరదుని భక్తి కలిమి కామిత ఫలమౌ

వ. అని పల్కుటయును, మార్కండేయునితో ధర్మరాజు వినయమితాంగుడై ప్రణమిల్లి-

క. దేవా! భూరి తపోధన
పావన చరితంపు కీర్తి పరమేష్ఠి సమా
కావగ వచ్చిన వాడవు
ధీ విభవుడ నిన్ను బోలు తేజులు గలరే

క. కల్పాంతర జీవన సం
కల్పము మాత్రంబు కలన కడు వేడుకతో

సల్పుదు పయనము గాలిలొ
అల్పంబే నీదు మహిమ అమరస్తుత్యా

వ. మీకీ కల్పంబుల పుట్టు పూర్వోత్తరములు విదితంబులు. జరామరణ విశ్చేదన ప్రభువుండవు. సకల చరాచర జీవోత్పత్తి స్థితి లయప్రకారంబు లెరింగిన మహితాత్ముండవు. కావున లోకంబులు విలయకాల సమయంబున యెవ్విధి నొందు. యెరింగింపవేయనిన మార్కండేయు డిట్లనియె.

ప్రళయ ప్రకార విషయము లెరింగించుట

ఆ. అఖిల లోక పాల ఆనందమయ రూప
ఆది దేవు విష్ణు అబ్జ నాభు
నీల దెలియు వారు లేరెవ్వ రిందెందు
మాయ యోగ విద్య మర్మ మేమొ

ఆ. తాత్మ్యు జనుల కెల్ల తానుగా దెలియడా
వేద విదుల కెల్ల విశద పడుచు
కొంత కొంత తెలియు కోవిదు కైనను
తెలియ జేతు వినుము తేట పడగ

వ. కృత త్రేతా ద్వాపర కలి నామంబులైన యుగంబులు నాల్గును పండ్రెండు వేలదివ్య వర్షంబుల కాల నియుక్తంబుగా ఒక్క మహాయుగం బనబడు. అట్టి మహాయుగంబులు సహస్రంబైన కాలము బ్రహ్మకు ఒక్కపగలు. పగలుగతించి రాత్రిందిన సంధ్యా కాలమున శతవార్షికంబైన అనావృష్టి దోషంబు పుట్టు నపుడు.

ఆ. ఏక చక్ర రథుని యెండ వేడిమి పొక్కి
జలధు లింకు జీవచయము లుడుగు
గాడ్పు లెగసి దిశల కాలాగ్ని రేకెత్తి
మంట లెగయు జగతి మసిగ మాడు

వ. తరువాత–

మ. అలి నీలాలక హేమమండిత రుచిం ఆనంద ముప్పొంగనా
సలిళోత్పాదన మేఘమండల గతిం జల్లార్చి సంవర్త్న మేఘావళుల్
జల ముప్పొంగగ జేయుదుం జగతిమై జాజ్వల్య మానంబుగా
అలుగుల్పారగ వర్షముల్ గురియుటే ఆశ్చర్య మెంతేనియున్

క. మాడిన మాసిన జగతిం
వేడిమి ఉదయించి మరల వేవిధ జీవుల్

మోడులు చిగురించి నటుల
పోడిమి కెక్కుచును మెలగు పూర్వాపరముల్

క. చల్లని గాలులు వీచును
మెల్లన జనియింత్రు జనులు మేదిని పండన్
అల్లన మునుపటి మాదిరి
ఉల్లాసము పొంగి పొరలు ఉర్విని మీదన్

వ. ఆ నడిమి బ్రహ్మ నిర్మితంబైన అనేక కల్పాంతర నిశీధికాల సమయంబున సర్వంబును పెను జీకటి ఆవరించియుండు. అప్పటి జలార్ణవ మధ్యంబున తామరసియందు పితామహుడు నిద్రించు చుండు. ఆ ప్రబలఅంధకార తమః పటలమునం దేమియు కానక భయాతురుండనై పెద్దకాలంబు పరిభ్రమించుచుండ నయ్యుదక మధ్యంబున నొక్క వట వృక్షంబు కానబడుటయును తదీయ పర్ణ పర్యంకంబున–

ఆ. బాల కేళియాడు బాలాకుమారుండు
కాలి బొటన వేలు కరచి నోట
కరము లందు బట్టి కాలెత్తి చూపంగ
కాంతి మయము లాయె కన్ను గవకు

వ. అంత అత్యంత విస్మితుండనై ఆత్మ గతంబున–

క. లోకంబులు సర్వంబును
యేకార్ణవ కాళరాత్రి యే వగలేకన్
చీకట్లను జీల్చి మనుట
వాకొనగను కాదు యేర్కి బాలకు లీలల్

క. నవ్వొలికించుచు నాడెడు
యెవ్వండీ బుడుత డొక్క డెక్కడి వాడో
దవ్వుల జూచుచు మదినా
సవ్వడి గొని నిద్ర లేచె సమయజ్ఞుండై

తే. యోగ నిద్రాసముండైన యోగివరుడొ
కాల పురుషుండొ యుగధర్మ పాలకుండొ
సృష్ఠి కర్తకు ఆద్యుండొ సద్గురుండొ
ఆదిదేవుడొ అభవుండొ ఆత్మ విదుడొ

వ. అని తలంచుచు దరికి చేరనంత నా శిశువు చిరు నగవు లొలికించుచు సుందర తర నేత్ర విక్షేపమున నన్నాకర్షించుటచే ముకుళిత హస్తుండనై నిలువ మృదు మధుర స్వరంబున నావంక జూచుచు అతిశ్రాంతుండ.

క. అతి శాంతుడ యోగి వరుడ
ధృతి మంతుడ దీర్ఘ కాల తపమయ జీవా
కతిపయ కాలము శాంతత
మతిమంతత విశ్రమించు మృదుతర భూమిన్

వ. అని ముఖ గహ్వర ద్వారంబు ప్రవేశింప వీలు గావించిన సుమనస్కుండనై అందు ప్రవేశించి ఆ చిరుతని మాయా మయోదరంబు ప్రవేశించి, యందు–

క. పదునాలుగు భువనంబులు
కుదురుగ నా కుక్షి యందు కూడియు ఒకటన్
కదులాడుచు కండ్ల యెదుట
విదితంబై కానవచ్చె విశ్వం బెల్లన్

వ. అట్లా బుడుతని యుదరాంతర భాగమ్ముల ద్రిమ్మరుచు సుమారు నూరువత్సరములు పైబడి–

తే. ఎంత కాలము వసియిస్తొ యేమి చెపుదు
యెంత జూచిన జూడనా వింత యగుచు
సంతసోల్లాస విభ్రమ సంభవించు
శాంత మెరుగంగ వేలేండ్లు చాలవేమొ

వ. అని చిత్తంబున యోచించిన కొలది భయ భ్రాంతులు ముప్పిరి గొన పరమాత్మ తత్పరుండనై అబ్బాలుం భజియించినయంత కారుణ్యాంబుధియైన కమలాక్షుండు నన్నుం తనవదన గహ్వరము నుండి వాయు వేగంబున వెలువరించుటయును, యెప్పటి యట్ల అమ్మహా వటవిపినంబు చెంత ఆతని శయ్యాపత్ర సన్నిధిని వ్రాలియుంట.

క. అల్లన నవ్వుచు కనుగొని
చల్లగ వసియిస్తి వొక్కొ జననా కుక్షిన్
తల్లడి కాగా మనసది
కల్లలుగా దలతువేమొ గతవిధ మెల్లన్

వ. అని పలికినంతట, నేనును విభ్రమ సంభ్రమాశ్చర్య మానసుండనై అబ్బాలకు పాద పద్మముల కు నమస్కరించి మహా మహిమోపేతా! వటపత్ర శయనా! యేను భవదీయ మాయా ప్రభావము లు భావింప నేరకున్నవాడ.

క. నే జూచిన దెల్లను కల
యా జూడ్కుల విభ్రమంబ ఆశ్చర్యంబౌ
యీ జూడ్కుల పుణ్యంబో
యే జన్మయు లేక నన్ను యేలుము కరుణన్

వ. అని వేడు కొనిన యంతట–

నారాయణుడు మార్కండేయునకు తన ప్రభావము తెల్పుట

తే. కరుణ జూచుచు నావంక ఘనుడ విను, మ
దీయ మోహనా మోహంబు తిరము గాగ
అనుచు వచియించెదన లీల లంబుజాక్షు
పద్మ పత్రాన శయనుండు బాలకుండు

తే. తనదు దివ్య లీల లెరుగంగ తరము గాదు
దేవ ముని ముఖ్య దిక్పాల దివ్య కైన
దేహ త్యాగైక దైవాంశ తేజులైన
అహము లేనట్టి ఆత్మలే అరయు నంచు

తే. ఏను సత్యుండ నిత్యుండ యెరుగ రెవరు
కాల పురుషుడ గణనీయ కాలమందు
ముందు వెనకల నేనౌదు మోదమలర
నిర్వికార నిరోమయ నిశ్చలుండ

తే. వేషధారుండ భువనైక భూరి కల్ప
సృష్టి స్థితియు లయ కార చర్యసముడ
పంచ భూతాత్మ దేవుల ప్రాపకండ
పాప పుణ్యాలు అంటని ప్రాభవుండ

క. జగదాకారుడ అఖిలుడ
నిగమాంతర గోచరుండ నిహతోద్భవుడన్
సగుణా నిర్గుణ మానస
సుగుణాన్విత ఆత్మ లందు శోభిలు చుందున్

సీ. ఆది మధ్యాంత రాహిత్య అనుప తేజ
ఆత్మాభి ధానుండ ఆత్మ విదుడ

జీవులన్నిటిలోన జీవాత్మ మధ్యస్థ
పరమాణు తుల్యమౌ పరము నేన
పంచ భూతాత్మమౌ పరబ్రహ్మ రూపాన
కామితార్థము దీర్చు కల్ప తరుడ
నిత్యుండ సత్యుండ నిర్భయ చిత్తుండ
నిర్గుణ తేజుండ నియమ వర్త్న

తే. భక్త మందార హృదయుండ భవ్య దివ్య
పుణ్య పూరుష జనులందు గణ్యమౌచు
వేద వేదాంత వేద్యుండ విబుధ వర్య
పరమ పురుషుండ పరమార్థ ప్రాపకుండ

తే. ఎరుగ నేరరు ఇంద్రాదు లీశ్వరజులు
అష్ట దిక్పాల కాదులౌ అమర వరులు
జగతి సర్వంబు నేనౌచు జరుపువాడ
ధర్మ సంస్థాప నార్థంబ ధరణి బుడుదు

తే. ధర్మ కామ్యార్థ మోక్షముల్ ధరణి వెలుగ
వదన స్కందోరు పాదాల వరుస నాగ
నాల్గు వర్ణాల జాతులం నయము జేతు
సమయు నన్నియు నాలోన శాంతవేళ

క. ఎల్లరు గొల్తురు నన్నది
అల్లల్లన వారివారి అనువగు రీతిన్
ముల్లోకము లందు జనులు
వెల్లువగా మ్రొక్కు లిడుచు వేడ్కపు భక్తిన్

క. నా తెర గంతయు వింటివి
తేజో మోదంబు దనర జెప్పితి నెల్లన్
ఆతావీతా వనకను
భూతాదు లన్నింట నుందు భూ నభ చయమున్

తే. యోగ నిద్రామయుండనై యోగిమయ
యుగ సహస్ర కాలాలు ఒప్పిదముగ

యేక వారాశి జల మధ్య యివ్విధాన
బాలరూప ధరుండనై పవ్వళింతు

వ. అనుచు వచియించి వెండియు–

తే. శంక వీడుము చరియించు చక్ర గతిని
సర్వసంగుడ వగుచును జగతు లందు
సృష్టి కార్యంబు ఒడగూర్చు చతురముఖుడ
అనుచు పల్కి అంతర్హితుండాయె నంత

వ. అద్దేవదేవుం డానతిచ్చిన క్రమంబున ఆ చతురాననుండుక్రమ్మరి సర్వసృష్టికార్యం బొనగూర్చుటయు నెల్లను నా కవగత అనుభవైక పూర్వకం బగుటయును–

క. నాకును నీకును జగతుల
కాకరమై యుండువాడు ఆపద్బంధుం
డా కృష్ణుడు ఓ పాండవ
లోకజ్ఞుడ చూడగంటి లోకోద్ధారున్

క. శరణాగత రక్షకుడును
దుర్యోధను దుర్నయాలు తుదముట్టింపన్
ధర బుట్టిన పరమాత్ముని
శరణంబన గల్గు సుఖము సంతస మెలమిన్

క. అనవిని యా పాండు సుతులు
వినయంబుగ బావ కృష్ణ విష్ణుం జిష్ణున్
జనితోద్ధతి పొగడ దొడరి
తనియంగా మునికి మ్రొక్కి తద్దయు వేడ్కన్

వ. మహనీయా! భవత్ప్రసాదంబున అత్యద్భుత కథాకథన శ్రవణ సంతోషులమైతిమి. కలియుగంబున ధర్మచ్యుతి కల్గునని విందుము. తత్ప్రకారంబెరిగింపుమన మార్కండేయుడు వారల కిట్లనియె.

మార్కండేయుడు ధర్మరాజాదులకు కలియుగ ధర్మంబులు దెలుపుట

క. కృతయుగ జగతిని ధర్మువు
ద్యుతి నెగడును నాల్గు పాళ్లు ధారుణి వెలుగున్
గతి తప్పుచు పాలు వరుస
అతి తక్కువ గాగ మిగులు ఆ కలియుగకిన్

వ. అట్లగుటం జేసి కల్యాంత సమయంబున జనులు–

క. ధర్మువు సత్యము దప్పుచు
దుర్మదులై గర్వి లగుచు దూరుచు పరమున్
ఖర్మకు లోనగుచు దురిత
దుర్మార్గపు వృత్తు లందు దుఃఖితు లగుచున్

క. అల్పాహారులు అగుచును
అల్పాయువులై జనములు ఆర్తులు అగుచున్
కల్పిత జీవచ్ఛవులై
కల్పాంతపు వేళ దనరు కలియుగ మందున్

సీ. కామాది మోహముల్ కడుమిక్కి లైయ్యుంట
వేద విద్యలలోన విముఖు లగుచు
క్రోధాది లోభాల కోట్లాది ధన కాంక్ష
హెచ్చు మీరినదౌచు పెచ్చు పెరుగు
పాప పుణ్యంబుల మాటైన దలుపరు
పారమార్థపు చింత పట్టువీడ
ఆదరభిమాన మరుదౌచు కన్పట్టు
వంచన గుణులౌచు వ్యావృతింత్రు

తే. వైరమెంతనా వాణిజ్య పరముగాను
పాడి పంటలు నశియించు భర్త గౌనరు
వర్ణ సంకర మెల్లెడ వరలు చుండు
కాలధర్మంబు తెలియుమా కలియుగాన

తే. దేవ పితృ యాగ కార్యాల తీరు మారు
అహము మితిమీరు అధికార మధిక మగుచు
ఆత్మ హింసల పాత్కాల అలమటింప
మాన మర్యాద లడుగంటు మతము చెడును

క. కాలానుగణ్యు లగుచును
ఆలోచన పరులు గాన అవసర పరతన్
ఆలోచింపరు ఉచితము
లోలత్వంబున జనములు లోగొను మదితోన్

తే. ధర్మ మనుమాట దలపరా ధరణి జనులు
ఆశ్రయింతురు ధనముకై అతివలన్యు
జార చోరత మితిమీరు జగతి లోన
అన్న విక్రయ మొనగూడు అవనియందు

సీ. దీనుల పేదల దేవతా వృత్తులు
దుర్జను ల్పాలౌను దుష్టపాల్న
అడవులు మోడులై అడుగంటి పోవును
అడవి జాతులు పెక్కు అలమటింప
ధరణి నేలెడు వారె దరిద్రులై చరియింత్రు
సాదుబీదల గోడు వాదు పరచి
ఊరి జనముల కుపయోగ పడుచు నున్న
ఊర గెడ్డల మరుభూము లాక్రమింత్రు

తే. రాచకార్యంబు గోప్యంబు రాక్షసంబ
శిక్ష జేతురు చోరుల పక్ష మగుచు
దీక్ష ప్రకటింత్రు జనపాల్న దీక్షయంచు
వృక్ష జూపుచు పాలింత్రు పక్ష మేర్చి

సీ. దేవతార్చనలందు దాంభికం బొనగూడు
భక్తి భావము కాదు భుక్తె గాని
నల్ల ధనపు జోరు నాయకు బొక్సాల
మూల్గుచుండగ జూతు రమాత్య వరులు
పేదోద్యోగులం బట్టి పీడించి వేధింత్రు
నీతి నైతిక శాఖ నియతి లేక
దొడ్డ దోపిడి చేతు రుద్దండులం బట్టి
ఉరికంబ మెక్కించు ఊహ చేయ్క

తే. ధనము చేతులు మారనా దయను జూప్తు
న్యాయ శిక్షణ నిపుణకుల్ నయము కూర్ప
ధర్మ మధర్మముల్ రెండు తారు మార్చు
కలి ధర్ములం జూతుమా కలియుగాన

సీ. ధనకాంక్ష మితిమీరు ధర్మ భ్రష్టత గూరు
దాతృత్వ మడుగంటు ధరలు పెరుగు
అలరారు సెల్ఫోన్లు అందరి హస్తాల
వినుకలి యంత్రాలు విస్తరిల్లు
విశ్వ విఖ్యాతమౌ విజ్ఞాన ప్రగతంచు
విధ్వంస యాగాలు విస్తరిల్లు
సృష్టి మూలాలకే చేటు గూరును యేమొ
జూడజూడగ నెంతొ చోద్యమగుచు

తే. హొయలు పోవగ బహుయోగ మోహులగుచు
అన్నమో రామచంద్రా యని అలమటింత్రు
తిండి నిద్రిత సుఖదంపు తీరులుండ్క
కలి మాయ కాదొకో కమల నయన

వ. అంత భూ భవన విదిత పురస్సరముగా-

తే. కలియుగాంతపు సమయాన కల్కి రూపు
దనర ప్రభవించు విష్ణుండు తానుగాను
వినికి మాత్రాన నే వేద వేద్యుడగుచు
ధర్మ సంస్థాప్న జేయు సద్ధర్ముడగుచు

విష్ణువు కల్కి రూపాన ధర్మమ్ము ప్రతిష్ఠించుట

వ. కలి యుగాంతము నందు భువన విదితంబగు శంబర గ్రామంబున విష్ణుయశుండను పేర విష్ణుండు జనియించి సంస్మరణ మాత్రాన వేదవేదాంగ శాస్త్రాల విభవుడగుచు, భూధేవోత్తముల నాదరించుచు యజ్ఞ యాగాదులు నెరపుచు నిజశక్తి నిమిత్త మాత్ర ఖడ్గధారుండై శక్తి వారువము నధిరోహించి తుచ్ఛ మ్లేఛ్ఛులనెల్ల మడియించి సార్వభౌముండై ధర్మ ప్రతిష్ఠాపనము గావించివార్ధ క్యమున తపోవనముల కేగుటయును.

తే. కృతము కాసాగె ధర్మువు కృతయుగాన
వర్ణ వ్యావృతి వెలుగొందె వావి వరుస
శాంతు దాంతులు భువినిండె సమతతోడ
స్వార్థ చింతలు వీడిరా సర్వ జనులు

తే. సశ్య సంపన్నమై ధాత్రి చాల బండె
ఆయురారోగ్య భాగ్యమ్ము లవని బెరిగె

పుణ్య కార్యాలు వెలయించ్రి పూతమౌగ
గ్రాలె గ్రహగతుల్ శుభదమై కామ్యమొప్ప

వ. మరియు నా పరమాత్ము కృప యిట్టి ధర్మంబె ప్రవర్తిల్లు త్రేతా ద్వాపర యుగ ద్వయంబు లందును ప్రత్యయ ప్రత్యక్షంబు లనేకంబులుకాననగు. నీవడిగిన గతా గతానాగతంబులగు విశేషంబులెరింగించినాడ. ఇంక నొక్క హిత మాకర్ణింపుమని–

తే. శాంతచిత్తులు బ్రాహ్మణుల్ సమత గూర్ప
సత్య ధర్మాల కొరకునై సహకరింత్రు
పరమ పదమును కాంక్షింత్రు బ్రహ్మ కులులు
భూత హితమది నెలకొల్పు భూరి యశుడ

తే. నియమ వర్తన గావింపు నిజము నెరిగి
ధూర్త గుణ వర్త్న దుర్నయాల్ దూలదన్ను
విడువు గర్వంబు విభుదాళి వీడ కెపుడు
ధర్మ పాలన మొనరించు ధర్మరాజ

తే. అనిన వానికి ధర్మరాజనియె నిట్లు
నీదు హితవుల పాటింతు నియతు నగుచు
లోభ మోహాది దుర్నీత్కి లోనుగాక
ధర్మ శాసన మొనరింతు ధరణి వెలుగ

వ. అని యుధిష్ఠిరుండు మునికి వినమ్రుడై మ్రొక్కి మహాత్మా! బ్రాహ్మణ ప్రభావంబు వినవలతునన, వానికి–

మార్కండేయుడు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావము వివరించుట

వ. తొల్లి అయోధ్యా పట్టణమున యేలు పరీక్షితుండను భానువంశోద్భవుండు మృగయావినోదార్థియై జవసత్వ హయాధిరూఢుండై అడవుల కేగి యందనేక మృగముల వేటాడుచు బోవు వాడొక్కెడ–

క. మృదుపద గజ్జల రవళుల
సుదతులతో నాడి పాడ్చు చూపుల కింపౌ
మదగజయాన యొకర్తుక
మదినెంతో దోచె విభుని మన్మథు లీలన్

వ. ఆ మదవతియు నా భూవిభుని రూప లావణ్యాతిశయంబుల మదినెంచుచు సాభిప్రాయముగా ధృక్కులు నిగిడించి చూచుచుండ డాయంజని ఆ భూ విభుండు–

క. సుదతీ యేకత మిట్టుల
ముదమలరగ నాటలాడ్డు మోదము గూర్పన్
సదయత నిను గోర్దు మదిని
కదియంగా రమ్ము నాతొ గాఢపు కోర్కెన్

వ. అనుడు నా రాజు మాటలాలించి మదవతి గావున ఆ సుదతియు ఓ రాజా!

క. నదినద వాగుల లోనన
సదయుడ నను గోర నంచు సలిలము లాడన్
కదియం రా రమ్మనుచును
అది మాటగ నిలుతువేని ఆడుదు పెండ్లిన్

క. ముదితయు ఆడిన మాటకు
మదనాతురు డగుట కతన మక్కువ గనుచున్
అదియిది అనకను వేరుగ
ముదితుండయి ఒప్పుకొనియు ముచ్చట గూర్పన్

వ. పురంబునకు దోడ్కొనివచ్చి యిష్టోప భోగపరుండై కాలముగడుపుచు కొండొక శరత్సమయం బున తత్పుర–

క. బాహ్యాంతర వనసీమల
వాహ్యాళిగ వెడల నడచి భార్యామణితో
గుహ్యాంబగు పుష్ప పొదరి
సహ్యాంబుల సురత దేలి సత్స్వేదనుడై

చ. వెలిజని తత్సమీప నులి వెచ్చని నీటిమడుంగు నీళులన్
చెలియతొ తానమాడనయి చేయిడి రమ్మన సంతసంబునన్
వలదని యెంత వేడినను భామిని మాటల లెక్క చేయకే
జలములలోని కీడ్చుటయు చయ్యన భామిని నీట మున్గియున్

చ. వెలువడ లేదదెంతకును వెన్కల ముందుల తేలదెంతకున్
తలచెను యెంత జేస్తినని దాపుల నందర హెచ్చిరించుచున్
అలుగుల పారనీకుడని ఆమడ దవ్వుల వేడ్క బంపియున్
జలచయ మింక జేసియును జాడది గానక ఒక్కటేనియున్

వ. అట్లారాజు ఆనతి మేరకు జలచయమింక జేయుటచే అందలి మండూకమ్ము లెల్లను బెకబెక అరచుచున్న తద్భకరవంబులు తన్నుంజూచి హేళన జేయుచున్నవేమోయని అవియే తన రాణిని

మ్రింగియుండు ననియు దలంచిన పరీక్షితుండు భటుల నియోగించి తద్భకచయ రవంబుల విన బడ కుండునట్లు చేయుడని ఆజ్ఞ నిడ స్వామిభక్తి పరతత్పరులైన వారలు దిశ లెల్లెడకుం జని–

క. మడువుల దొరవుల వాగుల

కడలెల్లడ వెదకి వెదకి కప్పల నెల్లన్

గడలకు గుచ్చుచు మోదను

వడవడకుచు ఒక్కరుండు వచ్చియు నటకున్

వ. రాజా! ఇట్టి పనికి ఆన జేయుట నీవంటి యశఃకాములైన వారలకు తగునా? అని యడుగ నా రాజాతనితో ఓయీ! యీ బెకములే నాప్రియ భామను మ్రింగి వైచి నన్నవహేళనగా బెకబెక నగవుల అలరించుచున్నవి. కావున ఇట్లానతిచ్చితి. నీకెందులకు పొమ్మన. ఓ రాజా! యేను–

క. మండూక నాయకుండను

దండాయువు అనెడివాడ దయగొనుమాపై

మండూకాన్వయ స్త్రీ యు

ద్దండులు బేల్పడిరి దాని ధాటికి నీవా

వ. అని అనినంత, అప్పరీక్షితుం డట్లేని నాకు నాప్రియ భామను తెచ్చి యిచ్చి ఒప్పింప వలయు నని ప్రార్థింప, ఆతనిమంచికి మెచ్చుకొనుచు ఆత్మగత తలంపున ఆమెంరావించి రాజునకు యిచ్చి ఒప్పించి కూతుం జూచి కినిసి నీవనేక భూపతుల నవమానించితివి. కావున నీకుం బుట్టినవారలు కపట వర్తను లయ్యెదునని మండూకరాజు జనుటయును, పరీక్షితుండును సంప్రాప్త మనోరథుం డగుట ఆమెం దోడ్కొని పురం బరుగుటయును, కాలాను క్రమంబున దానియందు శలు, దలు, వలుంద్రు అనుఉద్దండులు ముప్వురం బడయుటను, పెద్దవాడైన శలునకు పట్టంబుగట్టిపరీక్షితుం డు తపోవనంబుల కరుగుటయును, శలుడు పెద్దవాడై వేటలకని అడవి కేగి తన వింటి కోలనొక మృగముపై గ్రువ్వ అది దానితోడన పరుగులిడుచు నొక మునిపల్లెకు బోవుటయు, ఆ ముని ధేను వును బలాత్కారముగా బంధించబోవుటయును, మునితన శిష్యులంబంపినను శలుండును వలుం డును లెక్కచేయక ధేనువును విడువ కుండుటకు కోపించిన ఆ ఋషి క్రోధానల జ్వాలలకు ముం దునకుం రాలేక పోవుటయును సర్వజనంబులును రాజసతేజంబుల కంటె బ్రాహ్మణ తేజస్సు గొప్ప దని ఆయన ననేక విధముల ప్రార్థించుటయును, విన విన్న ధర్మరాజు అనుజులతో మునికి నమ స్కరించి మహాత్మా!

క. తమకంటె పెద్దవాడును

అమలిన ఘన కీర్తి పరులు అధిపులు కలరే

తమరొక్కరి వలన దెలియు
మము బోండ్లకు మార్గగామ్లు మానవు లిలలోన్

క. అని వేడగ కలడొకడని
ఘనుడింద్రద్యుమ్ను డనెడు ఘనతరు డుండెన్
వినుమని చెప్పెను నాతని
ఘనకీర్తులు ముజ్జగాల గణ్యం బౌటన్

ఇంద్రద్యుమ్నుని చరిత్రము

క. కాలము గడువ క్రమగతి
తలమందున కీర్తి మాయు ధరణీ పతికిన్
వలవదు నుండం దివిలో
తొలగుము అని వెడలనౌద్రు దొరకొని భువికిన్

వ. అట్లు వెడల నడువం బడియున్న ఇంద్రద్యుమ్నుండు నాకడకు వచ్చి-

క. ఎరుగుదె ఇంద్రద్యుమ్నుడ
తరతరముల క్రిందివాడ ధరణీపతి నే
సురలోకము దిగివచ్చితి
భరతాన్వయ రాజకులుడ పావన గుణుడన్

వ. అని అడుగ, నే మిమ్ముల-

క. ఎఱుగంగ జాలనయ్యెరొ
ఎఱుగందగు పెద్ద కలడు యేర్పడ చెపుదున్
తరతరముల ముదుస లొకడు
గిరిశృంగపు కొమ్ము నేల గెద్దొక డుండెన్

వ. అది నిన్నెరుగం దగునని పలుక దానిం జూపుమని నన్నుం దోడ్కొని పోవ ఇంద్రద్యుమ్నుడు దానింగని అన్నా!

క. నన్నెరుగుదువా అనుచును
నన్నడిగిన యట్టు లడుగ నాపులు గనియెన్
నిన్నెన్నడు యెరుగ
నున్నది యొక కచ్ఛపమ్ము నూతలమడుగున్

వ. అది నా కంటెను చాలా పెద్ద. దాని నడిగిన నిన్నుం దెలియ గలదన ఆ ఇంద్రద్యుమ్నుండు మమ్ములం దోడ్కొని దాని కడకుం బోయి యడుగ నది చాల తడవు ఆలోచనామగ్నముగా కనుం గవ మొగిచి చింతించి శిరము నుంకించి మమ్ములం జూచి యిట్లనియె.

తే. కొలను వెలువడి పైకొచ్చి కూర్మరాజు
కనుట పడలేదు మహనీయు వినుటెగాని
మమ్ము గాపాడినట్టియా మనుజ విభుని
ధర్మపాలుని జగదేక ధరణి పతిని

వ. నేట్కి మీ వలన గాదె ఆ మహాపురుషుని దర్శన భాగ్యము కలిగె నాకు. అని ఆతని పాదంబులకు మ్రొక్కులిడుచు–

తే. తెలియనగు గాదె జనములు తేట పడగ
యజ్ఞ యగాది క్రతువులు నేర్పరించి
అగ్రహారాది దానాలు అట్టె జేసి
పుడమి పాలించి నట్టియా పుణ్యచరితు

వ. నెవ్వ రెరుంగ కుందురని పలుకుచు ఆ మహారాజు దానార్థులై వచ్చిన విప్ర వరులకు తాను దెచ్చి యుంచిన గోగణ త్రొక్కిలుడుచే యేర్పడినదియే కదా యీ ఇంద్రద్యుమ్నమడుగు. అని అను చుండగా ఆకాశగమన మార్గము గుండా అప్సరసల తోడన దేదీప్యమానంబుగా–

తే. దేవదూతలు అరుదెంచి దేవరావె
ఇంద్రలోకము గొనిపోదు మింద్రుయాన
దేవయానము యెక్కుమా తేజమలర
సుస్థిరం బయ్యె నీయున్కి సురుల భూమి

క. విను లోకము గొనియాడగ
ఘన కీర్తుల వెలయు జనుడు ఘనుడై దివిలో
మనుచుండును అంత దనుక
అనుమానము లేదు సుమ్మ అమరుల సమమై

వ. అని చెప్ప వెండియు మార్కండేయునితో ధర్మరాజాదులు మహాత్మా!

కువలయాశ్వుని చరిత్ర

వ. తొల్లి ఇక్ష్వాకు వంశోద్భవుండైన కువలాశ్వునకు దుంధుమారుండను పేరెట్లు వచ్చె ఆన తీయ వలయునన దానికి మార్కం డేయుడిట్లనియె.

క. ఇలలో మునులకు గురువై
వలనొప్పుగ తపసు లందు వయసున పెద్దై
కల దుదంకుండను ముని
జలముల గ్రోలుచు దినములు జరుపుచు నుండన్

క. రయమున లేచి ప్రాతః
క్రియ విధు లెల్లయును దీర్చి కేశవు మదిలో
భయ భక్తి వినయ తత్పర
దయగొల్చెడు ఆత్మవిదుడు తాపస వృత్తిన్

వ. అతని భక్తి తత్పరతకు మెచ్చి ఆదిదేవు డంబుజాక్షుడు ప్రత్యక్షంబై నీకేది కావలయు వరంబు వేడుకొమ్మన నద్దేవదేవు దివ్య పాదారవిందములకు ప్రణమిల్లి–

తే. ఇంత కంటెను భాగ్యమ్ము యేమి కలదు
సదయ సర్వేశ మిము గంటి సాక్షు లలర
సత్య ధర్మానురక్తుండ నిత్యమౌగ
వరము నీయుమ నాకదే భాగ్యమౌగ

తే. అనగ నద్దేవు డట్లనే అగును మరియు
జ్ఞాన యోగత్వ సంసిద్ధ జ్ఞానవంతు
కలడు ముల్లోక విధ్వంసకారు డొకడు
దుంధుడను దానవేయుని ద్రుంపనౌగ

తే. మర్త్యార్థత యొనగూర్పు మాననీయ
ఆది యిక్ష్వాకు కువలాశ్వు అన్వయాన
పదవ తరమున త న్నామ ప్రభవుడైన
బృహదశ్వు సూనుడౌ ప్రజ్ఞశాలి

వ. నీవలన జరుగనగు యీ జగత్కల్యాణ కారణమున సమస్త లోకములు తల్లడి కాకుండ సంత సిల్లెదునని పల్కి అద్దేవదేవుం డంతర్ధానుండైన, ఉదంకుండు యధావిధి తపః కార్యమ్ములు సల్పు చున్నెడ కువలాశ్వునకు–

తే. అధిక జవసత్వ సంపన్ను లైదువేల
సూను లుద్భవు లెంతయుం సూరి వరులు
సత్వదాంతులు వైభవ క్షాత్ర తేజు
లార్త రక్షా పరతంత్రు లాఢ్య గుణులు

వ. అఖిల శస్త్రాస్త్ర విద్యా పాటవ విలసితు లగుచు పెరుగుచు నుండ బృహదశ్వుడు నిజ సుతు కువలాశ్వుం గనుంగొని ప్రాప్త యౌవను సంతాను అత్యంత ధర్మ రక్షాదక్షు రాజ్యనిర్వహణ భారా ధౌరేయుంగా నెరింగి పట్టాభిషిక్తుం జేసి తాను తపో వనముల కేగసమకట్టి యున్న యవసరంబు న ఉదంకుం డటకు యేగుదెంచి–

తే. ధర్మ రక్షార్థ పరతంత్ర ధరణి పతివి
నీదు పాలన కాదొకో నిఖిల జగతి
సర్వ రక్షిత శిక్షితుల్ సమత నుండ్రి
అడవి పోబోవ దగదయ్య ఆర్త రక్ష

వ. విను మొక యద్భుతంబు. మధు కైటభులన ప్రఖ్యాతి వడసిన యసురతనయుండు దుంధుం డనువాడు మహత్తపోవనంబున, పితామహువలన వరంబు లొందిన మదగర్వ దుర్వానుండగుచు ముజ్జగ దేవ దానవ యక్ష రాక్షస నర నాగ పాతాళవాసుల నెల్లర లెక్క చేయక బొలియించుచుం డు. వాడు యిప్పుడు మదీయ ఆశ్రమ ప్రాంతవాసుల కెల్ల ప్రాణాంతకముగా యుండె. వాని వద న గహ్వర వాయువీచికలు తత్సమీపారణ్య ప్రాంతములెల్లను దుర్గంధ విష పూరితగా జేయుచున్న యది. కావున ఆ దుష్టదుర్గంధ పూరితామిష విషోజ్వలాహారు నిర్జించి మాకును సమస్త లోకంబు లకును ప్రియంబొాడ గూర్పు మనుటయు, నీ –

క. ఆతతు వధకై యెవ్వడు
భూతలమున పూనుకొనునొ మోదము తోడన్
ఆతని కెల్లెడ జయ విధి
వాతోద్ధతి మించు శక్తి వాసవు డొసగున్

వ. అని ఆనాడే మహావిష్ణువే ఆనతిచ్చి యుండె.

క. కావున యిక్ష్వాక్వంశా
జావగ జేయగను బూను చాలగ దలచిన్
కావుము లోకుల నెల్లర
ధీ వైభవ నీదు శక్తి తేజోవంతా

వ. అనిన యుదంకునకు అంజలి ఘటియించి ఆ యిక్ష్వాకు వంశోద్భవుండైన బృహదశ్వుండు మునిజనోత్తమా!

క. ఆడియు యిచ్చిన మాటను
వీడడు యిక్ష్వాక కులుడు వీడిన అశువుల్

వీడుదె ధర్మోద్ధరణం
వీడను మీదగు పలుకులు వేదోక్తముగాన్

క. రక్షిత ధర్మోద్ధరుడై
యిక్ష్వాకుడు సాగుచుండు యే యుగి నైనన్
రాక్షస మాయల నెదిరిచి
రక్షించును జగతి జనుల రాజస వృత్తిన్

వ. నా మనవి విన్నవింపుడని మునిపంగవు వేడుకొని-

క. చేస్తిని సన్యాసస్త్రము
చేస్తిని తపోవనము లేగ చేకొన ధన్వున్
చేస్తును రక్షణ నృప విధి
చేస్తును మీ మాట చొప్పు చేయగ సుతునిన్

వ. అని అక్కార్యంబు నిర్విఘ్నముగా జేయ తనపుత్రుని నియమించి తన కనుజ్ఞ నీయ వలెనని వేడ ఆతని చేత అభినందింప బడి బృహదశ్వుండుతపోవనంబుల కరిగె నుటయును, వినిన ధర్మ నందనుడు మార్కండేయునితో మధుకైటభుల వృత్తాంతము దెల్పుమని అడిగిన వానికి వెండియు మార్కండేయ మునీంద్రుడు చెప్ప దొడగె నిట్లు. తొల్లి-

మధుకైటభుల చరిత్ర

క. ముల్లోకము లేకార్ణవ
కల్లోలిత మైనవేళ కరివరదుం డే
తల్లడి లేకుండ నిదుర
నల్లాభోగీంద్రు శయ్య నలరుచు నుండన్

వ. మధుకైటభులను రాక్షసు లిర్వురు నిశ్శంకందిరుగుచు ఆ జలార్ణవ మధ్యంబున-

క. నాభీ కమలోద్భవు గని
ఆభీలోత్సాహు లగుచు ఆర్చుచు రావన్
నాభీ నాళము జొరె నజు
డా భీతము జూచి విష్ణు డాత్మద్యుతుడై

వ. నిదుర లేచినవాడై ఆ దైత్యుల రాబిలిచి మీ ధైర్య శౌర్య సాహసంబులకు మెచ్చితి. ప్రీతి వేదు డు. వరంబు లిచ్చెదనన, వికవిక నగుచు యెగయగ-

క. వరములు నీవేమిచ్చెదు
చరమాంకపు వేళ యిదియ జగదోద్ధరణా

తిరముగ దీర్పను జన్మలు
విరి వరముల నడుగు మిత్ము వేడ్కతొ కావన్

వ. అని గర్వోన్నతి బల్కుటయు నప్పుడు, నారాయణుండు వారితో–

క. సత్య వచనా ధురీణులు
గత్యంతర మేమి లేక గడగితి కావన్
సత్యము నాచే జచ్చెడు
అత్యద్భుత కోర్కె దీర్పు డసురా మీరల్

వ. అని నుడువుటయును, వారలిర్వురు నొండొరు లేకత జూడ్కుల నభినయించుకొని కొండొక వడి–

క. అటులనె వెరువము జావను
యెటులైనను ఆత్మ గేహ మేగుట కాదే
పటుతర సాధన పరుడవు
కుటిలాత్మక రమ్ము మమ్ము కూల్చగ నేలన్

ఆ. జంప దలతువేని జలములే లేనట్టి
తలము నందు మమ్ము దూల్చ నగును
ధాత వరము మదిని దలతువో దలువవో
జలము లేని తలము జగతి లేదు

వ. నీ యిచ్చవచ్చిన తెరంగు నెచ్చోనైనం నీచే జంపబడుదుమన, త్రైలోక్య విభుండైన జగద్రక్షకుం డు ముల్లోకంబులు అంతర్జలమయంబు లగుట నాలోచించి–

క. పరచియు తన యూరు తలము
సరిగా గను వధ్యశిలగ సమయోచనుడై
వరదైతుల శిర బేధన
కర విదళిత చక్రగతుల కడదేర్చె ననన్

క. విని వారల సుతు దుంధుం
డనియెడి ఘోరాతి ఘోరు డాయుధ భుజుడై
తన కెదురుగ వచ్చు నతడె
తన దండ్రుల ద్రుంచె ననుచు దలచుచు మదిలోన్

క. హరి హర యమ పురి నాయక
సుర వాహిని నెల్ల ద్రుంప జూతును అనుచున్

గిరితరు గహ్వర నేలల
దిరుగాడ్చు భీతి గొల్ప తేజోద్ధతిమై

వ. అట్లు నిజతేజో వైభవ వరగర్వితుండైన దుంధుండు సమస్త లోకకంటకుడుగా వర్తిల్లు చుండుటయును, ఉద్దాలక ముని కతమున బృహదశ్వుచే అనుజ్ఞాతుండైన కువలాశ్వుండు తనసంతాన మైదువేలు వెంటరా దుంధుని దురాగతు బరిమార్ప నెంచి తన చతురంగ భట సందోహన పరివారుండై వెడల నడువ యింద్రాది దేవవరులు ముని ముఖ్యులు అనేక విధముల హర్షించి కొనియాడుచుండ ఆకశమున నుండి-

క. దుందుభి నిశ్వన మెగసెను
అందముగా ఆడి పాడ్రి నప్సర గణముల్
నందన విరివాన గురిసె
సందడి కువలాశ్వు సేన సందోహింపన్

వ. ఇట్లు అభిలషనీయ శుభోత్కర శోభాయ జయజయ ధ్వాన మానసుండై కువలాశ్వుండు సుర వైరిపై దండువెడల ఆతని సుతు లేను వేలమందియు-

మ. దురితోపద్రవ రాక్షసాధమునిపై దోర్దర్ప మేపారగా
నరనాధోత్తము నందను ల్సెలగి సేనానీక విజృంభణుల్
కురియం జూపుల వర్ష ధార లనిలో క్రోధానల జ్వాలుడా
సుర తేజోమయ జూపులం గురియుచుం సుంతైన లెక్కింపకన్

ఉ. క్రూరుడు దుంధుడుం డపుడు కోరల దంష్ట్రల చీల్చి చెండనై
వారల నొక్క ఉద్ఘటన పారగ దోలుచు హుంకరింపగా
తోరము గాగ సైన్యములు దూరము దూలియు నేల గూలియున్
గారడి విద్యయో యనగ కాదుర రాక్షస మాయరా యనిన్

వ. వెరగొంది చూచుచుండ మాపై ఆ రాక్షసుండు విరుచుకు పడ మేమును-

ఉ. మారణాయుధావళుల మామక గుప్పుచు లక్షలాదిగా
వారణ జేయనా దనుజ బాధితు డెంతయు లెక్కచేయకన్
క్రూర విషాగ్ని గక్కుచును కూలగ జేయను సర్వ సైన్యముల్
పోరియు మాడి రగ్నులను పూజ్యమునై కువలాశ్వు ముంగలన్

వ. అటుల జరిగిన యుద్ధమున ధృడాశ్వ కపిలాశ్వ చంద్రాశ్వులను ముప్వురు బిడ్డలు తప్ప మిగిలిన కొడుకు లందరును సైన్యం సర్వంసహా మారణ హెూమంబుగా నిహతు లగుట కోర్వనివాడై కువలాశ్వుండు సమయ సంహార సమయంబున కాలరుద్రుండు నుం బోలె ప్రచండ కోపోద్రిక్త

మానసుండై ఉజ్వలతేజుండై కదియ నద్దానవ దుంధుండును సహింపని వాడై శూలాయుధ పాణి యై యుద్ధమునకు గడంగుటయును, అర్కకులసంభవ అయోధ్యా పట్టణనాధుండు కువలాశ్వుండు ఆత్మజనితంబై మండుచున్న మహాగ్నుల నిజయోగవిద్యా ప్రాభవ జనితంబగు ప్రచండ జల ప్రభా వంబున జల్లార్చి నాభీ కమలోద్భవుం మది దలంచి బ్రహ్మా స్త్రముం ప్రయోగించిన–

క. దివ్యాస్త్ర్య జ్వలితాగ్నులు
అవ్యాయతమై దశదిశ లావర్తితమై
సవ్యం బెరుగని దుంధుని
దివ్యంబుగ బూదిచేసె దీప్తి చెలంగన్

క. జగదోపద్రవ దుంధుని
పగదీరగ ద్రుంచినావు పాపం బనకన్
తగు దుంధుమారు డనుచు
జగమెల్లను నిన్ను బిలువ జగదోద్ధారా

వ. అని పల్కుచు ఇంద్రాది దిక్పాలకా గణములును, సురముని సంఘమ్ములును అ క్కువలాశ్వు నభినందించి నీ కభీష్ట వరంబు లిచ్చెద వేడుమన్న, నాతడు బ్రాహ్మణ భక్తియుభాగవత్భాగవతుల సఖ్యంబును దాన ధర్మాది సత్శీలతయును కలుగునట్లు ప్రార్థింప వాని కోరినయట్లు వరంబులు ప్రసాదించి దివికేగుటయును. కువలాశ్వుండు విజయోల్లాస భాసితుండై ఉదంకుని నిజాశ్రమంబు న కనిపి అయోధ్యాపురమున కరిగి నిత్య నూతన వారాంగనా నృత్యగాన విశేషంబుల సామ్రాజ్య సౌఖ్యంబుల బరగు చుండెనని మార్కండేయులు ధర్మరాజునకు కువలాశ్వుడు దుంధుమారుండని కీర్తి నొందిన తెరం గెరిగించెనని వైశంపాయనుండు జనమేజయ మహారాజునకు యెరింగించుట యును. ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయ విరచిత –: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ చతుర్థాశ్వాసము:–

శ్రీమదాంధ్ర మహాభారతము
అరణ్య పర్వము పంచమాశ్వాసము

శ్రీరామా! సీతాపతి
నారాయణ దీనరక్ష నయనానందా!
వేరెవ్వరు నీసాటిల
యేరాయిడి లేక బ్రోవు యిహపర తేజా!

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పునట్ల అనేకానేక పుణ్యధర్మ కర్మాదికరణీయంబులు మార్కండేయుల వారివలన వినిన వాడై ధర్మరాజు వెండియు, మహాత్మా! యెట్టి స్త్రీ పురుషులుత్తము లని చెప్ప బడుదురని అడుగుటయును–

ఉత్తమ స్త్రీ పురుష విషయము లెరింగించుట

చ. పతి కనువర్తనా సమత భాసిలు జీవన సద్గుణాళియుం
అతులిత భోగ భాగ్యముల కాస్పద కార్య శీల సుందరా
హితకర బుద్ధియుం గలిగి ఇంగిత మెర్గు వివేకవంతమౌ
స్తుతమతి భార్యగా మనుట సూకృత మెన్నగ పూరుషాళికిన్

చ. సతియెడ సౌమ్య భావనయు సమ్మతి కోర్కులు దీర్చువాడునుం
అతి ధనవంతుడుం మరియు ఆర్జవ యుక్తుల సాహసుండునుం
కృతికత పాఠనావళుల కొంతయు నెంతయు లోచనుండయిం
పతితుడు కాని సుందరుని భర్తను పొందుట స్త్రీల భాగ్యమౌ

క. తనయులు జననీ జనకుల
కనుకూలురు గాగ నుండి అవసర ఫణితిన్
జనుచును బుద్ధిని శుద్ధత
మనుటది ధర్మాచరణము మహనీయంబౌ

పతివ్రతా మహత్మ్యమ్ము ధర్మజుని కెరింగించుట

వ. మరియు భర్తానువర్త నానురక్తి సక్తయు, పతి శుశ్రూషాది సద్గుణ సమన్వితయుయైన పతివ్రతల మహత్మ్య మెరుంగదగు నొక ఐతిహాస కధను దెల్పుదు. తొల్లికౌశికుండను చండప్రచండ దీక్షణోద్దండ మునివరుం డొక్క వటమూలంబున నాశీనుండై సామవేదము పఠియించుచుండ తదీయ వృక్షాగ్ర శాఖనుండిన కొక్కెర యొకండు ఆతనిపై రెట్టవెట్టిన ఆ మహాముని కోపించిచూచుడు అది నిశ్చేతనం బై నేలం గూలుటయును దుఃఖిత మనస్కుండై–

క. అక్కట యేమిది మనసా
కొక్కెర జావంగ జేస్తి వ్వ కోపము తగునే
మిక్కుటమౌ పాపము గద
యెక్కడ శాంతమ్ము నీకు యెంతయు వగవన్

వ. అని అనేక తెరంగుల వగచుచు మధ్యాహ్నం బగుటయు భైక్షుక విధానుండయి దాపున గల గ్రామంబున విప్రగృహంబుల కేగి అందొక పతి అనురాగవల్లి ఇంటి ముంగట నిలచి భిక్షాందేహి అని అర్థించుటయు, ఆ ఇల్లాలు మాధవ కవళము యిడుటకుం పాత్రకై వెదుకబోవు నంతలో-

క. వేకువ యేగిన పెనిమిటి
ఆకటమున తిరిగి రావ అలమట జెందిన్
వాకిట మంచము దిగిచియు
ఆకలి దీర్పంగ వేగ ఆతృత పడుచున్

క. మండ్వా వాకిట పీటిడి
వండిన పప్పూ పులుసులు వడ్డన జేసిన్
రండని కేకేసి పిలిచి
దండిగ కుడువంగ బెట్టి తద్దయు వేడ్కన్

క. చరణము లొత్తుచు నుండగ
గురుతుకు రాగా మునివరు గుమ్మము లోనన్
మరు నిముసము లోని కరిగి
పెరుగన్నము తోడ పప్పు పెట్టియు తేగాన్

వ. అ మ్మగువం జూచుచు కౌశికుండు రోషరంజిత కషాయితా లోచనుం డగుచు-

క. కులకాంతకు దగునె యిటుల
తలవాకిట యింత దవ్వు తడయగ జేయన్
అలతుల మైతిమె మగువా
వలనొప్పదె పోయిరండు బాపడ అనగాన్

వ. ఆ యిల్లాలు మునివరుతో-

క. కోపము తగదో మునివర
యే పాపము జేస్తి నేను యీ విధి పలుకన్
నా పతి రా ఆకలనుచు
ఆపనిగా ఆలసిస్తి అంతియ కాదే

వ. కావున నన్ను మన్నింపుడన–

క. నీపతి యెక్కుడె మమ్ముల
నీ పగిదిం జుల్కన జేసి యింతయు దనుకన్
ఆపుట పాపము కాదే
శాపింపగ వలయు నిన్ను శాంతుల మగుటన్

వ. ఇంతవరకు వేచియుంటినన–

క. భూసుర మునివరు లలిగిన
భాసురముగ అవని కృంగు బాధిలు జగముల్
కాసిలి మనమది పొక్కుచు
యీసున శపియింపనైన యింకును జలధుల్

వ. నీవింత యెరుంగ వైతివి కదే! అనిన వానికి ఆపె యిట్లనియె.

క. భూసుర తాపస మునులరు
దోసము లెంతురె తమ మది దుర్నయ మగుడున్
నీ సముడౌటది పాపము
భాసురముగ దైవ సములు భార్యకు భర్తల్

వ. నీవతి కోపనుం డవనియు నీ కోపానల ధృక్కుల నొక కొక్కెర నిహతం బగుటయు యెరుంగని దానగాను. క్రోధంబు కొనియాడనగు విషయము కాదు.

క. కోపము నెరుగరు తపసులు
కోపమునం జెడును గాదె గుణ సంచయముల్
కోపము నణచిన వారే
దీపంబై వెలుగుచుంద్రు దేదీప్యంబై

తే. నీతి నైతిక మార్గణ్య నియత బుద్ధి
ఆత్మ శౌచత ధర్మంబు ఆహితాజ్ఞ
శాంత మింద్రియ నిగ్రహణ సామ్యవాదు
డవని వాడెపో బ్రహ్మణ్యు డనగ బరగు

వ. ధర్మంబు అనేకానేక విధంబులయ్యును సూక్ష్మంబై యుండు. నీవు సాధ్యాయన పరుండవు కాని ధర్మసూక్ష్మంబు లెరుంగవు కావున తడయక మిథిలానగరమున కరుగుము. అందు జితేంద్రియుండును, ధర్మ పరుండును, మాతా పితృ దైవ భక్తుండును, సత్యవాదియు నైన ధర్మవ్యాధుండను కిరాతుండు కలడు. నీకు ధర్మసూక్ష్మము లెరింగించి సంశయ విచ్ఛేధనముగావించు. స్త్రీలు శాస్త్రపరిజ్ఞానము

లెరుంగని వారలు. అట్టివారిని సహించవలయు గాదె. అనిన, ఆమె ఆత్మ జ్ఞానమునకు వెరగందుచు కౌశికుండు–

క. నీకతమున నాకిప్పుడు
చేకూరెడు శాంతి మదికి చయ్యన బోదున్
సాకల్యంబుగ నెరుగుదు
ఆ కిరాతుని ధర్మ మార్గ నధిపుని తోవన్

వ. అని తక్షణంబ కౌశికుండు ధర్మవ్యాధు దర్శనలాలసుండై కదలి పతివ్రత యోగదృష్టికి వెరగందుచు తన్నుం దా తిట్టుకొనుచు కతిపయ దివస ప్రయాసప్రయాణముల మిథిలాపురప్రవేశము గావించి రాజమార్గంబుల నేగి అచటివారల ధర్మవ్యాధుని గురించివిచారింప వారెరింగించిన మార్గమున ఊరి వెలుపల మృగయా మాంస ఖండమ్ముల విక్రయించుచున్న ధర్మవ్యాధుం గనిదరిజేర నొల్లక అల్లంత దూరమున నుండి చూచుచుండ ధర్మవ్యాధుడు–

ఆ. అతని రాక నెరిగి అల్లంత దూరాన
వేచి చూచుచుండు వేదవిదుకు
ధర్మవ్యాధు డపుడు తానుగా దెల్పుకు
తనదు గృహము దెచ్చి తగు విధాన

ఆ. అతిథి పూజ చేసి ఆసనం బమరించి
పూజ గృహము నందు పూజనీయు
మాతృ పితృ తోడ మధ్యాహ్న భోజన
పాయసాన్న దేనె పండ్లు పాలు

వ. కుడువం బెట్టి సేదదీర్ప మృదుల సెజ్జ నునిచి–

ఆ. మాటమాట గలపి మర్యాద లెగయంగ
ఆదరంబు మీర లతివ పనుప
వచ్చినారు దూర మెచ్చైన వేడ్కతో
అంతె చాలు మాకు అతిథి దేవ

వ. అనిపల్క, కౌశికుడు ధర్మవ్యాధు నెరుక కచ్చెరు వందుచు పతివ్రత యెరుకయుదలంచి ఆశ్చర్య మానసుండగుచు ధర్మవ్యాధుతో నిట్టులనియె.

తే. ధర్మ మెరిగిన సుజ్ఞాన ధర్మతేజ
ఐనవారల పోషింప అవనియందు

జీవహింసాత్మక కృత్యాలు చేయనేల
చేయరాదొకొ వేరొండు జీవనంబు

వ. అనినవానికి ధర్మవ్యాధుండు యిట్టులనియె. బ్రాహ్మణులకు తపస్స్వాధ్యాయన సత్య బ్రహ్మచర్యం బులును, రాజులకు దండనీతియు, వైశ్యులకువ్యాపార వ్యవసాయాదికములును, శూద్రులకు పశుపో షణా శుశ్రూషయు యెట్లు ధర్మపధములో అట్లే మాకనూ యీ మృగయోపన జీవనము కులక్రమాగ త ధర్మమ్ము. అదియునుం గాక యీ దేశమునకు రాజైనపాలకుండు నిజ ధర్మతత్పరుండైన జనకుడు. వర్ణాశ్రమ ధర్మ రక్షణాది కృత్యముల సర్వజన శ్రేయోదాయకమ్ముగా యేలువాడు. ఆత్మధర్మ వివర్జిత ముగా వర్తించునెడల తమ పుత్రునైనను దండింపం జేయుకావున నేనునూ స్వధర్మాభిరతుండనై జీవి తము గడుపుచుందు. ఐనను–

తే. జీవహింసన చంపను చీమనైన
ఒరులు చంపిన మృగమాంస మొగిన దెచ్చి
ఖండ ఖండాలుగా జేసి కాచి యిడుదు
సంత మిగిలిన ధనమదే చాలు నాకు

తే. అతిధి అభ్యాగతార్థుల నాదరింతు
ఉన్నదానిలొ లేదన కెన్నడేని
ఆర్తి జీవుల కాపాడ్డు ఆప్తితోడ
సత్య ధర్మాను వర్తినై సమత గూర్తు

తే. సతత దానోపవాసనా సక్తపరుడ
కట్టుకున్నామె నొకదాంతొ కలసి యుందు
రతిని ఋతుకాల వర్తనారతుడనౌదు
నింద సంస్తుతి నొకరీతి నెంతు మదిని

వ. అట్లగుటం జేసి పుట్టుచే హీనజాతుండ నయ్యును కట్టడి నీతిపరుండ. నిర్మల చిత్తుండ. ప్రసంగ వశమున యింత చెప్ప వలసి వచ్చె నంతియె. మరియు నీవు ధర్మ బోధనార్థివై ఆ పతివ్రతామ తల్లి పంపగా నాకడకు వచ్చినాడవు. కావున నా యెరుంగు ధర్మ విశేషము లెరింగించెద వినుమని–

తే. ఉర్వి కులధర్మ మెన్నంగ ఉత్తమమ్ము
మానమర్యాద వర్తనే మహిత బుద్ధి
హాని దలపరు మహనీయు లాత్మ విదులు
దైవ సంశేవనాసక్తి దగుల వలయు

తే. విషయ వాంఛల విముఖుండు విజ్ఞుడరయ
సత్యహింసాది సద్గుణి సమత గూర్చు
యెవరి కోపము వారికే యెగ్గు దెచ్చు
కోప వర్జిత సుజనుల కోర్కె దీరు

వ. త్యాగశీలుర కసాధ్యమ్ము లేదు. యెగ్గు చేసిన వారికి ఒగ్గు చేయుటయే శాంతి మార్గము. శిష్టచరితులు కాని కపట వర్తనుల పాలికి పోకుండుట శిష్టాచారులవిధి అని నుడువుటయు, కౌశికుండు శిష్టాచారము లెవ్వియని అడుగుటయును, దానికి ధర్మవ్యాధుండు–

సీ. దానము సత్యమ్ము తపము యజ్ఞమ్ము
పేదసాదల యందున పేర్మినుంట
గోవృద్ధ బాపల గురుజన శుశ్రూష
పురుషార్థ సూక్తుల బూని నడక
అనసూయ సంతోష నభిమాన శీలమ్ము
సత్కార్య చరణమ్ము సాదు వాద్న
సద్గురు సాన్నిధ్య శాస్త్రార్థ గోష్ఠుల
విజ్ఞాన దృష్టిమై విజ్ఞతొంద

తే. వీడకెప్పుడు ధైర్యంబు బీదపడక
దైవచింతన తత్పరా ధన్యునౌచు
తల్లిదండ్రుల సేవనా ధర్మ మెరిగి
మసలు చుండుటె మహితమౌ మాన్యతౌర

వ. "విను మహింసో పరమో ధర్మః" అనిరి బుధులు. అదియును సత్యమును సంతరించుకొన్న బంగారునకు వన్నె పెట్టినట్లగును. మరియును–

తే. శిష్టాచారము నొప్పెడు నిష్ఠ దనరి
వేద విహితార్థ ధర్మమ్ము వీడ కెపుడు
కార్య సాధన వెలయనా కర్త తాను
దేవ పథమున దీప్తిమై తేజరిల్లు

ధర్మవ్యాధుడు కౌశికునకు అహింసా స్వరూప మెరింగించుట

వ. అని చెప్పుచు ధర్మవ్యాధుండు, అయ్యా! నీవు తొల్త నా వర్తనము హింసామార్గంబని గాదె పల్కితివి. దానికి యేను తగు తెరం గెరింగించితిని. అది అట్లుండ హింస అహింస అనునది యేర్పరింప యేరితరము. హింసాహింసలు ఒక్కొక్కపరి తారుమారుగా రూపింపందగు. గురుశిష్య సంబంధమ్మున

శిక్షలు హింసగానేరదు. అటులనే రాజదండన హింసగా పరిగణింపరు. తల్లి తనయునిదండించుట ధర్మసమ్మతమే కాగలదు. ఇక హింస ద్వివిధములుగా గణింపనగు. అవియేవన, శారీరక మానసిక ములు. మానసిక హింస అంతర్గత విషయము. బాహ్యమైనది శారీరకహింస. పురాకృత పాపపుణ్య విశేషణ కర్మఫలములు జీవి శారీరకముగా అనుభవైకయోగ్యము కాకతప్పదని పెద్దలు చెప్పగా విను చుందుము. చంపెడువాడు నిమిత్తమాత్రుండు. ధర్మయుద్ధము శాస్త్రసమ్మతమైన అహిరగా శ్రుతులు దెల్పెడు. శాకోదక ఫలమూ లౌషధ తృణధాన్య తతి పశుపక్షి మృగతతుల కాహారమూ బ్రహ్మనిర్మిత ములని వేదములు ఘోషించుటను కాదనగలమే.

సీ. తొలుదొల్త శిబి యీడె తొడమాంస ఖండముల్
ఇంద్రాగ్నులకు ప్రీతి యినుమడింప
తలకొనె గోవధ దయశీలి జరుపడే
రంతిదేవుడు చాల రహి వెలుంగ
బలిదాన విధమంచు బలిహార మీయరే
యజ్ఞయాగాది క్రతు అధ్వరాల
పిండప్రదానాది పిత్రు కార్యములందు
ఆమిషాన్నపు కడి అర్హమగుడు

తే. అగ్నులధిక మాంసార్ధు లనుట వినమె
కన్నులూడ దీస్కు శివుకిడె కన్నయప్ప
దురిత మంటెనా? వీరల దుర్నయాల
హింసాహింసలు మనసునం దిమిడియుండు

తే. చిన్న చేపల పెనుచేప చెలగి మ్రింగు
కోరి కీటకాదుల దిను కోడిపుంజు
జీవికాహార మింకొక జీవికాదె
హింస కానట్టి జీవన మెందు కలదు

వ. హింసాహింసల నేర్పరింప నేరితరము. ధర్మమ్ము బహుభంగులై వర్తిలుచుండు. తదీయ సూక్ష్మ గతి దురవగాహనమ్ము. కావున శ్రుతి వచనముల వలనను పూర్వాచార ప్రక్రియల మూలములను యెరుంగునదియే ప్రమాణము. వివాహాది పుణ్యకార్య సంఘటన లందును ప్రాణ విత్త మాన భంగ పాటు పరిస్థితుల యందును పల్కిన బొంకువలని పాపమంటదని విజ్ఞుల ప్రవచనము కాదె. ఇట్టి వియే ధర్మ సూక్ష్మములని పల్కుచు–

క. తప్పైనను ఒప్పైనను
చొప్పడి కులధర్మ మంటి సుజనుం డిలలో
గుప్పిట గౌరవ ముంచుకు
ఒప్పిదముగ బ్రతుక నేర్చు ఓపిన కొలదిన్

వ. అని పల్కి వెండియు వినుమని జగతి జీవులకు కర్మ వలన జన్మను, జన్మ వలన కర్మయు ఇవి రెండుయు ఒకదానిపై ఒకటి అనువర్తితమై పొందుచుండు. మూఢ మానవుడిది తెలియక దైవదూష ణులగుచు నుంద్రు. పురుషుడు తానే కర్తనని తలంచుట అవివేకము. నిజమునకు తానే కర్తయగున పుడు సర్వకార్యములును ఫలప్రదముగా చేసుకొనవలయుగదా. విజ్ఞుల మనుకొనువారల కార్యంబు లు కొన్ని యెడల సిద్ధి నొందుట లేదు. అమాయకులు అజ్ఞానులు ఐన వారలొనర్చు పనులు ఫల ప్రదము లగుచుండుటయు కద్దు. కొందరాయాసపడియు కార్యములయెడ నిష్ఫలాలంబులుగా మిగి లియుంద్రు. కొందరెన్ని పుణ్యకార్యము లొనరించియు సంతానహీనులుగా పొడము చుంద్రు. కావున కర్మ ఫలము దైవాధీనమని యెఱుంగనగు. కర్మ ఫలము తనయందే ఉండునపుడు పురుషుడు ఆధి వ్యాధి జరామరణములు లేక సుఖజీవనుడుగా బ్రతుకనగు గాదె? దేహధారుండైన జీవుడు కర్మ పరిప క్వమైన తదుపరి తద్దేహమును వీడి కర్మ రహితమగు చోటికరుగు. అని వినిన కౌశికుండు జీవుండెట్టి వాడని అడుగుటయును–

ధర్మవ్యాధుడు కౌశికునకు జీవి లక్షణములు దెల్పుట

తే. దేహధారుడు జీవుండు దీప్తుడనఘు
డాత్మరూప సనాతనుం డాఢ్యు డెన్న
కర్మ వశమున జనియించు కాలవశత
చెడిన కాయంబు వీడుచు జేరు వేర

వ. మరియు పాప పుణ్యానుగణ్య బంధంబు లివియ నంచు –

క. బహు పుణ్యులు దివి జన్ములు
ఇహపర సాధన పరులరు యీ భువి జన్మల్
బహు కల్మష కర్ము లకట
బహువిధ కీటక తతులుగ భవమొంద్రు రనిన్

క. ఆశా మోహన జీవన
మాశాంతము గల్గు చుండు అంతము గాకన్
కాశిం బెట్టును జీవుల
శాశ్వతముగ ముగియ జేరు సర్వేశు దుదిన్

క. ఎరిగియు యీ విష వలయము
దురితపు దోవలను జనక దూరపు దృష్టిన్
నెరవాదులైన బుధులరు
పరమెంచుచు ధర్మ మార్గ పారగు లగుదుర్

క. ఎరుగక జగతిని జీవులు
తిరముగ పరమార్ధమెంచి దీధిత బుద్ధిన్
చిరముగ ధర్మము నెఱపుచు
మురియక ఇంద్రియపు లోల్త మూర్ఖుడు గాకన్

క. దరి జేరక పాప గతుల
పరిపరిగా చింత జేసి పావన గుణుడై
పరిణితి జెంది క్రమ గతి
పురుషోత్తము నెంచు మదిని పూనిక తోడన్

తే. అనిన ఆ కౌశికుండు చండాలుతోడ
ఇంద్రియంబుల గతు లెవ్వి యెర్గి వాని
నిగ్రహింపక నున్నచో యేమి దొడరు
నిగ్రహించిన ఫలమేమి నిజము దెల్పు

వ. మని వేడుటయు. నంత–

తే. ఇంద్రియము లేను దేహమం దిమిడి యుండు
మనసు మూలమై నవియెల్ల మసలు చుండు
కామక్రోధాది లోభాల క్రమ్మి మదికి
బుద్ధి మాంద్యము నొడగూర్చు శుద్ధ జీవ్క

వ. మరియును శ్రుత్త్వక్చక్షు జింహాఘ్రాణేంద్రియము లేనును క్రమగతిని శబ్దస్పర్శరూప రస గంధన విషయజ్ఞానము నుత్తేజ పరచుచు మనోబుధ్యహంకారముల లోగొనుచు పంచ భూతాత్మక ప్రదీప్తంబై భాసిల్లుచుండు.

క. వ్యక్తా వ్యక్తం బగుచును
రక్తికి ముక్తికిని రెంట రమ్యోద్ధుతులన్
శక్త్యాను సరణి యింద్రియ
యుక్తంబై వెలుగు చుండు ఉద్దీపింపన్

వ. కావున జీవుడు సద్బుద్ధిందవిలి విషయేంద్రియ లోలుండుకాక వానిని గుదియింపనగు. జితేంద్రియులైన ధీ రమణులు తమ యందలి పరతత్వమును మనము నందెల్లప్పుడు వీక్షించుచు తపంబుల అన్యధా చలింపరు.

క. తపమన సుస్థిర బుద్ధియ
తపమన వాంఛా విముఖత తపమన దీక్షా
తపనము. యేకత మనమున
తపమన యేకైక కాంక్ష తాత్మ్యత దెలియన్

క. స్వర్గము నరకపు భావన
నిర్గుణ బుద్ధిని దెలియును నిజమూహింపన్
వర్గీకరించి పలుకగ
మార్గము మది దోచదెందు మానవ తతికిన్

క. అరదము దేహము లశ్వము
లిరవుగ యింద్రియము లేను యిహ సుఖ గతులన్
తెరువెరుగక బోవ నవక
తిరముగ నడుపునది బుద్ధి దేహాత్ములకున్

వ. అనవిని ఆ విప్రుడు సత్వ రజస్తమో గుణములతెర గెరిగించుమని అడుగుటయును ధర్మవ్యాధుండిట్లనియె.

క. సత్య సమాహృది సత్వము
నిత్యము యీ దేహ మంచు నిగుడుట తమమౌ
నిత్యానిత్యము లరయుట
అత్యంత రజో గుణంబు అనునవి మూడున్

వ. శాంత సత్వ దయ కరుణాదులు సత్వ గుణములు. రాగ సంతోష ధైర్య స్థైర్యమిత్యాదులు రాజస గుణ ప్రధానములు. దీన దైన్య నిద్రా విమోహాదులు తామస భావములు. సాత్వికుడు లోక వృత్తము సమస్తము నెరుంగుచు సర్వసంగ పరిత్యాగిగా తామరాకున నున్న నీటిబొట్టు వలె సంసార సాగర మధ్యమ్మున నుండియు అంటీ అంటనట్టుల నిమిత్త మాతృండుగ అహంకార మమకారముల వర్జితుండై సంయమ భావన జీవనుండై శాంతినొందియుండు. సత్వగుణుండైన శూద్రుండైన నేమిజన్మాంతరముల ఉత్తమ గతులం ప్రాప్తించుకొని భవ విముక్తుండగు నని చెప్పిన, అ మ్మహీసురుండు ధర్మవ్యాధు నభినందించుచు మహాత్మా! నీవు సర్వజ్ఞుండ వగుట యింత యెఱింగించితివన, ధర్మవ్యాధుండతని కిట్లనియె.

క. ఏనిమ్మెయి ఉత్తమమౌ
జ్ఞానోన్నతి వడయ గల్గు జాగృతి మూలం
బౌనది కలదొక ధర్మము
భూనుత నీకెరుగ పర్తు బుద్ధిని కనుమీ

వ. అని నిజగృహాంతర మధ్యస్థంబైన చతుశ్శాలా విలసితంబగు మనోహరంబౌ గదిని సమీపించి.

క. రమ్మని నడుపుచు లోనికి
గుమ్మము వాకిలిని దాటి గూటిల నున్నా
అమ్మను అయ్యను కనుమని
నమ్ముము నా దైవతములు నాకగువారల్

వ. అని పల్కి తానునూ వారల పాదాభివందనము గావించి వారల కుశలంబడిగిన వారలు తన యునితో–

క. కుశలము గాకేమి చెపుమ
అశనము నీరముల నెల్ల నడుగక ముందే
నిశయిది రేయిది యనకను
వశవర్తన జేతు వెపుడు వత్సా మాకున్

వ. నీయట్టి సత్పుత్రుని బడయుట కంటె వేర భాగ్యము లేల మాకు.

తే. నీదు ధర్మమ్మె గాపాడు నిజము దెలియ
వంశ వర్ధన కీర్తుండ వగుదు వయ్య
అనుపమా ధర్మవర్తనుం డవుదు జగతి
ఆయురారోగ్య భాగ్యమ్ము లందగలవు

వ. అని పలుక, నప్పుడు ధర్మవ్యాధుండు వారికా కౌశికుం జూపి యిమ్మహాత్ముండుమనల జూచు వేడ్క యింతదూరము వచ్చినాడన నా వృద్ధులాతని నాదరంబుదెలియ అర్ఘ్య సత్కారములు గావింప జేయ గైకొని వారలుసముచిత భాషణముల సంతృప్తులం జేయ నవ్విప్రునకు లుబ్ధకుండిట్లనియె.

చ. జననియు దండ్రియుం గురుడు జాగృతి నగ్నియు దేవదేవులం
అనయము పూజ సేయనగు నా గృహమందున నెల్ల వేళలం
దనియుచు లచ్చి యుండునన తాల్మితొ పెద్దలు చెప్పుయెప్పుడున్
జననుత చేయుచుందు నల చెయ్యన సేవలు దైవమంచనిన్

వ. పతివ్రత పనుపునం జేసి కాదె ధర్మసూక్ష్మమ్ము లెరుంగనయి నాకడకు చనుదెంచినాడ. తత్పతివ్రత అనుగ్రహంబున కాదె నీ దెస నా చిత్తము ప్రసన్నంబై యుండియు నీచేసిన అకార్యంబొక్కటి

నామదిగలంచుచున్న డదెయ్యది యనిన–

చ. మది చెడకుండియు తనదు మానస వీధుల నెల్లవేళలన్
పదిలము గాగ నీదు దెస పాపము అంటక ఉండులాగునన్
అది యిది చెడ్డ చెప్పకను అందరి తోడను మూగ జీవులై
ఒదిగియు జీవనేచ్ఛమెయి ఓపిక లేకను మాట మాత్రమున్

చ. ముదుసలు లెంతయుం మరియు మూల్గుచు నుండిన తల్లిదండ్రులన్
వదలియు వచ్చినాడవిట వద్దనుచుండగ ధిక్కరించియున్
పదిలము నీదురాకకయి పాయక జూచుచు నున్న వారలన్
వదలుట పాడిగాదు జని వారల బ్రోవుమ భక్తియుక్తులన్

వ. అనిన కౌశికుండతనితో యిట్టు లనియె. మహదాశయా!

చ. వినదగ జెప్పితెంతయును వీనుల విందుగ ధర్మ మార్గముల్
చనియెద ఇంటికిం యిపుడె చాలగ జేస్తిని పాపమింతకున్
మునుపటి మార్గముం విడుదు ముచ్చట గూర్చుదు తల్లిదండ్రికిన్
అనువుగ సేవలం జరిపి హాయిని పొందెదు మానసంబునన్

క. నీ తోడి చెలిమి కతమున
నా తపము ఫలించు గాదె నయమున నాకౌ
ఆతత భావము లుడుగుచు
చేతో మోదమ్ము గూరె జేజే పరతన్

చ. అనుపమ దుర్ఘటంబయిన అంతర దృష్టియు ధర్మ సూక్ష్మముల్
కనుగొని చెప్పగా దగిన గండడు కోటికి ఒక్కడుండు నే
నిను నొక శూద్రుగా దలప నేరము కాదొకో? పూరుషాళికిన్
వినదగు నీ చరిత్రములు వీనుల విందుగ పూర్వ వృత్తముల్

వ. అనిన వానికి ధర్మవ్యాధుడు

ధర్మవ్యాధుడు కౌశికునకు తన పూర్వ జన్మ వృత్తాంతము తెల్పుట

చ. విను. తగ జెప్పుదుం మదిని వేదన జెందకె దైవలీలకుం
వినుత గుణాఢ్య భూసురుడ పేరిన భక్తుడ వేదవేద్యుడం
ధనికుడ పూర్వ జన్మమున ధార్మిక చింతన జేయువాడనుం
అనుపమ విజ్ఞనొచు నిల అందరి మన్నన లందినాడనే

వ. నా జనకుండు రాజాస్థానమున మంత్రి మండలాధ్యక్షుండౌట కతన, నాతోడి వయస్కుండైన ఆ రాజ సుతుని తోడ నేనునూ ధనుర్వేదము నందారితేరిన వాడనై అమ్మహీపతి వేట వోవుట నాతని తోడ నేనునుం వేటనం దవిలి శర ములు సంధించి విడువ నందొక శరము వనాంతర ఆకుజొంప ముల నడుమ నున్న తాపసికి దాకుటయు, "హారామా" యని అతండు నేల వ్రాలుటయు అదివిని–

క. నేనుం జేరియు నాతని
మేనిం నాటిన శరమును మీదికి దిగిచిన్
కానం దొరికిన ఆకుల
లోనిం రసములను దుడుచు లోననె నాపై

క. చురచుర జూచుచు లేచియు
యెరుగవె యేమౌనొ యంచు యెంతయు కినిసిన్
తరుగని కోపము తోడన
యెరుకుగ జనియింతు వవల యెవ్వడ వనుచున్

వ. అడుగుటయును, నేనాతని ననేక ప్రకారంబుల ననునయింపం, యెరుగక్న చేసిన తప్పు మన్నిం పుడని వేడుకొనగా దయార్ద్ర హృదయుండై ననుం కనుగొనినాదు మాటకు తిరుగు లేదు.

ఆ. బ్రాహ్మణుండవయ్యు బాణంపు విద్యల
యెరుకలేని మదిని యింత పనికి
పూనుకొంటివౌర బుద్ధి హీనుడవౌచు
యెఱుకవౌచు పుట్టు వెట్టులైన

వ. అయినను పూర్వాపర జన్మ జ్ఞానమ్ము సిద్ధించు.

క. నీ విద్యా పాటవములు
సేవాధర్మములు యెల్ల చేద్పుడు దనుచున్
ధీవైభవ గుణ దీప్తుడ
ఆవేదన కూడదంచు అంతర్ముఖుడై

వ. సమాధి స్థితుండగుటయును, నేనీ జన్మంబున మాతా పితరుల సేవనమును, దైవచింతయు కల్గి నుంటినని పల్కుటయును, కౌశికుండు ధర్మవ్యాధునుద్దేశించి–

ఆ. జన్మ మెద్దియైన ఘనమైన చరితమ్ము
గల్గు టెంత వింత ఘనుడ చెపుమ
తపసి జనుల మాట తథ్యమ్ము కాదొకో
బ్రహ్మ వేత్త వీవు పావనుండ

వ. పాప వర్తనుండు బ్రాహ్మణ జాతుండు శూద్రుని కంటెను హీనుడగు. సత్య శౌచాది సద్గుణ సంపన్నుడైన శూద్రుడు సద్విజుండని అనరె బుధులు.

చ. తనదగు బుద్ధి మాంద్యముల తద్దయు చేకుదు సౌఖ్య దు:ఖముల్
వినుము మునుజేసి నట్టి అవివేకపు చేష్టలు ఆత్మ దోషముల్
ఘనముగ మంచి చెడ్డ లిల గాఢతవొచ్చు బాధజేయుడున్
మనముల క్రుంగదీయు అనుమానము లేదిటు యెంచి చూడగన్

చ. బుధజను లెంచ రెద్దియును బుద్బుద ప్రాయము జీవితంబనిన్
సుధయును కాలకూటమును చూచుడు పుట్టవె ఒక్క నీట నా
విధముగ మంచి చెడ్డ లెడవెట్టక నుండును ఒక్కచోటనున్
బుధజన వీడు బేధములు. పొందుము సౌఖ్యము సామరస్యతల్

వ. వివేకవంతులెందులం విచారింపరు. నీవు ప్రాజ్ఞుండవు. వివేకవంతుడవు. కావున వగవ తగదు. యెట్టి స్థితి యందునను సంతోషముగా నుండుటయే ఆర్య మతము. ధీరుండవై యుండుమన, ధర్మ వ్యాధుండు మహాత్మా! నీవిట్టు చెప్పిన యింతవట్టు నిఖేదనుండనై భవిష్యత్కాల సద్భావములందు సమాహితుండనై యుందు. అన ఆ భూదేవుండు ఆతనితో–

క. అమలిన పుణ్యమ వీవే
తమ వినిచిన సూక్ష్మ దృష్టి దారుల నడువన్
సమయజ్ఞత పాటింతును
మిము బోంట్లను జూచునంత మీదట దెలిసెన్

క. అని యతనిని కొనియాడుచు
తనియంగా కౌగలించ్కు దయగొను మంచున్
కనులందున నీరు నిలువ
అనుమతితో పోయివత్తు నని తా నరిగెన్

వ. కౌశికుండు తన తల్లిదండ్రులకు అతి భక్తి ప్రపత్తులతో సపర్యలు జేయుచు కృతార్థుండయ్యెనని తెల్పిన విని ధర్మరాజు సంతోషించిన వాడయి మరలమార్కండేయునితో –

తే. అగ్నిదేవుడు జేసినా డనుప తపము
తేజమేర్పడ దేవతా ద్వేషియగుచు
యేమి కతమున జేసెనో యెరుగనైన
వినగ దలపుము విశదమ్ము వినుపుమయ్య

వ. అని అడుగుటయును–

అంగిరశుడు అగ్నియైన విధంబు యెరింగించుట

వ. ఆది నొకప్పుడు అగ్నిదేవుడు దేవతలతో విరోధించి హవ్యంబుల ఆహూతుల గొనక తపంబున అత్యంత కృశుండై ఆత్మగతమున నిట్లని తలంచె. నేనిట్లు వెలుగకున్న జగంబుల సర్వకార్యముల స్తబ్ధత యేర్పడును. అట్లగుట జగత్పితయైన జలరుహసంభవుండు అగ్నిపథమునవేరొండు ప్రకారము గావించు. కావున నాకిది తగదని నిజపథమున నుండ నగునని జని అంతకు మున్నే బ్రహ్మనియోగంబున త్రిలోకములకును అగ్నియై వెలుగొందుచున్న వాని అధిక తపో విజృంభణకు అగ్నిరశున్ గని భీతిలి యెప్పటియట్ల మగిడి బోవునెడ అంగిరశుడగ్నిపాలికిం జని అనఘ తిమిరాపహరుడజగ త్రయార్చితుడ ప్రధమవహ్ని పథమ్మున మెలంగువాడ. బ్రహ్మ నిర్మితుడ. నీదగు పథంబున నేనుండుట తగదని, నీవు నీ ప్రథమ వహ్ని పథమున నుండవే అనిన అగ్నిదేవుడు నియమితుడవైన నిన్నాదని మరలనేనా పథమున కేగుట అపకీర్తి హేతువై జను. కావున ఆ పథంబున నాకుండ నిష్టంబులేదు. నీవుప్రథమాగ్ని స్థానంబున నుండుము.నేను ద్వితీయంబగు ప్రజాపత్యవహ్నినై వర్తింతునన అంగిరశుడు, దేవా! నీవ ప్రథమాగ్ని స్థానంబునుగైకొని నన్ను నీప్రథమ పుత్రుగా గైకొనుమన, పావకుండట్లనే యనుటయును, అట్లంగిరశుండు అగ్ని సారూప్యంబున తేజరిల్లుటయును, అంగిరశునకు శివయను దానియందు ఆరున్నొక్క జతల స్త్రీ పురుష సంతాను లగుచు తద్వంశము క్రమానుగతిని అనేక అగ్ని వంశంబులు ప్రవృద్ధంబగుటయును. ఇట్లా అగ్ను లెల్లరుం తదీయ స్థావరాన్వయులై ధర్మసాధకులైన వారుచేయు యజ్ఞ యాగాది క్రతువులందలి హవ్యంబుల గొనుచు దేవ ముఖ్యులకు అందించుచు సకల ధర్మ సాధకు లగుచునుండిరి. ఇట్లగ్ని హవ్య వాహకుడుగా వెలుంగుచు దుర్బలుండై అధ్వరుండనువానికి తన తపసులు జూచుచుండునదిగా పల్కి సేదదీరుటకునై సముద్ర జలంబులమరుగున దాగుకొనియుండ దేవతలు అగ్నిదేవు డెచ్చటెచ్చటని విచారించుచు వెదకులాడు చుండ తద్జలచర మీను లెల్లను సురలకుఅగ్నియిందున్నాడని పల్కుటయును, అందులకు కినిసిన అగ్నిభట్టారకుండు జలచరంబులైనమీనులను జనంబులు నిర్దయులై పట్టి తినుచుందురని శాపంబిడుటయును, హవ్యవాహనునకు యియ్యకొనక సమీరవాహుడు తనదు మేను విడుచుటయును, అట్లు విడిచినఆఅగ్నిదేహము నుండి రత్నరాజిత శిలానిర్మితంబులును సుగంధ గంధకాదులును స్ఫటికమును పుట్టుటయును, అగ్ని అప్పుడు భూ గర్భ మధ్యస్థుండై ఘోరతపంబు చేయుచుండ భృంగ్వంగింశ భరద్వాజాది మహామునులు అగ్నినిప్రార్థించుటయు అగ్ని భూగర్భమునుండి వెలువడి పైకి వచ్చి యెప్పటియట్ల అఖిలలోక హితంబుగా హవ్యవాహనంబు వహించుట యును, ఇట్లనేక విధముల యయ్యగ్ని ప్రశస్థములై ప్రశంశా భాజనంబయ్యె. అగ్నులెందరెన్ని విధంబులున్నను తదాత్మయైన తేజమ్ము ఒక్కటియే అనిపల్కిన సంతసిల్లి ధర్మనందనుండు మార్కండేయ మహామునికి యిట్లనియె.

క. మునినాథ మహాసేనుం
డనలుకుం గృత్తికలకు హరునకు సుతుడై
న నిమిత్తమేమి విధమో
వినగోరితి యెల్లయును సవిస్థర గతులన్

మహాసేనుండు అగ్నికిని కృత్తికలకును హరునకు సుతుండైన విధంబు

వ. ఇంద్రుండొకప్పుడు దైత్యులతో రణంబున నోడి దేవగణ సహితుండై మానస శైలాగ్ర భాగంబుల గ్రుమ్మరుచు దానవుల నోటుచేయంగల సేనాపతిని యెందుబడయం దగునోయని చింతాపరుండై క్కనాడొక్కండు కార్య చింతనాపరుండై యుండునెడ –

క. అన్నా నన్నీ దనుజుడు
వెన్నంటి దరుముచుండె వీడకె పట్టన్
సన్నుత మూర్తులు యీ దరి
నన్నుం గావంగ రారొ నా యనువారల్

వ. అనునొక స్త్రీ ఆర్తనాదంబు చెవులం బడుట తడవుగా పురంధరుండు నిజాంతరంగంబు తృణాంత రంగితంబగు టయు–

ఇంద్రుండు కేశియను దనుజుని పారదోలుట

క. వెరువకు మబలా యిది నే
అరుదెంచుచు నుంటి వేగ ఆతండెవడో
దురితిం ద్రుంచెద నని రా
కొరకొర జూచుచును వాడు కోపోద్రిక్తన్

క. విరుచుకు పడుచును దనుజత
కిరకిర లాడంగ దంష్ట్ర కేరుచు తనలో
తరమెరుగక వచ్చె నెవడొ
అరనిముసము లోన ద్రుంచి అవనికి దోతున్

వ. అని దూకుచు రా సురేంద్రుండప్పు డా దనుజునిత–

క. ఎవడనుకొంటివి యేమో
భువనాంతర దేవలోక పురనాధుండన్
కవయగ రమ్మి యింద్రుని
అవనీతలమునకు దోస్త్వ యసురుడ నన్నున్

క. అనుచున్ కేశియు విక్రమ

దనుజోద్ధతి జూపనెంచి తనదౌ గదనుం
కినియుచు విసరగ ఇంద్రుడు
తనదౌ నిశితాస్త్రమేసి తాకగ నంతన్

క. ఆ దానవ వీరుండును
పాదోద్ధతి దన్ని గిరుల పటుతర ముష్టిన్
బాధిల జేయం వాసవు
డా దానవుపై తన కులిశాస్త్రము వేయన్

వ. ఈ విధముగా జరిగిన యుద్ధమ్మున వజ్రాయుధము ధాటికి నిలువలేని ఆ దనుజ కేశి అక్కన్నియ మాట మరచి ప్రాణంబులు రక్షించుకొన తిరోగతుం డగుటయును, ఇంద్రుండా అబలను చేరం బిలచి, యెవ్వనిదాన విట్లేల యీ దనుజనిన్ను వెన్నాడుచు వచ్చె నిటకు అని అడుగ ఆమె ఆతనితో

క. అన్నా నే దేవ వనిత
నన్నుం చెలి దైత్యసేన్ను నదియిది యనుచున్
వెన్నంటి వచ్చుచును పొ
మ్మన్నా మము విడిచి పోడు మాపై కోర్కెన్

వ. నే ప్రజాపతి తనయను. దేవసేన యంద్రు. నాచెలి దైత్యసేన. మేమిరువురమువిహారార్థమై పెద్ద ల యనుమతం బున వచ్చిన యిచట

క. ఎటులన జూచిన వాడో
పటుతరమౌ కోర్కె తోడ బడయగ మాతో
యెటుబోయిన అటు వచ్చుచు
మటుమాయల దైత్య సేన్ను మాయము జేసెన్

క. నన్నుం గూడను రమ్మని
యెన్నెన్నో మాయ పల్కు లేమేమొ యనిన్
వెన్నంట, మొదలు వెట్టిన
నన్నుం గాపాడ్తి విటుల నసురను దోలిన్

క. అని పల్కిన ఆమె తనదు
జననికి చెలి కూతురగుట జాగృతి నెరిగిన్
కనుమిదె నా చెల్లి వగుదు
వినిపింపుము నీదు కోర్కె వెలదుక యనినన్

వ. అనిన ఆ దేవసేన అన్నా! నా చిన్నతనాన నన్నొడి యందుంచుకొని లాలించుచు-

క. మున్నొక నాడనె జనకుడు
నిన్నొక తేజోధికుండు నిజమూహింపన్
యెన్నంగా చేకొను విను
పన్నుగ నా మాట నిజము పడతుక యనియెన్

వ. కావున అప్పుడామె–

చ. అనిమిష లోచనా జనుల కగ్రత నుండను దండనాయకా
దనుజుల నెల్ల ద్రుంపనగు ధార్మిక తేజుడు వీరయోధుడుం
మునిజన పూజనీయ సురమోదిత రూప ససుందరోజ్వలుం
తనియగ నీకునుం జెలుని ధన్యత గూర్పవె నాకు భర్తగాన్

వ. అనిన నయ్యింద్రుండు దీనికి భర్త యెవ్వండోయని చింతించుచు అమ్మొహూర్తమ్ము సూర్యచంద్ర సమాగమన సంయోగ జనకంబైన అమవస యగుటయును దివజమునివరు లెల్లరుంవేల్చు తేజోవంతంబగు హవ్యంబు లరుణంబై వెలుగొంది రూపొందుటయును పొడగట్టి మహా తేజోరూప రౌద్రారంజిత శోభితుండై బుట్టినవాడు దీనికి వరుడు కాగలడని నిశ్చయించు కొన్నవాడై పితామహు పాలికిం జని–

క. తాత తెలుపవె దీనికి
యే తావుల నున్నవాడొ యెవ్వడు పతియో
భూతల దివిజుల నెల్లర
వాతోద్ధతి మించి చెలగు పటుతర జవనున్

వ. అని వేడిన నయ్యమరేంద్రునకు పితామహుం డిట్లనియె.

క. భూతల దివిజానుత, ముని
మాతల కుదయించువాడు మహిమాన్వితుడున్
యేతరు డార్మోముల ఘన
శీతాంశు ముఖుండు దీన్ని చేకొను ననుటన్

వ. ప్రీతుండై పితామహులకు ప్రణమిల్లి నిజలోకమున కరుగుటయును, తదనంతరమున కాశ్యప వాసిష్ఠాది దేవ మునివరు లెల్లరుం అమావాస్య హొమంబుచేయ సమకట్టిన–

క. అయ్యె య్యావిర్భాగము
చెయ్యన చేకొన సురలు సన్నద్ధులవన్
నెయ్యమునం హవ్య వహుడు

అయ్యసుర యోగ్య తతికి అందీయుటయున్

వ. అత్తరి యా యాగ వర్తన క్రియా సమయసందర్భముల –

క. మదనానురాగ రంజిత

సుదతులు సురముని సతులరు చూపుల కింపై

సదయుల కెల్లెడ హితవుగ

ముదమున పతి సేవలందు మోదము గూర్పన్

వ. మరియు నా అంగాంగ రాగ రంజిత స్వర్ణాలంకృత శుభగ శోభన శోభితలౌ–

క. మగనాలుల వయ్యారము

మగసిరులను దోగి దోచు మార్దవ యుక్తుల్

వగజూపుల నయగారము

శిగ దురిమిన పూ పరిమళ శింగారమ్ముల్

క. నడయాడెడు తీరులు మరి

యొడి కట్టుల కోక సొబగు వొయ్యార్జూపుల్

ముడి వెట్టిన జడలందము

తడియారని వల్వ సొబగు తక్కుం దనముల్

వ. అతి రమ్యంబుగ ఆకర్షణీయంబై తమ మధ్యస్థంబగు యాగ˘వేదిక జుట్టుం పరిపరిగా దిరుగు వారలం జూచి జూచునా–

క. అనలుడు మదన వికారత

ముని పత్నుల వెంటనంట మోహితు డగుటన్

మనమున వగచుచు పెల్లుగ

వనితామణి అగ్ని భార్య భయమొంది మదిన్

వ. పతి యనురాగ రంజిత గావున అ వ్వనితామణి స్వాహాదేవి మనంబున పెక్కు గతుల చింతించి తన పతికి ప్రియంబొనగూర్పని నాడాతండు విగత శరీరుండగుట కుద్యుక్తుం దగుటయును గ్రహించి నది కావున పతిని రక్షించుకొనుటయే సతి ధర్మమంచు చేయునది లేక–

క. తప్పైనను ఒప్పైనను

తప్పదు తన విభుని రక్ష తనదౌ పనిగా

ఒప్పుగ మునిసతి రూపుల

మెప్పించుచు అగ్నిదేవు మోదితు జేయన్

క. కామాతురు మోహాతురు

తామసులై కన్ను గాన్క ధర్మేతరుడై
నీమము నిష్ఠయు వీడుచు
పామరులై బుద్ధి హీన్త పయనింతు రనన్

వ. మునిపత్నులయందు మోహాతురుడు గావున నయ్యగ్ని మునిపత్నుల తోడనే రమించుచుంటినన్న భ్రాంతితో తద్రూపరంజితయగు నిజసతి స్వాహాదేవిం గూడుచు వచ్చుచుండుటయును, అటుల నా యింతి ఆరుదినంబులు వరుసగా తదగ్ని తేజోమయ శుక్లధాతువుల నిజసోణితములం సంగ్రహించి శ్వేత శైల కాంచన కుండమ్మున భద్రపరచుచు వచ్చినదేకాని అరుంధతి రూపముధరించలేనిదయ్యె. అట్లు అగ్ని తేజంబున సంఘటితంబైన సోణితము నుండి–

షణ్ముఖ స్వామి ఉద్భవము

క. షణ్ముఖ పంద్రెండ్బాహుల
రాణ్మణిమయ భూషణుండు రాక్షస బలుడున్
షణ్మాతల ముని సదయుడు
చిన్మయ రూపుండు వెలసె చెలగగ నమరుల్

వ. ఇట్లుద్భవిల్లిన షణ్ముఖుండు శుక్లపక్ష చంద్రుని మాడ్కి దినదిన ప్రవర్ధ మానుండగుచు నిజ తేజో బలదర్పంబుల త్రిదశులనేకాక ముల్లోక సేనావాహినులనెల్లర మట్టుబెట్టగల జవసత్వ సమన్వితంబుగా విజృంభించుచు త్రిపురాసుర సంహారసమయ సాధనంబైన హరుకార్ముక మమ్మహీధర శిఖరంబున నిక్షిప్తంబై యున్నదాని నవలీలం కేలంగొని నారిసారించి గుణధ్వని జేసిన తధ్వనికి అవనీ ఆకాశ మధ్యస్థంబైన దశదిశలును మారుమ్రోగ భూవలయమ్మును మూపునమోయు ఐరావతాది దిగ్గజ సందోహము నిగ్రహింప నేరక విజృంభణముసేయ నిజసత్వ శక్తి యుక్తంబుగ అయ్యష్ట దిగ్గజమ్ముల తన యెనిమిది బాహుల బలంబున నిల్వరించి పరిపూర్యమాన నినదంబైన శంఖమును పాణిద్వయంబున పట్టి దిక్కులు పిక్కటిల్ల శత్రు భయంకర పాతంబుగా నినదింపుటయు, పాణిద్వయంబుచే శరసంధానము గావించి క్రౌంచపర్వత విద్వేషణము గావించుటయును, పటుతర ముష్టి ఘాతముల శ్వేత శైల శృంగభంగము గావించుటయును, ఆరు ముఖముల నొక్క పెట్టున గాండ్రించుచు ఆర్చినం ప్రళయ భైరవారావ భీషణంబైన తద్ఘోషణంబున–

క. కులశైలమ్ములు వడకెను
జలవార్ధుల ఘోష లెగసె ఝంఝూటముతోన్
తలకిందులాయె జగతి
వలనొప్పుగ అగ్ని రేగె వాతోధృతిమై

క. అతలా కుతలం బాయెను

వెత జెందుచు జగతి జనులు వేదన పడగా
గతి దోచక దేవతలును
మతి వీడిన వారలైరి మార్గోగ దిశల్

వ. అయ్యవసరంబున–

క. భ్రాంతిలిన జగతి దేర్ప వి
భ్రాంతులు మునివరులు యెంతొ పారగు లగుచున్
శాంతి క్రియ లొనరించిరి
శాంతింప ప్రళయ భీతి స్వస్థత గూర్పన్

వ. అయినను సామాన్య జీవన ప్రజానీకం బెల్లరును–

క. ఇంతకు కారణ జన్మని
శాంతము యెరుగంగ లేక సంభ్రమ మునులర్
వింత గదా స్త్రీ చపలత
యెంతయు విడ్డూర మంచు యేమేమొ యనిన్

వ. మునిపత్నుల యందగ్నికి ఉదయించిన వాడెపో యనుచు అమ్మలక్క లాడిపోసికొనుట విన్న ఆ ముని పత్నుల పతులార్వురును తమ సతుల పరిత్యజించుటయును, కొందరు వీరలేమియూ నేరము చేసినవారు కారు. ఇంతయూ చేసినదా అగ్ని భార్యయే అనినొక్కి వక్కాణించునంత అమ్మహామునుల చెంతకు పావకాంగన చనుదెంచి వారి పాదములంటి నమస్కరించి–

క. మునివర శాంతత విన నీ
అనుమానము తీరగలదు ఆ వనితలపై
విన జెప్పెద నా నేరము
పనిగొని నే జేస్తి నాదు పతి రక్షణనై

క. నా పతి మీ వనితలపై
పాపపుగతి బుద్ధిహీన్త బరుపగ ధృక్కుల్
ఆ పని కొప్పని వారల
శాప నివారితము నెంచి సాహసి నగుచున్

క. వారల వేషములు గొనుచు
దూరము చింతింపకేను దోషపు యుక్తిన్
వారలుగా రమియిస్తిని
ధీరత నా వహ్ని సురత తేజం బమరన్

వ. ఇందు వారల దోసం బిసుమంతయు లేదనుటయును వినవిని యెట్టకేలకు–

క. కనికరులై శాంతమతులు
అనుమానము వీడి మదిని అనునయ బుద్ధిన్
జనితోద్ధతి నిజ భామల
మునుపటిలా చూడనౌత ముద్దుల సతులన్

వ. విశ్వామిత్రు డ క్కుమారుని కడకుంజని బహుభంగుల ప్రస్తుతించి తదాదేశంబున అతనికి జాత కర్మాది విధులొనరించు టెరింగిన సురసంఘంబు లెల్లను అమరేంద్రు పాలికింజని ఆతనితో–

క. వీరుడు శూరుడు తేజో
ధారుండా వహ్ని సుతుడు దారుణ రౌద్రా
కారుడు దుర్వార బలుడు
మారణ హెూమాగ్ని సముడు మహిమాన్వితుడున్

వ. ఆతండెత్తి వచ్చిన నీ యీ అమర సింహాసస్థితి వారి పరంబగు. కావున ముందుగనే నీవాతనిపై దండెత్తి మడియించిన మాకును నీకును హితంబుగా నీ ఇంద్రాధిపత్యము శాశ్వతముకాగలదు. మరి యు లోకంబులెల్లం అవ్యాకులం బగునన అమరేంద్రాదిపతి బహుతెరంగుల విచారించి, బుద్ధిం దల చి సప్తమాతృకలం బిలువనంపి వారల కిట్లనియె.

క. చని మీరలు వహ్ని తనయు
ననునయ వాక్యములు పలికి అభయ ప్రదమౌ
పనిచేయుట లెస్సగునని
తనుగా బ్రతిమాలి పంప తద్దయు వేడ్కన్

వ. ఆ ఋషి పత్నీ–

క. మాతృక లందరు ఒకటిగ
ఆతృత పరులౌచు పోయి అగ్ని కుమారున్
పుత్రత దలచుచు, సురపతి
పాత్రుండవు. నీవయంచు పరిపరి పలుకన్

వ. షణ్ముఖుండంత వారల నభినందించుచు పలుక, అగ్నిభట్టారకుండు నిజపుత్రు పాలికిం జనుదెం చి వానిచే పూజితుండై తదీయ రక్షావిధ పరతంత్రుండైనిలువ, లోహితాస్య అని పిలువంబడు ముని పత్ని క్రోధ జనిత వానికి దాదియై ఉపలాలింప నిజశక్తి సమస్త భూత గణ సముదాయమ్ములు తన్ను పరివేష్ఠింప వారల కధినాయకత్వంబున వర్తిల్ల కలుషించిన ఇంద్రుండు–

ఇంద్రుండు కుమారస్వామిపై దండెత్తుట

క. శిఖి నందనుపై ఇంద్రుడు
అఖిలంబగు అస్త్రు లేయ అమితపు శక్తిన్
శిఖినందన ఘన విజయుడు
మఖశతుపై త్రిప్పి కొట్టె మహితోధృతుడై

క. శరవణభవ రణ ధీరుడు
సురపూజిత అమర విభుని శోషిల జేయన్
సురసేనలు వడి నేగుచు
గురి జూసియు అగ్ని కొమరు ఘూర్ణిలు జేయన్

క. వడి లేచియు షణ్మోముడు
కడు కోపన ధృక్కు లెగయ కార్ముక మంటిన్
సడి లేకనె అమరేంద్రుని
సుడి వడిగా చుట్టి పట్టి స్రుక్కగ జేయన్

వ. అపుడు సురసేనా నివహము లన్నియు శరణంబని శరవణ భవు నాశ్రయించుటం జూచిన బల సూదనుండు క్రోధ ఘూర్ణిత మానసుండై ఆతనిపై తన వజ్రాయుధముం ప్రయోగింప అది నయ్యగ్ని కుమారు దక్షిణ స్కందమ్మును దాకిన అందుండి ఒక తేజోమయ రూపుండు పుట్టినది కాక అనేకానేక కుమార గణము లుద్భవిల్లుటయును, హరిహయుండు విస్మితుండై అగ్నిసంభవు నభయంబని కొలిచె నంత. సంతసిల్లిన సుర తండంబులు సింహ నాదములు చెలంగ షణ్ముఖు శతమఖులం పరివేష్ఠించి రని మార్కండేయుడు ధర్మరాజుతో వెండియు నిట్లనియె. అట్లయ్యధికతర జవసత్వ సంపన్నుండు నిధ నుండైయుండ నేర్క–

క. ధనదునిపై యెత్తి వెడలి
నినదింపను శంఖమూది నిశ్చిత బుద్ధిన్
అనిమిష లోచన ధనదుడు
వనజాక్షి సంపదలను వావిరి గురిపెన్

వ. అంత నయ్యగ్ని కొమరుండు విశేష లక్ష్మీయుతుం డగుటయును, అష్ట దిక్పాలక దేవ మునిగణ ముఖ్యు లెల్లరుం వానిం పరివేష్ఠించి–

క. సిరి వెలుగగ అగ్ని సుతుడు
పరిపూర్ణ కళల మహేంద్రు భాతిగ వెలుగన్

సురలోక పాలన కర మ
మరేంద్రు ఘన సింహపీఠ మధిరోహింపన్

వ. నీవ తగుదని పలుక వారల కతండు మహనీయంబగు–

క. నీ యింద్రత్వము సేకొన
మాయోపాయులకు గాక మాకుం దగునే
ధీయుతమౌ సామర్థ్యము
నాయంతటి వానికగునె నమ్మిక చెపుడీ

క. అని యా మునివరుల నడుగ
విను నీ తేజంబు శక్తి వీరత జవమున్
వినయము ధీరత బుద్ధియు
వినుతింపగ నేరి తరము విభుదస్తుత్యా!

ఉ. పూనిక నెంతయుం దనుజ పోతరు నెల్లర క్రిందు సేయనై
మానవతీ పతివ్రతలు మాతృక లందున పుట్టియుండుటన్
మానిత విక్రమోజ్వలుడ మారుతి యంతటి శక్తి యుక్తతన్
తానుగ దేవతాగరిమ దారుణ శక్తుల ఉక్కడించగా

క. పుట్టుకతో వచ్చిన నీ
దిట్టత కనుగొనిన యట్టి దిక్పతు లెల్లర్
చుట్టుం జేరిన నాడే
పట్టమహేంద్రుండ కావె పావన గుణుడా!

క. పక్షీంద్రునిలా సహజత
నిక్షిప్తంబైన లావు నీదగు శక్తుల్
వీక్షించిన దిక్పతులే
రక్షింప్మని వేడునాడె రాజైతి వనన్

వ. అనిన వారలతో వెండియు నయ్యగ్ని పుత్రుండు, ఇంద్ర పదవి యందుండు వారలకు యేయే అర్హత లుండనగు, మరియును వారలు చేయందగు కార్యము లేమియని అడుగుటయును.

క. లోకములం బాలింపను
శక్తియు జయయుక్తి దనరి సామర్థ్యండై
రక్షాదక్షత వెలయం

శిక్షార్హుల విడువకుండ శిక్షింప నగున్

క. అనునెడ యింద్రుం డనియెను
ఘనతర భుజశక్తి యుక్త కరుణామయుడా
వినుమీ ఇంద్రత్వము గొని
అనునయముగ నేలు దేవ అమరుల జగతుల్

వ. నే దేవేంద్ర పదవి నుండ నిష్టత జూపుట లేదు. ఎట్లన–

క. నీకును నాకును గాకను
వాకొనుచీ పదవి మిషను పామర బుద్ధుల్
యేకత్వము చెడదీయుచు
సాకల్యత పాడుజేత్రు సమరోత్సాహుల్

వ. దానం మనమధ్య భేదము వాటిల్లుటయును, లోక భీకర భయంకరమగు విగ్రహంబు ప్రవర్తిల్లు టయు నే కోరుకొనను. ఈ యింద్రత్వము నీక యొప్పింతును. జగంబులనెల్ల సుఖంబుండ నేలికొమ్ము నవిని కుమారస్వామి నవ్వుచు నయ్యమరేంద్రున కిట్లనియె.

ఉ. అట్టిది కోర బోనెపుడు అయ్యమరాధిప పీఠ మెప్పుడున్
దిట్టతనుండ నీకెనగు ధీరత శక్తుడ సాహసుండవై
కట్టడి జేయనా యమర కార్యము లందున సంగరంబులన్
కుట్టిల బుద్ధులం దెలసి కూకటి ద్రుంపనె నీకు నండగాన్

చ. అనవిని యగ్ని నందనుతొ యాడెను యింద్రుడు సామరస్యతన్
వినుమిదె నిన్ను నేగొనుదు విజ్ఞత నెంతయు దేవసేనుగా
అనువగు రీతులం సురుల కాస్పద చిత్తత నాయకుండవై
జనుటది మాకునుం సరిగ జాగృత బుద్ధిని యేల నున్నతిన్

వ. అనిన అమ్మరుత్పతికి మరుత్సుతుండు యిట్లనియె.

చ. ప్రియమొనరింతు నీకెపుడు పేర్కొనుచుంటిని సిద్ధహస్తుడన్
జయమొన గూడగా జనుచు చయ్యన కట్టుము నాయ్క పట్టమున్
నయవిధ సంగతిం రిపుల నందర ద్రుంపుదు రాక్షసోద్ధతిన్
పయనము జేయుచుం దివిజ పాలన పీఠికి వన్నె గూర్చెదన్

వ. అనిన అతి ప్రీతుండై పురుహూతుండు అప్పటి కప్పుడు

క. మునిగణ దేవక బృందము
తనియంగా షణ్ముఖాఖ్యు దర్శింపను వే

వినుతింపను జనితోద్ధతి
అనునాయక పీఠమందు అభిషేకింపన్

వ. ఆ సమయంబున–

క. నయవిధి నచ్చర లాడగ
జయదుంధుబు లెగయ మింట జాగృతమౌచున్
భయ తత్పరులవగ అసుర
నయవాసన పూలు గురిసె నభమది వెలుగన్

వ. సర్వ మంగళాకర సురసేనానాయక పట్టంబున అభిషిక్తుండైన తత్సుకుమారు కుమారు శిరంబున ఇంద్ర నీల మణిమయ స్థగిత రత్న కిరీటంబు దేదీప్యమాన సందీప్తులీన శిరసోర్ధ్వభాగ తలమ్మున సురదీప్తితమౌ ధవళాత పత్రంబు శీతలచ్ఛాయ లొలికింపుచు శ్వేత హిమగిరి శిఖరో పరిభాగ సంకాశ శరశ్చంద్ర శోభల నధికరింపుచు వెలుగొందుచుండ–

ఈశ్వరుడు కుమారస్వామిని చూడ వచ్చుట

సీ. శీతల గంగమ్మ శిరసోర్వి భాగాన
జాబిల్లి కాంతుల జాలువార
అర్ధాంగ భామన అర్ధాంగి శోభల
అలరింప తానౌచు ఆది గురుడు
అన్న పానము గూర్చి అన్ని ప్రాణుల గాచి
ముక్తి మార్గము చూపు మోహనాంగ్డు
నయనాభిరామమౌ నాగభూషలు దాల్చి
అభయప్రదుండైన అద్వితీయ్డు

తే. భూది రుద్రాక్ష మాలికా పూత వినుత
రుద్ర గణముల కధినాయ్కు రౌద్రమూర్తి
దేవసేనాని ప్రియసూను దీప్తి జూడ
ఆది శంకరుం డచటను అవతరించె

వ. ఇట్లు వచ్చిన మహాదేవుండు మహాసేనుం కౌగలించుకొని ఆశీర్వదించి అతనికి విశ్వకర్మ నిర్మితంబైన హేమమయ పుష్పమాలిక యొసంగెనని చెప్పి వెండియు మార్కండేయుడు పాండవేయుల కిట్లనియె. వినుము. రుద్రుండు మున్ను నిజవీర్యంబు అగ్నియందు పరిరక్షింప తత్తేజోవిశేషంబున పావకుండు కుమారు నుత్పాదించె, నదియునుంగాక అగ్ని రౌద్రం బని వేదవిదులు వినిపించుటం జేసియు,

కుమారుండు వహ్నిసంభవ రుద్రసూనుడగుటయును అగ్నిభామిని కృత్తికాఖ్యలైన ముని పత్నులార్వుర రూపంబులం తనయం దేర్పడ ప్రభవించుటచే కార్తికేయ షణ్ముఖ నామధేయంబుల వర్తిల్లెనని దెల్పుటయును, ఇంద్రుండు మున్నుగా తనచే రక్షింపబడిన తన చెల్లెలు–

తే. అబ్జభవుని యోగ యువిదయ్యబ్జ నేత్రి
దేవసేనను రావించి దీప్తి చెలగ
దేవసేనకు జూపింప దేవమునులు
పరిణయంబది చేయించ్రి పరమ ప్రీతి

వ. అటులా గుహుండు దేవసేనం పరిణయంబాడిన రోజు షష్టి యగుట సేనాకుమార (సుబ్రహ్మణ్య) షష్టి గాను, అంతకు ముందురోజు దేవసేనుం శ్రీవల్లి వరించిన దినం బగుట వల్లీశ్రీపంచమి గాను ప్రసిద్ధంబులయ్యె. అదివిని నిజభర్తలచే విడువంబడిన మునిభార్య లార్వురును విహిత మంగళాచార కరుండైన సేనాశ్రీవల్లీ సహిత కుమారస్వామి వద్దకు ఎండివాడిన పూల వలె దీనాతి దైన్యవివర్ణ వదనలై యేతెంచి–

క. చూడక కానక దుర్జను
లాడిన మాటలకు కినిసి ఆ మునులార్వుర్
పొందని విడిచిరి మము కా
పాడుట నీ ధర్మమంచు బావురు మనగాన్

క. ఇహపర సుఖముల కెడనయి
అహితంబుగ అశువు లోర్చి అందరి కెడమై
బహు బాధితమౌగ మనసు
దహియించను గుండె మంట తనువులు పొక్కన్

వ. అని అనేక విధముల పరితపించుచు–

క. మాతల మగుదుము నినుమా
పుత్రుంగా దలచు చుంట్మి పూతచరిత్రా
మాతల మము గాపాడుట
చేతో మోదంబు గూర్చు చిరముగ నుండన్

క. మనముల దొలగుడు దుఃఖము
తనయుడ మీ యార్వురకును దయగొను డనుచున్
మనగా జేతుల మిమ్ముల
వినువీధిని చుక్క భాతి విహరింపంగాన్

క. అని యోచింపుచు మనమున
తన దెసనే యున్న యింద్ర ధనదుల వేడన్
వినియుంటిమి సవితావని
వనితా రోహిణియను సరి వలనుగ నుంపన్

వ. నాటంగోలె కృత్తిక లార్వురును అగ్ని దైవం బనంబరగు కృత్తికా నక్షత్ర రూపితలై ఆకశంబున వెలుగొందసాగిరి. అంతట స్వాహాదేవి కుమార నందనుని కడ్ కరుదెంచి నీవు మత్సుతుండ. నిత్యం బును నీకడ నుండ గోరుదునని సంప్రీతుండై అట్లకాక యేనును నీ కోడలుంగొనియాడ ప్రియంబున నుండు మనుటయును, అప్పుడు కుమార మాతృకలు హవిష, కాళి, కౌశిక, ఉద్ధత, శౌరిక, ఆర్య, వైధాత్రి యేడ్వురుం కుమారుని ముంగల నిలచి ఇట్లనిరి.

కుమారస్వామి సప్తమాతృకల బాల గ్రహములుగా నొనరించుట

క. మునిమాతృక వనితామణు
లనిశము మము గొలుచునట్ల నాదియ రీతిన్
కొనియాగ జేయు జగతి
జనములు సంప్రీతితొ మము జనితోద్ధితమై

వ. అని యెరిగిన ఆ స్త్రీజాతి వైరి భావన మది నెరింగి యాతండు–

క. వారల పేరిమి భంగము
మీరలు కోరంగ దగునె మేలొ రీతిన్
వేరొక వరమది వేడుడు
వారలపై కోపగించ్క వలనగు పనిగాన్

వ. అని పలుకుటయును, అంతట వారలా ముని మాతృకలపై కినుకతో–

క. తప్పక యీదగు కాదని
చెప్పక యీ జగతి జనుల చీడా విధులన్
ముప్పిరి గొని బహు బాధల
తిప్పల పాల్జేయు పనిగ తీర్పుము వరమున్

వ. అని సంకోచింపక వేడుటయును అప్పుడు కార్తికేయుండు–

క. అక్కట యిది కోరికయా
మిక్కుటమగు చేటు గాదె మీకుం దగునే
తక్కక యిచ్చుచు నుంటిని

మక్కువ మీ మాట దీర్ప మాతృక లగుటన్

క. ఐనను మొక్కిన వేడిన
బోనపు పండుగలు జేసి పూనిక గొల్వన్
మానిత దేవతలై పసి
కూనల కాపాడు కొందు కొమరిన ప్రీతిన్

క. పాయక పదునాల్గేండ్లొ
ప్రాయము దనుకను శిశువుల బాధింపంగా
ఆయత బాలగ్రహ గతి
సాయతమై నాదు అంశ సమకూర్త్ననుచున్

వ. అమ్మహాసేనుండు తన దేహము నందుండి కాంశ వర్ణ తేజోవంతు నొక పురుషుని ప్రభవింప జేసిన వాడు పుట్టుక తోడనే ఆకలని ఆక్రందింపుచు శోషితుం డగుటయును, కుమారస్వామి వానికి చైతన్యంబుగూర్ప అతండు స్కాంద అపస్మారకా గ్రహంబన పేర మాతృకా గణములకు రక్షకుండుగా వర్తిలు చుండుటయును, శని మాతయైన వినతయు, దైత్య మాతయైన దితియు, గోమాతయైన సుర భియు, కుక్కుట మాతయైన సరమయు, వృక్ష మాతయైన కరంజియు, సర్పమాతయైన కద్రువయు, కుమార మాతయైన లోహితాస్యయు, మాతృగణ సమానులై శిశు పీడన బాల పీడన గర్భ పీడనలు గావించుచు మానవుల వలన బలి మంత్రోపహార దాన తర్పణ విధానంబుల తృప్తు లగుచు శిశువు లకు ఆయురారోగ్య సుఖంబు లొసంగుచుండు.

క. పెద్దలకు గూడ నొక్కెడ
అద్దిద్దను గ్రహపు బాధ లలమట బెట్టున్
శుద్ధిగ శుచులౌ యోగ్యుల
గద్దింప నేరవెట్టి గ్రహగతులైనన్

వ. మరియును–

తే. మహిత నీశ్వరు గొల్చునా మనుజు కెపుడు
దుష్ట గ్రహ బాధలన్నియు దొలగు చుండు
భక్తి వైభవ మెరుగుమా భద్ర గతిని
శాంత కాముల కెయ్యెడ సమత గూరు

వ. అనుచు పల్కిన మార్కండేయుడు వెండియు నిట్లు గుహుండు గ్రహంబులనియోగించు నవసరం బున అగ్ని వల్లభ నల్లన నాతని దగ్గర జేరనేగి–

తే. పుత్ర విను మేను దక్షుని పుత్రి నన్ను

పావకున కిచ్చె మా తండ్రి బాల్యమునను
ఒల్ల డాతడు నన్నెప్డు ఓపలేను
పతికి యెడగాని సాన్నిత్తి బడయ జేయ్ము

వ. అనిన నయ్యగ్నిభవుండు స్వాహాదేవి యందు దయగొని మాతా! హవ్య క్రవ్యంబుల భూదేవోత్త ములు స్వాహాకార కలిత మంత్రమ్ముల (నీకు నీభవు సాన్నిత్తత్వమును) గూర్చువారు. దాన నీ మనోభీ ష్టంబు సిద్ధించుననుటయు, నప్పుడు సకలమునిగణ సహితుండై విచ్చేసినకమలాసనుండు మహాసేను నభినందించుచు చెంతనే యున్న మహాదేవు దెసం బరికింపుచు నిట్లనియె.

చ. అనఘుడు వీడెపో త్రిపుర హంతక వీరుడు దేవసేనకుం
అనయము బెంపు గూర్చునని హారిని జూపుచు దేవసేనకుం
కనుమిదె తండ్రి నీకనుచు గాఢత గొల్వుమ మానసంబునం
వినయత జూపుమా విబుధ వేల్పుల గావగ బుట్టినాడవో

వ. వీరలగ్నిదేవుని యందును తదీయ భార్యలయందును నిజయోగ బలంబునంతమతమ వీర్యంబు లావేశింప జేయ ఆ దంపతులు లోక హితార్థంబుగా నిన్నుం గనిన వారని చెప్పుటయును, అప్పుడ య్యగ్ని భవ పార్వతీ నందనుండు అపరిమిత ఆనంద హృదయుండై సకల లోకారాధనా పూజితుల రగు శివపార్వతులకు మ్రొక్కి సంస్ధుతింప దేవ యింద్రలోకాధిపతి కార్తికేయునకు ఐరావణభూషణం బైన రెండు గంటల నొసంగె. అందొకటి తా గొని రెండవదానిని విశాఖునకు యిచ్చుటయును, తద నంతరంబ కుమార గురుండు.

ఈశ్వరుడు కుమార సహితుండై భద్రవటంబు చేరుట

మ. తనయుం దోడ్కొని పార్వతీ సహితుడై తాత్మ్యంబు వెల్వార్పగా
అనఘుం డర్కుని భాతిమై వెలుగనౌ ఆదిత్య సంఘంబుతో
జనితోత్సేకుడు అగ్నిసంభవ సుతుం జాజ్వల్య తేజోద్ధతుం
తనదౌ భద్రవటీ తటాంతరములం దర్శింపగా నేగుటన్

వ. అ మ్మహాదేవు ముందట సమస్త యక్ష గంధర్వ గీర్వాణ సముచిత పరివారుండై పుష్పక రధారూ ఢుండైన కుబేరుండును, వెనుక అమరగణ సమన్వితుండు ఐరావత భద్రనగాధిరోహుడునౌ వాసవుం డును, దక్షిణ భాగమ్మున ప్రబల యక్షోరక్ష దక్షుండై యమోఘనామధేయుండైన యక్షోత్తముండును, దాపలికేల యమకింకర పరివేష్ఠితుండైన పితృపతియును, మరియు ననేక వశు, రుద్ర, వరుణ, అని లాగ్ను లాదిగ నడువ మూర్తిమంతమ్ము లైన శూల, గద, కమండు లాదిగా గల్గు ప్రముఖోపయుక్త ఆయుధ తండమ్ములుం జనియె. అయ్యాది దేవునకు సన్నిహితుండునై చంద్రుండు ధవళాత పత్రంబు ధ రియించె. అనలుడు వింజామరుండయ్యె. విద్యా, సావిత్రీ, గాంధారీ, కేశిని యను దేవాంగనలు

దాక్షాయనిం గొల్చుచుంజనిరి. త్రిలోచన సఖుండైన పింగళుండను యక్షుండు వృషభ కేతనంబు ధరియించనిట్లు మహదభిరామ విలోకన దారుండై కుమారగురుండు భద్రవటంబు జేరనరిగి అట కుమారుం జూచి యిట్లనియె.

క. తనయా గురుడవు దివిజుల
తనదౌ తేజంబు గొంచు దర్పితమతివై
అనయము రక్షించు సురల
వినయత పూజింపు ఋషుల విజయోత్సాహా

కుమారస్వామి మహిషాసురుని జంపుట

క. అనగం ఆ సమయంబున
వినిపెం ఉత్పాత రవము వీనులు పగులన్
మునుపెన్నడు కననట్లుగ
జనులందరు మూర్ఛవోవ జగతులు వణకన్

క. ధర కుంగెను పాతాళికి
తరుగిరి వారాశి దిశలు తలకిందు లవన్
దురితోప ద్రవ కారణ
వరదర్పిత మహిష దనుజ మారణ రవళిన్

వ. మరియు నయ్యవసరంబున వివిధ మారణాయుధ పాణులగుచు–

క. అసురానీకము పెల్లుగ
వసుధాసతి యోని నటుల పాతక శక్తుల్
పస దనరుచు మీది కురుక
వసుధాదిగ దివిజు లెల్ల వణకగ భీతిన్

వ. మహిషాసుర రక్షిత దనుజవ్రాతంబు విజృంభించి నానావిధ మారణాయుధములతో నిమిషమాత్రమున అసంఖ్యానీకంబగు అనిమిష సైన్యంబుల చెల్లాచెదురుగ పారంద్రోలుటయును, కార్చిచ్చు పొదివినంపరచు మృగంబుల చందమ్మున అమరులుసమర విముఖులై తొలంగంబారిన చూచిన మధుసూదనుండు సింహనాదంబు చేయుచు యెలుగెత్తి సురతండంబుల నిలువం ద్రొక్కి–

క. భీతిల వలవదు దనుజుల
ఆతత శక్తులను ద్రుంప ఐక్యత తోడన్
చేతికి చేయిగ తోడయి
పోతరికంబుగను నిలచి పూనిక తోడన్

క. పాతక దనుజుల ద్రుంపుడు
యేతరులై చెలగి మిగుల యెంతయు పటుతన్
వాతోద్ధతి మించి యెగసి
ఆతత అస్త్రాల తోడ నసురుల దాకిన్

వ. అని హెచ్చరింపగ, సుర సంఘంబులు చెలగి సంఘటించి దనుజానీకంబుల–

క. ఛిన్నా భిన్నము చేయగ
మిన్నుం దాకిన యరపులు మిక్కుట మవగా
విన్నారాక్షస మహిషుడు
మిన్నుం మన్నుం గలయుచు మిక్కిలి యుక్కున్

క. ఘన శైలంబుల గూల్చుచు
తనుగా రణభూమి జేరి దనుజోద్ధతిమై
కనివిని యెరుగని భీకర
రణ మొనరించను సురతతి రణభీతులునై

వ. పరుగులు పెట్టం–

క. ఇంద్రుండిడ యింద్రాస్త్రము
యేంద్రా యీ అస్త్రమంచు యేపున దనుజా
యింద్రుం డింద్రాస్త్రిని నడి
సంద్రంబున గూలదన్నె సంభ్రమ ముడుగన్

వ. అంత మహోదగ్ర శౌర్య ధైర్య సంతప్తులైన వసు రుద్ర సాధ్య మరుత్ప్రవరు లెల్లరును–

మ. పురుహూతాగ్రహ కారణోజ్వలనులై ప్రోత్సాహ మేపారగా
మరుతుల్రుద్రులు మారణాయుధ తతిన్ మంత్రించి యెంతేనియున్
దురితోపద్రవ కారుడా మహిషునిం దోర్దర్ప మింకింపనై
హరు సైన్యంబులు వెంటరా దనుజ సంహారైక్య ఉత్సాహులై

వ. తమతమ రథాశ్వ గజ యూథ ప్రభావిజృంభమానులై మహిషాసురాధ్వర రక్షిత రాక్షసమూకలం చెల్లాచెదరుగా నుగ్గాడుటయును, దైన్య సైన్యంబులు నిలవనోపక నలు దెసలకుం పరువులు పెట్టుటయును మహిషాసుర మహా శైలంబు రూక్ష కషాయితా నేత్రుండై కోపాగ్నులు గ్రుమ్మరించుచు ఘన శైలంబుల పెకలించుచు దేవతానీకంబులపై రువ్వ నిర్జన యూథములు హాహాకార రవంబులు పెట్ట శైలోద్దండ భీకరరూప మహిషుండు తనశిరోశృంగమ్ములద్రుళ్లించుచు దిగంతమ్ములుగదుల హుంకరించుచు ఛీకొట్టుచు సురసైన్యంబులపై దూకుచు కాలాంతకుడైన రుద్రుని రథటెక్కెంబును దూలనేయ–

చ. హరుడదె జిక్కెనింక నసురాధిపు నడ్డుట కాదు కాదనిం
పురుహూతు దొట్టి దిక్పతులు పోడిమి గోల్పడి కిందుమీదుగా
పరువులు వెట్టుటం గనిన పార్వతి నందను దద్భుతంబుగా
సురవరు లెల్లరుం బొగడ సూరత నెంతయు ధిక్కరింపుచున్

వ. కుమార గురుండు–

క. తనదౌ శూల గదాదిగ
అనేక శస్త్రాస్త్ర గతుల నా మహిషునిపై
జనితా భీకర తాక్షుడు
ఘన శరముల నాటనేసె ఘన విజయుండై

వ. అట్లు కుమారుండు కల్పాంత సన్నిభ కాల రుద్ర రౌద్రాగ్నులు గ్రక్క ద్విదశ బాహుల నుండి సం ధింప బడిన మార ణాయుధ సమూహమ్ముల శక్తి పరంపరలకు నిలువ నేరని ఆ మహిషాసుర భస్మీ భూతుం డగుటయును–

క. ఘనశక్తి పాతయుతమౌ
తనదౌ భుజశక్తి జూప తక్కిన దైత్యుల్
అని మొన వీడిన వారలు
కనుమీ దయ తోడ మమ్ము కావుము అనుటన్

వ. సురవైరి తిమిరంబు రూపుమాయుడు విరియించిన సుర వైరి చందమ్మున వెలుంగుచున్న కార్తికే యుం జేర నేగి సురాధిప ఇంద్రుండు అతనిం తన కౌగిట జేర్చికొని యాడుచు యీ మహిషాసుర దనుజుండు–

క. అజువర బలయుత దర్పుదు
నిజ మూహింపక దనుజత నీల్గుచు రణ తా
ప, జయోద్ధతిమై మమ్ముల
నిజ భృత్యుల కరణి జూచె నేమన వచ్చున్

క. దనుజ వ్రాతము సర్వము
అనిగూలిరి నిన్ను దాకి అసుర గణంబుల్
కనుమిదె నీకీర్తి వెలిగె
అనునాయక నాయకుండ వమరుల కెల్లన్

వ. అని పల్కుటయు నప్పుడు–

క. పార్వతి నందను కనుగొని
పార్వతి పతి యిట్టు లనియె పరమోత్కృష్టా
నిర్వర్తింపుమ సురగణ
నిర్వర్తుల కభయమొొచు నిశ్చయ బుద్ధిన్

వ. ఇది విన్న చదివిన యెల్లరు సర్వ దోష నివారితు లగుదురని ఆశీర్వదించెనని మార్కండేయుడు చెప్పిన, పాండవులు సంతుష్టాంతరంగులై అమ్మహాత్ముం ప్రశంసించుచు కధాగోష్ఠులనుండునెడ కృష్ణ వల్లభి సత్యాదేవియు పాంచాలియు యేకతంబ ప్రియ సల్లాప సంసక్తలై యుండు నెడ ద్రౌపది కిట్టు లనియె.

సత్యా ద్రౌపదుల సంవాదము

క. పడతీ ఐదురు పతులను
విడనాడక యెట్లు గొల్తు వెంతటి దాన్వో
అడలక తడయక మదిలో
తడబాటుకు లోనుగాక ధార్మిక బుద్ధిన్

క. ఏ నీ చేసిన పుణ్యమొ
మేనం పొడమిన సుఖంబొ మేధాన్యుక్తో
జాణ తనంబో మంత్రమొ
అన్నోదక రస విధాన ఆత్మైక్యతయో

తే. సతత సమ్మద సౌభాగ్య సతివి సూవె
పతులు పావన మూర్తుల పడతి వౌదు
మతి దలంకక చెప్పు మా మహిమ యేమొ
అతివ గొందును ఆ మాట ఆప్తతొంద

క. అని యడిగిన మది నించుక
కననౌగా లజ్జ యీర్ష్య కాముఖి గుణముల్
కినిసియు కోపాగ్ని ముఖత
కనుపింపగనీక పైకి గడసరి యుక్తిన్

క. తగునా యిటు సామాన్యుల
కగువిధముగ మాటలాడ గల్గుట అకటా
నగుమోముగ పైదీపుగ
తగవరి నాయన్న విన్న దయనీయంబౌ

వ. అని హాస్యోక్తుల దాని అవివేకత యెరుక పడం బల్కి పాంచాలి వెండియు యిట్లనియె.

క. వినుమో పొలతుక మంత్రా
జనితోద్ధతు లౌచు ప్రేమ చయిదులు పతులర్
అనుటది పొరబాటు దెలియు
వినదగ నిబ్భంగి పలుక వెఱ్ఱివి కావే

చ. మగువవు నీయనం దగిన మందుల మాకుల ప్రేమ గూరునే
మగలకు హానియే యగునొ? మానుము యిట్టుల మాట మాత్రమున్
పగతుర మాట లిట్టివియ పాపము మూటగ గట్టుకోవుటల్
వగపుల జిక్కులం బడకు వావిరి హానియు నింద పొందుదో

క. పతియెడ వక్రత మానుము
అతులితమౌ ప్రేమజూపు అహముం విడుమీ
పతి యనురాగము పొందుటె
అతివరొ సౌభాగ్యమమ్మ అనునయ బుద్ధిన్

వ. నీవనునట్లు పాండుపుత్రుల యెడ నేనెబ్భంగి మెలంగుచు యిట్టి సౌభాగ్యమ్ము నందినదియు నెరింగింతు. యేర్పడ వినుమీ.

క. పతితము గాక మనంబున
పతులెడ అనురాగ యుక్తి బాయక మనసౌ
అతివల తోడన మెలగిన
మతిమంతిగ ప్రేమ జూప్దు మాన్యత నెంతోన్

తే. భక్తి చేయుదు సేవనా శక్తి దవిలి
అత్త కుంతికి బంధుల కాప్తి తోడ
పతుల మానస భావనా పటిమ కెడగ
మాటమాత్రన కాదన్క మసలుచుందు

తే. కుడువ నెన్నడు ముందుగా కుంతి సుతకు
స్నాన భోజన విధులెల్ల సమయ గూర
దగ్గరుండియు చేతు నా ధర్మమంచు
శయన మందిర విధుల స్వయముగొందు

క. తగ దతివకు తలవాకిట
నగవుగ మాటాడ నవదు నాయనుచోటన్

మగవారల చైదమ్ములు
మగువలతో నైనగాని మానుము పలుకన్

క. పతులరు ఊరేగినచో
అతివరొ వారొచ్చు దనుక ఆశావహినై
అతులిత పూజలు జరుపుదు
పతి ఆగమనంబు కోరి పావన మతినై

క. మృదుమదులని నిజతేజుల
పదుగురలో న్చులక జేయ పడతికి తగదో
మదిగుందిన వార లొకట
వధియింతురు భార్య పుత్ర బంధుల నైనన్

మ.సరి బంత్యానీక భోజనా ప్రగతిమై సంస్థవ్య మానం భజే
నరనాథోత్తమ రాజభోజన తతుల్ నాయన్గ సంప్రీతిమై
తరుణీ తండము వడ్డనల్ జరుపగా తళ్కొత్త శింగారముల్
అరుదై యొప్పదె పాండు నందనులదౌ ఆతిథ్య మింపారగన్

వ. అని చెప్పు కొనెడి జనావాస ధర్మనందనుని నగరి యందు నిత్య నైమిత్తికముగా జరుగు వేనకు వేలగు అతిథి అభ్యాగత పరివ్రాజకా పరిజన భోజనంబులును, శతసహస్రానీకంబగు మదమత్త వార ణంబులును, మరి పదింతల జవసత్వ సమన్విత ఉత్తమాశ్వంబులును, వాటి నిత్యోచిత తృణపర్ణాది ఖాద్యంబులును, సమస్త భాండాగార సంచయములును, ఆయవ్యయ ధన ధాన్య సమృద్ధియు నేను యెరుంగుదు. నాకు దెలియక యేపనియును తమంతగా తాము చేయనొల్లరు. తుదకు గోపాలకా జనంబులు సహితము నాకెరుక పరుపక యేపనియుం జేయరు. పాండు నందనులు సమస్థ గృహ రాజకీయ విషయ సర్వస్వంబును నాయందుంచి వారు నిస్సంకోచ నిర్భీతిమై యిష్టాకార్య విహారార్థం బుల హాయిగ నుందురు.

తే. ముందు వెనుకల కొనుగా ముద్ద దినగ
అర్ధరాతిరి పొద్దుల అతివ నేను
కోడికూతకు మున్ముందు కోర్కె లేతు
యెదయు లేదది మనసందు యెవ్విధాన

తే. ఓర్పు సహనమ్ము శాంతమ్ము ఉవిద కగును
మగువ నీ జెప్పు మంత్రాల మాయ లెరుగ

ఇంద్రజాలపు విద్య నాకెందుకమ్మ
ప్రియము జేతును పతులకు ప్రేమమీర

వ. అన విని సత్యాదేవి లజ్జా కలిత చిత్త యగుచు చిరు నగవులు చిందులేయ బిగికౌగిలి బిగియ నేచి, మగువా!

క. నా నేరమి సైరింపుమ
యేనెరుగక మేలమాడ్తి నింతియె సుమ్మా
మానిని నా మాట వినుము
నన్నుమానించకు మది నళిన దళేక్షీ

వ. అనినం ద్రౌపది మందస్మిత వదనయై అట్లకాక పోనిమ్మని వెండియు–

ద్రౌపది సత్యభామకు పతివ్రతా ధర్మ బుద్ధులు చెప్పుట

క. పతి అనురాగమె సతులకు
ధృతిమతమౌ నీతి సుమ్మ దూరము గనుమీ
పతి కెడమై గర్వోన్నతి
సతి కెప్పుడు మంచి కాదు సద్గుణ శీలా

క. కావున సఖ్యత తోడన
వావిరిగా పేర్మి జూపు పావన మతివై
సేవల జేయుచు నాధుకు
తావలమౌ బుద్ధి దవిలి తాత్మ్యంబౌచున్

క. నాధుడు వచ్చిన తోడనె
పాదంబులు కడిగి నీట భక్తి దలిర్పన్
నీదౌ శిరమున దాల్చుము
కాదన రాదెంతలైన గర్వము తోడన్

క. ప్రియమారగ నగుమోముతొ
ప్రియునిం దన వశము గాగ పేరిన భక్తిన్
నయవిధులం జూరగొనుము
నయసన్నల మెలగులాగ నాయను యుక్తిన్

క. సవతుల మధ్యన యెప్పుడు
అవమానము పొడమనీకు అహమౌ బుద్ధిన్

భవదీయులు మెచ్చుకొనగ
నవనీతపు పల్కు పల్కు నల్వురు మెచ్చున్

క. వంచన లేకనె మనసున
మంచిని పోషించ్కు ధవుని మన్నన గొనులా
అంచిత ఫలముల నొందుము
సంచితమౌ ఫలము కృష్ణ సతివై బుట్టన్

మత్త. అన్నపానము లన్ని గూర్చుమ ఆద్యుడౌ పరమాత్ముకున్
సన్నుతాంగవు సద్గుణాంబరొ సభ్య తెర్గుమ సఖ్యతన్
కన్నవారల గౌరవం బది కామితార్ధత పెంపునన్
మిన్ననాయన మీది కెక్కుచు మెచ్చుకోదగు కీర్తితోన్

మత్త. ఎంత బంధువు తోడనైనను యేర్పరింపక విజ్ఞతన్
చెంతజేరిన చెడ్డబుద్ధుల చేరనీయకు దగ్గరన్
మంతనంబులు చేయుచుండుమ మాననీయుల తోడుతన్
పంతగించక పారమార్ధుల పల్కరింపుమ కోర్కెతోన్

వ. ఇట్టి విధంబుగ మెలగుట సతిపతుల సౌఖ్య సౌభాగ్యతకు మంచి యుపయుక్తంబనిన ప్రీత చిత్త యై సత్యభామా వధూటి ద్రౌపదితో నిట్లనియె.

క. ధర్మాధర్మము లెరిగిన
నిర్మలమతి వౌదు గాక నేరరు వారు లే
కర్మంబుల పోబో, నా
ధర్మం బని పలికి తెంత ధర్మాన్వితవో

క. తరుణీ నీ సుతు పతులరు
కరుణామయ కీర్తిధనులు గర్వోన్నతులున్
దురితాప హరులు కరులును
దరిజేరని పాప శములు దయనీయులునౌ

వ. నీ పతులం నీ యడవుల పాల్జేసిన ఆ ధార్తరాష్ట్రుల సతులు అధోగతుల పాలౌట నిక్కువము. ప్రతి వింధ్యాదులైన నీ పుత్రరత్న ఉపపాండవులేవురును శూరాగ్రేసరులు. సద్గుణ సంస్థవనీయులును. వారలిప్పుడు యాదవ పురంబున నున్నవారలు. వారల కేకొరంతయు లేకుండ రుక్మిణీ సుభద్రా దేవులతోపాటు యెల్లరును తమబిడ్డల కంటెను గారాబముగ జూచువారలే. వారిదెస నిశ్చింతతో నుండుమని పల్కుటయును, కృష్ణుడు పాండవుల వీడ్కొని మార్కండేయాదుల నామంత్రణము గావించి

గమనోన్ముఖుం డగుటయును, సత్యభామ యాజ్ఞసేనిం కౌగలించుకొని గౌరవ పురస్కరంబుగా వీడ్కొ న ప్రియసఖీ సహితుండైవాసుదేవుండు రధారూఢుండై ద్వారకాపురికరిగె. మార్కండేయుడును పాండ వులనాశ్వాశించి నిజాశ్రమంబునకుం జనియెనని చెప్పిన వైశంపాయనునికి జనమేజయుం డిట్లనియె.

క. అనఘులు పాండవు లడవుల
ముని యాశ్రమ వాసులగుట మోసము కాదో
మనుజోత్తమ గుణశీలురు
ఘనతర దుఃఖితులు నౌట కలి తాకులతన్

క. కాలము గడపిన విధమది
లీలగదా దైవమాయ లెరుగం దరమే
మూలము ధర్మానుచరుల
ఆలోచన కర్మగాదె ఆశావహమున్

క. అన వైశంపాయనుడనె
జనమేజయ తదుపరి విను చెయ్యన కామ్య
క్వనమును వీడుచు పాండులు
వనమా ద్వైతమున చేరి పావనులుండన్

క. అట జనె కరి పురి బాపడు
పటుతరమౌ దేశచారి పాండుల కడకున్
దిటవుడు వినిపింప కథలు
నిటలాక్షుండైన గాని నిజమని దలుపన్

వ. వాని రాకడకుం సంతసిల్లిన పాండునందనులు హస్తిన యందలి తమ తల్లియు, విదుర భీష్మ ద్రోణ కృప ధృతరాష్ట్రాదుల క్షేమంబు లారసినపిదప తమస్థితి గత కుశలము లుపలక్షించిన వాడెపో ఆత్మీయత యుట్టిపడ వారల సమాస్వాదించి, ఆతిధ్యాదులు స్వీకరించి శుభం బగుగాక యని ఆశీర్వ దించి మరల హస్తిన కేగుదెంచి ధృతరాష్ట్ర పాలికిం జనిన అమ్మహీపాలుండు సంతసంబున వానిం దగ్గరగా జేర బిలిచి–

క. తమ్ముని తనయుల సంగతి
నిమ్ముగ విని శోకమగ్న నిర్భర హృదుడై
నమ్ముము నా తప్పిదమిది
దిమ్మరులై అడవులంటి దిరుగుట అకటా

క. సాధ్వీలలామ ద్రౌపది
పృధ్వీపాలకుల వెంట పూనిక ధృతియై
అధ్వర మతియై చెలగుచు
అధ్వాన్నపు జీవితాన అలమట బొందన్

చ. అమిత పరాక్రమాన్వయులు అందరి కందరు శూర శేఖరుల్
అమరుల ధిక్కరింపనగు అద్భుత శక్తులు ఆఢ్యవోత్తముల్
అమలిన సౌధవాగ్రముల హాయను జీవన సంగతోద్ధతుల్
కమలిన దీప్తులై దిటవు కానల బాధలు పొందుటీ విధిన్

క. సప్త సహస్ర గజాబల
దీప్తుడు అనిలా సుతుండు తేజోనిధి సం
తప్తుడు వైరి జనాళికి
ఆప్తుడు మునిజన సమాశ్రయాన్వయ తతికిన్

క. కోపోద్రిక్తులు తమ్ములు
వాపోవుచు నుండువారు బాధితు లగుచున్
ఓపని సతితో మమ్ముల
కోపంబున తిట్టుకోరె కోకొల్లలుగాన్

తే. ఘోర కలితంపు దుర్యోధ్న కుత్సితాల
కాగ్రహింపని పురుష సింహాలు వారు
అన్నమాటకు తలయొగ్గి అధికులౌచు
మిన్నకుండిరి కాదన్క మేటి గుణులు

వ. కాదేని–

తే. శకుని కైతవ దుశ్శాస్ను సాహసంబు
ధూర్త దుర్యోధన రాజస దుర్నిరీక్ష
వాయు నందన దావాగ్ని వసుధ రేగి
కౌరవాటవి గాల్పదో కాలగతుల

క. ధర్మజు సత్యము శాంతము
నిర్మలినపు బంధుప్రీతి నిజమూహింపన్
ఖర్మకు లోనగు మతితో
ధర్మజుని భ్రాతృ గణము తాలిమి గొనుటన్

క. మునుమును చేసిన కర్మలు
అనుభవములు కాకపోవు అయ్యె తెరగుల్
వనవాసము తీరు దనుక
మనుటది బహు కష్టతరము మహనీయంబౌ

క. వలదు వలదన్న జూదము
తలకొని మానంగరైరి దయగొను మనుచున్
కలతలకు మూల కారిణి
తులువతనం బదియదన్న దుర్నయ బుద్ధిన్

తే. రాత్రి పవళులు క్రమగతి రాకయున్నె
మంచి చెడుయును సమయ సమాన బుద్ధి
అందరందరు తమతమ అభిమతార్ధ
యుక్తి యుక్తమ పొందగు శక్తి దనరి

వ. అనుచు ధృతరాష్ట్రుడు పలుతెరంగుల పలికి మనంబున వగవ విని దుర్యోధనుండు వృద్ధరాజేల యింత భీత హృదయుం డయ్యెనని తలంచుచు కర్ణ శకులం బిలిపించి అభ్యంతర మందిరమునకుం జని కార్యాలోచన మనస్కుడైయ్యుండ కర్ణుండిట్లనియె.

దుర్యోధనుడు కర్ణ శకునులతో మంతనములు సల్పుట

క. అడవుల పాలై యుండిరి
వడి జేరను పాండ్వ లక్ష్మి వాదది లేకన్
పడియేడ్వను ద్రుపద తనయ
కడు భీతిలి పృథ్వి పతులు కప్పము లొసగిన్

క. అరి గాపులు గాయుటదియ
కురురాజుకు వశ్యులగుచు కువలయ మందున్
తరుగని కీర్తి ధనంబుల
విరిబూయదొ వైభవమ్ము వినువీధులలోన్

వ. పాండవు లిప్పుడు ద్వైతవనంబున యున్నవారలని వింటిమి. మిత్రజన మోదంబును, శత్రు జన ఖేదంబున గదా సంపదలకు దగిన ఫలంబు.పాండవులు నీ విభవంబు కన్నులారం గాంచి–

తే. సకల సామ్రాజ్య వైభవ సంపదలకు
దాయ శాస్త్రవ పగతుర ధర్మ విధికి

దార అనుజుల సహితుడై ధర్మజుండు
కృంగి కృశియించి మనసునం గూల వలయు

వ. అప్పుడ కాని యెంత యున్నను ఫలమేమి యెరుగ తగవొ.

క. ఆకు లలములు దినుచునై
వ్యాకులతం ద్రుపద తనయ బాధకు లోనై
సాకుగ మయసభ నవ్వుల
చేకూరిన ఫలమిదనుచు చెమరగ కన్నుల్

క. కురురాజన్యుల వనితల
ధరహాసపు మోము గనుచు దయనీయతయై
తరుగని వేదన భరితై
మరిమరి యేడ్వంగ వలయు మదమది ద్రెళ్లన్

వ. అనవిని నాగకేతనుండు సంప్రీతుడై ఆలోచించి రాధేయునిం జూచి–

క. నగుమోమిడి ఔనౌనని
మగువా ద్రోవది నగవటు మదనత గుందన్
పగతో పొక్కుచు యెంతో
భగభగ మండుచును నుండె భరమై వ్యధతోన్

వ. కావున ఇందుకు తగిన ఉపాయము ఆలోచింపనగునన సౌబలుడు కల్పించుకొని నా తలపును యిట్టిదను మది నూహల జేసిజేసి మనమా ద్వైతవనంబున కేగి మహనీయ భోగభాగ్య రాజ్య వైభవ ములు ప్రదర్శించిన, పాండవులు మనల జూచి లజ్జా భర భరిత వివర్ణ వదను లగుట నిక్కువంబు. ద్రౌపదియు నిర్వేదనా మతియై ధృతి దూలుటయు కాకపోదు. అవశ్య కార్యాచరణం బనుటయును దుర్యోధనుండు వారల కిట్లనియె.

క. తగువిధ మాలోచింపుడు
సుగుణ సమాహిత బుద్ధి సూకృతి మెరయన్
వగపేదియు లేక మదిని
దిగులొందెడు వృద్ధరాజు తేకువ పలుకన్

వ. సోదర పాండునందనులా ద్వైతవనంబున నుండుటెరింగిన ఆంబికేయుండు యిందుల కనుమ తించుననుట వట్టిమాట. అదియునుంగాక పాండునందనులు–

చ. భుజబల విక్రమోన్నతులు భూరిబలాఢ్యుడు భీమసేనుడా
విజయుడు ఆయుదోద్ధతుడు వీరుడు శూరుడు సంగరోద్ధతిన్

అజగర కాళిమర్దనుని ఆస్పద యుక్తులు అస్త్రవిద్యు లనిన్
నిజముగ నమ్మియుండుటది నిద్దుర రాదది ఆంబికేయుకున్

వ. అదియునుం గాక భీష్మ విదురుల మనంబున పాండవ పక్షపాతము గోచరం బగుచుండుటయు ను, మనము విచారించిన యిక్కార్యంబునకు వారలే చిన్న యెరింగిరేనియు విఘ్నమ్ము వాటిల్లు గావు న, అతి గోప్య రహస్యం బుగా దీనికి ధృతరాష్ట్ర అనుమతంబు వడయునదియ కార్యమ్ము. తెరవాలో చింపుడని పలికి నిద్రాసమయం బగుడు తమతమ మందిరముల కేగి ఆలోచనామగ్నులై పవ్వళించు టయు, ప్రభాతం బగుటయును కర్ణుండు కురురాజున్కు కడకేతెంచియిట్లనియె.

క. వనముల నున్నవి గోవులు
అనుమానము లేకయుండు నచటికి యేగన్
వన్యపు మృగములు చెలగుచు
మునుమున గో తతుల దినుట మోసము గాదే

వ. వాని రక్షణకునై ద్వైతవనంబున కేగుదుమని వచించుట కడులెస్స అన మంచి ఉపాయాలోచన యే యిదని సుబల తనూజుండును సహకరింప సమయోచితముగా పల్కితివన–

క. నవ్వుచు తమలో తాముగ
సవ్వడి లేకుండ వారు సత్వర గతులై
ముువ్వురు ఒక గోపాలుతొ
యివ్విధముగ వృద్ధ విభుని యిష్టత వడయన్

వ. కురువృద్ధ ధృతరాష్ట్రుల వారి వద్దకు చేర నరిగి కాలానుగుణ్య సముచిత సల్లాపంబులు సలుపు చు ద్వైతారణ్య ప్రాంతముల నుండిన మన గోపాలకుండొక డొచ్చెనని పల్కుటయు, ఆంబికేయుడు తొలుత వాని క్షేమమారసి గోసంతతులు క్షేమము లారయుటయును, ఆ వచ్చిన గోపాలకుడు మహా ప్రభూ!

కర్ణ సౌబల దుర్యోధనులు ధృతరాష్ట్రునిచే ఘోషయాత్రకు అనుజ్ఞ వడయుట

మత్త. ఏటి సేమము గో గణంబుల కేమి చెప్పుదు మారజా
నోటి మాటగ చెప్పలేనిది నొచ్చుకొందురు బాధతో
పూటపూటకు ఆవు దూడల పూన్కి వెంబడి గర్చుచున్
నీటి పట్టుల సంధ్య వేళల నీల్గ జేయుడు బెబ్బులుల్

మత్త. హెచ్చు జాగ్రత రేయి పొద్దులు యెంత గాచిన ఆదటన్
రెచ్చిపోవుచు కంచె దాటుడు రీతి నెప్పుడు చూడనే

వచ్చినాడను చెప్పుకోగను వచ్చి చూడరొ సత్వరం
బెచ్చు మీరిన క్రూర జంతుల నెట్టులైనను దుంచగాన్

వ. అని గోలు గోలున మొరలిడ సౌబలులిర్వురుం కురుభూపతి ధృతరాష్ట్ర మహారాజుతో దేవా! తడయక మన గోగణ రక్షణార్థము, మరియు క్రూరమృగ నాశనము గావించుటకుభవత్సూను దుర్యోధను సపరివారంబుగా పంపుట లెస్స యగునన, అతండు కొంత విచారించి వారల కిట్లనియె.

తే. దుష్ట మృగముల ద్రుంచుట పుష్టి దనర
ఆలమందల రక్షింప అర్హమగును
ఐన మద్భ్రాతృ నందను లెల్లరచట
నున్నవారని విన్నాను ఉవిద తోడ

క. తగదటు పోవను వారట
నగచాటులు పడుచునుండ నడవుల లోనన్
తగువిధ మాలోచింతము
పగబట్టిన పాము గాదె పవనాత్మజుడా

వ. అదియునుం గాక–

చ. ప్రకటిత బాహు విక్రములు పార్థుడు ధర్మజ మాద్రి నందనుల్
నక నకలాడు కోప పగ నందిన వారలు రాజసోద్ధతిన్
సకలము నెర్గు శాత్రవత సంశయ బంధము మానసంబునన్
వికలము నొందజేయునది వీడుట లేదది యీర్ష్య భావనన్

వ. అని వ్యథనొందుటం గనిన శకుని నయ్యాంబికేయునితో యిట్లనియె.

క. వారల జోలి అదేలను
నేరము నే జేస్తి మేని నేరరు నియమో
ద్దారులు ధర్మువు దప్పని
వారలు భయమేల మదిని పాండవు వలనన్

వ. అనుటయు దుర్యోధనుం డప్పుడు–

క. మాకును మృగయా కౌతుక
మాకలనము నున్నదెంతొ ఆవుల రక్షా ణ
తేకువ మతివై అనుపుము
మాకై యీ కౌతుకంపు మక్కువ దీరన్

వ. అనిన కొంత వడి విచారించి ధృతరాష్ట్రుండు వారల నుపలక్షించి–

ఆ. శుభము పోయిరండు శురభుల గాపాడ
దుష్ట జంతు బారి దొలగ జేసి
అనగ జాట బంచి రప్పుడు ఘోష్యాత్ర
కరిపురంబు గదల ఘనతకెక్క

దుర్యోధనుడు ఘోషయాత్ర వెడలుట

క. కరులును గుఱ్ఱంబులు ఘన
తరమౌ అరద పరివార తరుణీ జనితో
కురుపతి సోదరయుతుడై
అరిగెం ఆ ద్వైత వనికి అభిమత హితుడై

వ. అమ్మహీపతి విభవంబులకు తగినటుల-

క. అనురూపంబగు జనములు
చనినారా రాజు వెంట సహచర గణముల్
వనచర మృగముల ద్రుంపగ
కనివిన రానట్టి ఘనులు ఘనతర ముష్ఠల్

వ. ఇట్లు తరలి వెడలి ఐదు గహ్యూతులు (ఇరవై మైళ్ళు) ఆనాటికక్కడ విడియించి మరునాడు మరల గిరితరు నదీనద తీర దుర్గమ మారణ్యంబుల పయనించి ఆ ద్వైతవనంబు చేరి యందొక్క రమణీయ సైకత తలంబున శిబిరంబు గావించి కౌరవ్య రాజేంద్రుడు-

మ. కనిరా ఆవుల మందలం మరియు నా కాంతార తీరంబులన్
తనువుల్పొంగను లేగదూడ తతులం తత్తీర వ్యాఘ్రోధృతిన్
వినుచుం ఖేదము పొందనా సురభికై పెంపెక్కు కోపోధృతా
వనిలో నుండిన క్రూర జంతు తతులం వద్దన్క చెండాడగాన్

తే. వేగ క్రూర్మృగ విచ్ఛిత్తి వేట దగుల
సర్వ సన్నాహు డైయ్యుండు సమయమందు
గోపబాలురు తోదెచ్చి గోపరసము
అర్పితము జేసి రాజుతో అనిరి యిట్లు

తే. నీటి దరులను వాగుల నేటి యొడ్ల
సంధ్య సాయంత్న సమయాన చాటు మాటు
లేగదూడల ఆవుల లేపుకొంచు
వాటమేర్పడ బలిగొను వాలుమెకము

వ. అని పరిపరి విధముల మొరలు బెట్ట–

తే. అభయ మంచును మాకును ఆల జాత్కి
వచ్చినారలు మారాజులు సచ్చరిత్ర
పెద్ద మెకముల ఉగ్రోధ సద్దు సెపగ
మీకు తోడుగ వెన్నంటి మేము గూడ
రాగలారము వేట్లాడ రాత్రిపూట
దొడ్డ దొరలకు దార్జూప్థ అడ్డదార్ల

వ. సాయం సమయ కాల మాసన్న మగుటయు–

తే. సరస సల్లాప సౌహార్ధ సదయ వరుల
హాస్య రసరమ్య వైతాళికాంగ్న తతికి
ఆట విడుపుగ బహుకాన్క లందజేసి
వేడ్క వేటార్ధ మడవికిం వెడల నడచి

వ. శిత శీతల పూ విలసనోద్దీపిత తరు గిరి జలధారా గలగలారావ సముల్లాసిత సంజ కెంజాయ సంజనిత వరవర్ణ నీల బర్హిబర్హ నటనానంద సుందరతర విలసన శోభాయమాన, బక హంస జాత్కా రండవ జల కుక్కుట పక్షితండ జల విలాసన బుడిబుడ బుద్బుద స్వన రామరంజిత నీల మణిమయ అరుణారుణ పూ దామర కలువ కుముద రమణీయ జలాశయముల తోడను, ఘ్రాణ రసాస్వాదనా మధురాతి మధుర పూ భరభరిత చూత పనస కదళీ నారికేళ నిమ్మనారింజ ఖర్జూర దానిమ్మ రేగు వెలగ మారేడు జామ ఉసిరి కామ్లక సీతారామాఫలనేరేడు పోక తుమ్మికాద్యనేక పల్లవముల తోడను, శుక పిక కపోత చారికా కోకిలాద్యనేక దేగ రాబందుక కాక ఘూక గరుడ దివారాత్రించర పక్షి నివ హ కిలకిలారావ సుస్వర ధ్వనితరంగముల తోడను, మరుద్వీచికా సుగంధబంధురమునై నయనానంద మనోహరంబునై తరుమండ మండిత మధ్య వల్మీక శిఖరవ్యాళ ఫణి చిలువ వాలాంగోల కపికుల కిచకిచారావ కీచుక ధ్వనుల తోడను, ఆటవిక మృగ మదకరి కస్తూరికా హరిణ కిశిదంతి దంతావళ హయ ఘోటక గుర్ఘుర వరాహ వృక సింహ జంబుక శార్దూల మాని మార్జాలాది జంతుసంఘసంఘట్టన విద్ధూతమాన ధూళిధూసరి రజోసంకాశ అసురానీక ఆహారవిహార విజృంభణ సముల్లాసితమునై కంటక సహిత గొబ్బి గుబ్బ పూపొదరిండ్ల తోడను, జొరవీల్కాని ఆకుజంపముల తోడను, లతాగుల్మములతోడను, ఆహ్లాద సంజనితమునై యుండ పరిజన పరివార సమన్వితుండునై యేగుచు ధార్తరాష్ట్రుండు ద్వైతవనాంతర సరోవర తీరంబు చేర జనియె, అంతట అటధర్మ తనయుండు సోదర ముని జన సహాయుండునై వన్యఫలమూల సలిలశాఖాహారుండునై సద్యోఫల సద్యసస్కందంబను యజ్ఞమ్ము

చేయుచుండుటయును, దుర్యోధనుండు తత్సరోవర తీరంబుల క్రీడావిహార గృహంబులు నిర్మింపుడని నిజ భృత్యుల నియోగించుటయును-

క. అనుచరులా భృత్యు లపుడు
జనియా సరసీ తరులత ఛాయల దరులన్
అనువగు రీతుల గృహముల
పనులందున మునిగి యుండ వలదిటు మీకున్

క. తొలగుడు తొలగుడు వేగన్
పలువురు మీరెవ్వరిచట భయమది లేకన్
ఇలనిది గంధర్వాధిపు
జలకాటపు నీటిపట్టు చెయ్యన జనుడీ

వ. అని అధికారయుతంబుగా హెచ్చరించు నటుల పల్కిన విన్న యా భటులు దుర్యోధను పాలికిం జని వారల పలుకులు వివరించుటయు, నప్పుడు దుర్యోధనుడు రణ భీకరులగు సైనికుల కొందరం బనిచిన వారలు వెడలి గంధర్వులతో నిట్లనిరి.

క. వలదు తొలంగుం డనునది
బలయుత దుర్యోధనాద్ను బలగము ముందా
జలకాలాటల కొలనని
పలుకంగా చిత్రసేన్కు వలదని చెపుడీ

వ. అన్న కౌరవపతి ఆజ్ఞగా నెరింగించుటయును, అదివిని చిత్రసేనుండు ఆ వచ్చిన వారలతో-

క. తనుయేమో యెదురేమో
మనమున జింతింప నేర్ని మనుజులు గలరే
తనదౌ మానము మర్యా
దను గోల్పోవు టదియ తథ్యం బనుడీ

వ. అని పల్కుటయును మరియు మత్సరబుద్ధులతో మందమతియై చెడిపోకముందే తెలివిగా యిట నుండి తొలగి వచ్చిన దారిన వచ్చిన చోటికి పోకున్న అమానుషతకులోనై తలదించుకు కృంగి కృశిం చ వలసి వచ్చునని తెల్పుటయును, అది విన్న దుర్యోధన కౌరవ పతి రోషావేశ వివశుండయి తమ్ము లందరి వంకనుం జూచి మీరెల్లరును మీమీ సైన్యంబులతో వెడలి ఆ గంధర్వుల గర్వం బడంచి సరో వరం బాక్రమించునది. వారికిసహాయకారిగా సురగణాధిపతి యింద్రుండు అరుదెంచినను లెక్కచేయ క అవలీలం జయించునది అని పల్కిన వెన్వెంటనే-

క. నూర్వురు అనుజుల వెంబడి
గర్విత కురుసేన యంత గంధర్వులపై
సర్వము తామే అనునటు
పర్వెరి నల్దిశల జుట్టి బంధింపంగాన్

వ. అట్లు చనుదెంచు కురువీర సైన్యంబుల కడ్డంబు దవిలి కొందరు గంధర్వులు అనునయ ప్రియ పూర్వకముగా–

క. ఇటురా నేటికి మాతో
పటుతరమౌ ముష్టి జూప బలమది గలదే
కటువది జూపక మునుపే
అటు తొలగుడు వాదులాడ్క అమరుల కెదురై

వ. అని పలుకుటయును ఒర్వక నా సుయోధన సేనానులు వారలపై నిశితాస్త్రములు పెక్కు ప్రయోగించుటయును, వారలుకినుక బూనినవారలై అంతయు నా చిత్రసేనునకుం నివేదింప యిక మం వ్రాటలతో పనిలేదని మనంబున నోర్వక–

క. వేనకు వేలౌ గజరథ
సేనా వాహినుల నెల్ల జీల్చుచు చెండిన్
తూనీగల ద్రుంచు నటుల
పీనుగ పెంటలుగ జేసి పీచమడంచన్

క. రాధా తనయుం డప్పు డ
సాధారణ రణము జేయ చాపము బట్టిన్
గంధర్వులు నేల విడిచి
రథ ఆయుధ తతులతోడ రక్షాధృతిమై

వ. ఆహాయని మెచ్చు కొనుచు ఆ కర్ణుని ధాటికి నిల్వ నేరక–

క. ఆకశ వీధుల జూచుడు
నాకాధిప చిత్ర సేన్డు నాయని లేచిన్
తేకువ మాయాజాలత
ఆ కౌరవు కర్ణ శకుల నతివతౌ గూడన్

క. పటుతర గంధర్వాస్త్రుల
తృటిలో కట్టగను కట్టి ధరణీపతితోన్

ఝుటిలోద్ధతి నంద రొకట

నటునిటు కదలంగ నీక అద్భుత లీలన్

వ. ఆకశవీధులం గొనిపోవు నవసరంబున దూరతీరంబుల నున్న సుహృద్భావ చారుగణంబు కొన్ని పరుగు పరుగున ఆ దాపున గల ముని కుటీరంబుల సద్యోఫలయజ్ఞ నివర్తియగు ధర్మనందను పాలి కిం జని ధర్మజాత్మా! పాండునందనా! వంశవర్ధనా!

క. శరణు శరణు నీ భ్రాతృల

కురు రాజన్యుల నతివల కూటమి తతితో

అరిగెడు ఆ గంధర్వుల

నిరసించుచు వంశ కీర్తి నిలుపవె దేవా!

వ. అని మొర పెట్టుకొని కృతాంజలులై నిల్వ వారల జూచి వాయునందనుడు భీమసేనుండు ధర్మ నందనునితో–

క. అన్నా! కాగల పని మన

మున్నా గంధర్వ గణము మోసిరి జరుపన్

మొన్నను నిన్నను జేసిన

యేన్నెన్నో పాపాల ఫలము యీ విధి కుడువన్

వ. తగిన శాస్తియే యైనది. మనమూరకున్న సరిపోవునన నయ్యుధిష్ఠిరుండు అప్పుడు అనుజునితో నిట్టు లనియె.

క. దాయ పగలు మనవరకే

సాయము కోరున్న యపుడు సహజాతులమై

దాయకు సాయము చేయుట

నాయము మది నెంచు భీమ, నాయను బుద్ధిన్

వ. ధార్తరాష్ట్రులును మనమును అన్న దమ్ముల బిడ్డలము. ఏకకుటుంబ జనితులము. మనకుటుంబ స్త్రీల యెడల మన వారల యెడల జరుగు అవమాన పరాభవములు మనవి కావా? మనలో మనకు వైర ముండుగాక. ఇతరు లెత్తి వచ్చినప్పుడు మనమందరమును ఒకటియే. కావున ధర్మమును మదిద లంచి శరణాగతులైన మనవారలకు రక్ష గావించి తీరవలసినదే. అన విని భీముండన్నా!

క. మున్నుగ నీటను ముంచియు

పన్నిరి ఆ లంక యింట్కి పంపిరి జంపన్

అన్నమునం విషము గలిపి

రెన్నెన్నో జేసి రెగ్గు యెంతయు పగతోన్

క. పన్నని పాపము లేదుగ
మున్నెన్నో జేసినారు ముచ్చట దీరన్
అన్నీ భగ్నము లాయెను
మన్నించుట యెవ్విధమ్ము మాటకు యైనన్

వ. వారల విషయము తలపులకు వచ్చిన తనువు మంటలు భగభగలు భుగభుగలుగా రగులుచుండును. వారు చేసినవి మరువ దగినవా? అన విని ధర్మరాజు తమ్ములతో–

క. శరణన్న వారి కాచుట
మరణాంతపు వేళనైన మరువం దగునే
పురుషా దైవాంశ జనిత
కురు వంశోద్భవ యుడుగుము కోపంబు మదిన్

క. భరతాన్వయ నృపు సంతతి
నిరతము ధర్మార్త రక్ష నియతులు భువిలో
తరతమ మెంచక చేసెడి
తరగని సత్కీర్తి ధనము తలపరె మదిలోన్

వ. దుర్యోధనాదులు నీ బలదర్ప శౌర్య పరాక్రమ మెరుంగని వారు గారు. తప్పక గాపాడ్డు మని యెంతో ఆశతో వచ్చిన వార లిటకు. యజ్ఞ దీక్షితుడనై యుండుట నాకుం కదలజనదు. లేకున్న యిప్పుడే వెడల గలవాడ. కావున తమ్ములం దోడ్కొని నీవు–

క. అరుగుము కావం కౌరవ
పురజన సేనా ప్రభువుల పుణ్య స్త్రీలన్
సుర గంధర్వుల బంధుల
పరిపరిగా చింత జేసి భండన భీమా

వ. తొలుత గంధర్వులతో ప్రియ పూర్వకముగా పలుకునది. ఎట్టులైనను ఆ సుయోధనసార్వభౌముని విడిపించుడన, భీమాదు లన్నగారి మంచిని మాటను ఔదల దాల్చి–

క. ధర్మజుని మాట కెనయుచు
కార్ముక తూణీర కవచ గద సంయుతులై
నర్మిలి మనసుతొ నేగిరి
దుర్మద దుఃఖోపహతుల దుర్దశ బాపన్

భీమార్జున నకుల సహదేవులు చిత్రసేన గంధర్వులతో పోరుట

క. ఏగిరి సత్వర గతులై
సాగెడి గంధర్వ సేన సదయుల కెదురై
మూగుచు నల్వురు అనుజులు
యేగెద రెచ్చటి కనుచును యెంతయు ప్రీతిన్

క. మీతో కాదిది వాదము
మాతోడుగ బుట్టి యున్న మాకగు వీరిన్
యేతరులై గొని పోవుట
మీ తరమా విడిచి పొందు మీమీ దెసలన్

వ. అనిన వారలతో గంధర్వు లిట్లనిరి.

క. మా దెస కడ్డము వచ్చిన
సోదరులా వీరు మీకు సుంతయు దెలియన్
యే దెస జూచిన గానీ
సోదరు లని చెప్పు కొనుట చోద్యంబగుడున్

క. మమ్ముల నాజ్ఞాపింపగ
సమ్మతమే మీకు చెపుడ సత్యము పలుకన్
మిమ్ముల వమ్ముల జేయగ
నిమ్మహి వాంఛించు వీరు హితులా మీకున్

వ. అనుటయు, అర్జునుండు గంధర్వోత్తములారా! మిమ్ముల నాజ్ఞాపించుట కాదు మాకు–

క. మమ్ముల నాజ్ఞాపించిరి
నమ్ముడు మా అన్న ధర్మ నందను నాజ్ఞన్
సమ్మతితో జేయ వలయు
గమ్ముగ మా వార్ని విడుడు కాదన గలరే

వ. అనుడు ఆ మాటలకు కినిసిన ఆ గంధర్వ రాజు చిత్రసేనుడు అర్జునునితో–

క. సురరాజగు దేవేంద్రుని
నర నాకపు నాయకాజ్ఞ నయవిధి జేయ్కన్
వరవీరులు మీకు తగునె
సురరాజును ధిక్కరింప సూకృతమౌనే

వ. అనవిని అర్జునుండు, సుకృతమో వికృతమో యేదియైన మా అన్న ధర్మనందనుని అజ్ఞమేర మా అనుజ వరులీ కౌరవ వ్రాతమును మీ బంధముల నుండి విడిపించుట మాకర్తవ్యము. కావున ఇంత దనుక మీతో సఖ్యతతో పలుకుచున్నాను. విడిచి పొండు. కాదందురేని కాచుకొనక తప్పదు మీకన–

క. గంధర్వ గణము లొక్కట
నిందించుచు అర్జునాఖ్యు నిర్ణయ బుద్ధిన్
సంధించుచు దివ్యాస్త్రుల
యేంద్రావీన్లావు నంచు యెదురుగ నిలచిన్

క. వారణ జేసెడి వారల
తారాపథ మార్గమంటి తరుముచు వేగన్
శూరాగ్రేసరు డర్జును
డారని ఆగ్నేయ శరము నభిమంత్రించిన్

క. ఆరని కోపోద్రిక్తత
పోరుకు సంసిద్ధు లగుట పూనిక తోడన్
మారణ హోమాగ్ని రగుల
ధీరమణుడు ఇంద్రసూన్డు తేజోనిధియై

వ. తన వద్దనున్న దివ్యాస్త్ర విద్యా ప్రాభవ పాటవముల గంధర్వ సేనల చీల్చిచెండాడి దిగ్భ్రాంతులం జేయు నప్పుడు గంధర్వ నాయకుండు చిత్రసేనుండు వారణ సేయగ పాండుల వరుణునిమది దలువ అతండు పటుధారల కుంభవృష్టిగా వర్షించుటయును, మరియును–

క. మాయా గంధర్వ మహిమ
యేయెడనుం దన పొడ గననేర్పడ కుండన్
డాయుచు మొగులుల చాటున
చేయం బహు ఘోర రణము చింతిల పాండుల్

క. పొడ గట్టని వార్ల నెటుల
పడగొట్టుటొ తెలియ నేర్క పరిపరి దలచిన్
సడిగొని గొట్టుటె పనియని
వడివడిగా చింత జేసి పార్థుని తమ్ముల్

వ. అన్నా! అర్జునా! చిన్న నాట పిన్నాటల నేర్చిన ఘంటారవ శబ్ద భేదనము మరచితివా? అనఅర్జునుడు తమ్ముల కౌగలించుకొని ఆది గురువుల మదిందలచుకొని శబ్ద భేదిని ప్రార్థించి శబ్దవేధ సంవిధాన క్రియ మాయాజాలరులగు గంధర్వుల నెల్లర నొక్క తృటిలో వమ్ముచేయుటయును, చిత్రసేనుం

డది గని మరి చేయునది గానక ఇంద్రనందనుని జేరంజని తన పాద జూపి నిలచిన వాని దెసం జూచిన అర్జునుండు, గంధర్వనాయకు తెరంగుచింతించి సుహృద్భావ వీక్షణముల పలుకరింప వాయునందనుడును కవలులును చిత్రసేనునుం మర్యాద పూర్వకముగా కుశలం బడిగిన మీదట అర్జునుండు–

క. సురవర తగునే తమకిటు
కరుణాకర కౌరవేయు కాంతాసహితున్
పరువెంతగ తరలింపను
దరినుండగ ధర్మ నంద్న తమ్ముల గెలువన్

వ. అనిన నయ్యర్జుననకు చిత్రసేనుం డిట్లనియె.

క. ఎరిగియు వచ్చిన వీరల
దురితత దుర్బుద్ధు లౌట దుస్సహ బుద్ధిన్
దరిజేరుచు దర్పము గొని
పరిహాసము జేయ వచ్చి పాపులు మిమ్మున్

వ. వీరలమదమడంచి కాలుసేతులు బంధించి తెమ్మని సురపతి ఆనింద్రునానతి నెరింగించుటయు.

క. ఎరిగియు యెరుగక యున్నను
తరుగదె యీ కార్య కలన ధారుణి లోనన్
కురుసతి గౌరవ హానులు
తిరమను మా ధర్మజాజ్ఞ తీర్పగ వలయున్

క. సురగురు నానతి మాకును
సరిసరి పాటింప నగును సఖ్యత తోడన్
పరితాపము పోనుడివెడి
తెరవది మా యన్న మాట తిరముగ వినుడీ

వ. అని వారల నొప్పింపను వారును తత్ప్రకారము చేయుదుమన్న అందరును వెల్వడి –

ధర్మరాజు చిత్రసేనుని బంధము నుండి దుర్యోధనాదుల విడిపించుట

క. యజ్ఞుడు ధర్మజుని కడకు
విజ్ఞాపన జేయ వచ్చి విజయుని తోడన్
ఆజ్ఞాపాలనులయి రా
జాజ్ఞగ పరిజనుల గూడి అందరు యొకటై

వ. అప్పుడయ్యజాత శత్రుండు చిత్రసేను నతి ప్రీతిపాత్రంబున పూజించి మా యీ సోదర దుర్యో ధనాదులు సానుజా మాత్య సతీ సమేతులై మీచే కట్టువడి వధియింప బడకుండుట మాభాగ్యముగా తలచుచున్నాము. మావారి వలన మీకును మీ సుర గణాధిపులకును యేదేని దొసగు వాటిల్లిన దయగొని మాకుగా వీరిని సహించి విడువవలయు నని ప్రార్థింప నతండట్లుగాక యని దుర్యోధనా దుల బంధనము తెగటార్చి పాండు పుత్రుల నామంత్రణము జేసి నాక లోకంబున కరిగి ఇంద్రునకు తత్ప్రకారము నంతయుం దెల్ప, నప్పుడయ్యింద్రుండు అమృతవృష్టిచే నిహతులైన గంధర్వాదులనెల్లర సంజీవితుల జేయుటయును, యిట యుధిష్ఠిరుండును దుర్యోధనాదుల బంధ మోక్షము గావించి వారల కిట్టులనియె.

తే. అయిన దానికి జింతింప కాత్మ యందు
దుష్ట సాంగత్య దుర్నీతి తొలగ జేస్కు
నిన్ను నమ్మి వచ్చిన నెల్లవార్ల
చావ జేయక శుభుడవై చాల మనుము

వ. అని పల్కి వీడ్కొల్పుటయును, తదాశ్రమవాసులైన మహామునులు ధర్మనందను ధార్మిక బుద్ధి విశే షంబుల కొనియాడుచు ధౌమ్య సహిత పాండునందనుల బహుభంగుల ప్రశంసించిరని వైశంపాయ న విదితంబైన కధా కధనంబును విన్న, ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయ విరచిత -: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ పంచమాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము షష్ఠాశ్వాసము

శ్రీ పాదము లొత్త నగుట
కాపాడెదు వాడవయ్య కామిత ప్రదుడా
యేపాపము లంటనీక
సాపేక్షత కావుమయ్య సద్గుణశీలా!

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పునట్ల అతి మానుషంబైన అర్జునుని పరాక్రమము ను, దుర్యోధనుని అత్యంత దీనాతిదీన స్థితిత్వ పరాభవంబును విని విస్మయ పరుండగుచు జనమేజ యుండు వైశంపాయనునితో ఇట్టులనియె.

దుర్యోధనుడు ప్రాయోపవేశము చేయ బూనుట

చ. అనిశము పాప చింతనల కాస్పద కారియు దుర్వినీతికిం
మునుకొని పాండునందనుల మోదన వేదన పాలుజేయనై
జని యిటు చింతలందవిలి చావును మించిన దైన్య దుస్థితిన్
తనువది బాయగా మదిని తల్పడె తుచ్ఛుడు కౌరవేంద్రుడా

వ. అని అడిగిన ఆతని న మ్మని యిట్లను. వినుమీ తలచిన యట్టుల కౌరవేంద్రుండు రాహుగ్రస్థ కలుషిత వదనుండగు రోహిణీ పతియునుం బోలె విషాద పరాభవ వివర్ణ వదనుండయి, యేకాంతర మందిర వసుధా స్థలస్థితోప విష్టుండయి ఒక్కరుండును–

క. కనలిన లజ్జా వదనుడు
తనువది జాలింపనెంచి తమకము తోడన్
మునుకొని ప్రాయోపశమన
తనునాశిక రంధ్ర గతులు తద్దయు మూసిన్

వ. ప్రాణ పరిత్యాగంబు చేయసమకట్టి యున్నెడ కర్ణ సౌబల దుశ్శాసను లెల్లరును పరుగు పరుగు నయేతెంచి–

క. ఏమిది యీ పగిది గొనగ
మా ముందర యిట్టి విధము మమ్ముల విడిచిన్
సామాన్యుని విధము దలప
ధీమంతుడ ధీర గుణుడ తేజోవంతా

క. ధీరుడ వీరుడ శూరుడ
రారాజువు మమ్ము నేల రాజస వృత్తిన్
మారణ మంత్రంబు గొనగ
కారణ మేమొచ్చె జెపుమ కౌరవనాధా

వ. అని అడుగుటయును, అంత దుర్యోధనుండు వారలం జూచుచు–

తే. మాన మర్యాద లన్నియు మంట గలసె
ఓడి పదుగుర మధ్య నే యోటు వడితి
దాయ పగతుర చేతనే దయను గొంచు
బంధ ముక్తుడ నగుగాదె బ్రతుక నేల

వ. మాన ధనులగు మనుజ విభులకు తద్విదాఘాతమైన పట్టున ప్రాణ పరిత్యాగమే మిన్న కావున నన్నాప వలదనిన వానికి వారలప్పుడు–

తే. అన్న దమ్ములు నీకునై అయినవారు
నిన్ను కాపాడు కాదొకో నీదు జనికి
ప్రజల పోషించి పాలించు ప్రభుడ వీవు
చావు సమకట్ట పాపంబు చాల దలప

వ. అనవిని వెండియు వారలతో దుర్యోధనుండు, మీరు యీ దుశ్శాసనుని ప్రభునిగా పురస్కరించు కొని పురంబున కరుగుడని దుశ్శాసనుని కనుంగొని–

తే. ఏలు యీ కురురాజ్య మేకరీతి
ఐన వారల బోషింపు మధిక ప్రీతి
పగల నుక్కడంచుచు నీదు ప్రబల శక్తి
ఇంద్ర తుల్యుండ వగుదువీ విద్ధ చరిత

వ. అనిన వారల మాటకు యిచ్చగింపక దుశ్శాసనుండు అగ్రజు పాదంబులం బడి యిట్టి మాటలు నీ వన వలదు. నే వినవలదు. వేయేల యీ సర్వంసహా కురు సామ్రాజ్యమునకు నీవే ప్రభుండ వెన్న టికిని. నేను నీ అనుజుండ. అనుచరుండ. ఆజ్ఞా పాలకుండ.

తే. బేల వైతివి దేలనో భీత వగుచు
వజ్ర సంకల్ప సందీప్త వహ్ని తేజ

అన్ని విధముల ధీరవై అవని జనుల
కాచి రక్షింప పోషింప కార్య మగుదు

తే. నీదు భారంబు తలదాల్ప నేనదెంత
అనుచు యెలుగెత్తి రోదనం బనుగ మింప
యిద్ద రొండొరు పట్టుకు యేడ్వనౌత
అంగ భూపతి కర్ణుండు అనియె పతికి

క. ధీర కులోత్తమ కౌరవ
ఆరయ నీకేటి కొరత ఆర్తి దొరంగన్
కారణ జన్మడ కావా
కౌరవ కుల ముద్ధరింప గర్వోన్నతిమై

వ. పాండవుల చేత విముక్తుడ నైతినని వగచు చుంటి వంతియే కానీ ఆవలికార్యగతి ఆవంతయు దలంపనైతివి. నీ కారణంబున కాదె యీకురుకుల సామ్రాజ్య మంతయును నిశ్చింతన సుఖ జీవనం బుల వర్తిల్లుట. ఆ రాజునకు సంతోషకరముగా అవసర సమయంబుల సహాయకారులుగా నుండుట పురజన ధర్మ వర్తనులై యుండుటయును, ఆటులనే కౌంతేయులును నీకు నోడినీ బంట్లుగా జీవింప కున్నను నీ దేశమున నుండి నీ ఆజ్ఞావలంబనులై యుండగల్గుటచే వారు నీ విముక్తికి సహాయపడు ట వారల కర్తవ్యము. దీని కింతగా వగవ బనిలేదు. శాంతుండవై పురంబునకు విచ్చేయుము. అట్లు కానినాడు మేమందరమును నిన్ననుసరించి ప్రాణపరిత్యాగులము కాకతప్పదు. దీనన నీకు యింత కంటెను నిందయును నగుబాటును రాకయుండునా యని నొక్కి వక్కాణించుటయును, శకునియు దుర్యోధనునితో యిట్టులనియె.

క. కర్ణుండాడిన దుచితము
కర్ణంబుల జొనుపు మయ్య గతమది యెల్లన్
జీర్ణించుకు పక్షి విధము
దుర్ణీతికి పాలుగాక దుస్సహ బుద్ధిన్

తే. కడకు నా మీద నింతయు కరుణ లేక
కాయమును కూడ మంటలం కలుపనెంచ
మామ కష్టంబు లవియెల్ల మరచినావు
మానమర్యాద లంచును మాకు లేవె

తే. కష్ట సుఖములు మరియును నిష్ఠురోక్తి
ప్రాణహానులు మది నెంచ్క పాటు పడుచు
ధీరచిత్తుల గుణమది పెంపు జూపి
కార్య సాధనె ప్రభుతకు కాంక్షితమ్ము

వ. కావున–

తే. పిరికి తనమది పోవిడ్మ్ము పెంపు గూర
అవని జనులను పాలింపు మాదరంబ
ధీర చిత్తత వెలుగొందు దీప్తి గొనుచు
శుభము లంటంగ నూరేండ్లు శోభనుండ

వ. అని యెంత పల్కినం వినవొల్లక ప్రాయోపవేశ మనస్కుండై అందరబొమ్మనుటయును, సాయం సంధ్యా సమయం బగుటయు సుయోధనుండు శుచిస్నానుండయి వల్కలంబులు ధరియించి ఉచిత దర్భాసనుండయి స్థిరబుద్ధిం పద్మాసనస్థుండయి–

తే. సమసమాధిత సత్క్రియా సాధనంబ
ప్రాయ ఉపవాస్న సన్నద్ధ పరుడు నగుచు
శాంతి ధామంబు చేరనై సాహసుండు
ప్రాణ కార్యంబు యవి యెల్ల పారదొబ్బి
కానుపించెను స్థిర దీపకళిక వోలె
నిర్మలానంద సందీప్త నిశ్చలుండు

దుర్యోధనుని కృత్య పాతాళమునకు గొనిపోవుట

తే. అప్పు డహిలోకమున నున్న అసుర గణము
ఆత్మ సంబంధ రాక్షసు లంద రొకట
కృత్య నొకదాన్ని బంపిరి కౌరవేంద్రు
నటకు దెప్పించి వానితో ననిరి యిట్లు

తే. మానవేంద్రుడ కౌరవ్య మహిత శక్తి
సోదరాత్ముడ నీయట్టి శూరవరుడు
భూతలంబున బుట్టుట పూతమిదియ
ధర్మ మార్గమ్మె నీయట్టి తాల్మికునకు

వ. ఆత్మ ఘాతుకునకు నిందయు దుర్గతియు ప్రాపించును. పుణ్యలోకములు లేకనుండు. నీవు మానుష మాత్రుండవుకావు. సర్వార్థ రాజభోగ యశోనాశంబగు యీ దురవస్థ నీకేల. ఈ సాహసంబుడుగుము. కారణ జన్ముండవు. శత్రు భంజనుండవు. నీ పూర్వజన్మ కలన తెలిపెద వినుము. మున్ను యింద్రాదులచే నోడిన–

క. అసురానీకము లెల్లను
ఈసున ఆ సురుల గెల్వ యీశ్వరు గొల్వన్

ఆ సర్వేశ్వరుదయ. దయ
సేసిన భాసురుడ వసుర సింహుడ కావా

క. నీదగు పూర్వ శరీరము
సూదంటెడు రాయి కంటె శోభస్కరమౌ
యేదంటిన పో విడువదు
ఇంద్రాయుధ మైన గాని యిలపై గూలున్

క. నీకై నీతోడుగ నిల
యేకోన్ముఖ మౌచు గెలువ యిలపై బుట్టన్
యేకైక మార్గమంచును
సాకల్యము రాక్షసాంశ సంభవ మగుటన్

వ. నీ సామ్రాజ్య రాజన్యులెల్లరుం దైవాంశ సంజాతులరు. నీ పితృవ్యుల కొందరు దైవాంశ సంభూతులు. ఐనను నీ ప్రాపకంబున వారలయందును రాక్షసావేశము పొడమి నీకై నీ శత్రు నివహముల వధియింప సమకట్ట గలరు. కావున నిర్విచారుండవై అలకమాని నిజభ్రాతృ మిత్ర బంధు సంఘంబులు వెంటనడువ యధాపూర్వకంబుగ సంతుష్ఠాంతరంగుడవై యుండుమని కృత్యచే యధాస్థానమున కనుప, నంతప్రాతఃకాల తేజోరాశి ఆ రాజన్యమనోగత మా చీకట్లను పటాపంచలుచేయుటయును.

క. తేజోమయ కాంతి గనుచు
రాజేంద్ర దుర్యోధనుండు రాజస స్ఫూర్తిన్
భూ జనములు పొంగి పొరల
సాజంబగు రాజకీయ సద్భవు డగుటన్

వ. దుర్యోధనుండు తా దెలిసిన దంతయును–

క. కలగా దలచుచు మదిలో
యిల సంభవ మగుట నిజమ యియ్యది యనుచున్
తలచిన వాడుగ నాతడు
తెలుపడు యేమౌనొ దిట్టి తీరిది యెర్కిన్

దుర్యోధనుడు ప్రాయోపవేశము మాని హస్తినకు వచ్చుట

వ. ఇట్లయ్యుత్సాహ తేజోవంతుండైన రాజుంజూచిన సర్వజనులును ఆనందోత్సాహ సంభరితులు నైయ్యుండ, కర్ణ సౌబల దుశ్శాసనాదులంబిలిచి పురంబునకు వెడలనడువ సమకట్టనాజ్ఞాపింపుడన

మ. అమితోత్సాహపు పెంపునం గదలిరా ఆర్భాటు లెంతేనియున్
అమలానీకము వార్ధి చందమున వారాంతర్య మేమౌనొకో

తమలో తాముగ సంప్రదించుచు సద్భావజ్ఞు లెంతేనియున్
అమరాధీశుని ధిక్కరించు కరణిం ఆనంద మేపారగాన్

వ. అట్లేగిన దుర్యోధనుండు, కర్ణ సౌబల దుశ్శాసన బంధు మిత్ర మిత్రామాత్య అనుజా భటగణ సహితుండై నిండు పేరోలగమ్మున నుండ నొక్కనాడు-

మ. అనియెం భీష్మ పితామహుం డపుడు దుర్యోధనాదు ల్వినన్
కనుచుం యుంటిమి నీదు పోకడలు నా కర్ణాది సౌబల్యులన్
చనియా పాండవు లున్న వాకిటకునై సాధింప గంధర్వుచే
అనిలో ఓడియు బంధ ముక్తుడవునై తవ్వారి సాద్గుణ్యతన్

వ. ఇకనైనను బుద్ధిమంతమ్ముగ దుస్సాంగత్య దోషంబు నెరిగి అన్నదమ్ములరగు పాండవులతో మిత్రత్వంబున మెలగుట యెంతయును లెస్సయన, నా గాంగేయు పలుకులం దనాశక్త చిత్తుండై కర్ణ శకుని దుశ్శాసనుల పురస్కరించుకొని నేగ భీష్ముండు నిజ నివాసమున కరుగుటయును. కౌరవేశ్వరుండు యెప్పటియట్ల కార్యసాధనా మంత్రాంగ మందిరమున మంత్రులతో కర్తవ్య ఆలోచనుండయి యుండ కర్ణుండు వాని కిట్లనియె.

ద్వి. మాను నీమది విచార మెల్లను - మానితంబగు ఉజ్వలుండవు
భోగభాగ్యము లంద జేయుము - భూసురావళి మెచ్చుగాన్
యజ్ఞ యాగము లెల్ల జేయుము - ప్రజ్ఞ జాలగ కౌరవేంద్రా
రాజరాజువు రాక్షసోద్ధతి - రమణి సంపద కురియగా
ఏక ఛత్రము గాగ యేలుము - యిద్ధరణి రాజులు కొల్వగాన్

వ. అనిన దానికి సంప్రీతుండై కౌరవేంద్రుండు-

ద్వి. రాజసూయము కంటె మిన్ననగు - రమ్యతరమగు యాగ మొక్కటి
రాజరాజను పేరు వెల్గగ - రాజ చంద్రులు జూచి మెచ్చగ
జగతి యందున వెల్గు లీనగ - జనులు జూచియు చాల మెచ్చగ
చేయ నెంచితి చింతలన్నియు వీడగా- చాట బంపుదు సర్వ జగతిని

వ. అని పల్కి బ్రాహ్మణోత్తముల రావించి ప్రస్థావింప, వార లిట్లనిరి.

దుర్యోధనుడు వైష్ణవంబను యాగము చేయుట

ద్వి. సృష్టి యంతయు అష్ట దిక్పతి - పుష్టి దనర జేసి నట్టిది
వైష్ణవీయము దుష్ట నాశము - పుష్టి గొల్పెడి శాంతి యాగము
కష్ట సాధ్యము యుర్వి పతులకు - కాంక్ష దీర్చెడు శత్రు జయముగ
నిష్ట చేయుమ కౌరవేశ్వర - నిశ్చయంబని దెల్పగాన్

క. పెద్దల యనుమతి గొనుచును
ఒద్దికతో పనులు దీర్ప యోహెూ యనగా
ఉద్దండ యాజనీయుల
సిద్ధాంతుల పిలువ నంప శీఘ్రమ యనుచున్

క. పిలువం నంపిరి సద్భవ
కులగుణ సందీప్త నృపుల కూటమి నెలమిన్
పలువుర రాజన్య జనుల
యిల గల విప్రోత్తములను యితరుల నెల్లన్

వ మరియును ముఖ్యముగా ద్వైతవనంబుననున్న పాండవుల సన్నిధికి ఒక దూతద్వారా కబురంపుట యును, ఆతడు వెడలి ధర్మనందను పాలికిం జని–

తే. పాండవోత్తమ దుర్యోధనుం డనిపెను
తాను జేసెడు వైష్ణవంబను యజనము
చూడ రమ్మని మునివరు తోడ మిమ్ము
రమ్మన ధర్మజుం డతనితో ననియె నిట్లు

ఉ. సంతస మాయెనా మదికి సద్బుధి తోడ సుయోధనుం డటన్
వింతగ జేయు యాగముకు వెళ్లుట కూడదు కార్యదీక్షచేన్
అంతకురాక యుండుదునె యంతటి కార్యము చేయుచుండనా
వంతయు ఆడి తప్పుటది నాత్మకు నొప్పదు సత్యసంధతన్

వ. అని దెలుప మనుటయును, భీముండా దూతంగని –

ఉ. ఆడిన మాట కాదనక అన్నయు దమ్ముల మందరొక్కటం
వాడి శరంబులం గొనుచు వావిరి వత్తుము యుద్ధ భూమికిం
యేడులు మూడునుం బదియు యేగిన మీదట కౌరవేంద్రుకున్
పోడిమి తోడుతం బలుకు భూపతు లెల్లరు సంతసింపగాన్

వ. అని నొక్కి వక్కాణింపుమని తెల్పిన, నా దూత కరి నగరమున కరిగి, నిండు పేరోలగంబున సుయోధనునకు నమస్కరింప, పాండుపుత్రు లేమనిరని యడుగ ధర్మ నందనుని ప్రియవచనంబు లును, భీమసేనుని కోపోద్రిక్త నిష్ఠురోక్తులను దెల్పుటయును, అట్టియెడ ఆ కౌరవ్య యాగార్థ సంసేవనోత్సాహులై–

మ.వసు సంబారము లెన్నియో గొనుచురాభాగ్యోన్నతాధిప్యుకున్
వసుధం బుట్టిన సద్బుధోత్తమ సతీ పద్మాక్షు లెందెందరో

నిసువుల్ పిన్నలు పెద్దలందరధిపుల్ నిర్ద్వంద్వ పారీణిలై
వసునాధీకము పొంగిపొర్లె ననగా వచ్చెన్ ప్రజావాహినుల్

వ. మరియును ఆహ్వానితులై శిష్య సహితులై విచ్చేసిన మునిజనానీకంబుల నెల్లరయుక్తి యుక్తముగ సత్కరించి పూజించుటయును–

మ.దశదానాదిగ సర్వ దాన విధులం ధన్యుం డొసంగెం కడున్
విశదంబౌగ సనాతనా విబుధకుం వేర్వేర సంప్రీతిమై
అశనా పేక్షకు లన్నదాన మొసగెన్ ఆ యాగ సంపూర్తిమై
నిశి దాటేంతకు రాజసంబెసగనా నిర్ నిద్ర భావోన్నతిన్

వ. ఇట్లతి వైభవముగా జరిగిన ఆ వైష్ణవయాగంబు పరిసమాప్తమగుటయు, యాగానంతర అవభృ త స్నాన శోభితుండైన సుయోధనుండు అయ్యై దేశాగత రాజన్యులనెల్లర ధన కనక వస్తువాహనము ల నిచ్చి సత్కరించుటయును, వారలతనింగని–

క. మున్నొనరించిరి పెక్కురు
యెన్నెన్నో యాగ విధులు యిలలో నృపులర్
విన్నది లేదిటు యెన్నగ
నిన్నటి నీ యాగ సాటి యేర్పడ దెందున్

వ. అని అనేక విధముల ఉత్సహించుకొనుటయు, మనములందు మరికొందరు–

క. ధర్మజు రాజసుయాగము
నిర్మలమై శాంతిదనరె యెందుం సమమే
నర్మిలి తనముగ జేసిన
కర్మాంతపు యాగమిదియ కాదొకొ దెలియన్

వ. అని అనేక రీతుల తమలోతాము ఊహించు కొనుచునేగ రాధా తనయుండు సుయోధను కడ కేతెంచి–

ఉ. కౌరవ నాధ నీకతన కౌరవ గౌరవ మెల్ల దెల్లమై
దూరపు తీర కీర్తనము దోహద మెంతయు ముందు నాటికిన్
ఏరికి జెల్లు భాగ్యమిది యెవ్వరు సాటిల కౌరవేంద్రుకున్
ఊరట జెందె మానసము ఉత్సవ మెంతయు నీదు మామకున్

వ. మున్ముందు పాండవుల జయించి యిటులనే రాజసూయమును గూడ సేయందగు. కదన రంగ మున ఇంద్రనందను నెదిరించి పోరు దిగ్విజయ మగునట్లుశాశ్వత కీర్తి గడించుటది నాది కాదే అన

మహదానంద సంభరితుడై దుర్యోధనుండు కర్ణుని కౌగలించుకొని ఆత్మీయులందరి సమక్షమున అత
నితో–

క. నీవుండగ నాకేటికి
దేవుండవు నాకు నీవు ధీరుడ కర్ణా
కావాలని శ్రీకృష్ణుడు
యేవేవో జెప్పుచుండు యింతయు యెంతన్

వ. ఇట ద్వైత వనంబున ధర్మ తనయుండు, అట సూతతనయు ప్రతిజ్ఞా వాక్యములు పరోక్షముగా వినినవాడై మనంబున వాని ధైర్య సాహస బల పరాక్రమశస్త్రాస్త్ర విద్యా పాటవంబునకును, పుట్టుక తో వచ్చిన కవచకుండల ప్రభావ శక్తిసంపదలకును విషణ్ణ హృదయుండై కునుకు లేకుండుటయును, దుర్యోధనుండు కర్ణ శకుని దుశ్శాసన ప్రముఖులతోడ కార్యసాధానానుకూల మంత్రాగుండై పెద్దలైన భీష్మ ద్రోణ కృపాశ్వద్ధామాదులకును రాజకీయ దురంధరులైన రాజ ప్రభువులకును ప్రియసత్కార సంభాషణలతో నిత్యంబును త్యాగ భోగ పరాయణుండై యుండె నన్న వైశంపాయనునకు జనమే జయుండు మీదికార్యం బెట్టిదని అడుగుటయును–

ద్వైత వన మృగములు ధర్మరాజునకు స్వప్నములో తమ దుఃఖములను చెప్పుకొనుట

క. ఏడులు తరబడి పాండులు
వేడుక మృగజాతి జంప వీడకె ద్వైతిన్
కీడని శంకించి మదిని
వీడక లేకం మృగములు పెద్దగ వగచిన్

క. కలలో కనబడె మృగములు
వలవల యేడ్చుచును ధర్మ పాలకు తోడన్
ఇల మా కులములు నిల్పగ
వలనొప్పగు వేరు చోట్కి వడిగా నేగన్

క. వరమిడు మాకంచు పలుక
సరిసరి అటులే ననుచును చాలగ దలచిన్
అరుగగ పోదలచి ననుజు
తిరముగ వేరొండు చోటు దెల్పుడు యేగన్

క. అనగా నప్పుడు వారలు
వినుమో మాయన్న యిపుడు వేరుగ నేగన్

అనువది కామ్యక వనమట
జనియుండుద మంద రచట చయ్యన అనగాన్

వ. వారెల్లరును ధౌమ్య గురు బ్రాహ్మణ వరులతో గూడను పాంచాలీ సహితులై కామ్యక వనంబున కరిగి అన్యోన్యానురాగరంజితులై పర్ణశాల లేర్పరుచుకొని అందుకందమూల శాకాన్న ఫలాశనులైతృణ పర్ణాశనులై కాలోచితముగా సుఖంబుండియు అప్పుడప్పుడు తమకంబు ఆడిన జూద దుర్వ్యసన పరా లోచనులై మనంబుల వగచుచు కాలంబు లెక్కించుచు నుండునంత, నొక్కనాడు–

మ. అరిగెన్ వ్యాస మునీంద్రుడా వనికి తానవ్యాజ పారీణుడై
తిరులై ధర్మజు వాకిటకునై శీతాంశు బింబాననుం
డరుదై శాంతత భీముడర్జు న నకులర్ ఆత్మాభిమానుల్వ్యథా
భరులై మాన్యులు గుందనై వెతలురై ధైర్యంబు పోనాడకన్

వ. అపుడా కురుకుల వంశోద్ధారకుం ప్రీతి కనుగొని పాండు పుత్రులు యెదురేగి పాదాభివందన మాచరించి ఆశ్రమమునకుం గొనివచ్చి అర్ఘ్య పాద్యాది విధి విధానోక్తంబుగా పూజించుటయును, సంతుష్టాంతరంగుడై వనవాసోప వాసనా కృశాహిత శరీరులం దుఃఖితాంతరంగుల నివురు గప్పిన నిప్పు కణికలవోలె తేజోవంతంబులగు శస్త్రాస్త్ర విద్యా ధనార్జితుల ద్రౌపదీసహిత పాండునందనుల నందర దిలకించి బహుభంగుల ఆశ్వాదించి, ధర్మనందనుం గనుంగొని–

తే. నిష్ఠురంబైన నీ కాల నియతి దెలియ
స్రష్ఠ నొక్కనికే నౌగ సర్వ జగతి
కష్ట సుఖములు గణియింప కాదుబుధకు
నిష్ట వర్తను లగుటదే నీతిమంత

క. తప మొనరింపు మనుచు నా
విపరీతము లెల్ల బాయు విజయోత్సింహా
తప మొనరింపరె తపసులు
ఉపయుక్తంబగు జగతికి నుర్వీ పతికిన్

తే. సత్య శీలము క్షమయును శాంత చిత్త
మత్యంతము జరుపు నతడె ఆఢ్యత వెలయున్
ముత్య మంతటి ధర్మంబు ముజ్జగాల
నిత్య శోభితమై వెల్గు నిర్మలాత్మ

వ. అని పల్కిన మీదట ధర్మరాజు యేయే దాన ఫలంబులు అధిక ఫలంబనుభవ యోగ్య మగునని అడుగుటయును–

వ్యాసుడు ధర్మజునకు ముద్గలోపాఖ్యానమును దెల్పుట

వ. తొల్లి కాశీ పట్టణమున ముద్గలుండను మహనీయ తపోనిధి ఉంఛజీవనుండయి వచ్చినదానిలో కొంతకొంత ప్రోవుచేసి ప్రతిపక్ష, మాసాంత పర్వదినంబుల అతిధిఅభ్యాగత సంతర్పణలొనరించుచు అన్నోదకములపై అనాసక్తుండై ఉన్నది లేదనక కాదనక యెల్లర దనుపుచు తనకు లేకున్నను సంతృప్తి తో నారాయణనామ సంకీర్తనోపాసనుండయి పరలోకగతుడగుటయును, ఆతనికై దేవలోకమునుండి ఇంద్రవిమాన మరుదెంచుటయును, అంతనాతడు దేవలోకపు తీరు తెన్ను లెట్టివని అడుగుటయును, దేవదూత లాతనికి యిట్టు లనిరి.

క. ఈ లోకము పైలోకము
ఆలోకింపంగనేల అమరాన్వితమై
లీలం దనరుచు వైభవ
సాలాలంకృతము దివ్య సంభవ మెలమిన్

తే. ఉందు రచ్చట దివ్య భవ్యులును దాన
యజన సత్పుర్ష సింహులు సుజన కోటి
మానవాతీత సుజ్ఞాన మహిత గుణులు
సత్య సంధులు నుత్తమ సద్గుణాళి

క. పూనిక కలదొక లోకము
దానికి పైపైకి చాల దవ్వుల సత్యం
బైనది బ్రహ్మ పథంబన
మానవు నూహకును మించి మహిమాన్వితమై

క. వెలుగులు జిమ్ముచు నుండును
కలలో కాంచంగ వచ్చు కమలోద్భవుడా
తలమును యేలుచు నుండును
కలుముల పంటలును పండు కాంచన తరువుల్

వ. అందు దేవఋషి గణోత్తమ సంభవులును, మనువులును, దాతలును, దయా దాన తపోవిభూతులును, ధర్మ సత్యాభి సంశోభితులును, భూరి యశోవిలసితులును,యోగిపుంగవులును, ఆత్మానంద సంధాయకులును, భక్తితత్పరోద్భవులును, స్వర్గాతీతలునైన తేజోరూప సంభావ్యులును, నిత్యానంద తేజోరాశి సంసేవ్యమాను లగుచు ఆనందించుచుందురు.

తే. కామ కిల్బిషాసూయలు కానరావు
ఆది వ్యాధులు అనునవి అసలె లేవు

పాప మనునది చెవులకే పాలుమారు
బ్రహ్మ పదమది మహనీయ భవ్యతలము

తే. సుఖము సౌఖ్యమ్మునౌ స్వర్గసీమ
హెచ్చు తగ్గులు లెక్కింప నుత్సహింత్రు
తనదు పుణ్యమ్ము చాలదో తలము దోత్రు
అవని జేసిన పుణ్యమ్ము అయిన తోడ

వ అంతియేకాని మరల అచట పుణ్యమ్ము గణియింప నవదు. బ్రహ్మోవర్తనము నందును తక్కిన స్వర్గ ముల యందెల్ల యెడల యిదియే వర్తింపనగు. బ్రహ్మ లోక పరిభ్రష్టులరు మగుడి మర్త్య లోకంబున శుభశీలుండయి జననమందు. ఇయ్యది కర్మభూమియు, ధర్మావర్తన పుణ్యములు గణింప వీలుకలదు. ఆ లోకములందు ఇందుల ఫలమును అనుభవించుట అగు. నీయందలి దయాగుణమునఆదరబుద్ధి తోడను యింత దెలుపం వలసె. కావున సత్వరుండవై వచ్చి విమానారూఢుండ వగుము. ఆలసించె దవేల యన ముద్గలుండు ఆ దేవదూతల కిట్లనియె.

తే. స్వర్గమున కేగి మగుడి నిసర్గ మగుట
దివ్యధామమ్ము యెటులౌను తిరిగిరాని
సత్య లోకమ్ము చేరుటే సమ్మతింతు
అంత కంటెను సుఖదమీ యవనినుంట

తే. పదులు వేలేండ్లు గడిపితీ భవము నందు
దివ్యలంపిన యానంబు దీని నెక్క
అవ్యయంబగు స్థితధామ మభిలషింతు
అమర వరులకు నేనిదే అంజలింతు
తిరిగి బోవుదు మీదారి దివ్యసీమ

వ. అని వారలవీడ్కొల్పి ముద్గలుండు సత్యనిష్టా గరిష్ఠుండై అవ్యయానంద సంతుష్టాంతరంగ శాంతి మార్గుండై నిర్వికల్ప జ్ఞానమార్గణుండై ధ్యానయోగ సమావిష్టుండై తుల్య నిందాస్తుతి పాటింపని వాడై సర్వకాలసర్వావస్థలయందున భగవన్నామ సంకీర్తనుండై పరమపదంబును బొందెనని తెల్పుచు పాం డవోత్తమా! నీవునూ తపంబు చేయుము. నీకు జయమ్ము చేకూరు. ఈ అరణ్య అజ్ఞాతవాసాంతముల అభీష్ట సిద్ధుండవై నీ పితృ పైతావహంబైన రాజ్యంబు పొందెదవని సమాస్వాశించి సాత్యవతేయుం దరుగుటయును, సంతుష్టాంతరంగు లై పాండవులు–

క. గడిపిరి ఆరణ్యాంతిమ
గడువది తీరెడు దనుకను కామ్యక వనిలో

గడుపుచు అస్త్రాభిరతిని
గడుపను అజ్ఞాత విధపు కాలము యెటులోన్

వ. అని మది దలంచుచు నొక్కనాడు తృణబిందు మౌనీంద్రు యాశ్రమంబున కులగురు ధౌమ్యాదులను ద్రౌపదిని నునిచి–

తే. వేటలాడను వేడుకన్ వీరవరులు
పాండవేయులు యైదురుం పయనమయిరి
సింహ శార్దూల మత్తేభ జింక లేళ్ళ
అడవి గుర్ఘుర దుప్పుల నట్టె నేయ

సైంధవుడు పాండవులచే పరాభవింపబడుట

చ. సుమధుర సింధు భూపతియు శూర శిఖామణి సైంధవుండనన్
అమలిన శౌర్య సాహసుడు ఆఢ్యు డసాధ్యుడు యుద్ధ సంగతిం
తమకము తోడి దుందుడుకు తత్పర కామియు రాజసోద్ధతిన్
సమహిత కార్యుడుం మరియు సత్కృప జూచు వాడెల్లడన్

తే. సహజ సుందరి సద్గుణ సాళ్వదేశ
కన్యకామణి పెండ్లాడు కార్య వశత
అరుగు చుండెడి సైంధవుం డడవి దారి
ఆశ్రమ స్థిత ద్రౌపది గనుట నొకట

క. అరదము నెక్కి వనాంతర
సరసిజ నేత్రి నగ్ని సంభవ సుదతీ
దర్శన భాగ్యు డసురగతి
విరహితు డగుట విధికృత వింతయు కాదే

వ. ఆ ద్రుపద రాజతనయ ద్రౌపదిని జూచి యీమె యెవ్వతెయో–

ఉ. ఎక్కడిదీ తనూవిభవ నెక్కడి దందము సౌకుమార్యమున్
నిక్కువ రాచ కన్నియయ నేరరు దీనికి యింద్ర భామినుల్
తక్కువ కాదుకో యవని దర్శన మిచ్చిన చంద్ర బింబమో
మక్కువ దీర్చుకో దగదె మానుగ జేకొని రాజ్య భోగముల్

వ. అని మదిం దలంచి అక్కోమలిం కనుంగొని–

ఉ. ఎవ్వరి దానవో యువిద యివ్వన సీమల నుండ నేలకో
సవ్వడి గాక రావలదె సద్భవ కోవకు జెందువాడనే

యి వ్వన భూములన్నియును యేలగవచ్చును నన్నుగూడియున్
పువ్వుల బెట్టి కొల్చెదను పొందెద సౌఖ్యము సింధురాణివై

వ. అని పల్కుట వినిన యంతన, నా యన్నతో ద్రౌపది–

తే. ద్రుపద పుత్రిని పాండవ పత్ని నేను
మున్నె కౌరవ పాండుల చిన్న చెల్లి
నాదు మరదలు దుశ్సల నీదు భార్య
తనను భార్యగా గొంటివి ధర్మ విధిని

వ. అన్నా నన్నెరుంగవదేల అన్న వౌదు. నీ బావ లేవురును వేట విహారార్థము అడవి కేగిరి. వారువచ్చు దనుక ఆశ్రమమందు విశ్రమింపుము. వారినుండి తగు సత్కారములు గొని యేగెదవు గాక. అనవుడు–

తే. నీదు మాటయు చాలదో నిజము తెలియ
పాండవాదుల మాటేల తలప నిపుడు
బతకుచున్నారు కృశులునై పాప మకట
అడవులం బడి మృగయులై ఆర్త జనులు

తే. వావి వరుసలు దలతురే వసుధ నృపులు
కంటి కింపైన చెలియతో కదియు కంటె
భోగ భాగ్యమ్ము గలదటే భోగపరత
ఆడుదానవు దెలియవే అంతమాత్ర

తే. అందచందాలు అన్నియు అడవి పాల
వృధగ జేయంగ నీకేల వయసు దాన
రమ్ము రథమెక్కి నావెంట రయము గూర్తు
కొమ్ము సుందరి నామది కోర్కె దీర్ప

వ. అని కన్నుగానని మదోన్మత్తత ప్రలాపించు వానిమాటలు విననేరక చెవులు మూసికొని రామ రామ. దుర్మార్గుండ వనుచు పర్ణశాలలోనికి అరుగుచుండు నంతలోన–

తే. నగుచు వెన్నంటి పట్టబో నామె యపుడు
ఒక్క ద్రోపున ద్రోయనా ప్రక్క బడియు
అంగనామణి కొంగ్బట్టి అరచు దాన్ని
వేగ గొంపోయి రథముపై వెడల నడువ

వ. ఆర్తనాదము విన్న యా దాపు వాసు ధౌమ్యులు వచ్చులోన–

తే. అరదమల్లంత దూరాన కరుగుటయును
ధూర్త సైంధవ వర్తన దుర్మదాంధ
కండకావర మెల్లను యెండగట్టి
పీచ మడయించు పాండవ భీమబలుడు

వ. అనుచు ధౌమ్యుండు వచియింప ననుచునుండ, అడవి కెళ్లిన పాండవు లరుగుదేర. విన్నవించిరి సర్వమ్ము విశదమౌగ. రక్షగూర్పగ ద్రుపజాత్మకు తక్షణంబ.

తే. అనిన యప్పాట పాండవు లంద రొకట
అస్త్ర శస్త్రాదులన్నియు నపుడ దాల్చి
దౌడు దీయించి గుఱ్ఱాల దారి నంటి
సైంధ్వ సైన్యాల దెగటార్ప చెలగి రావ

వ. పాండవుల గుఱ్ఱాల పరుగు దెలియ, దౌడు దీసెడి నశ్వాల ధాటి గనుచు దూరతీరాల జూపుచు ద్రుపద జాత చచ్చినాడవు సైంధవా నిశ్చయంబు. అన్నమీదట సైంధవుండామె తోడ–

తే. వచ్చు నీ దగు పాండవ తుచ్ఛు వలన
చచ్చువాడనె దెలియుమా హెచ్చుమీరి
అస్త్ర శస్త్రాల సంధించి నంద రొకట
యెత్తి వచ్చిన నాకేటి యింతి గనుమ

తే. తెలియ చెప్పుమ అవ్వారి తీరు వినగ
వేరు వేరుగ దిలకింతు వేరువేర
అనిన యప్పుడ అనియె ద్రుపద తనయ
ఆలకించిన చత్తువీ అవని గూలి

వ. అనుచు వచియించె సైంధవుండౌర యనగ.

తే. ధర్మ వాయువు యింద్రులు దయ దలిర్ప
కుంతి కడుపున బుట్టిన కొమర వరులు

దేవ వైద్యులు అశ్వనీ తేజమొప్ప
మాద్రి కడుపున పుట్టిన మనుజ విభులు
పంచపాండవు లనుపేర బరగి నట్టి
ధర్మ జ భీమార్జ న నకుల సహ్దేవు లనగ

వ. కనుమా పంచకళ్యాణిపై అరుణారుణలోచనుండదే శాంతుడు ధర్మ దేవత శరణాగత రక్షణుండు.

మ. సవనోత్సాహుడు సాదువాదన కళాసంశోభితుం డెంతయున్
అవనీరాజ్య మదేక ఛత్రపతిగా ఆద్యంత మేలంగనౌ
భువనారాధ్యుడు పూర్వ పుణ్య కలనం పుంభావ సారస్వతీ
అవనీనాధు డజాత శాస్త్రవు దతండార్యోక్తి పెంపారగాన్

వ. ఆ వెన్క సింధూర కుంకుమ సైంధవముపై అత్యుగ్ర కోపానలాలోచనుండుద్దండ గదాధరుండదే.

మ. పవనాధీశ శతాధ్క శక్తి మయు డాపద్బంధు డుద్దండు ధీ
జవ సత్వంబులు అన్నియుం తనవిగా జన్మించె యీ లోకమం
డవరోధమ్ములు యెన్నియుం దగిలినా అడ్డంక్లు పోకార్చుకున్
భువన మ్మంతయు ఢీకొనం నిలుచునా పుణ్యుండు భీముండనన్

వ. అదిగో ఆ వెన్క ఘనగాండీవాయుధ హస్తుడై, శ్వేతాశ్వారూఢుడై విజయము చేయునా విజయుండదే–

మ. అసురానీకము లన్నియుం తమవిగా అన్యోన్య ముద్యుక్తులై
వసుధాధీశులు సర్వ సైన్య తతితో వాతోద్ధతిం బోరినా
పస జూపించుచు జీల్చి చెండాడ నవుచుం బాణాగ్ని బుట్టింపనౌ
అసమానాస్త్రుడు పర్జన్యాభయ ఘనుం డర్జు ్నండునా దెల్యుమా

వ. మరియు నావెన్వెంట పులినాశ్యామల నీలవర్ణ తురగారూఢు లుద్దండదర్పోద్ధతుల్ యిర్వురున్.

మ. కుసుమా సున్నిత సౌకుమార్య తనులర్ కూలంక్ష ప్రజ్ఞానిధుల్
అసమానాస్త్రులు పాండుభూప తనయుల్ అక్షీణ తేజోమయుల్
అసువు ల్దీతురు వీరవైరి తతులం అన్యోన్న మేపారగా
మసిమాడ్జేతురు వారు వీరనకనా మాద్రీ తనూప్రాభవుల్

వ. వీరేవురును ఆనేకానేక రిపుసంహారక శస్త్రాస్త్ర గదాయుధ సిద్ధహస్తుల్. భీముడు చిరుత ప్రాయముననే ఉద్దండ బలదర్పితులైన బక హిడుంబుల ద్రుంచిన ఘనుండు. అసహాయ శూరు దర్జునుండనా ముఖ్య పాండవ మధ్యముండు. పాశుపతాస్త్ర హస్త శోభన గాండీవి. కవలిద్దరును అరుణ కిరణముల మాడ్కి శరపరంపరా సాయక రణకోవిదులు. వీరల మధ్య చిక్కితివో నీవునూ నీ వెంట వచ్చిన సర్వ సేనానీకంబులును అల్లకల్లోలిత మహార్ణవమధ్య సుడిగుండమ్మున జిక్కువడ్డ పెను యోడ కైవడి తల్లక్రిందువై ఛిన్నాభిన్నము కాకతప్పదు. ఆశ్రిత రక్షణుండైన ధర్మ నందను పాదాక్రాంతుండవై ప్రాణములు కాపాడు కొందువో, మానావమాన హీనుండవై బ్రతికెదో ఆలోచించుకొమ్మనులోపల పాండు నందనులు వచ్చి సైంధవానీకములపై బడి శర పరంపరానేక వృష్ఠిధారలు గురిపింప జయద్రధుండు వారల కెదిరి నిలచి సహా వచ్చిన సర్వ సైన్యముల హెచ్చరింపుచు–

మ. తురగారోహుల జుట్టబెట్టు డనుచుం దుర్వారుడా సింధుడున్
శరధారావళి కుంభవృష్ఠి గురియన్ సామాన్యుడే పార్ధుడుం
ధరణీ ఖండము పొంగి పొర్లె ననా ధాత్రీశు సైన్యంబుపై
కురిసెం సాయక వృష్ఠులం తుములమై తూలంగ సైంధ్వోద్ధతుల్

చ. చెలగుచు సైన్య సైంధవులు చేయికి చేయిగ భీకరోద్ధతిన్
వలయము వీడకే పటుత వాడి మయూఖము వమ్ము జేయనా
చెలగుల నెల్లరం కవలు జీల్చుచు చెండిరి సంగరోద్ధతుల్
విలవిల లాడుచుం దొలగ వెన్కకు తగ్గుచు నొక్కరొక్కరున్

వ. ఇటుల నా సింధుర శిబి త్రిగర్త సౌవీర సైన్య సంఘంబులం చీల్చి చెండాడి చీకాకు బరుప త్రిగర్తాధిపతి సుధన్వుం డడ్డువచ్చి-

చ. తన ఘన సేనలం బరపి ధర్మజు జుట్టిన వాయునందనుం
డనఘుడు భీమసేనుడల అడ్డము నిల్చి సుధన్వు సేనలం
దునియలు జేయుచుం తనదు దుర్దమ శక్తి గదాయుధమ్ముచే
అనుపమ తేజుడై అదుమ ఆహవ వీరు డగర్తు సేనలన్

వ. త్రిగర్తలా సింధు సేనావాహినులు క్రిందుమీదు లగుచునుం మగుడి పైపైకి చెలగిరావ నప్పుడు-

సీ. చెలగుచు గిరగిరం చెండాడు చక్రమా
ఘనతర గాండీవు కార్ముకాగ్ని
తిరముగ నిల్వనౌ తీరది గానక
సందు నందుల దూరె సింధువారి
అసువుల బాసిరా ఆహవ సైంధవ
మదాంధ దుష్కృతి మదను మహిమ
గజబల యూధాశ్వ కార్ముక యోధులు
భుజబల సైన్యంబు బోరిలోన

తే. పరమ సాధ్వియ సౌశీల్య పాండ్వ పత్ని
ఎంత జెప్పిన బధిరుడై పంతగించి
కొరవితో తనదు తల గోకుకొనియు
దుర్మదాంధుడు సైంధవ దుష్ట బుద్ధి

వ. మరియును సైంధవునకు-

క. దన్నుగ నిల్చిన నృపవరు
మున్నెన్నడు యెరుగరాని యుద్ధోద్ధతులన్
పన్నిద్దరు సౌవీరుల
సన్నుతుడా నరుడు ద్రుంచె సమరావనిలోన్

క. తామర మొగ్గర మందున
కామద కరిరాజు కులము కలచిన రీతిన్
భామామణి ముట్టనైన
కామాంధుని మొగ్గరంబు కలచిరి పాండుల్

క. రథ సారథి తతి శైభ్యుల
పథిగా కాల్బలుల నంటి పటుతర ముష్టిన్
అధికంబగు బలదర్పుల
వధియించెను భీమసేన్డు పటు దర్పితుడై

క. అతలాకుతలం బగుచును
శత సంఖ్యల సింధుసేన శతమఘు సుతుచే
అతిపోవుచు నేల కొరిగె
వెత పోవగ సైంధవుండు బెగ్గిలి పారన్

వ. అట్లు ద్రుపదాత్మజ ద్రౌపది నేమరి వెన్నుజూపి పరుగిడు సైంధవు వెన్నంటి పట్టితెచ్చి భీముండు ధర్మజుని పాదముల చెంత కీడ్చి–

క. అనుజా దండితు జేయుట
దనుజా దుర్బుద్ధి యితడు ద్రౌపది పట్టిన్
అనుచిత వృత్తుండాయెను
అనుమానము లేదు ద్రుంతు అసువులు బాయన్

వ. అనునంతన పాండవాంగన ద్రౌపది ధర్మజుని వంక జూడ ధర్మరాజపుడు తమ్ము లందరు వినుచునుండ–

క. వలవదు చంపం వీనిని
అల దుశ్శల భర్త గాన యామెం దలచిన్
వలనొప్పగ సేయుడనగ
తల గొరిగియు బొట్లు పెట్టి దయగొని విడువన్

వ. కడు లజ్జా వదనుండై బిడియము లేకేమి వాడు పౌరుషమదుండై చెడినది మరచియు కుపితతత వడి నడచుచు కాశి కేగె పశుపతి గొలువన్. కడు నిష్ఠా గరిష్ఠుండై–

క. తిరముగ మది జేసి తపము
దురితమ్ములు పాయ వేడి దుర్గేశు మదిన్
వరదులు పాండులు దెగగొన
వరమీయుమ నంచు యడుగ పరమేశ్వరుడున్

వ. వాని తపంబునకు మెచ్చి ప్రత్యక్షంబై దుర్నయపరుడు సైంధవు నవలోకించి మదిని ఔరా!

క. కొరగాని కోర్కె వేడితి
తరమౌనే నరుని గెల్వ తథ్యము వినుమా
నరు నొక్కని దక్క గెల్తు
దురితుడ నీ వొక్కనాడు దోర్బలు వగుచున్

వ. మరియును–

క. ముద మొందుము నీ కోపము
మది దుఃఖము దీర జేతు మరువకు ఒకనా
డదియును నరుడా అర్జున
హృదయము దురపిల్ల పరిపరి ఉద్వేగమునన్

వ. అని పల్కి అంతర్హితుండగుటయును, సింధుండు తన దేశ మేగుటయును–

క. అన విని జనమేజయుడా
మునివరుతో ననియె నిట్లు మునులా
జనవర పాండుల బాధలు
వినలేమాయె యెరుగంగ వివరింపగదే

వ. అని అడుగుటయును–

క. తదుపరి పాండవులా ద్రౌ
పది దోడ్కొని కామ్యక వన పరిసర మౌనీ
విదిత యశస్కుల వినుచుం
పదమూడవ యేడు గడువ పరికించి మదిన్

క. అన్నా దమ్ములు సుదతితొ
యెన్నెన్నో యోజ చేసి యేర్పడ మదిలో

మున్నాడిన మాట నెరుప
అన్యోన్యత గడుప నెంచ్రి ఆ యడవులలోన్

తే. సత్య ధర్మాభిరక్షిత శాంత గుణులు
నిత్య నియతాన్న నిర్వర్త్న నీయు కడకు
భూసురాన్వయ మునివర భూరి వినుత
మహిత యశస్కుడు మార్కండ మౌని రాగ

వ. ఎదురేగి–

తే. పాండు నందను లందరు పత్ని తోడ
అర్ఘ్య పాద్యాది విధులచే నలర జేసి
పాయసాన్నాది ఫలహార పాలు
కుడిపి సేవజెసిరి శయనింప సేదదీర

వ. సుఖాశీనుండైన యపుడు ధర్మరాజు ఆతనితో యింట లేనపుడు ఒంటిమై ద్రౌపదియెడ సైంధవు డొనర్చిన దుర్మద వినీతి కార్యంబును, వానికై తామెల్లరు పడిన పాట్లును వివరించి పొక్కుచు మహాత్మా! మాకంటెను కష్టములపాలైనవారు యెవ్వరునూ ఉండరుకదా. విధీకృతం బెవ్వ డెరుగు. నుదుట వ్రాసిన వ్రాత దాట వశమె. అనుచు–

క. అతి మానుష బాధ లొదవె
మతిమంతియ ద్రుపద జాత మానిత పతితో
సతి ధర్మము పాటించుచు
వెత లొందిన వారు గలరె పేరిన భక్తిన్

వ. అనిన ధర్మనందనునితో మార్కండేయు డిట్లను–

క. మును ఆ త్రేతాయుగి నా
ఇనకుల పతి దశరథ సుతుడిక్ష్వాకుండా
జనకజ సుత సీతతొ
జనకుని మది మాటచొప్పు జనడే అడవుల్

వ. అనవిని ఆ విధంబెట్టిదని అడుగుటయును–

ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయు విరచిత

-: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ షష్ఠాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము సప్తమాశ్వాసము

శ్రీరమణీమణి ధవుడవు
తారామణి దీప్తి గొనగ ధన్యుడవయ్యా!
పారంపర్యా స్థితివర
సారూప్యా సర్వలోక సదస ద్విలసా!

మార్కండేయుడు ధర్మరాజాదులకు సీతారామ వనవాస కథ తెలుపుట

వ. తొల్లి సకల లోకపాలక రక్షాదక్షుండైన ఆదివిష్ణుని నాభీ నాళీకోద్భవ-

క. కమల భవు మానసోద్భవు
అమలిన పౌలస్య బాప డతనికి సుతుడా
విమలుడు వైశ్రవ బ్రహ్మయ
సముడై ఆద్యులకు నెల్ల సంపద్విభవున్

క. డన్నిట పెన్నిధి ధాతను
ఎన్నుచు నెంతో తన మది నెన్నడు తండ్రిన్
మన్నన మాటన మాత్రన
సన్నుతుడా వైశ్రవుండు సద్విధ బుద్ధిన్

వ. పెక్కు తపం బొనరించి తాతవలన నలకూబర లోకపాలక ధనైశ్వర్యత లంకాపట్టణ శంకర సాన్నిధ్య సాంగత్యములను వరములుగా పొందుటయును, తనను కాదను తనయునిపైకినిసిన పౌలస్యుడు తన తపఃతేజో వైభవ శరీరార్ధముల నుండి విశ్వావశుండనువానిం సృజియించి వైశ్రవునిపై వైరంబూనుమని పంపుటయు అదివిని కిన్నరేశ్వరుడు(నలకూబరుడు) విశ్వావసు బ్రహ్మకడ కేగి తపోధనా శక్తి యుక్తి శంకరసాన్నిధ్య లంకాపురాధీశ్వరా! నీవు నాకు తండ్రివగుదువు. నన్ను కరుణింపుమని అడుగుటయును, అతనిం ప్రసన్నుం జేసుకొన సర్వ కళావిద్యా విశారదులగు పుష్పోత్కట మాలినీ బకయను ముప్వుర రాక్షస స్త్రీలను పరిచారకులుగా యిచ్చిన వారలు-

క. పరిచర్యా క్రమగతి నా
సురకన్యలు విశ్వవశుని సురతల దేలిన్
నెఱజాణలైన కతమున
వరవీరుల బడసినారు బలదర్పితులన్

వ. వారలే రావణ కుంభకర్ణులు. పుష్పోత్కట యందున, విభీషణుడు మాలినికిని, ఖర శూర్పణఖలు బకయందున జనియించిన వారలు. విశ్వావశుండు వారిని జాత కర్మ సంస్కార శోభితులుగా నొనర్చి యేడేండ్ల ప్రాయమున విధివిధాన ప్రకారంబ ఉపనీతులుగానొనర్చి విద్యాధికులుగా పెంచిపెద్దచేయు టయును–

క. అసమాన బలోద్ధతులరు
పస దనరుచు సర్వశాస్త్ర పటుతర యుక్తుల్
వసు రుద్రాదుల భక్తులు
అసురులుగా బెరిగినట్టి అవనీసురులర్

వ. అందు రావణుండు ఆద్యుల కంటెను అధికుండుగా నుండనగు కోర్కె విధాత యనుగ్రహంబు వడయ నెంచి–

తే. మండు వేసవి మార్తాండు నెండ నిలచి
నిండు మనసుతో నీరిలో పండుకొనియు
వాయు భక్షకుడై వేయి వత్సరములు
శీత వాతన తపములు చేసె ఘనుడు

వ. కుంభకర్ణుడు నిద్రాతపం బొనర్చుటయును, విభీషణుండు వారలవలె గాక–

క. నియతాహారుడు సముడై
శయనించుచు ధాత్రి శయ్య శక్తి దళిర్పన్
పయనించుచు భక్తి దవిలి
నయవిదుడా విష్ణు నందు ననురక్తుండై

వ. సమభావన సుఖజీవన అతిశాంతత మెలగుచుండ ఖర శూర్పణఖలు వారలకుం బరి చర్యలు గావింపుచు అడనెడ–

క. దురితాపకారు లిర్వురు
మరిమరిగా జెప్ప నొప్పు మత్సర బుద్ధుల్
తర మెరుగని దుష్టు లకట
ఖరుడును శూర్పణఖయుం వికారులు పనులన్

వ. అట్టి యెడ రావణుని తపంబునకు మెచ్చి విరించి ప్రత్యక్షంబై అభీష్ట వరములు వేడుకొమ్మన, ఆ దశకంఠ రావణుండు ధాతకు మ్రొక్కి–

శా. దేవా యీగదె యెల్ల లోకములో దీప్తుండ నయ్యుండనా
సేవా భాగ్యమె భాగ్యమంచు దివిజుల్ సేవింప నెంతేనియుం

ధీ వైభోగ్యత లీలమై వెలుగగా దేదీప్య మానంబుగా
ఆ వైకుంఠమె ధాత్రికిం దిగెనహో ఆశ్చర్య మెంతోయనన్

వ. సమస్త దేవ దానవ గరుడ గంధర్వ కిన్నెర కింపురుష సిద్ధ సాధ్య నాగాహి యక్షరాక్షస పిశాచాది బలోత్కటుల వలన యెట్టి హానియు లేకుండ వరంబు ప్రసాదింప వేడుటయును, కుంభకర్ణునకు నిద్రా తపోనిష్టాపరంబుగా నిద్రననుగ్రహించుటయును, విభీషణునివంక దిరిగి యేమి వరము కావలయునో వేడుమిచ్చెద నన, వాడు తాతకుంమ్రొక్కి–

క. కరుణామయ విధి రాతవు
దురితము కాకుండ బుద్ధి దుస్సహ ఘటనన్
శరణముగా బ్రహ్మాస్త్రము
వరమీయుమ నాకు ననగ వరముల నొసగిన్

వ. పరమేష్ఠి అంతర్ధాన మగుటయును, దశకంఠ రావణుడు వరదర్పుండై ఉద్దండ మదోత్సేకంబున ఇంద్రాది దిక్పాలకా గణంబుల నెల్ల పాదాక్రాంతులుగా జేసికొని కాంతా కనక లక్ష్మీ లోలుండై పదునాల్గు భువన మణిమయ లక్ష్మీ కాంతుల నెల్ల లోగొనుచు ఆది లక్ష్మిని గూడ తన కైవసము జేసికొనక తన రాక్షస జన్మ సాఫల్యం బీడేరదని యోచించి ప్రవర్తిల్లు చుండుటయును, తొల్లి–

క. విను యిక్ష్వా క్వంశబున
ఇనకులు డుదయించె నజుడు యెంతయు ఘనుడా
తని కుదయించె దశరధుం
డను నాయక మణి అవనీ పతికిన్

క. కలిగిన భార్యలు ముప్వురు
కలుగరు బిడ్డలు ముదిమియు కడలు కొనంగా
కులపెద్ద లెల్ల పలుకగ
తలపెట్టెను పుత్రమేష్ఠి దశరధు డంతన్

వ. అటుల నాయాగఫలముగా దశరధ భూధవునకు కౌశల్యనందు శ్రీరాముడును, సుమిత్రయందు లక్ష్మణ శత్రుఘ్నులను కవలును, కైకయందు భరతుడును నలువురు బిడ్డ లుదయించిరి. ఆ నల్వురు సోదరులును క్రమగతి మిధిలా నగరాధీశుడైన జనకరాజన్యు రాజకుల బిడ్డలైన జానకిని శ్రీరాముడును, ఊర్మిళను లక్ష్మ ణుండును, మాండవిని భరతుండును, శృతకీర్తిని శత్రుఘ్నుండును పరిణయమాడిరి. రామలక్ష్మణులు విశ్వామిత్ర మహర్షి వద్ద శిష్యులుగా ధనుర్వేదాది క్షతియోచిత రాజనీతి విద్యా బుద్ధులు పొందిరి. రాముడు చిన్న నాటనే గురునానతి తాటకిని దునుమాడిన మహా విలుకాడు. మారీచ సుబాహుల మదమడంచి విశ్వామిత్రుని యాగమును కాచి రక్షించిన మహా

వీరులు రామలక్ష్మణులు. రామపాదముసోకి అహల్య పునర్జీవితురాలై పతిసేవాభాగ్యము నొందినది. సీతా స్వయంవర వేళ శివుని విల్లు యెత్త లేకభంగపడిన లంకాధిపతి రావణుడు ఆ భూజాత సీతా లక్ష్మి యందు మక్కువగొన్నవాడై కామవాంఛా దుర్బుద్ధిగలవాడు దుర్మదాంధుండు పరకాంతాలోలుం డు యెటులైనను ఆమెను దక్కించుకోనెంచి యున్న రాక్షసుడు. గురు నానతిని ఆ శివుధనుర్భంగము ను గావించిన రాముని మెడలో దండ వేసినది. సీతారాముల కళ్యాణానంతరము సర్వ మంగళకర సౌహార్ధ చిద్విలాస రామచంద్రునకు పట్టాభిషేకము గావింప కోశలాధిపతి దశరథ మహారాజు ఉవ్వి ళ్ళూరుచుండ, కైక దాది మందర మాటలు విని–

క. మును తా దాచిన వరముల
అనువుగ అడిగినది కైక అప్పటి కపుడే
అనుపగ రాముని కడవుల
తన సుతుగా పట్టమంచు దశరధు నడుగన్

వ. ఆ మాటలకు దశరధుడు వేటువడ్డ కదళీతరువట్లు నేలకొరిగి మూర్ఛాగతుం డగుటయు తెలిసిన శ్రీరాముడు–

క. దశరధు సత్యుని జేయను
నిశచర బాధలను గూర్చి నిశ్శంశయుడై
అశనోదక బాధ లనక
వశవర్తన సీతపతియ వనముల కేగన్

క. అడవుల పదునాల్గేడులు
యిడుములు పడుటకును గూడ యిష్టత తోడన్
అడుగిడ సీతా లక్ష్మణు
లడుగిడిరా రాము వెంట అడవుల కేగన్

తే. తల్లి దండ్రుల మాటగా దలచి మదిని
భరతు పట్టంబు గట్టుటే భద్రమంచు
నారచీరలు ధరియించి రాముడు నడువవారి
దారి కడ్డంబు నిలచిరా ధరణి జనులు

వ. అపుడు రాముడు వారలనెల్లర నూరార్చి తల్లులగురువుల మంత్రిసామంతాది పురోహిత బంధు హితుల నెల్లర తన మాటగా తండ్రి యానగా సమత పరచి త్వరలో తిరిగి రాగలమని వారల వీడ్కొ ల్పి సరయూనది కావల తీరాడవుల దారి నేగ–

తే. గంగ యొడ్డున పాదాలు కడిగి గుహుడు
రామ లక్ష్మణ సీతలం రహి వెలుంగ
దండ కాటవి దార్జూప దయను గొంచు
పర్ణ శాలలు నిర్మించ్కు పవ్వళింప

వ. అటుల నా సరయూ తీరారణ్యముల పర్ణశాల యందుండ భరతుడు తానుయిం లేనపుడు తన తల్లి వలన కలిగిన వైపరీత్యములెరింగి శ్రీరాముని తీసికొని వచ్చుటకు అడవుల కేగుటయును, శ్రీరాముడు కాదన రాముని పాదుకలకే పట్టముగట్టుదునని శృంగిబేరపురమున వశియింతుననిపల్కి పదు నాల్గేడులు దాటునంతకు నీవు తిరిగిరాకున్న అగ్నిప్రవేశ మొనరింతునని పలుకుటయును, సీతారామ లక్ష్మణులు అటనుండి దండకాటవి కేగుటయును–

క. నెలవది రాక్షస మూకకు
అలవారల కడ్డు లేదు ఆకలి దీర్పన్
తలబడి జీవుల దిందురు
చలమెంతన రక్త మాంస చర్మము లొలిచిన్

క. శాకాహారుల కానము
మూకాభి నయన తలూప్పు ముచ్చట జూడన్
యేకోదర సాంగత్యము
యే కోందరి లోనె యుండు యిష్టత గూడన్

క. సుడివడి లేచిన దాదిగ
అడవులలో సంచరించు అసురత కెక్కన్
కడు జారిణి శూర్పనఖది
వడి యేగెను రాము జూచి వహ్వా యనుచున్

వ. రామలక్ష్మణుల వద్దకేగి (మాయాసుందరి వేషధారిణి) తనను పెండ్లాడుమనిన లక్ష్మణుడు దాని ముక్కుం జెవులుం గోసి పంపుటయును, కినిసిన యారాక్షసి రామ లక్ష్మణ సీతా అంద చందములు పొగడుచు అన్న రావణుని వద్ద కేగి వారిని సాధింప నెంచిన దగుట–

తే. అంద మంతయు తనదైన సుందరాంగి
దేవ భామిని కంటెను దీప్తి వెలుగ
వనము లందున దిరుగాడు వాని భార్య
పొందగా రాని బతుకేల పొమ్మ టనగ

వ. రావణాసురుడు సీతను చెఱగొన నెంచిన వాడై బంగారు లేడి రూపమున–

క. మారీచు నంపియు మనసు లూర
మగువ సీత రాము లుత్సుక బొందిన్
దూరము నెంచక మనమున
ఆ రాముడు లేడి కొఱకు ఆశ్రమము పడుచున్

వ. ఆ మృగము వెంట నరిగిన రాముడు–

క. కోలం గొట్టెం లేడిని
నేలంబడి లక్ష్మణ యిటు నిలువగ లేకన్
నీల్గుచు నుంటిని కావం
లీలా మానుషుడ కావ లేవా నన్నున్

వ. అని అరచిన ఆ ఆర్తనాదమును వినిన సీత లక్ష్మణుని పో పొమ్మని హెచ్చరించుచు అనరాని మాట లాడుటయును, ఆ మాటలు వినలేక లక్ష్మణుడు ఆశ్రవ ంవాకిట రక్షరేఖ గీచి వెళ్లుటయును, మాయాజంగమ వేషధారియగు రావణుడు ఇంటి ముంగల భవతి భిక్షాందేహి అనుచు రావ–

క. మృగిదే నరుగగ రాముడు
మృగనేత్రియు భీతిజెంది ముందుకు నడువన్
పగదీర్పగ నిజరూపము
తగ జూపెను రావణుండు తరుణియు గూలన్

వ. రావణుడు ఆమెంగొని తన పుష్పకమున లంకకుం గొనిపోవుట, సీతచింతించుచు హా రామా! దశరథ రామా! రావావేగంకావం అని రోదించుటయును, జటాయువను పక్షిరాజు దశరథుని స్నేహితుడు ఆ ఆర్తనాదముంవిని రావణుని అడ్డగించి నేలం గూలుటయును, రామలక్ష్మణులు పర్ణశాలకు వచ్చి చూచుడు, సీత అపహరింపబడెనని అచటి ఆటవికులు పల్కుటయును, రామలక్ష్మణులు సీతకై అడవులంబడి వెదకుచుం బోవ, కబందు డనువాడువారిచే జచ్చుటయును, వారు చిత్రకూటమునకు వచ్చుటయు, అందున్న హనుమదాది సుగ్రీవ వానరులు హనుమ భద్రపరచిన సీత నగల మూటను జూపుట, సీత రావణునిచే గొనిపోవ బడుటయును వారు నిశ్చయించు కొనుటయును వానరులు–

క. రాముని లక్ష్మణు కనుగొని
వేమారులు గంతు లిడుచు పేరిన భక్తిన్
రామా రఘుకుల సోమా
కామా నీవార మమ్ము కావుము అనగాన్

వ. హనుమ రామభక్తి పరవశు డగుట. రామ సుగ్రీవుల మైత్రి. వాలి సుగ్రీవుల యుద్ధము. రాముడు వాలిని చెట్టు చాటున నుండి సంహరించుట. సుగ్రీవ పట్టాభిషేకము.

సుగ్రీవుడు సీతను వెదకుటకై తన వానర సేనలను అన్ని దిక్కులకుం బంపుచుఅంగద జాంబవద్ హనుమలను దక్షిణ దిక్కుగా బంపుటయును, సంపాతి వలన సీత లంకలో నున్నదని హనుమదాదులు యెరుంగుటయును–

క. రవి హస్త్రాద్రిని కృంగగ
అవిరళగతి చంద్రబింబ మంబర వీధిన్
నవ శోభల పూర్ణ కళల
శివు ధవుళిమ తన్ను జేర శిత శీతలతన్

వ. హనుమ లంక కేగుట.

క. పెరిగెను గగనము పొడవున
హరి వామను డెదిగి నట్లు అక్కజ పడులా
సరిరారెవ్వరు అనగను
విరిపొంగుచు లంక కురికె వేగపు గతితోన్

క. శిత శోభల వారాసిని
శత శోభల తనదు జాడ సాగుచు రావన్
శత యోజన పర్యంతము
జతగా డెవడంచు మదిని జాగృతు డౌచున్

క. కాలూనియు మైనాకునిపై
లాలనతో కడలుని కడు ప్రేమాస్పదుడై
వాలం బెత్తియు మరలను
లీలం పై కెగసి యురికె లీలగ లంకన్

క. గగనాంతర్గతి నేగుచు
నొగి రాక్షసి సురస నోట నొదిగిన వాడై
తగ కర్ణరంధ్రి వెలువడె
దిగి వచ్చియు లంక దారి తిరముగ నేగెన్

వ. సింహిక లంకిణిలను ద్రుంచియు లంకలో ప్రవేశించిన నాడు పున్నమి యగుట. ఆ రాత్రి లంక నంతటను వెదకుటకు సాధ్యపడుటయు, ఇది యింకో అమరావతి గానూ సప్త ప్రాకారములతో అలకాపురికి సాటిరాగల దనియును, యోజన పరిమిత తోవలుసాజల యంత్రపు వెలుగులు సాగెడు వరుసలు నానావిధ వర్ణిత సౌధములతో గొప్పగొప్ప పూదోటలతో అమరియుండుటను చూచినవాడు. మరియును పుష్పక విమానమును చూచెను. విడువకయే అన్నితావుల వెదుకసాగెను. ఆఖరున

అశోకవనము నందు తప్పతాగిన రాక్షస స్త్రీలమధ్య దీనాతిదీనయై గూడ వెలుగుచున్న సీతను గాంచి ఔనో కాదో గ్రహించనగు నటుల రామారామా యని ముమ్మార్లు పలుక ఆమె అతనిం చూచినీవెవ్వ డవని యడుగ, హనుమ తన వద్దనున్న రామ ముద్రికను జూపుచు–

క. అంజని మాతా సుతునిగ
కంజజు డిచ్చిన వరముగ గాలికి పుడితిన్
కంజజు నంతటి ఆయువు
భంజనగుణి నిజ జనకుగ ప్రబలిన వాడన్

వ. అనుటయును, సీతాదేవి ఆ రామ ముద్రికను కళ్ల కద్దుకొనుచు–

క. హా నాధా! రఘునాధా!
యీ నాటికి కాదె వింటి మీదగు వార్తల్
యేనాటి ఫలంబో యిది
యీనాటికి కూడి వచ్చె యీతని వలనన్

వ. అని సంతసించుచు తనను రక్షించునదిగా రామునితో పలుకమని తన శిరోమణినిఆతనికిచ్చి పంపుటయును, సీత హనుమంతునికి యేమియు యీయ లేకుంటి ననుచు యేదేని యీ వనమున పండొక్కటి గొనుమనుచు పలికినకారణముగా లంకావనములను కూకటితో పెఱికి రావణునికి పట్టు బడి బ్రహ్మబంధముల నుండి విడిపించుకొని లంకాదహనము గావించి రాముని వద్దకు వచ్చిసంగతి ని నివేదించి వానరమూక సహాయముతో వారధి కట్టి లంకజొచ్చి యుద్ధములో రాముడు రావణుని మడియించుటయును సీతతో ఆయోధ్యాపురికి వచ్చి అభిషిక్తుడయ్యెను. అటులనే మీరునూ యీ కష్ట ములను గట్టెక్కి సుఖింప గలరనుటయును.

సావిత్రీ సత్యవంతుల వృత్తాంతము

క. అవని గల డశ్వపతి యను
అవనీ నాధుండు మద్ర అవనిని యేల్చున్
సవనంబులు పెక్కు నెఱపె
భవనాధ్యుడు బిడ్డ కొరకు భార్గవి కొలిచిన్

క. పతి తోడుగ సతి మాళవి
మతమంతిగ చాలయేండ్లుమాసతి గొలువన్
అతి సుకుమారము పొడముచు
అతివకు గర్భంబు దోప అవనీ పతియున్

వ. మంత్రి సామంతాది సకల బుధ జన భూసురాశీర్వాదన క్రమంబున కులాచార స్త్రీజన పూజిత ముగా–

క. సీమంతపు వేడుకలను
 ధీమంతుడు యేర్పరించె తీరెడు కోర్కెన్
 సామంతుడు వేవేల్తన
 సామంతుల తోడ గూడి సాదర ఫణితిన్

వ. అంత నామెకు నవమాసములు నిండి ఒక సుముహూర్తమున సుపుత్రికా జననం బగుటయు, తత్పట్టణమున పుత్రీ జననోత్సవము తోడ తీపులుపంచుటయును, జాతకర్మాది శుభకార్యములు నిర్వ ర్తించి సావిత్రీ నామకరణము చేసి ఆశీస్సు లందుకొనిరి. ఆ బిడ్డయు శుక్లపక్ష చంద్రుని మాడ్కి దిన దిన ప్రవృద్ధముగా ఆట పాటల యందున అంద చందముల యందున అద్వితీయయై పెరుగుచు సావిత్రి భక్తి తత్పరతయై–

క. వరసిద్ధ సాధ్య విద్యా
 ధర సుర కన్యకల కంటె ధన్యత వెలయన్
 అరువది నాలుగు విద్యల
 వరపుత్రిక యైన కతన వదలక నేర్చెన్

వ. అంత నామె తనదు లావాణ్యాతిశయముల కనువగురీతి వినయ విధేయతా యుక్తసద్గుణములు సంతరించు కొన, అశ్వభూపతి ఆమెకు వివాహము చేయదలచు సమయంబున నారదు దేగుదెంచు టయు, రాజాతని తగువిధముల బూజించి వందనము లాచరించి బహు సత్కారము లొనర్చి కూతు రావించి వందనమాచరింపజేసి మహాత్మా ! మీరు త్రికాలవేదులు. త్రిలోక సంచారులును. మీకు తెలి యనిదేదియును లేదు. నా యీ కూతురు సావిత్రికి తగిన వరుని తమరే నిర్ణయించ గలరని ప్రార్థిం చుటయు, నారదుడు అర్ధ నిమీలితా నయనుండయి కొంతతడ వంతర్ద్రుష్టిని విలోకించి విధి విధాన సంవిధాన విషయజ్ఞుండై కనులు దెరచి ఆమెను పరికించి జూచుచు రాజా! నీ యీవరసుతకు తగిన వాడు సాళ్వ దేశాధిపతి ద్యుమత్సేనుని కుమారుడు సత్యవంతుడు.

చ. అతులిత రూప సంపదల అందరి కంటెను మిన్నయై తగం
 ధృతిమతు డెంతయుం ఘను డుదారుడు ధీరుడు బుద్ధి సంపదన్
 పతితము కాని బాహుకుడు బాధల కోర్చెడు సత్వ శీల భూ
 పతులకు మార్గ దర్శకుడు పాలన శక్తుడు సత్య సంధుడున్

వ. అన్ని విధముల నీ తనయకు యీడగు రాజ వంశజుడు. అపురూప లావణ్య సుందర మూర్తి. కానీ కాలవశ విధి విలాస సదృశుండై సాళ్వభూపతి ద్యుమత్సేనుండు రాజ్యమ్ము గోల్పోయి భార్యా

పుత్రుని తోడ వనవాసియై యున్నాడన అశ్వపతి మహారాజు తన తనయ సావిత్రి దెసం జూచి–

క. వింటివి గద అమ్మా యిది
ఇంటికి దవ్వై యడవుల యిడుమలు బడుచున్
యుండిరి సుజనులు వారల
వెంటంబడి అడవులందు వేగం గలవే

క. అతి సుకుమారత బెరిగిన
మతిమంతివి మాననీయ మనసౌ నీడా
స్థితి పాత్రుని వేరొక వరు
అతివా చేపట్ట గాదొ అంతకు మించిన్

వ. అని పలుక ఆ మాననీయ సావిత్రి అపుడు మహర్షులకు నమస్కరించి తండ్రి వంక జూచుచు–

క. వినయత గోరుదు మిమ్ముల
వినయుండా సత్యవంతు వినినది మొదలన్
మనసిచ్చిన దానను నా
మనసున నున్నట్టి వరుతొ మనువది గూర్పన్

క. అడవుల నున్నను యిడుముల
కడు అడలుచు వేగుచున్న కడకేమైనన్
ముడివడె నా మనసాతని
కడ కేగను వేగరింప కరుణింపరొకో

వ. అనుచు ప్రార్థింప నారదుడు అశ్వపతి మహారాజుతో రాజా!

క. చెప్పక తప్పదు సత్యము
ఇప్పటి కొక యేటి కెల్లి యీతని అశువుల్
అప్పన గొనిపో నెముడదె
తప్పక రానున్నవాడు తథ్యము అనియెన్

వ. ఆ మాటలు విన్న అశ్వపతి కూతుతో ఆత్మీయ తుట్టిపడ కన్నీరొత్తి కొనుచు–

క. అమ్మా మానుము నీమది
నెమ్మది పరికించి చూడు నేర్పరి మతివై
క్రమ్మరి యాలోచింపుము
నమ్ముము నీ మాట చొప్పు నయవిది గూర్తున్

వ. అని అటునిటు ఆలోచనాపరుండై చూచుచుండ వారలం గని మహాత్మా! మీర లెరుంగని దేది యు లేదీ ముజ్జగంబు లందని, తండ్రీ!

క. బోటికి మానమె ప్రాణము
మాటకు సత్యమె మనుగడ మాన్యత గూర్చున్
నాటికి నేటికి రేపట
కూటికి లేకున్నగాని గురుతర బుద్ధిన్

క. నిత్యము కాదీ దేహము
సత్యమ్మా సత్యవంతు సహచరి నౌదే
నత్యంతము గోరుకొనెద
సత్యంబా గౌరి మాట సత్యత కాదో

వ. అనుటయు నారద మహర్షి అమ్మా! యేమా సత్యగౌరిమాట అని అడిగినవానికి సావిత్రి, నేనొక పరి గౌరీ దేవతా పీఠమును పూజించి ప్రార్ధింప అందుండు ఆ మాత నాటిరేయి నా స్వప్నంబున సాక్షాత్కరించి చేయెత్తి నన్నాశీర్వదించుచు సౌభాగ్యవతీ సుఖీభవ. అని పల్కినది. ఆ దేవి కరుణ నేనె ప్పుడును సౌభాగ్య వంతముగనే యుందును. కావున నాకా సాళ్వపతి ద్యుమత్సేనా నందను సత్యవం తునితో వివాహము గావింపుడన, అప్పుడు నారద మహర్షి అశ్వపతి మహారాజుతో–

క. నీ సుత సౌభాగ్య గరిమ
ఆ సువ్రతు ఆయువృద్ధి అగుటయు తగదో
దోసము తొలగి శుభమగును
ఆ సావిత్రీ ఘన కృప అబ్జజు కరుణన్

వ. అనిపలుక మహర్షుల మాట లెల్లెడ అందరకును శుభము ఘటిల్లగలదని కూతుతో వారి పాద ములకు ప్రణమిల్లిన మద్రదేశాధీశు డశ్వపతిని నారదు డాశీర్వదించి ఆకాశ మార్గమున పితామహు బ్రహ్మలోకంబున కేగుటయును–

సీ. రధగజ తురగాది రాణువ తోడనా
మద్ర దేశాధిప మాన్యు డపుడు
మంత్రి సాంతాది మహనీయ భూసుర
బంధుమిత్రుల గూడి బయలుదేరి
కూతురా వెంటను కోమలాంగుల గూడి
సాళ్వ దేశాధిప సత్యవంత
తాపసోద్ధతి భూమి తరలిరా వెలుగొంద

శుభ సూచకముగా శోభ లెగయ

తే. అర్ఘ్య పాద్యాదు లొనరించి ఆదరంబ
ఆసనాదులు గూర్చియా అశ్వ పతికి
పండ్లు తేనియ పాదప ఫలము లిచ్చి
ఉన్న యంతలొ పూజించి సన్నుతింప

తే. ఉచిత సల్లాప సద్భాష లుట్టిపడగ
మమ్ము జూడగ వచ్చిన మాటదేమొ
నంచు వచియింప నప్పుడా అశ్వపతియు
బంధ సంబంధ బాంధవ్య బంధురముగ

తే. అనియెనా ద్యుమత్సేనుతో అతివ నాదు
తనయ గైకొమ్ము నీయింట్కి తరలి రాగ
సత్యవంతుకు సావిత్రి సరిగ యీడు
సత్యవంతుతొ మామాట సమ్మతింప

వ. అని తన తనయ సావిత్రిని రావించి వారలకు నమస్కరింప జేయ, ఆశీర్వదించి ద్యుమత్సేనుడా మెను గారవంబున లేవనెత్తి కూర్చుండ నియమించి సత్యవంతుని రావించి పల్క ద్యుమత్సేనుండు–

చ. అలతిగ నున్న వారనక ఆప్తితొ కోడలి గైకొనండనిన్
విలసన భావనా పటిమ వీనుల విందుగ పెండ్లి కూతునా
కులవతి కోడలిం గనుచు కోటిగ నెంచుచు సంతసింప నే
వలదను టెట్టులయ్య తగు వారలు పెద్దలు అందరౌననన్

వ. అయినను–

క. అతి సుకుమారియ చిన్నది
ధృతి లేకను అడవులందు తానును మాతో
వెతలం బడుటది తగునా
మతిమంతులు యెంచుడయ్య మరిమరి సరిగాన్

వ. మాకు సమ్మతమే యైనను ఐనింటి ఆడుబిడ్డ అవస్థలకు లోను గాకుండ చూడదగదో విచారిం పుడన సావిత్రి లేచి దరిజేరి అత్తమామలకు ప్రణమిల్లి సత్యవంతుని దిలకింపుచు తండ్రి కడకేగి యిట్లనియె.

తే. కష్ట సుఖములు యెంచనా కాదు మదిని
కలిమి లేములు కరుణించు కాల వశత

రాత్రి చీకట్లు పాయవో రవియు రావ
సత్యవంతుతొ మనువాడ సమ్మతింతు

తే. అన్నదానికి వేరేమి అనక వారు
సమ్మతింపుచు సౌశీల్య సద్గుణాళి
బుద్ధి కొనియాడి మానస బద్ధురాలి
సత్య సౌభాగ్య మెంచన సదయ బుధులు

తే. సత్యవంతుని యొప్పించి సమ్మతింప
మౌనిపుంగవు ఋషికుల మంత మెచ్చ
మంచి శుభ ముహూర్త మందున మనువు గూర్ప
తగగ తాంబూల మిప్పించ్రి తరలి రాగ

వ. పట్టణ మలంకరింప ననుజ్ఞాపించి దైవజ్ఞులరావించి మంత్రి పురోహిత సామంత బంధు మిత్రుల సమక్షంబున వివాహ లగ్న మహూర్తము పెట్టించి శుభలేఖలు వ్రాయించి మగపెళ్లివారికి ముందుగనే తగువైభవ విడిదిసత్కారము లేర్పరించి పందిళ్లు వేయించి ముగ్గులు పచరించి అరదంబుల నేర్పరించి అత్తమామల గూడి పెండ్లి కుమారుని పట్టపు టేనుగుపై రావించి కైదండలొసగి వియ్యాలవారిని రథములు డిగ్గరించి ఎదురు సన్నాహము లేర్పరించి వధూవరులకు మంగళ స్నానము లేర్పరించి అలంకరించి పెండ్లి కూతురుచే మంగళ గౌరీపూజ చేయించి మంగళ వాద్య రవముల మధ్య కళ్యాణ వేదికపైకిరావించి మధుపర్కములుసమర్పించి మహారాజ వైభవోపేతముగా బంగరు పళ్లెరమున అల్లుని కాళ్లుకడిగి కన్యాదానము చేసి శుభముహూర్త సమయమున బ్రాహ్మణోత్తములు చేయు వేదవిహిత మంత్రోచ్చారణముల నడుమ వధూవరులు శిరసులందు జీలకర్రబెల్లము నునిచి తాళి కట్టించి కన్యావరణము నిప్పించి అగ్నిహోత్రుని ప్రదక్షిణ సాక్షిగా వరునిచే నాతిచరామిఅనిపించి పాణిగ్రహణము గావింపజేసి అశీర్వాదాక్షతలచే అందరి ఆశీస్సులు గైకొన తలంబ్రాలవేడుక నిర్వర్తింప జేసి బ్రాహ్మణ సత్కారము గావింపజేసి అభినందనలుగైకొన తాంబూల ఫలప్రదాన సత్కారములు గావింపజేసి అన్నదాన సత్రంబులు పెట్టించి పురజనులనెల్ల సంతృప్తుల గావించి నాగవెల్లి అప్పగింతలుగావించి అరుంధతిని చూపించి దంపతులకు చీని చీనాంబరాభరణాదు లొసగి సమస్త సంబారములను సమకూర్చి అరదముల నేర్పరించి పల్లకినందూరేగించి పిల్ల నత్తవారింటి కంపుట కుద్యమింప గౌరవ ప్రదముగా స్వీకరించి–

తే. అత్త మామయు పతితోడ అతివ వనికి
కాలి నడకన కదలాడె కాలవశత

భర్త సంసేవనాసక్త భరిత యగుచు
సర్వ సౌభాగ్య సౌశీల్య శారదనుచు

తే. దేవ ముని ముఖ్య మాటనే తేప తేప
మదిని దొలుపంగ సావిత్రి మదన పడుచు
శాంత చిత్తత భక్తిమై శారదాంబ
గొల్చుచుండెను భర్తపై కోర్కె తోడ

తే. అత్తమామలు సంతోష చిత్త మేర్చి
పుణ్య కథలతొ వ్రతవిధ పూజితముగ
అంటిపెట్టుకు తిరుగాడ్చు అతివ మగని
కాలయాపన జేయుచు కదలుచుండ

వ. వ్రతములు ఉపవాసములు పెక్కు చేయుచు దినములు గడుపుచును నుండ–

తే. ఒక్క యేడది చిటికెలో అక్కజముగ
నారదుండాడిన దినము నయము రాగ
నాథు వెంటన కదులాడ నామె గూడ
అత్తమామల కోరనా అతివ ప్రీతి

వ. అట్లు కోరిన ఆ కోడలి మాటకు ద్యుమత్సేనుండును, వాని సతియు అమ్మా!–

చ. అడవుల నాథు వెంట దిరుగాడను బంపుట పాడిగాదు మా
యెడలను దోసమైన విను. యివ్వన భూముల వేరనుందు మం
చడలుచు పల్కనా మగువ చల్లని అండది నాకు మీరలీ
యడవులె హాయిగొల్ప మది అంటిని నంతియె వేరు గాదనిన్

ఉ. నాథుని జూడ ప్రేముడిగ నాప్తి దొరంగను మానసంబునన్
భూదవు సూనుడుం సతిని పోవిడ నాడక వెంట నుండనా
మాధవు దల్చుడుం మదిని మామయు నత్తయు సంతసంబునన్
సాధిత వమ్మరో మనసు చల్లని తల్లివి మామకోద్ధతిన్

వ. ఆయుష్మతీ సౌభాగ్య సంపత్కరివై వేగ రమ్మని దీవించి పంపుటయును–

మ. ఉపవాసంబులు పెక్కు జేయుచు మదిం ఉత్తేజ సౌశీల్యతన్
అపురూపంబున జూపు నాఅపతి మదిం అన్యోన్య మేపారగా
ఇపుడోపంగను లేను మానస భరంబేమౌనొాయన్భీతితో
తపనం జెందుచు పార్వతీ సతిపతిం తా దల్చు నత్యాశతోన్

వ. పతివెంట నేగుచు కైదండ వీడక నయ్యడవీ ప్రాంతమున కేగుదేర సత్యవంతుండా యటవీ రమణీయ తరు లతా గుల్మ పల్లవ పూపొదరిండ్ల సోయగముల జూపుచుండ నా సావిత్రి నిర్లిప్త మానసయై నిర్వికార బుద్ధిదలిర్ప ఆ రాజర్షి తనయుండొకచో నామెను గూర్చుండ నియమించి మధుర ఫల పత్ర సమిధ్కుశలం బ్రోవుజేయుచు గరిడియ నిండించి పరశున తరు శాఖాచ్ఛేదన కారణపరుండయి వేదనచే అలసి సొలసి సోలుచు నేలంగూల, వానింజూచి ఆతురమున సావిత్రి వడింబట్టి కూర్చుండ యొడిం జేర్చుకొని తన చీర చెరంగున వదన శ్వేదము తుడుచుచుండ ఆమెం జూచుచు–

చ. వివశత జెందుచుంటి తడవెంతయు లేదది ఆయువుల్గొనన్
పవనుని మించు వేగము, నవారిత పాశము చేతబట్టియుం
అవసనకాల చోదను డమాంతము వచ్చుచు నున్నవాడదే
ధ్రువ మది మృత్యువాత బడ దుర్భరమెంతయు యెట్టులోగదే

క. అనునంతన సావిత్రియ
కననా నా యమధర్మరాజు కంజలి యిడుచున్
చని ముంగలి కొక్క యడుగు
వినుమిదె నాభర్త యసువు విడువగ తగదో

క. అని వేడగ గని యామెతొ
వినుమీ జీవుడు విగతుడు విధిచేతను నా
పనిగొని జీవము గొనకే
వెనుదిరుగుచు బోవజాల వింతగ జెపుదే

క. అని యసువుల గొనిపోవుడు
వినువీధిని తానుగూడ వెంటంబడి యా
తని దయగొనుమో కాలుడ
నిను విడువను నాదు భర్త నిహతుని గొనకన్

వ. అని అసదృశమైన ఆ సావిత్రి యమ పురి దిశాదృశ భాగ తీరంబులను సహితము గణింపక యమపాశా బద్ధంబైన తనభర్త సత్యవంతుని ప్రాణంబులం బడివెన్నంటిజనుటయు, దండధరుడామె యసాధారణ శక్తికి వెరగంది, ఓకాంతామణీ–

తే. వలదు రావను యీ ద్రోవ వలను పడదు
దూర దుస్సాధ్య దుర్లభ దుస్తరంబు
బొంది తోడను యే ప్రాణి బోవనవదు
వదలి పొమ్మిస్తు నీకొక వరము అనుడు

వ. సావిత్రి ధర్మమూర్తి కంజలించి అత్తమామలకు అంధత్వము బాయ నడుగుటయును, యముండ ట్ల గాకయని అనుగ్రహించుటయు వెండియు, సావిత్రి వెంట నంటుచు రాగల్గుట జూచి సమవర్తి యామె అసాధారణ మహిమాన్విత మానవాతీత శక్తికిని, దేవయాన శక్తికిని సంతసించుచు ఓ శక్తి యుక్తా!

ఆ. వేడు మొండు వరము వేరైన దేదేని
భర్త ప్రాణ మొకటి వరము తక్క
అనుడు మాట వినుచు హస్తాలు జోడించి
అధిప సుతుల నిమ్ము అశ్వపతికి

వ. ఆ మాటలకు సంతోషించి అటులనే అగుగాక యని అనుగ్రహించి ప్రేత నాధుండు పాశబద్ధ సత్యవంతు ప్రాణములగొని రోదసీగహనాంతర అంధకార అయోమయ మార్గంబులంబడి నిజపురం బు దెసం జనుచుండ సావిత్రియు వానివెంబడి రాతిలకించిన ధర్మమూర్తి ఆమె పతివ్రతా మహత్వం బున కబ్బురపడుచు ఆనంద పారవశ్యంబున త్రికరణసుద్ధిగా సుదతీ యేదేనీ మూడవ వరము కోరు ము నీ పతి ప్రాణంబులం దక్క యిస్తునన, సావిత్రి సాగిలపడి మ్రొక్కి ఆత్మ స్థైర్యయై వందన మాచ రించి అటులైన సత్సంతాన సౌభాగ్యము ప్రసాదింపుడన, సత్య ధర్మాభి నిరతుడు యమ ధర్మరాజు అటులనే యిచ్చితి వేగ పొమ్మన, మహాప్రసాదమని ఆమహా పతివ్రత సావిత్రి సూర్య నందనా! ధర్మ మూర్తీ! నీవెరుగని ధర్మములు యెవ్వ రెరుంగుదురు. మానవతా ముర్తి యైన నాకు నాభర్త వలననే సత్సంతాన సౌభాగ్యము లొనగూర గలవు. కావున నా ప్రాణపతి సత్యవంతుని ప్రాణములం మరల అనుగ్రహింప గలవని వేడుటయును, యముండామె పాతివ్రత్య మహత్వ మనోరథ దీక్షకు ప్రసన్నుం డై విధివిలాసమునకు వెఱగందుచు చేయునది లేక సత్యవంతుని ప్రాణప్రదునిగా అనుగ్రహించి–

క. మగువా నీ సత్యవదుతొ
తగులంబులు పారదోల్కు ధన్యత వనుచున్
తగు సంతానము బడయుదు
దిగులొందకు శుభము గూరు దీప్తులు చెలగన్

వ. అని దీవించుటయును సావిత్రి మహాత్మా! మీ దయవలన శారదాదేవి అనుగ్రహము వలనను, విధికృత ధర్మ కార్యము వలనను, నా పతివ్రతా మహత్వ సిద్ధిగా నామనోహరుడు సజీవుండై యుం డునని సెలవు వేడుకొని వడివడి సత్యవంతుని కడ కరుదెంచునంత యాతండు–

క. వడి లేచుచు కడు అదలుచు
విడిచితినా అసువు లంచు వివశీకృతుడై

కడు వేడుక సతి జూచుచు
అడివందున పగటి కలయ అతివరొ చెపుమా

క. వచ్చిన యాయము డెక్కడ
చచ్చితినా పాశహస్తు సాదర కరుణన్
తెచ్చితివా బ్రతికించియు
సచ్చరితా యేమి యయ్యె సమయగ లేదో

వ. అని అడుగుటయు సావిత్రి యాతనిం కౌగలించుకొని–

క. ఆకలి అగుటయు లేదా
ఆకటితో అత్తమామ అలమట తోడన్
వాకిలి మొగమై జూచుచు
నాకొరకును నీకొరకును నయవిధి జూడన్

క. ముదమెంతన యదలందున
కదలాడుచు మనల కొరకు గద్గదు లగుచున్
యెదురగు మునులను అడుగరొ
పద వేగమ ఆశ్రమాన్కి పరుగున పోవన్

వ. అని వారలు కడు చీకటి కాక మునుపె వడివడిగా గూటి కేగుచుండ నిట ద్యుమత్సేనుండును భార్యయు–

క. కన్నుల జూడ్కులు పొడమగ
యెన్నెన్నో యూహ జేస్కు యేర్పడ మదిలో
సన్నుతి సంతోష హృదయు
లన్నుల మిన్నయయ కోడలా యడవులలోన్

క. ఏవిధి జేయుచు నున్నదొ
ఏ వరదుకు పూజలిడుచు యెంతయు ప్రీతిన్
పావనమతి సావిత్రియ
ఆవంతయు అత్త కిడక అన్నము తినదో

వ. నేడేలకో సత్యవంతు డింత తడవయ్యును యింటికి రాకుండుట కేమి హేతువో అని చింతించుచు మునిప్రాంగణముల కేగ వారలం జూపులం జూచుచునా పుణ్య మునికులము లత్యాశ్చర్య మానసులగుచు భగవదేచ్ఛం గొనియాడుచు సత్యవంతుని గుణగణముల గణించు తరి నారదుండట కేగు

దెంచి వారల పూజ లందుకొనుచునుండ వచ్చుచున్న సావిత్రీ సత్యవంతులు గూడను మహర్షులకు నమస్కరించ నారదుండు వారల నాశీర్వ దించి ఆ మునిజనము లందరి సముఖమ్మున–

తే. చచ్చి బ్రతికిన వాడవో సత్యవంత
కరుణమూర్తియ సావిత్రి కరుణతోడ
యముని మెప్పించి తెచ్చె నీసతి నిన్ను
అనుచు వివరింప ఆద్యంత మవధరింప

వ. అత్తమామలకు అంధత్వము బాయుటయును, రాజ్యప్రాప్తి కలుగు ననుటయు, అశ్వపతికి పుత్రోత్సాహము కల్గుటయుం దెలుపుచు ఈకథ వినిన చదివిన వారలకు శుభములు పొందనగునని పల్కి ఆకాశ గమనుం డగుటయును.

తే. శాత్ర గణముల దునుమాడి సర్వ శక్తి
సాళ్వ దేశాన నున్నయా సర్వ జనులు
మంత్రి సామంత నాయకా మహితు లెల్ల
నాద్యుమత్సేను గొనిపోవ నటకు రావ

వ. సావిత్రీ సత్యవంతుల తోడ సతీసమేతుడై ద్యుమత్సేనుండు నిజపురమున కరిగి సావిత్రీ సత్యవంతులకు పట్టాభిషేక మహోత్సవముచాటించి అశ్వపతి మహారాజులకు గూడ శుభవర్తమానము బంప సుఖంబుండి రంత. మీరలీ కథ వినిరి గాన మీరలును సుఖ సంతోషులై సంప్రాప్త మహీపాలురై సుఖింతురు గాకయని మార్కండేయుడు దీవించి చనుటయును, పాండవలు తమ పండ్రెండేండ్ల అరణ్యవాసము దరదాపులుగా పూర్తి గావచ్చు చున్నందులకు సంతోషాంతరంగులై యుండునెడ–

సూర్యుడు బ్రాహ్మణ వేషమూని కర్ణుని వద్దకు వచ్చి హితవు పల్కుట

క. కడయై పండ్రెం డేడులు
అడవులలో గడిపినట్టి అధిపులు యికపై
కడు దుస్తర మజ్ఞాతము
సడి లేకుండగ గడుపను సమయజ్ఞులమై

క. ఎట్టులని యోచన జేయుచు
పటుతరుడౌ కౌరవేంద్రు బారిన పడకన్
దిటవులమై మెలగ వలయు
అటుపై ఆ కర్ణ భీష్మ ఆధ్యుల గెలువన్

వ. అని చింత చేయుచుండు నెడ నర–నారాయణాంశ జనితులైన కృష్ణార్జునుల పట్టునుండి రాధా తనయుడుగా పెరుగుచున్న తన తనయు కాపాడుకోనెంచి దినకరుండు బ్రాహ్మణ వేషధారియై కర్ణుని కడ కేతెంచి–

క. కడు దాతవు ధీరుండవు
అడిగిన లేదనక యిత్తు వ అవధులు గొనకన్
ఇడుమల లోనౌదు ననక
తడయక నా మాటచొప్పు ధన్యుడ వగుదో

వ. దైవదత్తముగా పుట్టుకతో సంభవించిన నీ కవచకుండలములు నీకు శ్రీరామరక్ష. ఎట్టి పరిస్థితుల యందున వానిని బాయకుండుట క్షేమకరము. దేవేంద్రుడంతటి వాడు వచ్చి యాచించినను నీ దాతృత్వ వంశ గౌరవములకు తగినయటుల నీ దగు వసు రాజ్యాంగ నా మడి మాన్యంబు లెల్లను అర్పించి పంపునది. నాకు సమ్మతమనినుడువ, మహాత్మా! మీరలెవ్వరో గానీ నా హితులై వచ్చిన దైవ సములు. సత్యము వచియింపుడన, నే నాదిత్యుండను. నీవు నా వర సంజనితుండవు అనిపల్క కర్ణుడు వానికి పాదాభివందనమాచరించి పూజించి మీరు మా కులదైవము. నాహిత కీర్తులుగోరువారు. ఐనను నా స్వధర్మము.

ఉ. వీడుట పాడిగాదు ఘన వీరత శూరత దాన ధర్మముల్
వేడుచు వచ్చినా సురలు వీకొన జేయగ నాదు సత్వమున్
పోడిమి కెక్కనా యిడుదు పూనిక సర్వము జీవనాడులన్
కీడని యెంచబోన్మదిని కీరితి నిల్చుటె శాశ్వతమ్ముగాన్

ఉ. ఆప్తి దొరంగ నీ జగతి ఆర్తుల గాచుట నాదు ధర్మమీ
ధార్తుల పెంపు క్షైమనుట తథ్యము సత్యము మానసంబునా
వర్తన మెంచుచున్ భళిర వాసవు మించిన వాడు వీడనన్
కీర్తిని బందుచుం భువి సఖీజన కోటులు సంతసింపగాన్

క. స్వర్గము కీర్తియ యెల్లెడ
నిర్గుణుడై బ్రతుకు కంటె నీల్గుట లెస్సో
మార్గము పృథివీ పతికిం
భార్గవ తేజమును మించు భవ్యత కలదే

వ. అని పలుక–

క. ఎక్కడ దానము ధర్మము
చక్కగ యోచించి జేయు సద్గుణశీలా

మక్కువ కీర్తంచు మదిని
నిక్కము నీ ప్రాణమంచు నేరవు కుర్రా

తే. అర్థ సంపద రాజ్యంబు లవని యున్న
అనుభవించుట కొరకెగా అవలయేమొ
చచ్చి సాధించునది యెద్ది సాహసుండ
బ్రతికి యుండిన శుభములు బడయవచ్చు

వ. కావున నీకును నీవారలకును యెగ్గుకాని తెరంగున కీర్తిగడించనగు, కానీ భార్యా బిడ్డలకు, బంధు జనులకు, ఐనవారల కెల్లరకును హితవుకాని కీర్తి యశంబులు ప్రశంసానీయము కాదు. నీవున్న యపుడుగాదె నీ వారెల్లరును సుఖించి సంతసింతురు. ఇదియొక దేవరహస్యము. వినియెదు నావల.

క. నీదగు శక్తి జగద్ధిత
సాధారణ యుక్తి యుక్త సాధన మెలమిన్
సాధించను పాండుసుతు న
సాధ్యుని సమరాంగ్ణ భూమి సాహస కర్ణా

వ. నీవలన కాదె ధార్త రాష్ట్రులు జయాభిలాషులై యున్నవారు. ఈ జగంబున నిన్నెదిర్చి గెలవగల వాడా పార్థుండొక్కండె. వానిని నిర్జించితేని సకలరాజ్య భూవలయంబులనెల్ల జయించినట్లే. ఇంద్రుండు నీ కవచ–కుండలముల నర్థించవచ్చుచో ఆతండిచ్చు అమోఘ శక్తి అస్త్రంబును కాదనక స్వీకరింపుమని, దాని ప్రభావముననే ఇంద్రుడు సకల సమరాసుర తండములనెల్ల తృటిలో జయించి త్రిభువన పాలకుడుగా వెలుగొందువాడని పల్కి ఆదిత్యుడు నిజలోకమున కరుగుటయును–

క. వాసవు రాకడ దలచుచు
వేసరిలక మనము నందు వీరుడు కర్ణుం
డాస యొనర్పుచు ధీరత
వీసము చలియింప బోక విజ్ఞత నుండెన్

వ. అన విని జనమేజయుండు వైశంపాయనునితో యిట్లనె.

క. కలదను దేవ రహస్యము
తెలుపగ వేడెదను ఆర్య తెలుపగనైతే
తెలియుదు రెల్ల జనంబులు
తెలియగ జెప్పుదు విదితము దీప్తి చెలంగన్

వ. అన వినుమని, తొల్లి కుంతిభోజుండను ధాత్రీ నరేంద్రుని కడకు దూర్వాసు డేగుదేర, రాజాతని సభక్తి యుక్త పురస్సరముగా పూచించిన, ముని యాతని నాశీర్వదించి రాజా! నీ ఆతిధ్యమున కొంత కాల ముండ వచ్చితి నన, వల్లెయని కుంతిభోజుడు పృధయను తన కూతురును రావించి మునికి నమస్కరింప జేసి–

చ. అతిధులు గాగ రుందురని ఆయన సేవలు చేయుదీ వనం
అతులిత భక్తి యుక్తముగ ఆయమ గూడను నెల్ల వేళలన్
స్థిత ముని గొల్చుచుండె తగ సూకృత మెంతన మౌనివర్యుడున్
అతివరొ మెచ్చుకో నిడుదు ఆప్తితో గైకొను మంత్రరాజమున్

వ. అని యొక మంత్రమును ప్రసాదించి చనిన యంత, వెరగొందుచు నా కుంతిభోజుని తనయ కుంతి సుప్రభాత స్నానయై అ మ్మునివర్యు మంత్ర ప్రభావమేమియో చూతమని మది నెంచి చూచు డు, తూర్పు దిక్ప్రభాసమాన తేజోమయుండునా ఆదిత్యుడు కానుపింప. ఆతని మదిదలంచి మంత్ర మును స్మరింప తన్మంత్ర ప్రభాభాసితుండైన ప్రభాకరుండు ఆకశవీధుల నుండి మానుష రూపమున ఆమెకెదు రవతరించి–

తే. మగువ ముగ్ధుడ నైతినీ మంత్ర కలన
ఏమి కోరితి మనసునం యేకతంబ
వేడు మిచ్చెద కాదన్క వేడ్క మిగుల
అన్న యాతన్కి కుంతి యనియె నిట్లు

వ. దేవా!

తే. మంత్ర ప్రభావ మదియేమొ మదిని దెలియ
బాల చాపల్యమున చేసి భవ్య గుణుడ
నిన్ను దలచితి నంతియే నిజము గనుమ
దివ్య మంత్రమ్ము జపియిస్తి తిరము గాగ

వ. బాలను నేనేమియు దెలుపలేను. నన్నడుగ వలదన, ఆమెభావ మెరిగిన ప్రభాకరుండు–

ఉ. బాలవు గోరవో మదిని భవ్యుని దివ్యుని నాదు సంగతిం
బాలుని నొక్కనిం గనగ భాసుర తేజుని అస్త్రవిద్యలం
మేలగు నీకు నెప్పుడును మెచ్చియు వస్తిని రిత్తవోదునో
వీలగు తోవలం బరపి వెచ్చన గూర్తును బిడ్డ నొక్కనిన్

వ. కాదందువేని నీ జనంబులును నీకీ మంత్రోపదేశము చేసిన వారునూ నాతేజోబల సంపదలచే భస్మీభూతు లగుదురన, కుంతి భీతిల్లి గడగడ వడంకుచు ఆర్యా! స్త్రీ బాల చాపల్యంబున కులధర్మ

విరుద్ధముగా ఉద్వాహము గాకుండ బిడ్డనుం బొంద అనాచారితగా నా కన్యాత్వమును పోకార్తువే యని ప్రార్ధింప, ఆదిత్యుండు సంతోషించి అబలా నీకన్యాత్వము దూషితముగాకుండ అనుగ్రహింతు నన ఆమాట కొడంబడి సద్యోగర్భంబున ఒకబాలకుడు ప్రభవించుటయును, ఆతడు పుట్టుక తోడనే కవచకుండల మండితుండుగా ప్రకాశింప, కుంతి ఆతనయు నెత్తి ముద్దాడి ఆనంద పారవశంబున కన్నీరు నించుచు యేడ్చుచుండ భాస్కరుం డొక్క మందసమును తనమాయా ప్రభావంబున యేర్పరించి అందా తనయునుంచి పట్టణప్రాంత జలప్రవాహమున విడువ బంచుటయును–

క. మందసమా నడి యేటను
కొందల మందుచును విడువ కోమలి మనసౌ
అందము లన్నియు నీటను
సందడి గొని పార దొడరె సర్వేశు కృపన్

క. ఇనుడును నీరము వాయువు
అనలము ఆకశ తలములు అనువగు రీతిన్
పనిగట్టుకు కాపాడను
వినయతతో బ్రోవ వేడ్డు పేరిన భక్తిన్

క. ఎన్నడు చూడగ నౌనో
తిన్నగ నిను జూడలేదు తీపగు కనులన్
మన్నింపరొ నాదు గుణము
సన్నుత మూర్తిని అనఘుని సద్భవ నిన్నున్

వ. అని యెవ్వరెరుంగ కుండ కన్యాంతఃపురంబు జేరి యెప్పటి యట్ల వర్తిలుచుండ నీట వైచిన ఆ మంజూష క్రమగతిని ప్రవాహ వేగమున తేలియాడుచు భాగీరదీ జలంబులం బడి అంగదేశ సూత గృహాంతర విషయికంబుల చేరువకురా–

క. జలకాలాడుచు మురియుచు
అలివేణియ రాధ ధవుడు ఆ మందసమున్
వలవేసియు దరిజేర్చుకు
విలువగు నా బాలు జూచి వెరగొంది మదిన్

క. మురియుచు నెంతో ప్రీతిగ
పరిపరిగా చింత జేసి పరమాత్ముండే
అరుణారుణ కాంతి మయుని
తిరమది పెంపెక్కనౌగ తమ కిచ్చెననిన్

వ. కర్ణాభరణ కవచ కుండలములతో నున్నవానికి కర్ణుండని పేరిడి బిడ్డలు లేని రాధయు సూతుం డును ఆ బాలుని యెంతో గారాబముగా పెంచుట కతన వాడు రాధాతనయుడుగా, సూతనందనుని గా పెరిగి పెద్దవాడగుటయును, వసు వర్ణాభరణములతో నుండినవాడు గావున వసుసేనుం డనియు వ్యవహరింప బడుచుండె. తద్వృత్తాంతమంతయు కుంతి తనపరిచారికల వలన కనుంగొని సంతా ప మనస్కయై యుంటయును, రాజాదరణ పాత్రుండైన సూతుడు తనయు కర్ణుని చిన్నతనమున ద్రోణాచార్యుల వద్ద రణరంగ విద్యలు గరపించుటయును మరియు నాతడు కౌమార యౌవన సమ యముల కృప జామదగ్నులవద్దను విలువిద్యా పారంగతు డగుటయు అంతియేకాక కురుకుల సార్వ భౌముండైన దుర్యోధను స్నేహ పాత్రుండగుటయును పాండునందనులతో విద్వేషమును పెంచుకొని ప్రతిఘటించుటయును–

తే. కర్ణ సంధ్యా ద్యుపాసనా కాలమందు
అర్థియై అరుదెంచెనా అమర విభుడు
కవచ కుండలాల్గొనగనా కర్ణ వేడి
పెంపు జేయగ తన పుత్రు పేర్మి తోడ

వ. వానిం కనుంగొని కర్ణుండు తన మనంబున–

తే. వచ్చినాడదె సురరాజు వసుధ కురికి
అనుచు పొంగుచు కర్ణుండు అనియె నిట్లు
భూసురోత్తము కాసనం బొనగూర్చి
పావనంబాయె మా యిల్లు పరమ పురుష

తే. అతిథి అర్థుల బ్రహ్మణ్యు లవని సురల
కేది వలయునో అది యిత్తు కీర్తి కెక్క
వేడ వచ్చిన చేజాచి వేడ వచ్చు
కాదు లేదను మాటయే రాదు నోట

క. అనవిని బ్రాహ్మణు డప్పుడు
అనునయ నీ కవచకుండ్ల ఆభరణమ్ముల్
పనిగొని వేడగ వస్తిని
తనియంగా యిమ్ము చాలు ధన్యుడ వౌదున్

వ. అనినవానికి కర్ణుండనియె నిట్ల.

క. సహజాతపు తొడవు లివియ
మహనీయుల నాదు రక్ష మహిమాన్వితమౌ

బహుమతిగా యీయ తగవు
మహి యింద్రా వేడు మొండు మత్సరమేలా

వ. అని యితరము లెవ్వియైనను గ్రహింపుమని అడుగుటయును, అప్పుడాతడు ఆడి తప్పినవాడవు కావలదు. నీ కవచ కుండలములే యిమ్ము. ప్రతిగా నీకు నా శక్తి అస్త్రమును యీయం గలవాడను. సత్యసంధుడవైన మారాడక యిమ్ము. లేదేని అని పల్కుచుండంగ కర్ణుడు తన మనంబున–

క. ఇహ పుట్టు గిట్టు లవని
సహజమ్ములు జీవకోట్కి సమయోచితమై
ఇహ జన్మలు సాధింపరె
సహయోగము తోడు రాగ సంస్థవు లవనిన్

వ. త్రిలోకాధిపతి యింద్రుం డంతటివాడు యాచింప వచ్చిన యిచ్చుటయే ఘనకీర్తి. యశస్సు కాగ లదని ధృఢ మనస్కుడై సహజములై ప్రాణప్రదములైన కవచకుండలముల నూడదీసి (భూ)సురేంద్రు ని కర్పించిన–

క. విశ్వేశ్వరు మది దలచుచు
విశ్వాసంబున తొడవులు వీడితి వనఘా
శశ్వత్కీర్తి ధనుండవు
శాశ్వతుడవు దాన కర్ణ సార్ధకనామా!

వ. అని వినుతించి తన శక్తి అస్త్రమును ఆతనికీయ సురేంద్రుడు నిజనివాసమున కేగుటయును.

క. విరివానలు కురిసి రమరులు
సరిమ్రోగ దుందుభులును సమ్మతి తోడన్
అరిభీకర కర్ణునకును
సరిదాతలు లేరనంచు సదయులు పలుకన్

వ. అది తెలిసి ధార్తరాష్ట్రులు కించిద్యోచనాపరు లగుటయును, పాండునందను లానంద భరితులు నై అరణ్య వాసానంతర కార్యంబు లెటులని యోచింపుచుండ–

ఆరణేయుడను యక్షుడు ధర్మరాజుని యక్ష ప్రశ్నలు వేయుట

వ. ఒక ముసలి బ్రహ్మణ్యుడు దిగాలుగా వచ్చి నేల కూలబడి–

క. బహు యోగ్యుడ కడు ధర్ముడ
ఇహపరముల గూర్చు అగ్ని యెవ్విధి జేతున్
కుహనా మృగమది కొమ్మున
బహుదూరము గొంచు యేగె పదపడి తెమ్మా

వ. నీవా ఆరణి తెచ్చునంత వరకు గ్రుక్కెడు నీరైనను ముట్టనని ప్రాయోపవేశము జేతు ననుటయు, బ్రాహ్మణ హితకార్య మగ్నుడై ధర్మరాజు ఆ మృగమేగిన దారి వెంట నడువ వాని తమ్ములు పరుగు పరుగున సహకారులుగా నేగుటయును–

క. మృగమది అడనెడ గెంతుచు
అగపడుచును అగపడకను ఆమడ దవులన్
యెగయుచు అడవుల వెంబడి
మగధీరుల నలమటించి మాయంబగుటన్

వ. పాండు నందనులు యీమాయ యేమొకో అని మనోవేదనకు లోనై ఒక మఱ్ఱి నీడను విశ్రమం ప, ధర్మజుడు తమ్ము లలయుట కనుగొని నకులా!

క. పటువగు దప్పిక ఔటది
ఇటనట నీరంబు లుండు యేగుము దేవన్
పటుతర యుక్తుడ వేగము
వటవృక్షము యెక్కి చూడు వత్సా అనగాన్

వ. నకులుడు మఱ్ఱి నధిరోహించి దూరమున పక్షుల కలాకలారావ రాక పోకలు గమనించి నీటి కొలనొకటి ఉండనోపునని అన్నకు చెప్పి నీరముల దే నరిగి యెంతకును రాకుండుటను యోచించి సహదేవుని పోయిరమ్మన, అతడు–

చ. అరిగియు చూచుడుం కొలని అంచున నిద్దుర నున్న అన్ననుం
పరిసర నీరము ల్గనుచు పర్విడి యేగగ దప్పి దీర్చుకో
మురియుచు నీరము ల్గొనగ మూర్ఛితు డయ్యెను. నన్ను కాదనిం
సరిసరి నీవుగూడ విను చయ్యన బోకుము నీరు గ్రోలగాన్

వ. ఈ కొలను మదీయరక్షితము. నా మాటనుకాదని నాదుప్రశ్నలకు సరియగు ఉత్తరములు యిచ్చి నకాని యీ నీరములు ద్రావుటకు వలనుపడదను మాటలు వినం బడుటయును, ఆ మాటలు యెం దుండి వచ్చెనో తెలియక అటునిటు చూచి యేమియు గానక ఆ మాటలు సరకుగొనక సహదేవుడు గూడను–

క. సరగున కొలనికి దిగుటయు
శరవేగపు శక్తి యొకటి చాతురి మెరయన్
అరచేత బట్టి విసరగ
చెఱువొడ్డున మూర్ఛనొందె చెప్పెడిదేమా

వ. సహదేవుడును తిరిగి రాకుండుటయును, పాండవమధ్యముండు ఆ కొలని యొడ్డున పడియున్న నకుల సహదేవులం జూచుచు కారణము అరయనేరక చింతించుచు–

తే. దప్పి గొన్నట్టి వాడౌట తడయకతడు
కొలని నీరది త్రావంగ కోర్కె దేర
ఆగుమాగుము యువకయో అనెడి మాట
విన్నవాడౌట మోమెత్తి అన్ని దిశల

వ. పరికించి చూచి యేమియుం గానక–

తే. ఆగుమాగు మను పల్కు అనిన దెవరు
దప్పిగొనువారు నీర్ద్రావ తగదె చెపుమ
నీరు అనిలాగ్ని గగనాలు నీవె యగునె?
కట్టడించుచు పల్క నీకెట్టులౌను

వ. అనిన దానికి భూతమిట్లనియె వినగ.

తే. నీరు ద్రావంగ నెంచితే నిజముగాను
నాదు మాటకు బదులిమ్ము నయము గదుర
నన్ను గాదని పడియుండ్రి చిన్నవారు
చిన్న తమ్ముల గావరా దెన్ననౌగ

వ. కాదందువేని నీకునూ యింతియే కాగలదన కోపించిన వాసవ నందనుండు–

తే. శబ్దబేధన బాణంబు చెలగి విడువ
గగన వాణియ గతినేగి గమ్మునుండ
నన్నుగాదని చెడబోకు నాయనంచు
విఙ్ఙ వీగకు గర్వాన వెఙ్ఙి కుఙ్ఙ

వ. అనుమాటలను గూడ గణుతింపక అర్జునుండు కొలని నీరంబులం ద్రావ జొరబడి తమ్ముల యట్లనే తానును వివశుండై పడియుండె. నంతట యుధిష్ఠిరుండు భీమసేనుని బోయిరమ్మన–

ఉ. తమ్ముల రాకకై యేగిన దారిన యేగుచు భీమసేనుడా
తమ్ముల మొగ్గరంబు కడ తమ్ములు ముష్వురు మూర్ఛనొందుటన్
అమ్మరొ యేమి చోద్యమిది అందరు దుర్నయు లొక్క రీతిగా
గమ్మగ నుండ కారణము కానగ రాదది యేమి వింతయో

వ. ఇయ్యది నరమానవుల కతీతమగు శక్తియుక్తమై యుండునని యోచించుచు యీ మడుగునందు నీరముల్ గొందు ముందుగ అని మడుగు దరికింబోవ తొల్లిటి యట్టుల నా యజ్ఞాత భూతము –

ఉ. నీరము గ్రోల నీ మడువు నెంచిన వాడవొ సాహసంబునన్
నీరసమంచు దల్పకుము నిక్కము ముందుగ నాదు మాటకున్
సారస యుత్తరమ్ము లిడు చక్కని రీతిగ ధర్మ సమ్మతిం
జేరకు వీరి తీరులను జేరియు కుందకు ప్రాణహానియున్

వ. అని హెచ్చరించుటయును బల గర్వితుండైన దోర్బలుండు ఐన భీమసేనుండు ఆ మాటలను లెక్కసేయక అమితమైన దాహార్తితో నుండుటవలన మడుగులో జొర నుంకింప–

తే. శక్తి తోపున హీనుడై చలన లేక
మడువు యొడ్డున పడియుండ మానురీతి
ముగ్గురు తమ్ముల తోడుత మూర్ఛనొంద
ధర్మ తనయుడు రానాయె తమ్ము కడకు

చ. నలువుర తమ్ములం గనుచు నాయను వీరులు అందరొక్కటం
చలనము లేక నుండ గని చాలగ చింతిలి భీతి జెందుచుం
ఇలబడి మూర్ఛనొందుటకు యింతకు యేమొకొ కారణంబనిం
కలగుచు మార్గము ల్వెదుక కార్యము కాదని ధర్మరాజుడున్

వ. వారల వీక్షించుచు దిక్కుల పరికించి చూచుచు–

తే. ఒరులు వచ్చిన జాడది ఒకటి లేదు
వాదులాడిన గురుతేది వసుధ లేదు
కత్తి వేటది సుంతైన కానబడదు
యిట్టులగుటకు తగు హేతువేమొనంచు

తే. దురిత దుర్నయ దుర్యోధన దూర్తనంబొ
కర్ణ దుశ్శాస్న గాంధారు నిర్ణయంబొ
మాయగానొప్పు శక్యాది మర్మ మెదియొ
బహుళ స్తుతిపాత్ర సుగుణాత్మ బంధనమ్మొ

వ. ఏది యేమైనను నా దమ్ముల నల్వుర దరిజేర్చుకొని గాని ద్రుపదనందన కడకుజనుట ధర్మసమ్మతము గాదు నాకని అనేకానేక విధములుగా వగచుచు డగ్గుత్తికతో శోషిల్లుచు దప్పికోర్వనివాడై ధర్మజుండు ఆ సరోవర నీరములలోనికి దిగుచుండ అశరీరవాణి ఒకటి–

మ. అనఘా బోకుము నీరము ల్గొనగ నా కర్ధంబు వాక్రుచ్చకున్
మునుగా దెల్పెద నన్ను కాదనుచు యీ మోహాంధు లత్యుగ్రతన్

చనియుం నీరము ద్రావనా కొలన మూర్ఛవ్యాధి సంపర్కులై
వనిలో జిక్కిరి నున్నవార్ని గను మీ బంధమ్ము వైదొల్గగాన్

వ. అని వినంబడుటయు, ధర్మనందనుండా అశరీరవాణి మొగంబై అనఘా!

ఉ. నీవొక భూతనాథుడవొ నేరను నిక్కము పల్కుచుంటి దే
కావుము నాదు తమ్ములను కారుణి జూపుచు ధర్మదేవతా
బ్రోవుము నాదు ఉత్తరములు పోడిమి కెక్కుచు ధర్మ సమ్మతిన్
ధీ విభవుండ యీ కరణి దేర్పడ జేయుము సత్కృపాళువై

వ. అని వినుతిచేసి నీ ప్రశ్నంబు లెవ్వియనిన, వారిరువురి మధ్య జరిగిన యక్షప్రశ్నోత్తర పరంపర.

ప్ర. సతత మధారమౌనెద్ది జగతి కరయ

జ. సతత మీజగతి కాధార మైనది సత్య మరయ

ప్ర. పంచభూతాలచే పట్టుబడని దెద్ది

జ. పంచభూతాలచే పట్టుబడని దాత్మ

ప్ర. జీవన్మృతు లన యెవరు

జ. దేవ, అతిధి, పితృ, ఆధార భృత్య జనముల కిడక తా దినెడి వాడు

ప్ర. మృతజీవులన నెవరు

జ. చచ్చియు జగతిలో స్మరింపబడు వారలు

ప్ర. ధార్మికుండన నెవడు

జ. ధర్మముం దెలిసి జీవించువాడెపో ధార్మికుండు

ప్ర. జగదాధార సూర్య రధమున కిరుసేది

జ. జగదాధార సూర్య రధమున కిరుసు ధర్మము

ప్ర. బ్రాహ్మణుడు దేవత యెట్లు కాగలడు

జ. వేదాధ్యయన శాస్త్రములు వినుట వలన శ్రోతీయుడు దేవత కాగలడు

ప్ర. శూద్రుడన నెవడు

జ. శౌచ వేద విజ్ఞాన నియత జీవనము లేనివాడు శూద్రుడనగ బరగు

ప్ర. భూదేవి కంటెను భారమైనది యెద్ది

జ. భూదేవి కంటెను భారమైనది గర్భస్త పిండము

ప్ర. ఆకశము కంటె పొడవైనదేది

జ. ఆశ, పితృగౌరవము

ప్ర. మెరుపు కంటెను శీఘ్రగతి కలిగిన దేది

జ. ఆలోచన, మనస్సు

ప్ర మనసును పీడించునది యేది

జ. చింతన, దిగులు

ప్ర. నిద్రించియు కన్ను మూయలేనిదేది

జ. ఝషము

ప్ర జీవముండియు చేతన శక్తి లేనిది యేది

జ. పక్షి గ్రుడ్డు

ప్ర. కన్నులుండియు కనుగొన లేనివాడు యెవడు

జ. అజ్ఞాని

ప్ర. హృదయరహిత రూప మెద్ది

జ. పాషాణము

ప్ర. అన్నిటి కంటెను వింతైన దేది

జ. జగత్ సృష్ఠి

ప్ర. వేగము వలన గణింప బడున దెద్ది

జ. నదీ ప్రవాహము

ప్ర. కనులతో చూడలేనిదేది

జ. గాలి, శక్తి, బ్రహ్మము

ప్ర. దైవసాన్నిధ్యము కూర్చు విద్య యేది

జ. యోగవిద్య

ప్ర. విషము కంటెను విషమైనదేది

జ. బ్రాహ్మణ ధనాపహారణ

ప్ర. శ్రాద్ధమునకు కావలసినదేమి

జ. శ్రద్ధ

ప్ర. ఉత్తమ ధర్మమేది

జ. అహింస

వ. అనిదెల్ప విని సంతోషించిన ఆ భూతనాధుండు నీ తమ్ములం దొక్కనికి ప్రాణంబు లిచ్చెద. వేడు మన ధర్మనందనుడు మాద్రీనందను నకులుని బ్రతికింపుమని కోరుటయును, దానికి మెచ్చి ఆ దివ్య పురుషుడు, రాజా! నీధర్మజ్ఞతను పరీక్షింప వచ్చిన నీ జనకుడ ధర్ముండ నేనేయని నిజరూప దర్శనం బిచ్చిన వాడునై నీ తమ్ము లందరును సజీవులుగా నుందురన నిద్రలేచిన వారుగా భీమార్జున నకుల

సహదేవులందరు లేచి అన్న కడకు వచ్చినవారితో అందరు ఆ ధర్మువునకు మ్రొక్క అభిమత వరంబు లిత్తును వేడుమన, ధర్మరాజు వానిం ప్రస్తుతించి మదీయ ఆశ్రమ భూసురోత్తముని అరణికై వచ్చిన వారము. మీ దర్శన భాగ్యము చేకూరుటచే ధన్యులమైతిమి. అతని అగ్నికార్యంబు విఘ్నంబు కాకుం డ అయ్యరణి ప్రసాదింపుమని వేడ ప్రీతుండై ధర్మమూర్తి ధర్మరాజుతో–

క. అరణియు హరిణము లేదవి
ధర నీ ధర్మంబు యేర్ప తనియగ జూడన్
ధరణీసుర రూపంబున
అరుదెంచితి నంతె సుమ్మ అవనికి యిటులన్

వ. మీ దర్శన భాగ్యము పొందితిమి. మా యిష్టములు మీ కెరుగరానివి కావు. అనుగ్రహింపుడన, బిడ్డా! మీ–

క. వనవాసము కడదేరియు
వినుమీ అజ్ఞాతవాస వేళది వచ్చెన్
అనువగు రీతుల జనుడీ
పనిగట్టుకు జెప్ప వస్తి భయపడకుండన్

వ. మిమ్ము యెవ్వరెరుంగ కుండునట్ల మీరెక్కడ యేయే రూపంబుల కోరియుండినను అందులకు వ లయు సర్వంబును కలుగునట్లు వరంబు యిచ్చితి. ఇంక యేమైన వలయుచో కోరుండన–

క. ఇల దైవమ మాకు జనక
కలనైనను కోపతాప గతులకు బోకన్
వలనగు వరముల నిస్తివి
కులధర్మము నందు మనసు కుదురుగ నిమ్మా

వ. అని వేడిన అనుగ్రహించి దక్షిణ దిక్పతి అంతర్హితుండైన కౌంతేయులు నిజాశ్రమంబునకు జని భూసురాశీర్వాదంబులు గొని పరమానంద భరితులై యుండిరని పంద్రెండేడుల వనవాస వివిదార్థ కథా కథన ప్రకారంబులు మృదు మధుర కర్ణాభీష్టంబుగా నుపన్యసించి–

క. ముని వైశంపాయను డల
జనమేజయు భూదవులకు చాతురి మెరయన్

కనుదమ్ముల జూచి నటుల
తనియంగా భారతాఖ్య ధన్యత దెల్పెన్
ఇది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీరరాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయ విరచిత
–: శ్రీమదాంధ్ర మహాభారత అరణ్యపర్వ సప్తమాశ్వాసము :–



రచయిత : మండపాక చినజోగిరాజు

పుట్టిన స్థలము : వడ్డాది, విశాఖ జిల్లా, ఆంధ్రప్రదేశ్
పుట్టిన తేది : 01 – 10 – 1930
ఉద్యోగము : టీచర్
అభిరుచులు : గ్రంధ రచన, సత్సాంగత్యము, చిత్రలేఖనము, చదరంగము, సమస్యాపూరణ, ఆశువు
బిరుదులు : కవిరాజు, శ్రీ, మహాకవి

ఇతర రచనలు

సూర్యస్థుతి (నక్షత్రమాల)
వేంకటరమణా శతకము (శ్రీనివాస కళ్యాణము)
కళ్యాణ వెంకటేశ (గీత శతకము)
భువనవిజయము (పద్య నాటకము)
రామాయణము (కంద పద్య కావ్యము)
శ్రీ కృష్ణ లీలా తరంగిణి (మహాభాగవత పూర్వార్ధము–పద్య గ్రంధము)
ఉత్తర హరివంశము (మహాభాగవత ఉత్తరార్ధము–పద్య గ్రంధము)
భగవద్గీత (పద్య గ్రంధము)
కుమార సంభవము (పద్య కావ్యము)
రాఘవ పాండవీయము నకు (రామాయణార్ధము మరియు భారతార్ధము)
జీవబ్రహ్మైక సిద్ధి (తత్వ విచారణ)
రంగ రంగ (శ్రీ పాండు రంగ) శతకము
కాళీస్తవము (పద్యములు)
ఉపనిషద్సారము
కరోనా ప్రహసనము
ఆత్మ ప్రబోధము
దుర్గా స్థుతి
భద్రకాళీ వీరభద్ర పరిణయము
Still Alive (An Immortal)